www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

సోమవారం | 26-3-2018 | పేజీలు: 16 + 20 | వెల: రూ. 5.00 | సంపుటి: 58 సంచిక: 340 | శ్రీవిళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం; తిథి: దశమి తె. 3.43 తదుపరి ఏకాదశి; నక్షత్రం: పునర్వసు మ. 12.55 తదుపరి పుష్యమి; వర్జ్యం: రా. 8.26-9.56; దుర్ముహూర్తం: మ. 12.46-1.34; మ. 3.11-3.59 వరకు; అమృతఘడియలు: ఉ. 10.40-12.10, తె. 5.27 మొదలు; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.19; సూర్యాస్తమయం: 6.24 | విజయవాడ సిటీ*

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai



అమరావతి జలాల్లో ‘ఫార్ములా 1’

2

రాజధానిలో ‘ఎఫ్‌1హెచ్‌2వో’ వరల్డ్‌ చాంపియన్‌షిప్‌

భవానీ ఐలాండ్‌కు ఎఫ్‌1హెచ్‌2వో ప్రతినిధులు ఓకే

నవంబరు 22 నుంచి 24 వరకూ పోటీల నిర్వహణ




ఐసీసీ ఔదార్యం

స్మిత్‌పై ఒక టెస్టు నిషేధంతో సరి.. అతడే కెప్టెన్‌: ఆస్ట్రేలియా

అంపైర్‌ నిర్ణయంపై అసంతృప్తి వ్యక్తం చేస్తేనే.. కఠిన చర్యలు తీసుకుంటారు..! ప్రత్యర్థి ఆటగాడిని స్లెడ్జింగ్‌ చేస్తే నిస్సంకోచంగా వేటు వేస్తారు..! అలాంటిది క్రికెట్‌ ప్రపంచం నివ్వెరపోయేలా.. సగటు అభిమాని తలదించుకునేలా.. ఆటలో ఓడించలేని ప్రత్యర్థిని దొంగ దెబ్బతీయాలని.. నిస్సిగ్గుగా జట్టంతా కలిసి బాల్‌ టాంపరింగ్‌ చేసినా.. సూత్రధారి ఆస్ట్రేలియా కెప్టెన్‌ స్మిత్‌పై కేవలం ఒక టెస్ట్‌ నిషేధం, పాత్రధారి బాన్‌క్రాఫ్ట్‌పై జరిమానాతో సరిపెట్టేశారు..! పైగా వైస్‌ కెప్టెన్‌ వార్నర్‌పై చర్యలే లేవు. ఆస్ట్రేలియా జట్టుపై ఐసీసీ చూపిన అవ్యాజమైన అనురాగమిది.

- సమగ్ర కథనం.. స్పోర్ట్స్‌ పేజీలో



మీ దారెటు?

రాష్ట్రం వైపా.. కేంద్రం పక్షమా?.. పార్టీలకు సీఎం సూటి ప్రశ్న

అమరావతి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌ ప్రజల సెంటిమెంట్‌ను అందరూ గౌరవించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయా రాజకీయ పార్టీలకు, నేతలకు ముఖ్యమంత్రి చంద్రబాబు సూటిగా కొన్ని ప్రశ్నలు సంధించారు. ఆంధ్రా పక్షమా? కేంద్రం పక్షమా? అన్నది ఆయా పార్టీల నేతలే తేల్చుకోవాలన్నారు. ప్రజల కోసం పోరాడే ముఖ్యమంత్రి పక్షాన ఉంటారా? రాష్ట్రానికి అన్యాయం చేసే కేంద్రం పక్షాన ఉంటారా? అని నిలదీశారు. ప్రజల హక్కుల కోసం పోరాడే తెలుగుదేశం పక్షాన ఉంటారా? ప్రజల మనోభావాలను నిర్లక్ష్యం చేసిన బీజేపీ వైపు ఉంటారో నిర్ణయించుకోవాలన్నారు. తెలుగుదేశం పార్టీకి మద్దతిస్తే రాష్ట్రానికి మద్దతివ్వడమే అని చంద్రబాబు పేర్కొన్నారు. ఈశాన్య రాష్ట్రాలకు ఇచ్చేవి కూడా ఏపీకి ఇవ్వడం బీజేపీకి ఇష్టం లేదన్నారు. తొలి బడ్జెట్‌లోనే రెక్కలు విరిచి ఎగరమంటే ఎలా? అని కేంద్రాన్ని తాను నాలుగేళ్ల క్రితమే నిలదీశానని చెప్పారు. అయితే తొలి బడ్జెట్‌లోనే గొడవపడితే రాజకీయం అంటారనే ఇన్నాళ్లూ ఆగామని టీడీపీ ఎంపీలు, మంత్రులు, పార్టీ నాయకులు తదితరులతో ఆదివారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో చంద్రబాబు చెప్పారు. ‘నాలుగు బడ్జెట్‌లు చూసినా ఏపీకి న్యాయం చేయలేదు. 29సార్లు ఢిల్లీ వెళ్లి రాష్ట్రాన్ని ఆదుకోమన్నాం. అయినా కేంద్రంలో

మిగతా 2వ పేజీలో...

మాల్యాకు ఒక న్యాయం? సాయిరెడ్డికి మరోటా?

ఈశాన్య రాష్ట్రాలకు ఇచ్చి.. ఏపీకి ఇవ్వడం లేదు!

తొలి బడ్జెట్‌లోనే రెక్కలు విరిచారు.. నాడే ప్రశ్నించా

గొడవ పడితే రాజకీయం అంటారనే ఆగాం

యూసీలపై రాజీనామాలకు వెనక్కు తగ్గారేం!

మనం హోదా అడగడం బీజేపీకి నచ్చడం లేదు

రావాల్సింది అడిగితే వారికి కోపమెందుకు?

టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు ఆగ్రహం

న్యాయం చేయకపోగా అవహేళన చేస్తారా?

అసలు ఏ హోదాతో ఆ లేఖ రాశారు

ఆంధ్రులను అవమానించేలా ఉంది

అమిత్‌షా లేఖపై మంత్రుల ఫైర్‌

ప్రజలా.. పార్టీనా?

దిక్కుతోచని బీజేపీ నేతలు.. టీడీపీ అటాక్‌తో విలవిల

..పొయ్యిలో పద్దామా.. వలస నేతల ఉక్కిరిబిక్కిరి

అప్పుడు మోదీ హీరో ఇప్పుడు జీరో

హామీలు నెరవేర్చకుండా ప్రజల్లోకి వెళ్లేదెలా?

14





అవిశ్వాసమంటే మోదీకి భయం

చర్చకు సిద్ధమంటూనే పలాయనం

సమావేశాల్ని తుడిచిపెట్టారు: రాహుల్‌

14

దానంగా భావిస్తున్నారాయన

రాష్ట్రాలకు సాయంపై అమిత్‌షాకు సిద్దరామయ్య చురక

చంద్రబాబు ట్వీట్‌ను కోట్‌ చేస్తూ బీజేపీపై మండిపాటు





బుందేల్‌ఖండ్‌ పాటి చేయమా?

బుందేల్‌ఖండ్‌కు తలసరి సాయం రూ.10 వేలు


ఏపీలో వెనుకబడిన ప్రాంతాలకు రూ.420

డ్రైనేజీ పనుల నిధులూ రాజధాని సాయమేనా?

హోదాను మరిపించటానికే.. యూసీల అంశం

బీజేపీ ఇవ్వలేదంటోంది... నీతి ఆయోగ్‌ ఇచ్చారంటోంది

కేంద్రం తీరుపై రాష్ట్ర ప్రభుత్వ వర్గాల ఆగ్రహం



యూసీలు అందినట్లు నీతి ఆయోగ్‌ లేఖలో స్పష్టంగా పేర్కొన్న భాగం

అమరావతి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి సాయం విషయంలో హామీలన్నీ నెరవేర్చేశామంటోంది బీజేపీ.. ఇంకా మాట్లాడితే చెప్పిన దానికంటే ఎక్కువే చేస్తున్నామని నొక్కి చెబుతోంది. కానీ రాష్ట్రానికి మాత్రం అన్నిటా విదిలింపులే. ఎటు చూసినా తీరని అన్యాయమే! లెక్కల్ని కాస్త తరచి చూస్తే నవ్యాంధ్ర.. బుందేల్‌ఖండ్‌ పాటి కూడా చేయదా అనే ఆవేదనే మిగులుతోంది. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలో... రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాలకు బుందేల్‌ఖండ్‌-కలహండి-కోరాపుట్‌ తరహా ప్యాకేజీ ఇస్తామని పేర్కొన్నారు. కానీ వెనుకబడిన బుందేల్‌ఖండ్‌కు ఇచ్చిన సాయానికీ, ఏపీలోని వెనుకబడిన జిల్లాలకు ఇచ్చిన మొత్తానికీ మధ్య భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. బుందేల్‌ఖండ్‌కు ఇచ్చిన సాయాన్ని అక్కడి జనాభాను పరిగణనలోకి తీసుకుని లెక్కిస్తే సగటును ఒక్కో వ్యక్తికి రూ.10వేల సాయం అందింది. ఏపీకి విషయానికి వస్తే... రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల్లో

మిగతా 2వ పేజీలో...

ఐఐటీల్లో సీట్లు మిగులు

హైదరాబాద్‌, కాన్పూర్‌ మినహా అంతటా ఇదే పరిస్థితి

సమస్య పరిష్కారానికి కమిటీ నియామకం

ఒకట్రెండు కోర్సుల్ని తొలగించాలని సిఫారసు

16



బాబోయ్‌ ఎండలు

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

ఉదయం నుంచే ఉక్కపోత మొదలు

ఏప్రిల్‌ రెండవ వారం వరకూ ఇదే పరిస్థితి

జాగ్రత్తంటున్న విపత్తుల శాఖ



విశాఖపట్నం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం ఉడుకెత్తుతోంది. సూర్యోదయం నుంచే వేడి వాతావరణం నెలకొంటోంది. మాడు పగిలే ఎండలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. రాష్ట్రంలోని నాలుగైదు ప్రాంతాలలో అప్పుడే పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరాయి. రానున్న నాలుగైదు రోజుల్లో ఎండలు మరింత పెరుగుతాయని వాతావరణ శాఖ, రాష్ట్ర విపత్తుల శాఖ హెచ్చరించాయి. మంగళవారం

మిగతా 2వ పేజీలో...

• ఒంటిమిట్ట రాముడికి బ్రహ్మోత్సవ శోభ

పాఠకులకు శ్రీరామనవమి శుభాకాంక్షలు



ఒంటిమిట్టలో శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం ధ్వజారోహణ చేస్తున్న అర్చకులు. విద్యుత్‌ వెలుగుల్లో మిలమిలలాడుతున్న ఆలయం

కండక్టర్లపై కత్తి

టిమ్స్‌ పెంచి సిబ్బందిని తగ్గించనున్న ఆర్టీసీ

బస్సుకు ఐదుగురు సిబ్బంది చాలు

రెండేళ్లలో 5 వేల మంది అవుట్‌!

మరో 2500 మందికి ముప్పు

మహిళా కండక్టర్లలో ఆందోళన

ఆర్టీసీ అసాధారణ నిర్ణయం

సర్క్యులర్‌ నంబర్‌ 7 జారీ

నిరసనకు సంఘాలు సన్నద్ధం



అమరావతి/విజయవాడ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ప్రగతి రథం నిర్వహణలో ఆర్టీసీ యాజమాన్యం పిల్లిమొగ్గలు వేస్తూనే ఉంది. సంస్థ నష్టాల్లో ఉందన్న సాకుతో ఆర్టీసీ కండక్టర్లను భారీ సంఖ్యలో కుదించేందుకు రంగం సిద్ధం చేసింది. ఈ క్రమంలో ఆర్టీసీ యాజమాన్యం జారీ చేసిన సర్క్యులర్‌ నంబర్‌ 7 తీవ్ర సంచలనంగా మారింది. దీని ప్రకారం బస్సుకు ఐదుగురే సిబ్బంది ఉండేలా లక్ష్యం నిర్ణయించారు. వాస్తవానికి రోడ్డు రవాణా సంస్థలో పూర్వం

మిగతా 2వ పేజీలో...



ధనుష్కోటి తీరంలో తులసి చైతన్యను అభినందిస్తున్న జాలర్ల సంఘం నాయకులు, స్నేహితులు

రామసేతు మీదుగా రికార్డు ఈత

16

32 కిలోమీటర్ల పాక్‌ జలసంధిని 8 గంటల 25 నిమిషాల్లో ఈదిన ఆంధ్రా పోలీస్‌



2

శివతేజారెడ్డి (ఫైల్‌)

నిమ్స్‌లో ‘ఏపీ వైద్యుడి’ ఆత్మహత్య

డాక్టర్స్‌ క్లబ్‌ భవనంలో బెడ్‌షీట్‌తో ఉరి

ఒంటరితనంతో కలతచెంది బలవన్మరణం

బెజవాడలో డబ్బావాలాలు

11



లంచ్‌ సమయానికి వేడివేడిగా ఇంటి భోజనం.. కృష్ణా తీరంలో ముంబై తరహా సేవలు

సమాచార కమిషన్‌లో రగడ




మాకు స్వాతంత్ర్యం లేదా?.. ఒక వ్యక్తి ఎలా నిర్ణయం తీసుకుంటారు?

సీఐసీ తీరును ఎండగడుతూ.. కమిషనర్‌ మాడభూషి శ్రీధర్‌ ఘాటు లేఖలు

బయటి శక్తుల ‘ఒత్తిళ్ల’పై ప్రశ్నలు.. బెంచ్‌ ఏర్పాటు, మార్పులపైనా నిలదీత

ఆలస్యంగా బయటికి.. కమిషన్‌లో ఏదో జరుగుతోందని అనుమానం

16



✱ మృత్యువును మించిన 'సామ్యవాది' లేదు

మరణించే ముందు అలెగ్జాండర్ చక్రవర్తి మూడు కోరికలు కోరుకున్నాడని చెప్తారు. ఒకటి.. తనకు వైద్యం చేసిన వైద్యులతో తన శవపేటిక మోయించాలి. రెండు.. తాను సంపాదించిన వెండి, బంగారాలను, వజ్ర వైఢూర్యాలను శ్మశానానికి వెళ్లే దారిలో చల్లాలి. మూడు.. తన రెండు చేతులనూ శవపేటికలోంచి పైకెత్తి ఉంచాలి. ప్రపంచంలో ఎంత గొప్ప వైద్యుడైనా మరణం నుంచి కాపాడలేడని, కాబట్టి జీవితాన్ని అంత తేలిగ్గా తీసుకోవద్దని చెప్పడం మొదటి కోరిక ఉద్దేశం. ఎంత సంపాదించినా ధనాన్ని వెంట తీసుకెళ్లలేడని చెప్పడం రెండో సందేశం. పుట్టేటప్పుడు ఉత్తి చేతులతో వచ్చాం. ఉత్తి చేతులతోనే వెళ్లిపోతాం అని ప్రపంచానికి చాటి చెప్పడానికి మూడో కోరిక కోరాడు. నిజమే! మృత్యువు ఈ లోకంలో ఎవ్వరినీ శాశ్వతంగా ఉండనీయదు. ఎంత సంపాదించినా ఏ వ్యక్తినీ చిల్లిగవ్వ కూడా తనవెంట తీసుకుపోనీయదు. 'ఆయుర్నశ్యతి పశ్యతాం ప్రతిదినం యాతిక్షయం యౌవనం ప్రత్యాయాన్తి గతా: పునర్నదివా: కాలో జగద్భక్షక:" అన్నారు పెద్దలు. అంటే.. చూస్తుండగానే నిత్యం ఆయుష్షు నశిస్తుంటుంది. యవ్వనం క్షీణిస్తుంది. గడచిన రోజులు మళ్లీ రావు. కాలము జగత్తునే భక్షిస్తుంది.- అన్నమాటలు అక్షర సత్యాలు. ఇది గమనించకుండా ప్రతివారూ తన అహంకారాలను ప్రదర్శిస్తుంటారు. కానీ మృత్యువు ముందు ఇవేవీ పని చేయవు. యోగులైనా, సిద్ధులైనా, ధనవంతులైనా, పేదలైనా.. అందరూ మృత్యువుకు సమానమే. ఎవ్వరైనా మృత్యువుకు తలవంచాల్సిందే. మృత్యువును మించిన సామ్యవాది లేదు. అందుకే మన పెద్దలు మృత్యువును కాలంతో పోల్చారు. కాలం భగవత్స్వరూపం అన్నారు. సృష్టిలోకి ఎన్ని జీవరాశులు వచ్చి వెళ్లినా, కాలచక్రం ఆగదు. అది అందరినీ తన వెంట నడిపిస్తుంది. జనన మరణాలు లేని స్థితిని పొందడం ద్వారా ఇలాంటి కాలాన్ని, మృత్యువును జయించడమే మోక్షం.

-డాక్టర్ పి. భాస్కరయోగి



పరంజ్యోతి


'అమ్మా'నుషం!

▸▸ వివాహేతర సంబంధాన్ని ప్రశ్నించినందుకు కూతుళ్లకు చిత్రహింసలు

వేటపాలెం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కూతుళ్లను కంటికి రెప్పలా చూసుకోవాల్సిన అమ్మ... వారికి నరకం చూపింది. వివాహేతర సంబంధాన్ని ప్రశ్నించినందుకు చిత్ర హింసలు పెట్టింది. యుక్తవయసుకు వచ్చిన పిల్లలను కొట్టి, రాత్రి సమయంలో ఇంటి నుంచి గెంటి వేసింది. దీంతో ఆ యువతులు ఆదివారం పోలీసులను ఆశ్రయించారు. ప్రకాశం జిల్లాలోని మండల కేంద్రమైన వేటపాలెంలో సర్వోదయ కాలనీకి చెందిన ఆత్మకూరి సీత, రాజు దంపతులకు ఇద్దరు కుమార్తెలు. రాజు 15ఏళ్ల క్రితమే అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి సీత తన ఇద్దరు కుమార్తెలు, ప్రసన్న (20), వెంకటలక్ష్మి (17)లతో కలిసి ఉంటోంది. ఆరు నెలల క్రితం సీతకు, దేశాయిపేటకు చెందిన వ్యక్తితో పరిచయం ఏర్పడింది. అది వివాహేతర సంబంధంగా మారింది. అతను తరచూ ఇంటికి రావటం నచ్చని కూతుళ్లు తల్లిని ప్రశ్నించారు. దీంతో ఆమె, కూతుళ్లను వేధించడం ప్రారంభించింది. అది తట్టుకోలేని పిల్లలు ఇద్దరూ ఈ నెల 18న తల్లితోపాటు, ఆమెతో వివాహేతర సంబంధం ఏర్పరుచుకున్న వ్యక్తిపై వేటపాలెం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చీరాల రూరల్ సీఐ భక్తవత్సల రెడ్డి వారిద్దరినీ పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినప్పటికీ ఆ తల్లిలో ఎటువంటి మార్పు రాకపోగా కుమార్తెలను తరచూ వేధించడం ప్రారంభించింది. శనివారం రాత్రి ఇద్దరిపైనా చేయి చేసుకుని ఇంటి నుంచి గెంటివేసింది. ఇంటి పక్కన ఉన్న వారు ఆడపిల్లల అవస్థను చూసి రాత్రికి ఆశ్రయం ఇచ్చారు. ఆదివారం ఆ ఇద్దరు బాలికలు తిరిగి వేటపాలెం పోలీసులను ఆశ్రయించారు.



నిమ్స్‌లో పీజీ విద్యార్థి ఆత్మహత్య



సోమాజిగూడ/హైదరాబాద్, మార్చి 25, (ఆంధ్రజ్యోతి): వైద్యవిద్యనభ్యసించి పేదలకు సేవ చేయాల్సిన ఓ పీజీ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకుకు చెందిన శివతేజరెడ్డి నిమ్స్‌లో న్యూరో సర్జరీ విభాగంలో పీజీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శనివారం రాత్రి 12 వరకు విధులు నిర్వర్తించిన అతడు.. ఆదివారం ఉదయం విధుల్లోకి రాలేదు. కారణం తెలుసుకుందామని ప్రీతం అనే జూనియర్ వైద్యుడు డాక్టర్స్ క్లబ్ భవనంలోని శివతేజ రూమ్‌కి వెళ్లాడు. తలుపు తీయకపోవడంతో అనుమానం వచ్చి కిటికీలోంచి చూసేసరికి ఉరేసుకొని కనిపించాడు. మృతుడి తల్లిదండ్రులు విదేశాల్లో ఉండటంతో ఇతర కుటుంబసభ్యులకు సమాచారమిచ్చి కేసు నమోదు చేశారు. శివతేజ ఆత్మహత్యతో నిమ్స్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. మందులు కూడా కొనుక్కోలేని స్థితిలో ఉండేవారికి తానే స్వయంగా మందులు కొనిచ్చే గొప్ప మానవతావాది అని, రోగులు కేసు షీట్ల జిరాక్స్ కాపీల కోసం ఇబ్బందిపడుతున్నారని గమనించి స్వయంగా రూ.40వేలతో జిరాక్స్ మిషన్ కొనిపెట్టాడని ఆస్పత్రి డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ కాసు వెంకటకృష్ణారెడ్డి చెప్పారు. కాగా, ఒంటరితనంతో కలత చెంది ప్రాణాలు తీసుకున్నట్లు అనుమానిస్తున్నారు.

అమరావతి జలాల్లో ఫార్ములా1

- ▸▸ రాజధానిలో 'ఎఫ్1హెచ్2వో' వరల్డ్ చాంపియన్‌షిప్
- ▸▸ భవానీ ఐలాండ్‌కు ఎఫ్1హెచ్2వో ప్రతినిధులు ఓకే
- ▸▸ నవంబరు 22 నుంచి 24 వరకూ పోటీల నిర్వహణ
- ▸▸ తీవ్రంగా కృషి చేసిన సీఎం.. పర్యాటక శాఖకు ప్రతిష్ఠాత్మకం




అమరావతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని అమరావతికి ప్రపంచం దృష్టిని ఆకర్షించేందుకు మరో అవకాశం దక్కింది. ఫార్ములా1 పవర్ బోట్ రేసింగ్‌లో ప్రసిద్ధి చెందిన ఎఫ్1హెచ్2వో ప్రపంచ చాంపియన్‌షిప్‌నకు ఆతిథ్యమిచ్చే గొప్ప అవకాశం భారత్‌లోని అనేక నగరాలను కాదని అమరావతికి దక్కింది. అమరావతిలోని భవానీ ఐలాండ్‌లో 'ఎఫ్1హెచ్2వో' ప్రపంచ చాంపియన్‌షిప్‌ను నిర్వహించాలని నిర్వాహకులు నిర్ణయించారు. ఈ మేరకు ఎనిమిది ప్రతిష్ఠాత్మక వేదికల్లో భారత్ పేరుని కూడా చేరుస్తూ శనివారం షెడ్యూల్‌ను ప్రకటించారు. 2018 వరల్డ్ చాంపియన్‌షిప్‌లో భాగంగా ఎఫ్1 వాటర్ స్పోర్ట్స్ నిర్వహణ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా 8 మహానగరాల్లో వీటిని నిర్వహిస్తుంది. పోర్చుగల్, లండన్, ఫ్రాన్స్, చైనా, దుబాయ్‌తో పాటు ఈసారి భారత్‌కు కూడా చోటు కల్పించారు. మే నెల 18న పోర్చుగల్‌లో మొదలయ్యే ఈ చాంపియన్‌షిప్ డిసెంబరు 15న షార్జాలో ముగుస్తుంది. నవంబరు 22 నుంచి 24 వరకూ అమరావతి వేదికగా నిలవనుంది. ఇది వరల్డ్ చాంపియన్‌షిప్ కావడంతో ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల నుంచి వేలాది మంది పర్యాటకులు అమరావతికి వస్తారు. దీన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పర్యాటక శాఖ వారికి అవసరమైన మౌలిక సదుపాయాలతోపాటు స్టార్ హోటల్ రూమ్స్, అంతర్జాతీయ స్థాయి ఫుడ్‌కోర్టులు ఏర్పాటుపై దృష్టిపెట్టింది.

ఎఫ్1హెచ్2వో ప్రపంచ చాంపియన్‌షిప్ షెడ్యూల్

దేశం/వేదిక	తేదీలు
పోర్చుగల్ (పోర్టిమావో)	మే 18-20
యూకే (లండన్)	జూన్ 15-17
ఫ్రాన్స్ (ఎవియాన్)	జూన్ 29-జూలై 1
చైనా (హార్బిన్)	ఆగస్టు 24-26
చైనా (లుయ్‌జౌ)	సెప్టెంబరు 29-అక్టోబరు 1
భారత్ (అమరావతి)	నవంబరు 22-24
యూఏఈ (అబుదాబి)	డిసెంబరు 6-8
యూఏఈ (షార్జా)	డిసెంబరు 13-15

చంద్రబాబు కృషి వల్లే..



అంతర్జాతీయ ఎఫ్1హెచ్2వో చాంపియన్‌షిప్‌ను ఏపీకి రప్పించేందుకు సీఎం చంద్రబాబు ఎంతగానో కృషి చేశారు. ఎఫ్1హెచ్2వో ప్రతినిధులతో ఏడాది వ్యవధిలో నాలుగుసార్లు చర్చించారు. అమరావతికి ఉన్న విశిష్టత, ముఖ్యంగా పోటీలు నిర్వహణకు ఉన్న మౌలిక సదుపాయాల గురించి వివరించారు. ఎఫ్1హెచ్2వో ప్రతినిధులు భవానీ ఐల్యాండ్‌తో పాటు సమీపంలోని 11 ఐల్యాండ్స్‌ను పలుమార్లు పరిశీలించారు. చివరకు శనివారం అమరావతికి ఓకే చెప్పారు. 'అమరావతిలో అద్భుతమైన 11 ఐల్యాండ్స్‌తో పాటు 23 కిలోమీటర్ల వాటర్ స్టోరేజ్ ఉంది. ఇది అంతర్జాతీయ వాటర్ స్పోర్ట్స్ నిర్వహణకు అనువుగా ఉంటుంది. కాబట్టి మా టీమ్ అంతా ఏపీ రాజధాని అమరావతికి వెళ్లేందుకు సిద్ధమయ్యామ'ని పోటీల నిర్వాహకుల్లో ఒకరైన అలెక్స్ ప్రకటించారు.

లోకం తీరు



ఎన్ని బాణాలు వేసినా చావడం లేదు..
'రామ బాణం'ను ప్రసాదించు స్వామీ...


ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
కడప	40.0	25.0
అనంతపురం	39.6	25.0
చిత్తూరు	37.0	25.2
హైదరాబాద్	36.0	24.0
విజయవాడ	35.5	25.0
విశాఖపట్నం	34.8	27.8
నెల్లూరు	34.6	25.4
ఒంగోలు	33.0	25.7

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమలలో ఆదివారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. దాదాపు 75 వేల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. సర్వదర్శనానికి సుమారు 10 గంటలు, దివ్యదర్శనానికి సుమారు 2 గంటల సమయం పడుతోంది. మంగళవారం సేవలకు సంబంధించి విజయాబ్యాంకులో సోమవారం లాటరీ ద్వారా జారీచేసే టిక్కెట్లు.. సుప్రభాతం:50, కల్యాణోత్సవం:80, డోలోత్సవం:25, అర్చన:26, ఆన్‌లైన్‌లో రూ.300 టిక్కెట్లు పొందడానికి w w l i లో సంప్రదించాలి. e . c

- ఆంధ్రజ్యోతి, తిరుమల



ప్రతి బుల్లెట్‌కు బాంబుతో సమాధానం చెప్పాలి

"బుల్లెట్లు, బాంబు దాడుల మధ్య పాక్‌తో శాంతి చర్చలు జరపలేం. సర్జికల్ దాడుల తర్వాత కూడా పాక్ వైఖరిలో మార్పు రాలేదు. వాళ్ల ప్రతి బుల్లెట్‌కు బాంబులతో సమాధానం చెప్పాలి. అప్పుడే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది."


- బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా



ఆధార్ కోసం వివరాలు ఇవ్వడానికి సంకోచమెందుకు?

అమెరికా వెళ్లేందుకు విమానాశ్రయంలో తెల్ల అధికారుల ముందు దుస్తులన్నీ విప్పేందుకు ఏ మాత్రం వెనకాడం. ఆధార్ కోసం వేలిముద్రలు, సమాచారం ఇవ్వాలని మన ప్రభుత్వం కోరితే మాత్రం సంకోచిస్తాం.

- కేంద్రమంత్రి కేజే అల్ఫోన్స్



'స్మార్ట్'గా ప్రొస్టేట్ కేన్సర్ చికిత్స

బీజింగ్, మార్చి 25: ప్రొస్టేట్ కేన్సర్ బాధితులకు సమర్థంగా చికిత్స అందించే 'స్మార్ట్ సాఫ్ట్‌వేర్'ను చైనా శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో పనిచేసే ఈ సాఫ్ట్‌వేర్ 99.38 శాతం కచ్చితత్వంతో కేన్సర్‌ను గుర్తించి, చికిత్స అందిస్తుందని నాన్‌జింగ్ విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకుడు హాంగ్‌కియాన్ గువా తెలిపారు. 'ఈ సాఫ్ట్‌వేర్ వల్ల నిపుణులైన పైథాలజిస్టుల కొరతను అధిగమించవచ్చు. పైథాలజిస్టుల అవసరం లేకుండా చేయడం ఈ సాఫ్ట్‌వేర్ ఉద్దేశం కాదు. వారికి సహకరిస్తూ.. రిపోర్టులను వేగవంతంగా అందించడం, చికిత్సా మార్గాలను సూచించడానికి ఇది ఉపయోగపడుతుంది' అని గువా పేర్కొన్నారు. ఇప్పటి వరకు 238 మంది ప్రొస్టేట్ కేన్సర్ బాధితుల నుంచి సేకరించిన 918 శాంపిల్స్‌ను ఈ సాఫ్ట్‌వేర్ పరీక్షించిందని తెలిపారు. కేన్సర్ ఏ స్టేజిలో ఉంది? అది ప్రాణాంతక దశకు చేరిందా? అనే వివరాలను ఈ సాఫ్ట్‌వేర్ తక్కువ సమయంలో గుర్తిస్తుందని వివరించారు.



బాబోయ్ ఎండలు

(మొదటి పేజీ తరువాయి)

నుంచి నెలాఖరు వరకు కర్నూలు, కడప, అనంతపురం, ప్రకాశం జిల్లాల్లో వేడివాతావరణం కొనసాగుతుందని విపత్తుల శాఖ వెల్లడించింది. ఈ నెల 30 నుంచి వచ్చే నెల రెండో తేదీ వరకు కోస్తాలో ఉక్కపోత ఎక్కువ అతుందని, గుంటూరు, ప్రకాశం, కృష్ణా జిల్లాల్లో ఉక్కపోత మరీ ఎక్కువగా వుంటుందని హెచ్చరించింది. క్రమేపీ వాయువ్య, మధ్యభారతంలో ఎండలు పెరుగుతాయని, దీని ప్రభావంతో తెలంగాణ, దానికి ఆనుకుని రాయలసీమ, కోస్తాలోని కొన్ని ప్రాంతాల్లో ఎండలు పెరుగుతాయని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. ఉక్కపోత, ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో మధ్యాహ్న సమయంలో బయట తిరగకూడదని వైద్యులు సూచించారు. పగటి ఉష్ణోగ్రతలు ఈ ఏడాది అత్యధికంగా నమోదయ్యే అవకాశం వుందని వస్తున్న వార్తల నేపథ్యంలో రాష్ట్ర విపత్తుల శాఖ అప్రమత్తమయ్యింది.

కోస్తాలో పాక్షిక మేఘాలు

శనివారం వరకు పశ్చిమబెంగాల్ నుంచి కోస్తా వరకు కొనసాగిన ఉపరితల ద్రోణి ఆదివారానికి బెంగాల్ నుంచి ఒడిశా, విదర్భ మీదుగా మహారాష్ట్ర వరకు కొనసాగుతుంది. దీని ప్రభావంతో కోస్తాలో అక్కడక్కడా ఉరుములతో వర్షాలు కురిశాయి. రానున్న ఇరవై నాలుగు గంటల్లో కోస్తాలో పాక్షికంగా మేఘాలు ఏర్పడతాయని, అయితే పొడివాతావరణం నెలకొంటుందని వాతావరణ అధికారి ఒకరు తెలిపారు.

బుందేల్‌ఖండ్ పాటి చేయమా?

(మొదటి పేజీ తరువాయి)

ఈ సాయం కేవలం రూ.420 మాత్రమే. రాయలసీమ, ఉత్తరాంధ్రల్లోని ఏడు జిల్లాలకు కలిపి ఏడాదికి రూ.350కోట్ల చొప్పున మూడేళ్లలో రూ.1050కోట్లు ఇచ్చారు. కేంద్రం చెబుతున్న 2011 జనాభా లెక్కలనే ప్రాతిపదికగా తీసుకున్నా రాయలసీమ నాలుగు జిల్లాల జనాభా 1.52 కోట్లు. ఉత్తరాంధ్ర జనాభా సుమారు కోటి. మూడేళ్లలో అందిన సాయం రూ.1050 కోట్లను ఒక్కొక్కరికీ పంచితే రూ.420 మాత్రమే. అదే బుందేల్‌ఖండ్‌కు ఇచ్చిన నిధులను, అక్కడి జనాభాను పరిశీలిస్తే... తలసరి రూ.10 వేలు వచ్చిందని అధికార వర్గాలు చెప్తున్నాయి. చట్టంలో ఉన్న విషయాన్ని అమలు చేయటంలోనే ఇంత వివక్ష చూపిస్తుంటే హామీల అమలతీరు ఇంకెలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చని ఆ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధుల కింద ఇచ్చిన రూ.1050కోట్ల నిధులకుగాను రూ.946 కోట్లకు యూసీలు సమర్పించారు. ఫిబ్రవరి 9వ తేదీ న నాలుగో ఏడాదికి కూడా ఏడు జిల్లాలకు కలిపి రూ.350కోట్లు కేంద్రం నుంచి విడుదల చేసి ఖాతాలో జమ చేశారు. అయితే ఫిబ్రవరి 15వ తేదీన మళ్లీ ఆ నిధులను వెనక్కి తీసేసుకున్నారు. ఆర్థిక శాఖ ఈ నిధులను తొలుత విడుదల చేయగా... ప్రధాన మంత్రి కార్యాలయం ఆదేశాల మేరకు వెనక్కు తీసుకున్నారని రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు చెప్తున్నారు.

ప్రాజెక్టులు, పనులవారీగా యూసీలు

రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర నిధులతో చేపట్టిన ప్రాజెక్టులు, పనుల వారీగా నిధుల వినియోగాన్ని పేర్కొంటూ యూసీలు సమర్పించిందని ఉన్నతాధికారులు చెప్తున్నారు. రాజధానికి ఇచ్చిన నిధులను... మౌలిక సదుపాయాల కల్పన, సీడ్ యాక్సిస్ రోడ్డు, ప్రధాన ఆర్టీరియర్ రోడ్లు, ప్రభుత్వ కాంప్లెక్స్ నిర్మాణంలో భాగంగా సచివాలయం, అసెంబ్లీల నిర్మాణం, సామాజిక మౌలిక సదుపాయాల కోసం స్కూళ్లు, ఆస్పత్రుల నిర్మాణం, కొండవీటివాగు ఎత్తిపోతల పథకం వంటి వాటికి కేటాయించి, ఖర్చు చేసుకుంటూ వెళ్తున్నారు. ఒక్కోదానికి ఎంత బడ్జెట్ కేటాయించారు? ఎంత ఖర్చుచేశారు? అన్న విషయాలను యూసీలో పేర్కొన్నారు. విజయవాడ, గుంటూరు నగరాల్లో భూగర్భ డ్రైనేజీ నిర్మాణం కోసం రూ.1000 కోట్లు ఇచ్చారు. వీటిని రాజధాని సాయంలో చేర్చకూడదని రాష్ట్రం పలుమార్లు విజ్ఞప్తి చేసినా కేంద్రం చెవికెక్కించుకోకుండా అందులోనే చేర్చింది. ఈ వెయ్యికోట్లలో మాత్రం రూ.350 కోట్లకే యూసీలు సమర్పించారు. ఈ భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులు ఇప్పటికే 42శాతం పూర్తయ్యాయని, గడువులోపు మిగతా పనులు పూర్తవుతాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

హోదాను పక్కదారి పట్టించటానికే...

హోదా అంశాన్ని పక్కదారి పట్టించడం, అసలు సమస్యను చిన్నగా చేసి చూపించడం కోసమే యూసీల అంశాన్ని బీజేపీ తెరమీదకు తెస్తోందని రాష్ట్ర ప్రభుత్వం గట్టిగా భావిస్తోంది. రాష్ట్రానికి ఇచ్చిన నిధుల్లో 8-12శాతం నిధులకే యూసీలు సమర్పించారని బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా అనడం పలువురు బీజేపీ నేతల వరకు ఇదే పాట పాడడంపై ప్రభుత్వ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. వాస్తవానికి రాజధానికోసం రూ.1500కోట్లు కేంద్రం ఇస్తే... రూ.1582 కోట్లకు యూసీలను రాష్ట్ర ప్రభుత్వం సమర్పించింది. నీతి ఆయోగ్‌కు యూసీలు సమర్పించగా... సదరు సంస్థ యూసీలన్నీ సరైన ఫార్మాట్‌లోనే వచ్చాయని పేర్కొన్న విషయాన్ని పలువురు సీనియర్ అధికారులు ప్రస్తావిస్తున్నారు. కేంద్ర ఆర్థికశాఖ నిబంధనల ప్రకారం, సాధారణ ఆర్థిక నిబంధన 212(1)ప్రకారం యూసీలు కచ్చితంగానే సమర్పించారని స్పష్టం చేసింది. 2014-15, 20150-16, 2016-17 ఆర్థిక సంవత్సరాలకు కలిపి విడుదల చేసిన మొత్తానికి ఈ యూసీలు సమర్పించారు. అయినా రాజధాని నిధులకు యూసీలు ఇవ్వలేదని కేంద్రం ప్రచారం చేయడంలో ఆంతర్యం ఏంటన్నదే ఇప్పుడు చర్చనీయాంశమయ్యింది.

మీదారెటు?

(మొదటి పేజీ తరువాయి)

స్పందన లేదు. అందుకే కేంద్రం నుంచి బయటకొచ్చాం. ఎన్డీయే నుంచి వైదొలిగాం. నిధులు రాబట్టేందుకు అన్ని ప్రయత్నాలు చేశాం. విధిలేని పరిస్థితుల్లోనే పోరాటమార్గం పట్టాం' అని చంద్రబాబు చెప్పారు. కేంద్రం ఇచ్చిన నిధులన్నింటికీ యూసీలు ఇచ్చాం. యూసీలు ఇవ్వలేదు కాబట్టే నిధులు ఆపామనడం పచ్చి అబద్ధం. దుర్మార్గం. యూసీలు ఇవ్వలేదని రుజువు చేస్తే ఎంపీగా రాజీనామా చేస్తాను అని సీఎం రమేశ్ సవాల్ చేశారు. లేకుంటే మీరు రాజీనామా చేస్తారా? అంటే బీజేపీ ఎంపీ జీవీఎల్ వెనక్కి తగ్గారన్నారు. వెనుకబడిన జిల్లాలకు ఇచ్చిన రూ.1050కోట్లలో రూ.940కోట్లకు యూసీలిచ్చాం. అమరావతికి ఇచ్చిన వెయ్యి కోట్లకు యూసీలిచ్చాం. గుంటూరు, విజయవాడకు ఇచ్చిన నిధుల్లో రూ.350కోట్లకు యూసీలిచ్చాం. ఆర్థికలోటుకు యూసీలు ఇవ్వనవసరం లేదు. రాష్ట్రానికి చేసిన అన్యాయం ప్రజలకు వివరించాలి' అని చంద్రబాబు పిలుపునిచ్చారు.

వారిద్దరికీ ఏమిటి వ్యత్యాసం?

'విజయ్‌మాల్యాకు ఒక న్యాయం? విజయసాయిరెడ్డికి మరో న్యాయమా?' అని సీఎం కేంద్రాన్ని సూటిగా ప్రశ్నించారు. 'ఇద్దరూ ఆర్థిక నేరస్థులే. వారి మధ్య వ్యత్యాసం ఏమిటి? విజయ్‌మాల్యా దేశం వదిలి పరారయ్యారు. సాయిరెడ్డి ప్రధాన మంత్రి కార్యాలయంలో ఉంటున్నారు. విజయ్‌మాల్యా సభ్యత్వం రద్దు చేశారు. విజయసాయి సభ్యత్వం కొనసాగిస్తున్నారు. చట్టంలోని అంశాలు, పార్లమెంటులో ఇచ్చిన హామీలు అమలుచేయమన్నాం. దానికి బీజేపీకి ఎందుకంత కోపం వస్తోంది? ఏపీకి ఎందుకు అన్యాయం చేస్తున్నారు? రాష్ట్రాభివృద్ధికి కేంద్రం సహకరించాలి. రాష్ట్రం కోసం పోరాడుతుంటే ఎందుకు విమర్శిస్తున్నారు? రాష్ట్రంలో అభివృద్ధి ఆగిపోకూడదు. అదే సమయంలో ప్రజల సెంటిమెంట్‌ను గౌరవించాలి' అని చంద్రబాబు వివరించారు.

నాలుగేళ్లయ్యాక స్పెషల్ పర్పస్ వెహికలా?

బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా లేఖ కూడా ఈ సందర్భంగా చంద్రబాబు ప్రస్తావించారు. 'షా లేఖకు అసెంబ్లీలోనే సమాధానం చెప్పా. ఆ పార్టీతో మనం పొత్తు పెట్టుకుందే రాష్ట్రం కోసం. ప్రజా ప్రయోజనాల కోసం. అలాంటిది నాలుగేళ్లయినా అది నెరవేరలేదు. ప్రజల మనోభావాలకు అనుగుణంగా కేంద్రాన్ని మనం హోదా అడగడం బీజేపీకి నచ్చడం లేదు. హోదాకు సమానంగా ఇస్తామంటేనే ఆర్థిక సాయానికి ఒప్పుకున్నాం. పైగా హోదా ఎవరికీ ఇవ్వొద్దని ఆర్థికసంఘం చెప్పిందని వక్రీకరించారు. ఈఏపీలకు నిధులు ఇస్తామని చెప్పి కనీసం మెమో కూడా ఇవ్వలేదు. మార్గదర్శకాలు జారీ కాలేదు. నాలుగేళ్లయ్యాక ఇప్పుడు స్పెషల్ పర్పస్ వెహికల్ అంటున్నారు. వీటన్నింటినీ ప్రజల్లోకి తీసుకెళ్లాలి. హోదా లేదని మనకు చెప్పి ఈశాన్య రాష్ట్రాలకు 90:10నిష్పత్తిలో నిధులు కొనసాగిస్తున్నారు. జీఎస్టీలో కూడా ఈశాన్య రాష్ట్రాలకు ప్రత్యేక లబ్ధి చేకూరుస్తున్నారు' అని చంద్రబాబు వివరించారు.

కండక్టర్లపై కత్తి

(మొదటి పేజీ తరువాయి)

ఒక బస్సుకు 11 మంది సిబ్బంది పని చేసేవారు. బస్సు గ్యారేజీ నుంచి బయలుదేరి తిరిగి గ్యారేజీకి వచ్చే వరకు ఈ 11 మంది విధులు నిర్వహించేవారు. అయితే, నష్టాల పేరుతో దశాబ్దాల కాలంగా బస్సు మీద పని చేసే సిబ్బందిని కుదిస్తూవచ్చారు. ఈ సంఖ్య 11 నుంచి 9, ఏడు, చివరికి 5.6గా వచ్చింది. తాజాగా ఆర్టీసీ యాజమాన్యం 5 మంది మాత్రమే ఉండాలని నిర్దేశించింది. అయితే, ఇప్పటికే సిబ్బంది కుదింపు వల్ల ఘోర రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పుడు మళ్లీ బస్సు నిర్వహణ బాధ్యతల నుంచి సిబ్బందిని మినహాయించడం అంటే ఆత్మహత్యా సదృశ్యమే అవుతుందని కార్మిక సంఘాలు హెచ్చరిస్తున్నాయి. సిబ్బందిని కుదించడం అన్ సీజన్‌లో ఆర్టీసీకి ఉపశమనంగా ఉంటుందేమో కానీ, పీక్ సీజన్‌లో మాత్రం కోరి కష్టాలు తెచ్చుకున్నట్టే అవుతుందని అంటున్నారు. అయితే, కుదించిన సిబ్బందినంతటినీ తొలగించబోమని, గ్రౌండ్ బుకింగ్‌కు వాడుకుంటామని ఆర్టీసీ యాజమాన్యం చెబుతోంది.

కుదింపు లక్ష్యం ఇదీ..

వన్‌మ్యాన్ సర్వీసులు ప్రస్తుతం 53 ఉండగా ఈ సంఖ్యను 96కు చేర్చాలని నిర్దేశించారు. టిమ్ సర్వీసుల కు యథాతథ స్థితిని కల్పించారు. సింగిల్ క్రూ డ్యూటీలను మినహాయించినా.. వన్‌మ్యాన్ సర్వీసుల విషయంలో ప్రస్తుతం ఉన్న 82 సర్వీసులను 116కు పెంచాలని నిర్ణయించారు. టిమ్స్‌ను 136 సర్వీసులలో ఉపయోగిస్తుండగా ఈ సంఖ్యను మొత్తం 220 సర్వీసులలో అమలు చేయాలని భావిస్తున్నారు. ఫలితంగా వందల మంది కార్మికులను కుదించడానికి ఆర్టీసీ యాజమాన్యం అధికారిక ఉత్తర్వులు ఇచ్చింది.

మహిళా కండక్టర్లపై వేటు


మహిళా దినోత్సవం సందర్భంగా రెండు వారాల క్రితం(మార్చి 8న) ఆర్టీసీలో మహిళా కండక్టర్లను ప్రవేశ పెట్టిన ఘనత తమదేనని అసెంబ్లీ సాక్షిగా మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారు. అయితే, అదే మహిళా కండక్టర్ల ఉద్యోగాలను గాల్లో దీపం చేస్తోంది ఆర్టీసీ యాజమాన్యం. బస్సుల్లో టిక్కెట్లు ఇవ్వడానికి మహిళా కండక్టర్లే కాదు పురుష కండక్టర్లు కూడా అక్కర్లేదని, డ్రైవర్‌కే టిమ్స్ ఇచ్చి పంపాలని యాజమాన్యం నిర్ణయించింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా 20 వేల మందిలో 2500 మంది కండక్టర్లు ఇంటి ముఖం పట్టనున్నారు. 2016 మార్చి నాటికి 12,256 బస్సులకుగాను సిబ్బంది 59,372 మంది ఉన్నారు. 2018 మార్చి నాటికి ప్రస్తుతం 11,630 బస్సులకు 54,489 మంది సిబ్బంది ఉండడం గమనార్హం. అంటే 4,883 మంది తగ్గారు. ఈ నెలాఖరుకు మరో 300 మంది పదవీ విరమణ చేయబోతున్నారు. అంటే రెండేళ్లలో ఐదువేల మందికి పైగా కార్మికుల్ని తగ్గించిన యాజమాన్యం మరో 2500 మంది ఉద్యోగాలకు చెక్ పెట్ట బోతోంది.

పొంచివున్న పెను ముప్పు


ఇప్పటికే రోడ్డు ప్రమాదాలు ఎక్కువై సురక్షిత ప్రయాణానికి చిరునామాగా ఉన్న ఆర్టీసీ ఇటీవల ఆ పేరుకు దూరమవుతోంది. ఈ పరిస్థితుల్లో డ్రైవర్ ఓ వైపు డ్రైవింగ్ చేస్తూ మరోవైపు టిమ్స్ ద్వారా టిక్కెట్లు జారీ చేస్తూ ప్రమాదానికి గురిచేస్తే ప్రయాణికుల భద్రతకు భరోసా ఏంటనేది ఇప్పుడు ప్రశ్నార్థకం. జిల్లాల వారీగా ఎన్ని టిమ్స్ పెంచాలన్న దానిపై ఆర్ఎంలకు యాజమాన్యం టార్గెట్లు విధించింది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతమున్న 1981 టిమ్‌లకు వీలైనంత త్వరలో 2,398కి పెంచాలని ఆదేశించింది. ప్రస్తుతం 1944 ఉన్న సింగిల్ క్రూ డ్యూటీలను 1977కు పెంచాలని, వన్‌మ్యాన్ సర్వీసులను 751 నుంచి 1082కు పెంచాలని స్పష్టంగా ఆదేశాల్లో పేర్కొంది.

అమీతుమీకి సిద్ధం: సంఘాలు

సిబ్బందిని తగ్గించేందుకు కార్మిక సంఘాలు ససేమిరా అంటున్నాయి. ఈ విషయంలో తాము ఎంతవరకైనా వెళతామంటూ తక్షణ ఆందోళనలకు పిలుపునిచ్చాయి. ఈ నెల 28, 29, 30 తేదీల్లో వరుసగా ఈయూ, ఎన్ఎంయూలు ధర్నాలకు శ్రీకారం చుట్టాయి. ధర్నాలకు దిగి రాకపోతే రీజియన్ల వారీగా రిలే నిరాహార దీక్షలు, ఛలో ఆర్ఎం కార్యాలయాల ముట్టడి నిర్వహించాలని, అంతిమంగా సమ్మెకు వెళ్లాలని భావిస్తున్నాయి. సర్క్యులర్‌ను ఉపసంహరించుకునే వరకూ పోరాటం ఆపబోమని ఎన్ఎంయూ అధ్యక్షుడు చల్లా చంద్రయ్య, ఈయూ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదర్‌రావు వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు.



ఒక్కసారి చెల్లించండి ...
భద్రతతో కూడిన
సమృద్ధిని పొందండి!
ఎల్ ఐ సి వారి
జీవన్ ఉత్కర్ష్
Plan No. 846 UIN : 512N313V01
ఒక నాన్-లింక్డ్, లాభాలతో కూడిన సింగిల్ ప్రీమియం ప్లాన్
అర్హత నిబంధనలు
కనీస ప్రవేశ వయస్సు : 6 సంవత్సరాలు
గరిష్ఠ ప్రవేశ వయస్సు : 47 సంవత్సరాలు
కనీస ప్రాథమిక బీమా రాశి: రూ 75,000/-
గరిష్ఠ ప్రాథమిక బీమా రాశి: అపరిమితం
పాలసీ వ్యవధి: 12 సంవత్సరాలు
ప్రీమియం చెల్లింపు పద్ధతి: సింగిల్ ప్రీమియం
సులభమైన లిక్విడిటీ
ఋణం పొందే సదుపాయం: పాలసీ జారీచేసిన తేదీ నుంచి 3 నెలల తర్వాత
5 సంవత్సరాల తర్వాత నిష్క్రమించిన పక్షంలో, లాయల్టీ అడిషన్, ఏమైన ఉంటే, చెల్లించబడును
మీ ఏజెంట్ / బ్రాంచ్‌ని సంప్రదించండి లేదా
మా వెబ్‌సైట్ www.licindia.in ని సందర్శించండి.
లేదా 'YOUR CITY NAME' 56767474 కి ఎస్ఎమ్ఎస్ చేయండి (e.g. 'Mumbai')
Follow us on: LIC India Forever
కొనుగోలు నిర్ణయం తీసుకొనే ముందు రిస్క్ అంశాలు, షరతులు, నిబంధనలకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం దయచేసి మా సేల్స్ బ్రోచర్‌ను జాగ్రత్తగా చదవండి
IRDAI Regn No.:512
LIC
भारतीय जीवन बीमा निगम
LIFE INSURANCE CORPORATION OF INDIA
జీవితాంతం - జీవితానంతరం కూడా.



విద్యార్థులు, తల్లిదండ్రులు, శ్రేయోభిలాషులకు విజ్ఞాన్‌వారి
శ్రీరామనవమి శుభాకాంక్షలు
NAAC 'A' nirf 88
విజ్ఞాన్స్
Foundation for Science, Technology & Research
(డీమ్డ్ టు బి యూనివర్సిటీ)
-Estd. u/s 3 of UGC Act 1956
వడ్లమూడి, గుంటూరు - 522 213.
ప్రజలంతా సిరి సంపదలు, సుఖసంతోషాలతో ఉంటే దాన్ని రామరాజ్యంగా భావిస్తాం. ఇలాంటి రామరాజ్యం తెలుగు ప్రజల వెన్నంటే ఉండాలని ప్రార్థిస్తున్నాం.
మన ప్రాంత, మన రాష్ట్ర అభివృద్ధిని మనమే సాధించాలి. ప్రధానంగా విద్యార్థులు, యువత ఉన్నత విద్యావంతులై నైపుణ్యాలను సొంతం చేసుకుంటే మన ప్రగతి తప్పకుండా సాధ్యమవుతుంది.
ఈ ఆలోచనతోనే విజ్ఞాన్ 41 ఏళ్ల నుంచి విలువలతో కూడిన విద్యను అందిస్తూ, లక్షలాది మంది దిగువస్థాయి, మధ్యతరగతిస్థాయి విద్యార్థులను సైతం ఉన్నతస్థాయిలో నిలబెట్టింది.
అదే స్ఫూర్తి, అదే పట్టుదలతో విజ్ఞాన్ నిరంతర కృషి కొనసాగిస్తోంది. ముఖ్యంగా గడిచిన రెండేళ్లలో ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగ రంగం తీవ్రమైన సంక్షోభంలో ఉన్నాసరే విజ్ఞాన్ విద్యార్థులు ఎక్కడా తడబడలేదు. ఈ ఏడాది ఇప్పటికే 70 నుంచి 75 శాతం మంది ఉద్యోగాలు సాధించేశారు కూడా. వచ్చే 2, 3 నెలల్లో 85 నుంచి 90 శాతం మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధిస్తారని సవినయంగా తెలియజేసుకుంటున్నాం.
రాబోయే సంవత్సరాల్లో ఎదురయ్యే క్లిష్టమైన పరిస్థితులను ముందుచూపుతో అంచనావేసి ఒకవైపు ఆధునిక సాంకేతిక కోర్సులైన ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, బిగ్‌డేటా, క్లౌడ్‌కంప్యూటింగ్ మొదలైన కోర్సులతోపాటు, మరోవైపు ఐఏఎస్, ఐపీఎస్, గ్రూప్-1, గ్రూప్-2 లాంటి ప్రభుత్వ సర్వీసుల్లో, బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగాలు సాధించేందుకు వీలుగా సమర్థవంతమైన తర్ఫీదును విద్యార్థులకు అందజేస్తున్నాం.
అంటే భవిష్యత్తులో విద్యార్థి ఎంచుకోనున్న రంగం, రాయనున్న పోటీ పరీక్షలకు సంబంధించి ముందుచూపుతో ఎప్పటికప్పుడు ప్రణాళికలు రూపొందించి అమలుచేయడం విజ్ఞాన్ అనుసరిస్తున్న కీలక వ్యూహం.
మన ప్రాంతం, మన రాష్ట్రం, మన యువత, మన ప్రజలు అందరికంటే ముందుండాలనే ప్రగాఢమైన కాంక్షతో విజ్ఞాన్.. చిత్తశుద్ధి, పట్టుదలతో పనిచేస్తోంది. ఇతర ప్రాంతాల నుంచి కూడా పలు విద్యాసంస్థలు ఇక్కడకు వస్తున్నా.. మన విజ్ఞాన్ మాత్రం తెలుగు ప్రజలు గర్వపడే విధంగా పనిచేస్తూనే ఉంటుంది.
41 ఏళ్ల నుంచి ఎంతో నమ్మకంతో మమ్మల్ని ప్రోత్సహిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ అందరికీ మరోసారి శ్రీరామనవమి శుభాకాంక్షలు. - మీ విజ్ఞాన్
బీ.టెక్./బీ.ఫార్మసీ ప్రవేశపరీక్ష
వీశాట్ 2018
అప్లికేషన్లు అందజేసేందుకు చివరి తేది:10-4-2018
అప్లై ఆన్‌లైన్ : www.vignanuniversity.org
ఆన్‌లైన్ పరీక్షా తేదీలు : 15-19 ఏప్రిల్ 2018
స్లాట్ 1 : ఉ॥ 8.00 - 10.30 వరకు
స్లాట్ 2 : ఉ॥ 11.00 - మ॥ 1.30 గంటల వరకు
స్లాట్ 3 : మ॥ 2.30 - సా॥ 5.00 గంటల వరకు
అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు : బీటెక్++/బీ.ఫార్మసీ*
అగ్రికల్చరల్ | ఆటోమొబైల్ | కెమికల్ | సివిల్ | సీఎస్ఈ
ఈసీఈ | ఈఈఈ | ఐటీ | మెకానికల్ | పెట్రోలియం
టెక్స్‌టైల్ & ఫ్యాషన్ టెక్నాలజీ
*బైపీసీ విద్యార్థులు కూడా బీటెక్ ప్రవేశాలకు అర్హులే
బయోమెడికల్* | బయోటెక్నాలజీ* | బయోఇన్ఫర్మాటిక్స్* |
ఫుడ్ టెక్నాలజీ* | బీ.ఫార్మసీ*
++బీటెక్ విద్యార్థులంతా దిగువ తెలిపిన కోర్సుల్లో ఏదో ఒక దాన్ని మైనర్ కోర్సుగా తీసుకునే అవకాశం
1. మేనేజ్‌మెంట్ 2. హ్యూమానిటీస్
ప్రతిభావంతులకు ఏడాదికి రూ. 4కోట్లకు పైగా స్కాలర్‌షిప్పులు
బీబీఏ + ఎంబీఏ/ బీబీఏ/ బీసీఏ అడ్మిషన్ టెస్ట్ వీ-జెట్-2018
బీఎస్సీ / ఎం.టెక్ / ఎంబీఏ / ఎంసీఏ / పీ.హెచ్‌డీ ప్రోగ్రామ్స్
ఇతర వివరాల కోసం www.vignanuniversity.org వెబ్‌సైట్‌ను సంప్రదించండి
వివరములకు : 0863-2344 777 | Toll Free : 1800 425 2529 | E-mail: dean_admissions@vignanuniversity.org



HONDA
The Power of Dreams
కలలను సాకారం చేస్తాం
EXPERIENCE a NEW RIDE THE GRAZIA WAY
MH 12 PJ 7117
GRAZIA
THE WORLD IN a NEW LIGHT
LED HEADLAMP
DISC BRAKE ALLOY WHEELS
FULLY DIGITAL METER ECO SPEED INDICATOR
SEAT OPENING SWITCH
HET BS-IV
125CC ENGINE
హోండా అంటే HONDA
Honda Motorcycle and Scooter India Pvt. Ltd., Registered Office: Commerical Complex II, Sector-49-50, Golf Course Extension Road, Gurugram - 122 018 (Haryana), India; Website: www.honda2wheelersindia.com; Customer Care: customercare@honda2wheelersindia.com
Also available: Annual Maintenance Contract** Road Side Assistance** Engine Health Assurance**
Follow us on
Honda Exclusive Authorized Dealerships: VIJAYAWADA: Anvita Honda - 9225922599, 0866 6628333; Mithra Honda - 2442149, 8297235235; Sri Santosh Honda - 9703123445, 8019669955; GUDIVADA: Pruthvi Honda - 8977185999, 8977803888; JAGGAIAHPET: Mithra Honda - 08297557149/50; MYLAVARAM: Mithra Honda - 8297568888; KAANURU: Sri Santosh Honda - 08666452666, 9618909494; GANNAVARAM: Sri Santosh Honda - 9912195558, 9391935558; VISSANNAPETA: Aishwarya Honda - 08673-272722, 9000866319; TIRUVURU: Sri VenkataSatya Honda - 08673-253446, 8977836666; KAIKALURU: Pruthvi Honda - 08677-225555, 9642854888; MACHILIPATNAM: Nagasai Honda - 9676945616; KANCHIKACHERLA: Sri Spandana Honda - 08678-273066, 8523034242; NANDIGAMA: Apple Honda - 07660867711, 08678-279001; CHALLAPALLI: Annapurna Honda - 8499900065; NUZIVIDU: Srishivani Honda - 7893194444; VUYYURU: Pruthvi Honda - 08676236236, 8142026888; IBRAHIMPATNAM: Leo Honda - 9348686966.
For Bulk/Institutional enquiries, please write us at: institutionalsales@honda2wheelersindia.com



కావి కోవెల

శివరాత్రి గడిసిన
సినుకు సిగమాసిన
మింటితెర వలకత్తె
ఇంట పడకేసిన
మొగిలి పరిసిన సాప
మొగడెత్తుకెళ్లిన
సెగల నాపె సలువ
కొలువున్నదేలీల

దారికిరువైపుల
నీడ పరిసిన సెట్లు
పసరు కొమ్మల పైని
పక్షుల ముచ్చట్లు
పండుటాకుల తాకి
సిరుగాలి సప్పట్లు
కొండ వాలున రాలె
కొసరు సినుకుల బొట్లు

కలగాని కలలోన
కనిపించెనీతావు
ఇల ఆవగింజంత
కలిమాయ పొడలేదు
పలువసతులనుకునె
పట్టణంబుల చాయ
ఈ జనపదంబున
ఇసుమంత లేదాయ

పొలిమేరకు కొలుపు
కుసుమ పూల పసుపు
రైతు వాకిలి నలికె
రాగి కంకుల ఎరుపు
ఊరి సత్తువ నిలుపు
ఉలువ రాసుల నలుపు
వినిమాయల ఎండ
పడనీయని కొండ

పసిమిపూల నురగ
ఎరుపు మడిలొ సెనగ
గాలిగజ్జెల పొందు
కందిగొలుక సిందు
పచ్చని వరి కురుల
పాపిట ముత్యాలా
పారాడె పందిరి
పల్లె సిరిసింగిడి

కాపు పడుచుపిల్ల
కంచుసెంబుల సల్ల
తలపైన తొణకంగ
తనువెల్ల చిలకంగ
దోర పెదవిన సిగ్గు
లూరి పేరే వెన్న
నవ్వు పుప్పొడి రాల
తేనెటీగలె వాల

పెసర కంది పొరక
దుసరు తీగల పొనక
తలపైన మోసుక
వెలది వేగపు నడక

నడుమొంపులే తొలుక
నాగుల తలపింప
పొరపడి తనవెంట
వచ్చె నెమలిజంట

ఇరుసందె వేళలొ
ఎగిసె గోధూలిలో
కావిరంగుతొ దేవ
కోవెలాయెను పల్లె
పసరు నెమరులతోని
అలమంద మురవంగ
వెండి ధారలతోని
ముంగిల్లే పొంగంగ

అవిసెమాను నిండ
పాలరెమ్మల దండ
కలశ గోపురమోలె
కనిపించెనీకొండ
మల్లికార్జున బండ
గుండములో గంగ
తోడుతున్న కొలది
ఊరుతున్నది చెలిమ

జడలిప్పె కావరం
కనరాని స్థావరం
తడిగుండెతొ పరుల
దరిదీసి సేవనం
ధరనేలె పురముల
మరిసింది ఈ తలం
కరునొంపె మాన్యుల
కొలిసింది ఈ వనం

ఊహతొ ఒనగూడె
భావ సిద్ధి ఫలము
ఎరుకనొందిన వారి
అనుభవం వేరన్న
కలను చెరిపి ఎదను
కదిపె మెలకువ కన్న
కలలుగనె కునుకులో
ఇలనె మరసితె మేలు

(సంగీత సాహిత్య నిధి, అపర సదాశివ చింతలదిన్నె హన్మంతరెడ్డిగారి పురా దేవాలయం లాంటి ఇంట కన్న కల)

■ గోరటి వెంకన్న

సోమవారం 26 మార్చి 2018

వివిధ

సాహిత్య వేదిక vividha@andhrajyothy.com

"Chess is a play activity, yet it is play only because the players deliberately make the game difficult in order to overcome the difficulties. The equation is simple: no difficulty, no fun. No chess player finds any real pleasure in playing an obviously inferior opponent. Learning to experience poetry is not a radically different process from that of learning any other kind of play!"

- John Ciardi ("How Does A Poem Mean?" P.669)

వచనకవిత్వం - అభివ్యక్తి ప్రాధాన్యం

శతకాలను, ముక్తకప్రాయ రచనలను అలా ఉంచితే- ప్రాచీన కవిత్వమంతా కథ ఆధారంగానే నిర్మించబడింది. వర్ణనలతో పాటు కథాకథనం, పాత్ర చిత్రీకరణ, సన్నివేశ కల్పన, నాటకీయ సంభాషణా ధోరణి మొదలైన అంశాలలో తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించడం ద్వారా, తమ రచనలకు ప్రాచీన కవులు కావ్యత్వాన్ని కల్పించగలిగారు.

ఛందోబద్ధమైన సంస్కృతాంధ్ర కావ్యాల్లో ఛందస్సువల్ల శ్రవణపేయత సమకూరుతుంది. దానితోపాటు భావానుగుణమైన శబ్దాలంకృతి ద్వారా భావ శబలత సాధించే అవకాశం కలిగింది. ఉదాహరణకు, "దుర్వారోద్యమ బాహు విక్రమ మదోద్ధరుడై...", "మందార మకరంద మాధుర్యమున....", "అడిగెదనని కడు వడి జను...", "అట జని కాంచె భూమిసురుడు..." లాంటి పద్యాలలోని శబ్ద, అర్థాలంకార అవినాభావ బంధం గమనించదగినది. కథారహితమైన, ఛందస్సులకూ శబ్దాలంకారాలకూ అవకాశంలేని వచనకవిత, కేవలం అర్థాలంకృతి ద్వారానే చదువరిని (శ్రోతను) అలరించవలసి ఉంటుంది.

కవి అనుభూతులు, ఊహలు, ఆలోచనలు, అభిప్రాయాలకే ప్రాధాన్యం కనుక, నవ్యత, క్లుప్తత, గుప్తత, కవిత్వ సాంద్రత మొదలైనవి వచనకవితకు అనివార్యమైనాయి. ప్రాచీనకావ్యాలకూ, పద్యాలకూ ఉన్నట్లు, వచనకవితా ఖండికకు నిర్దిష్ట నిర్మాణ చట్రమంటూ ఏదీ లేదు. ఇది ఎంత సౌకర్యమో, అంత అసౌకర్యం కూడ. అందుకేనేమో, "వచనకవిత్వ రచన, నెట్ లేకుండా లాన్ టెన్నిస్ ఆడడం లాంటిది" అన్నాడు రాబర్ట్ ఫ్రాస్ట్. "వచన గీతం తన రూపం తానే నిరూపించుకుంటుంది" అన్నారు శ్రీశ్రీ.

ప్రతి వచనకవితకూ శీర్షిక, ఎత్తుగడ, పూర్వాపర సమన్వయంతో కూడిన నిర్వహణ, వస్తువుకూ కవి దృక్పథానికీ అనుగుణమైన సార్థకమైన ముగింపు ఉండాలి. కనుక ప్రతి కవీ, తన ప్రతి కవితకూ ఒక విలక్షణమైన నిర్మాణ చట్రాన్ని రూపొందించుకోవాలి. లేదా అప్రయత్నంగానే అయినా రూపొందాలి. అట్లా రూపొందిన కవితలే పునః పునః పఠనాసక్తిని కలిగిస్తూ, పాఠకుల మదిలో చిరకాలం నిలిచిపోతాయి.

ముందే నిర్మాణ చట్రాన్ని ఊహించుకొని కవిత రాయవచ్చు. లేదా కవిత రాస్తున్న క్రమంలోనే నిర్మాణ చట్రం రూపొందవచ్చు. సిద్ధంగా ఉన్న ఒక మూసలో లోహపాత్రకు పోతపోయడానికీ; తాను తయారు చేయదలచుకున్న పాత్రకు తగిన విధంగా, ముందు మూసను నిర్మించుకొని, ఆ తర్వాత పోతపోయడానికీ తేడా ఉంటుంది కదా! ఇది వచనకవితా ఖండికకూ వర్తిస్తుంది. వచనకవి ఏకకాలంలో కవి పాత్రతో పాటు, (ఒక రకంగా) లాక్షణికుని పాత్రనూ నిర్వహించవలసి ఉంటుంది. కనుక వచనకవికి ఈ రెండు రకాల సృజనాత్మక నిపుణత ఉండాలన్న మాట.

వచనకవితలో పాదవిభజన గూర్చి చర్చిస్తూ చేకూరి రామారావు గారు చెప్పిన మాటలివి: "వచనకవిత్వానికి సర్వసామాన్యమైన నిర్వచన స్థాయి లేదు. అంతా నిర్వహణ స్థాయే. ఆ నిర్వహించిన స్థాయిని బట్టే లక్షణ నిర్దేశం చెయ్యాలి. నిజానికి నిర్దేశించము, ఆవిష్కరిస్తాము. ఇంగ్లిష్‌లో చెబితే: We don't define it, We discover it. వచన పద్య నిర్మాణం ఎప్పటికప్పుడు నిత్య నూతనం. దీన్ని సద్యో నిర్మాణం అందాం. నిర్వచన స్థాయి లేకుండా, నిర్వహణ స్థాయిలో నిర్మితం కావడమే సద్యో నిర్మాణం. వచనకవిత్వంలో స్వేచ్ఛా రహస్యం ఇదే." ఈ మాటలు వచనకవిత నిర్మాణచట్రానికీ వర్తిస్తాయి. ఈ అంశాలన్నీ గమనిస్తే, నిర్దిష్ట నిర్మాణ రీతిని ముందుగా రూపొందించుకున్నా, రూపొందించుకోక పోయినా, ప్రతి కవీ, తాను రాసే వచనకవితా ఖండికకు సంబంధించి, నిర్మాణ శిల్ప స్పృహ కలిగి ఉండాలి అని తెలుస్తుంది.

విషయాన్ని వీలైనంత గుప్తంగా చెప్పే పద్ధతి, వచనకవితలో శీర్షికతోనే మొదలవుతుంది. సాధారణంగా వచనకవులు, వస్తువును నేరుగా శీర్షికలతోనే సూచించే సందర్భాలు చాల తక్కువ; కవిత మొత్తం శ్రద్ధతో చదివిన తర్వాతనే శీర్షిక సార్థక్యమూ, విలక్షణతలు బోధపడే సందర్భాలే ఎక్కువగా కనిపిస్తుంటాయి.

ఆలంకారికమైన అభివ్యక్తిలో భాగంగానే, వస్తువును, దృష్టికోణాన్ని, పరిష్కారాన్ని, కంఠస్వరాన్ని (టోన్) కవి వ్యంగ్యం చేస్తాడు. వక్త ఎవరు? నిర్దిష్టంగా శ్రోత ఎవరు? వక్తవ్యాంశం ఏమిటి? అనే అంశాలు కూడా కవిత్వ నిర్వహణలో భాగంగానే వ్యంగ్యం చేయడం, ధ్వనించడం వచనకవితలలోని మరో సాధారణ అంశం.

నిర్దిష్ట కవితా చట్రంలో భాగంగానే కీలకమైన పదబంధాల ద్వారా, ప్రతీకల ద్వారా, (అరుదుగా) నామవాచకాల ద్వారా, కవి వస్తువును ధ్వనిస్తాడు. కవి ప్రయోగించిన ప్రతీకల మధ్యన ఉన్న సమన్వయాన్ని కనుగొనగలిగినప్పుడే వస్తువును, కవి దృక్పథాన్ని, వ్యక్తీకరణలోని అభివ్యక్తి నైపుణ్యాన్ని సంపూర్ణంగా అర్థం చేసుకోగలుగుతాం. ఉత్తమశ్రేణికి చెందిన, సాహిత్యాభిమానులను అలరించిన చాల కవితలలో అలంకార మూలమైన వస్తుధ్వని కనిపిస్తూ ఉంటుంది.

మరికొన్ని సందర్భాలలో కవితకు బాహ్యమైన అంశాల ఆధారంగానే కవితను అర్థం చేసుకునే అవకాశాలుంటాయి. కవితలోని కొన్ని ప్రతీకల ద్వారా, కవితాచట్రానికి బాహ్యమైన అంశాలను కూడా కవి సూచిస్తాడే కాని, కవితకు మొదట కాని చివర కాని, వస్తువును గూర్చి ఏ రకమైన సూచనలూ ఇవ్వడు. కనుక, కథా కావ్యాలను అర్థం చేసుకోవడానికి భాషా, వ్యాకరణ, కవిసమయాదుల పరిజ్ఞానం కొంత సరిపోతుంది. కాని, వచనకవితా ఖండికలను అర్థం చేసుకోవడానికి, చాల సందర్భాల్లో సమకాలీన సామాజిక, సాంస్కృతిక, రాజకీయాది రంగాల పరిస్థితుల పరిజ్ఞానమూ అవసరమవుతుంది. కథారహితమైన వచనకవితలలో వీలైనంత క్లుప్తంగా, గుప్తంగా వ్యక్తీకరించడానికి, అనేక భారతీయ, పాశ్చాత్య ఆలంకారిక రీతులను కవులు వినియోగించుకుంటూ ఉంటారు. కొత్తగా వచనకవితలను చదివే పాఠకులు కొందరు వచనకవితలలోని ప్రధాన అంశమైన అలంకార మూలమైన వస్తుధ్వనిని అందుకోలేక, కవితలను సంక్లిష్టమైనవిగా, అయోమయంగా భావిస్తుంటారు. అందుకేనేమో కొన్ని వచనకవితలను, సాటి కవులు చదివి ఆనందించినంతగా, సగటు పాఠకులు ఆనందించలేకపోతున్నారని కొందరంటున్నారు.

వచనకవులు 'నేను', 'మేము', 'మనం', 'నువ్వు', 'మీరు', 'వాడు' లాంటి సర్వనామాలను విరివిగా వాడుతూ ఉంటారు. కొన్ని 'వ్యక్తిగత' (పర్సనల్) కవితలలో మాత్రమే అస్మదర్థక సర్వనామాలు కవికి వర్తిస్తాయి. చాల ఇతర సందర్భాలలో, పైన తెలిపిన సర్వనామాలు వివిధ కుల, ఉపకుల, మత, ప్రాంత, వివిధ సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తుంటాయి; కవి వ్యక్తిగత నేపథ్యాన్ని బట్టి, కవి భావజాలాన్ని బట్టి ఆ సర్వనామాలను అన్వయించుకోవలసి ఉంటుంది. కనుక, కవి యొక్క సామాజిక వర్గాన్ని గూర్చిన, భావజాలాన్ని గూర్చిన అవగాహన (కొంతవరకైనా) ఉన్నప్పుడే, పాఠకునికి కవిహృదయం బోధపడుతుంది.



"ఆధునిక కవిత్వంలో కథ అదృశ్యం అయ్యాక భావాభివ్యక్తికి ఆలంబనగా కవులు సర్వనామాలను స్వీకరించారు. నేను, నీవు, వాడు, మేము, మనం, ఆమె, అతను, ఇది, అది వంటి సర్వనామాలను విరివిగా ఉపయోగిస్తున్నారు. మంచినీరు ఏ పాత్రలో పోస్తే ఆ రూపాన్ని, ఏ రంగు కలుగజేస్తే ఆ రంగును చూపినట్లు సర్వనామానికి కవితలో ఏ వస్తువు ఉంటే ఆ తత్వం, ఏ శిల్పం ఉంటే ఆ గుణం కలుగుతాయి. కవి సృష్టించే కవితా వాతావరణానికి అనుగుణంగా ఆ సర్వనామం తన రూపాన్ని మార్చుకుంటుంది" అని విమర్శకులన్నారు. (డా. వై. కామేశ్వరి, 'కొత్త కొలమానాలు' వ్యాస సంపుటి).

"సామూహిక ఆస్వాదన దశ నుంచి కవిత్వాన్ని వైయక్తిక ఆస్వాదన దశకి తీసుకెళ్ళడంలో భావకవిత్వం చేసిన మార్పులు, క్రమంగా బలపడి తరవాత, తరవాత కవిత్వంలో ముఖ్యలక్షణాలయ్యాయి" అనే వెల్చేరు ('తెలుగులో కవితా విప్లవాల స్వరూపం') అభిప్రాయాన్ని ఇక్కడ గుర్తు చేసుకోవాలి. వివిధ వాదాల, వివిధ భావజాలాల నేపథ్యంలో రూపొందిన సరికొత్త పరిభాషలనూ, వినూతనంగా రూఢి అయిన అర్థాలనూ, నవ్య ప్రతీకలనూ, వచనకవిత్వ పాఠకుడు గ్రహించగలిగి ఉండాలి.

> వచనకవి ఏకకాలంలో కవి పాత్రతోపాటు లాక్షణికుని పాత్రనూ నిర్వహించవలసి ఉంటుంది. కనుక వచనకవికి ఈ రెండు రకాల సృజనాత్మక నిపుణత ఉండాలన్న మాట.

వచనకవితాభిమాని, సాధారణంగా, వచనకవితా ప్రక్రియ గూర్చి ఎంతో కొంత అవగాహన కలిగినవాడై ఉంటాడు. కనుక వచనకవి తానే సూటిగా అంతా చెప్పాలనుకోకూడదు. వచనకవితా పాఠకునికి ఉండే క్రియాశీలక పాత్రను, కవితానిర్మాణ మర్మజ్ఞతను విస్మరించకూడదు. పాఠకుడు అప్పుడే ఒక ప్రహేళికను పరిష్కరించిన ఆనందాన్ని పొందగలుగుతాడు.

వస్తువు చర్వితచర్వణమైనది అయినప్పుడు, ఆలంకారికత మరింత ప్రధానమవుతుంది. అభివ్యక్తిలో పెద్దగా ప్రత్యేకత లేనప్పుడు వస్తు నవ్యత చదువరిని ఆకర్షిస్తుంది. అనుప్రాస, అంత్యప్రాసలను పొదుపుగా ఉపయోగించుకుంటే కవితకు నాదసౌందర్యం, 'వాక్యలయ' చేకూరుతుంది. మితిమీరితే, భావం మీద కంటే కవికి శబ్దం మీదనే దృష్టి ఎక్కువ అనే అభిప్రాయం కలుగుతుంది. అందుకే 'Don't over use rhyme, It's a crime' అన్నాడొక ఆంగ్ల విమర్శకుడు.

సానుకూలమైన అపూర్వత, అనూహ్యతలు జీవితంలో వలెనే, సాహిత్యంలోనూ (కవిత్వంలోనూ) ఆశ్చర్యానందాలను కలిగిస్తాయి. ఇది కవితావస్తువుకూ, అభివ్యక్తికీ వర్తిస్తుంది. ఒక కవి రాసే అనేక కవితలలో ఎత్తుగడ, నిర్వహణ, ముగింపులు ఒకే రకంగా ఉంటే మొనాటనస్‌గా ఉంటుంది. ప్రతి కవిత విలక్షణ నిర్మాణ వ్యూహం కలిగి ఉండడం కూడ ముఖ్యమే. కవితలోని కవి (లేదా పాత్ర) 'కంఠ స్వరం' (టోన్) ఆద్యంతం ఒకే 'శ్రుతి'లో ఉండేలా జాగరూకత వహించాలి.

ఆలోచనాత్మకతకూ, అనుభూతి వ్యక్తీకరణకూ ప్రాధాన్యమిచ్చిన వచన రచయితలు కూడా వ్యంగ్యం వల్ల, ధ్వని వల్ల వక్తవ్యాంశం చదువరుల హృదయాలలో చెరగని ముద్ర వేస్తుందని భావించారు; కవితాత్మక అభివ్యక్తిని ఎన్నుకున్నారు. చలం, బుచ్చిబాబు, రావిశాస్త్రి వంటి వారి కొన్ని రచనలను ఈ దృష్టితో గమనించవచ్చు. ఇటీవల విశేషాదరణ పొందిన 'పతంజలి భాష్యం', టంకశాల అశోక్ 'సముద్రం', కె. శ్రీనివాస్ 'సంభాషణ', అరుణ్ సాగర్ 'మేల్ కొలుపు' మొదలైన రచనలు వచనానికీ, కవిత్వానికీ మధ్యన హద్దులు చెరిపేశాయని గమనించవచ్చు.

క్లుప్తత, అనుభూతి ఐక్యత (పాఠకునిలో కలుగ జేసే భావ ప్రకంపన), సంఘర్షణ, నిర్మాణ సౌష్టవం అనేవి మంచి కథకు ఉండే సాధారణ లక్షణాలు అని విమర్శకులు పేర్కొంటూ ఉంటారు. ఇలాంటి లక్షణాలు వచనకవితా ఖండికకూ అవసరమే!

■ పెన్నా శివరామకృష్ణ

94404 37200

'భారతీయ సాహిత్యంపై అంబేడ్కర్ ప్రభావం'

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం - అంబేడ్కర్ ఛైర్, ఏపీ బహుజన రచయితల వేదికల సంయుక్త ఆధ్వర్యంలో మార్చి 28, 29 తేదీల్లో 'భారతీయ సాహిత్యంపై అంబేడ్కర్ తాత్వికత ప్రభావం' అంశంపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నాం. ఈ అంశంపై పరిశోధనా పత్రాలను ఆహ్వానిస్తున్నాం. వివరాలకు: 99669 90797.

- ఎస్. మురళీమోహన్

పతంజలి సాహితీ పురస్కారం

కెఎన్‌వై పతంజలి సాహితీ పురస్కారాన్ని ఈ ఏడాది కవి, పాత్రికేయుడు సతీష్ చందర్ అందుకొంటారు. ఈ పురస్కార ప్రదాన సభ ఈ నెల 29వ తేదీ పతంజలి జయంతి రోజున సా.5గం.లకు విజయనగరంలోని గురజాడ కేంద్ర గ్రంథాలయం మేడపైన చాసో సాహితీ సమావేశ మందిరంలో జరుగుతుంది. సతీష్ చందర్ సాహిత్యాన్ని కె.ఎన్. మల్లీశ్వరి సమీక్షిస్తారు. ముఖ్య అతిథి వాసిరెడ్డి నవీన్. వివరాలకు: 94901 06390.

- జి.ఎస్. చలం

'తలచుకుందాం! ప్రేమతో' పుస్తకావిష్కరణ

యలమంచిలి శివాజీ పుస్తకం 'తలచుకుందాం! ప్రేమతో' ఆవిష్కరణ ఏప్రిల్ 1 ఉ.10.30ని.లకు పి.బి. సిద్ధార్థ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, మొగల్రాజపురం, విజయవాడ నందు జరుగుతుంది. అధ్యక్షులు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్; గ్రంథావిష్కరణ జాస్తి చలమేశ్వర్; గౌరవ అతిథులు దూపాటి విజయకుమార్, డి.చంద్రశేఖరరెడ్డి; కృతి స్వీకర్తలు వీరభద్ర ప్రసాద్, ప్రమీలారాణి.

- ఎమెస్కో విజయకుమార్

ఉగాది ప్రతిభా పురస్కారాలు

శ్రీసిరి కల్చరల్ ఫౌండేషన్, త్యాగరాయ గానసభ, కళారాజ్ మీడియా&ఎంటర్‌టైన్‌మెంట్ ఆధ్వర్యంలో శ్రీవిళంబి-ఉగాది ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం మార్చి 26 సా.5.40నిలకు కళాసుబ్బారావు కళావేదిక, శ్రీత్యాగరాయ గానసభ, హైదరాబాద్ నందు జరుగుతుంది. ముఖ్య అతిథి కొలకలూరి ఇనాక్, సభాధ్యక్షులు హన్మంతరాయ శర్మ, విశిష్ట అతిథి వి.ఎస్. జనార్ధనమూర్తి. పురస్కార గ్రహీతలు: ములుగు కుమారస్వామి, ఇదారం శ్రీనివాసరావు, తిప్పినేని రామదాసప్ప నాయుడు, అంబల్ల జనార్ధన్, కె. నాంచారయ్య, దేవసేన.

- బి. రామచంద్రరావు

సాహిత్య పురస్కారాలు

జాతీయ సాహిత్య పరిషత్, సిద్ధిపేట ప్రతి ఏటా ఇచ్చే సాహిత్య పురస్కారాల్ని 31వ వార్షికోత్సవం సందర్భంగా మార్చి 30న సిద్ధిపేట ప్రెస్‌క్లబ్ నందు జరిగే సభలో ఇవ్వనున్నది. ఈ సభలో ఐతా భారతీ చంద్రయ్య సంప్రదాయ కథా పురస్కారాన్ని బి.వి.ఎన్ స్వామి, తడకమడ్ల సంప్రదాయ సాహితీ పురస్కారాన్ని కటుకోజ్వల ఆనందం, సంటి అనీల్ కుమార్ బాల సాహితీ పురస్కారాన్ని పైడిమర్రి రామకృష్ణ, గాడేపల్లి వెంకటమ్మ - వీరయ్య స్మారక యువ సాహిత్య పురస్కారాన్ని మెరుగు ప్రవీణ్ కుమార్ అందుకొంటారు. వీరిని సాహిత్య పరిషత్ అధ్యక్షులు కసిరెడ్డి వెంకటరెడ్డి సత్కరిస్తారు.

- ఉండ్రాల రాజేశం

మైనారిటీ సాహిత్యం పరిమితులు

తెలుగు సాహిత్యంలో ఇతర వాదాలతో పోల్చుకుంటె ముస్లిం మైనారిటీ వాదానికి ఒక ప్రత్యేకమైన పరిస్థితి ఉంది. దళితవాదం, స్త్రీవాదానికున్న సౌలభ్యం మైనారిటీ వాదానికి లేదు.

ఆయా వాదాలలో రచయితలకు, పాఠకులకు మధ్య అవరోధాలు లేవు. ఉన్నా చాలా తక్కువ. ముస్లిం మైనారిటి అస్తిత్వవాదానికి ప్రత్యేకమైన అడ్డంకులున్నాయి. అందులో ప్రధానమైంది భాషాపరమైన అడ్డంకి. తెలుగు రాష్ట్రాలలోని ముస్లింలు అక్షరాస్యతలోనే వెనుకబడి ఉన్నారు, అందులో కళాశాల స్థాయికి వెళ్ళేవారి శాతం మరీ తక్కువ. చదువుకునే ముస్లిం యువత తెలుగు భాషపై శ్రద్ధ చూపటం చాలా అరుదు. పాఠశాల స్థాయిలో పాఠ్యాంశాలుగా తెలుగును చదువుతున్నప్పటికీ అది పరీక్షల వరకే, ఆ తర్వాత వార్తాపత్రికలు చదవడం వరకే పరిమితమైపోతున్నదనే వాస్తవాన్ని తప్పక గమనించాలి. తెలుగు దిన, వార పత్రికలలో వచ్చే సాహిత్య వ్యాసాలను చదివే ముస్లింలు ఎంతమంది? ఇక తెలుగులో వచ్చే సాహిత్యాన్ని ఎంతమంది ముస్లింలు చదువుతున్నారు? అని ప్రశ్నించుకుంటే సమాధానం సులభంగా లభిస్తుంది.

ఎవరి గురించి, ఎవరి కోసం సాహిత్యం సృష్టించబడుతుందో అది వారి దగ్గరకు చేరడం లేదు. ఈ వాస్తవాన్ని ముస్లిం మైనారిటీవాద కవులు, రచయితలు తప్పక ఆలోచించాలి, అలాగే వారికి చేరువయ్యే ప్రత్యామ్నాయాన్ని కూడా అన్వేషించాలి. తెలుగు సాహిత్యంలోని ప్రధాన ప్రక్రియలలో ముస్లిం రచయితల భాగస్వామ్యం ముందు నుంచీ కొనసాగుతోంది. పద్య కావ్యాల నుంచి వచన కవిత్వం వరకూ అన్నింటా దీటుగా ముస్లింలు సాహిత్యసేవ చేస్తూనే వున్నారు. 1992కు పూర్వం ముస్లింలు సృష్టించిన తెలుగు సాహిత్యానికి, ఆ తర్వాత సాహిత్యానికి చాలా తేడా ఉంది. 1992కు ముందు ప్రధాన ప్రవంతిలో భాగంగా ముస్లిం రచయితల రచనలు కొనసాగగా, తర్వాత మైనారిటీ అస్తిత్వవాద సాహిత్యంలో భాగంగా వెలువడుతున్నాయి. ముస్లిం మైనారిటీ అస్తిత్వవాద సాహిత్యం అనేటప్పటికి ముస్లింల సమస్యలు, వారిపై వివక్షలు, ముస్లిం మైనారిటీల మనోభావాలను తెలిపే అంశాలు ప్రధాన వస్తువుగా మారాయి.

ఇస్లాం మత జీవన విధానంలో భాగమైన అనేక అంశాలను మైనారిటీ రచయితలు వ్యతిరేకించడం సాధారణమైపోయింది. ఒక రచయిత పరదా పద్ధతి, బురఖా ధరించడాన్ని వ్యతిరేకిస్తే మరొకరు విడాకుల పద్ధతి 'తలాఖ్'ను వ్యతిరేకిస్తారు. ఇవి తమ వ్యక్తిగత అభిప్రాయాలుగా భావించకుండా తాము మొత్తం ముస్లిం వర్గానికంతా ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు భావిస్తున్నారు.

మరికొంతమంది రచయితలు ఇంకా ముందుకు వెళ్ళి ముస్లింల ప్రార్థనా విధానం 'నమాజ్'ను, ఉపవాస దీక్ష 'రోజా' వంటి విషయాలపైనా వ్యతిరేకత చూపించగలుగుతున్నారు. ఇలాంటి అంశాల గురించి రాసేటప్పుడు రచయితలు జాగ్రత్తగా వ్యవహరించాలి. లేకపోతే తెలుగు చదువుకున్న ముస్లిం సమాజం కూడా ఈ సాహిత్యాన్ని వ్యతిరేకించే ప్రమాదం ఉంది.

ప్రతి రచయితకూ సామాజిక బాధ్యత ఉంటుంది. కాబట్టి ప్రతి రచనలో సమాజాన్ని ప్రతిబింబిస్తూ అంతో ఇంతో మేలు చేసే రచనలు చేయాలి అప్పుడే అది నాలుగు కాలాలపాటు నిలవగలుగుతుంది. ముస్లింలు సామాజికంగా వెనకబడి ఉండటానికి కారణాలు తెలియజేస్తూ, వాటి పరిష్కారానికి కూడా రచయితలు సూచనలు చేయగలగాలి. మత విషయాలలో కూడా కల్పించుకున్న, అవసరంలేని ఆచార వ్యవహారాలను వ్యతిరేకించాలి.

మన రాష్ట్రంలోనే ఒక మైనారిటీ విద్యాసంస్థ అడ్డదారిలో విద్యార్థులను మోసంచేసి మెడిసిన్ చదవటానికి అడ్మిషన్లు తీసుకుని ఒక సంవత్సరం తర్వాత విద్యార్థుల అడ్మిషన్ చెల్లదని రోడ్డున పడవేస్తే యాజమాన్యాన్ని ప్రశ్నించేవారే కరువయ్యారు. ఇలా మైనారిటీల హక్కులకాలదన్నే, మోసకారి అంశాల పట్ల ప్రజల్ని జాగృతం చేయాలి. వారికున్న హక్కుల పట్ల అవగాహన కల్గించాలి. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి సాధించగలిగిన అంశాలపై రచయితలు చైతన్యపరచాలి. అప్పుడది నిజమైన మైనారిటీ వాద సాహిత్యం కాగలుతుంది.

ముస్లింలలో అనేక శాఖలున్నాయి. సయ్యద్‌లు, పఠాన్‌లు, షేక్‌లు వీరితోపాటు నూర్ బాషాలుగా చెప్పుకునే దూదేకులవారు... వీటిలో ప్రధానమైన శాఖల వారు తెలుగు సాహిత్యాన్ని చదవకపోగా, చాలా సందర్భాలలో దాన్ని వ్యతిరేకించడం కూడా జరుగుతోంది. అభ్యుదయ భావాలు కావాల్సిందే. కాని ఏ సమాజం కోసం సాహిత్యాన్ని రాస్తున్నామో వారిలో కనీసం పది శాతమైనా ఆమోదించే సాహిత్యాన్ని రాయాలి. లేకపోతే అది వ్యక్తిగతమైన సాహిత్యంగా మిగిలిపోతుంది.

■ మండి అన్వర్ హుసేన్

94406 55230



ఒంటిమిట్టలో వైభవంగా

శ్రీరామనవమి వేడుకలు

రాములోరి కల్యాణానికి ముస్లింలు

విశాఖ జిల్లా నక్కపల్లి మండలం పెదదొడ్డిగల్లు గ్రామంలో శ్రీరామ నవమి వేడుకలను హిందువులు, ముస్లింలు కలిసి జరుపుకున్నారు. ఈ గ్రామంలో 65 శాతం మంది ముస్లింలే. రెండు మతాల ముఖ్యమైన పండుగలను ఇరు వర్గీయులు జరుపుకొంటుంటారు. ఆదివారం నిర్వహించిన సీతారామ కల్యాణోత్సవంలోనూ హిందువులతోపాటు ముస్లింలు పాల్గొని.. సహపంక్తి భోజనం చేశారు.

శారదాపీఠంలో ఘనంగా శ్రీరామనవమి

పెందుర్తి(విశాఖ సిటీ), మార్చి 25: చినముషిడివాడలోని శారదాపీఠంలో పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి ఆశీస్సులతో ఆదివారం శ్రీరామనవమి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పీఠంలోని దాసాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో సీతారాముల విగ్రహాలను ప్రతిష్ఠించి, రుత్విజుల వేద మంత్రోచ్చారణల మధ్య సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం పీఠం శ్రీకార్యం స్వామీజీ సందేశాన్ని భక్తులకు చదివి వినిపించారు.



ముత్యాల తలంబ్రాలు తీసుకెళుతున్న మంత్రులు



మాడవీధుల్లో స్వామివారి గ్రామోత్సవం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): కడప జిల్లా ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామి దేవాలయంలో ఆదివారం శ్రీరామనవమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ వేడుకల కోసం టీటీడీ భారీ ఏర్పాట్లు చేసింది. బ్రహ్మోత్సవాలు పురస్కరించుకొని ఆదివారం ఉదయం ధ్వజారోహణం కన్నుల పండువగా జరిగింది. ప్రభుత్వ విప్ మేడా మల్లికార్జునరెడ్డి స్వామి వారికి పట్టువస్త్రాలను సమర్పించి ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొన్నారు. టీటీడీ తరఫున తీసుకువచ్చిన ముత్యాల తలంబ్రాలను మంత్రులతో పాటు రాజ్యసభ సభ్యుడు సి.ఎం.రమేష్, ప్రభుత్వ విప్ మేడా మల్లికార్జునరెడ్డి ఆలయంలో అందజేసి సీతారాముల కల్యాణానికి తలంబ్రాల తయారీని ప్రారంభించారు. ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి సీతమ్మతో కలిసి దాశరథి ఆదిశేషుడిపై మాడవీధుల్లో విహరించారు.

తిరుమలలో వైభవంగా నవమి ఆస్థానం

శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమల శ్రీవారి ఆలయంలో ఆస్థాన వేడుకలు వైభవంగా జరిగాయి. తొలుత రంగనాయకుల మండపంలో సీతా రామలక్ష్మణ సమేత హనుమంతుల ఉత్సవమూర్తులకు అర్చక స్వాములు శాస్త్రోక్తంగా తిరుమంజనం నిర్వహించారు. రాత్రి బంగారువాకిలిలో శ్రీరామనవమి ఆస్థానం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమంత వాహనసేవ వైభవంగా జరిగింది.

కన్నులపండువగా సీతారామ కల్యాణం

తూర్పుగోదావరి జిల్లా అన్నవరంలో క్షేత్రపాలకులుగా పూజలందుకుంటున్న సీతారాముల దివ్యకల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. విజయనగరం జిల్లా రామతీర్థంలో సీతారాముల కల్యాణం సోమవారం వైభవంగా జరగనుంది. ఇందుకోసం దేవదాయశాఖ ఏర్పాట్లుచేసింది. కొత్తవలస మండలం మంగళపాలెంలో గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణంలో 101 జంటలు పాల్గొన్నాయి.



హనుమంత వాహనంపై విహరిస్తున్న రామచంద్రస్వామి

రాములోరి కల్యాణానికి మండపేట బొండాలు

మండపేట, మార్చి 25: తూర్పుగోదావరిజిల్లా మండపేటకు చెందిన కాజులూరి అచ్యుత వెంకట రామిరెడ్డి, మహలక్ష్మి దంపతులు 18 ఏళ్ల నుంచి భద్రాచలం సీతారాములవారి కల్యాణానికి కొబ్బరి బొండాలు భక్తిపూర్వకంగా సమర్పిస్తున్నారు. రాష్ట్ర విభజన తర్వాత కడపజిల్లా ఒంటిమిట్టలో నిర్వహిస్తున్న రాములవారి కల్యాణానికి కూడా నాలుగేళ్ల నుంచి కల్యాణ బొండాలు పంపిస్తున్నారు. భద్రాచలం, ఒంటిమిట్టతో పాటు జిల్లాలోని గొల్లల మామిడాడ, సత్యవాడతోపాటు.. పలు దేవాలయాలకు అందిస్తున్నారు.



తండ్రీకూతుళ్ల ఆత్మహత్య

బెంగళూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): యువతి ఫొటోను ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ చేశారని మందలించడంతో వారు ఎదురుతిరిగి దాడి చేశారు. మనస్తాపంతో తండ్రీకూతుళ్లు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ సంఘటన కర్ణాటక రాయచూరు జిల్లా సింధనూరు తాలూకా గొరెబాళ గ్రామంలో చోటు చేసుకుంది. బళగానూరు పోలీసుల కథనం ప్రకారం.. 20 ఏళ్ల బసలింగమ్మ ఫొటోను అదే గ్రామానికి చెందిన యువకులు ఫేస్‌బుక్‌లో పోస్టు చేశారు. యువతి తరఫు బంధువులు ఆ యువకులను మందలించడంతో వారు ఏకంగా దాడికి దిగారు. తీవ్ర మానసిక క్షోభకు గురైన ఆమె తండ్రి రాయనగౌడ (55) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి మరణాన్ని తట్టుకోలేక బసలింగమ్మ కూడా క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకుంది.

గీతం ఎంట్రెన్స్ దరఖాస్తు గడువు పొడిగింపు

సాగర్‌నగర్(విశాఖ సిటీ), మార్చి 25: గీతం విశ్వవిద్యాలయం విశాఖపట్నం, హైదరాబాద్, బెంగళూరు క్యాంపస్‌లలో బీటెక్, బీటెక్, ఎంటెక్, బిఫార్మసీ, ఎం.ఫార్మసీ, బీడీఎస్ బీఆర్క్, రెండేళ్ల ఎం.ఆర్క్ కోర్సుల ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న గ్యాట్-2018కు దరఖాస్తు చేసుకుందుకు ఈ నెల చివరి వరకు గడువు పొడిగించినట్టు అడ్మిషన్ల డైరెక్టర్ నరేంద్ర తెలిపారు. వివిధ రాష్ట్రాల విద్యార్థులు, తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష దరఖాస్తులు అన్ని యూనియన్ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, కరూర్ వైశ్యాబ్యాంక్ శాఖల్లో లభిస్తాయని తెలిపారు.

విమానాశ్రయంలో..

ఒక కాఫీ 180 రూపాయలా?!

చెన్నై, మార్చి 25(ఆంధ్రజ్యోతి): విమానాశ్రయంలో ఒక కాఫీ రూ.180, టీ రూ.135కు విక్రయించడంపై కేంద్ర మాజీ మంత్రి చిదంబరం ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా రైల్వే స్టేషన్లలో కాఫీ రూ.10కి, టీ రూ.8కి విక్రయిస్తుంటే చెన్నై విమానాశ్రయంలో వందల్లో వసూలు చేయడమేమిటని ప్రశ్నించారు. ఆదివారం చెన్నై విమానాశ్రయానికి వెళ్లిన చిదంబరం అక్కడి ఓ క్యాంటీన్‌లో టీ తాగేందుకు ప్రయత్నించారు. క్యాంటీన్ సిబ్బందిని ధర ఎంత అని అడిగారు. కాఫీ రూ.180, టీ రూ.135 అని చెప్పడంతో దిగ్భ్రాంతికి గురైన ఆయన టీ తాగకుండానే అక్కడి నుంచి వెళ్లిపోయారు.

సినీ ఫక్కీలో నకిలీ విలేకరుల అరెస్టు

ఒంగోలు క్రైం, మార్చి 25: వ్యభిచార గృహం నిర్వాహకురాలిని బెదిరించి డబ్బు వసూలు చేసి పారిపోతున్న నకిలీ విలేకరుల ముఠా సినీ ఫక్కీలో పోలీసులకు పట్టుబడింది. ప్రకాశం జిల్లా ఒంగోలులో ఈ ఘటన చోటుచేసుకుంది. అన్నవరప్పాడు కాలనీకి చెందిన అన్నపురెడ్డి శివప్రసాద్, శేఖర్, కోటేశ్వరరావు శనివారం అర్ధరాత్రి సమతానగర్‌లోని ఓ వ్యభిచార గృహానికి వెళ్లారు. అక్కడ ఇద్దరు యువతులు, ఇద్దరు విటులు ఉండటంతో వీడియోలో చిత్రీకరించారు. వ్యభిచార గృహం నిర్వాహకురాలు ప్రశ్నించగా, తాము శక్తి చానల్ విలేకరులమని, పేర్నమిట్టకు చెందిన కందుకూరు మల్లేశ్వరి తమకు ఇన్‌చార్జి అని చెప్పారు. రూ.50వేలు ఇవ్వకపోతే చానల్‌లో ప్రసారం చేస్తామని బెదిరించారు. దీంతో వ్యభిచార గృహం నిర్వాహకురాలు రూ.20 వేలు ఇచ్చింది. విలేకరుల పేరుతో బెదిరించి డబ్బులు తీసుకున్నారని చెప్పడంతో ఆరుగురినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

మేలో నంది అవార్డులు: చినరాజప్ప

కాకినాడ అర్బన్, మార్చి 25: మే నెలలో సినిమా కళాకారులకు నంది అవార్డుల ప్రదానం చేయనున్నామని, ఈ మేరకు సీఎం నిర్ణయం తీసుకున్నారని ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ దంటు కళాక్షేత్రంలో ఆదివారం నంది నాటకాల ముంగిపు సభ నిర్వహించారు. చినరాజప్ప మాట్లాడుతూ.. విశాఖపట్నంలో సినిమా కళాకారులకు నంది అవార్డులు ఇవ్వడానికి నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ప్రస్తుత సమాజంలో నాటకాల ద్వారానే చైతన్యం వస్తుందని చెప్పారు. వీటిద్వారా యువత, మహిళలు అనేక విషయాలపట్ల అవగాహన పొందుతున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ సినిమా, టీవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ అంబికా కృష్ణ మాట్లాడుతూ ఇటీవల సమాజంలో లఘు చిత్రాలు చాలా బాగుంటున్నాయని, యువత మంచి ప్రావీణ్యాన్ని ప్రదర్శిస్తున్నారని అన్నారు. దీంతో మంచి లఘు చిత్రాలకు రూ.రెండు లక్షల చొప్పున నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు చెప్పారు.

యువతలో ఆధ్మాత్మికత పెరిగితేనే దేశ ప్రగతి

▸▸ ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు శ్రీశ్రీ రవిశంకర్



తిరుమల, మార్చి 25(ఆంధ్రజ్యోతి): యువతకు ఆధ్యాత్మిక జ్ఞానం అవసరమని, అప్పుడే దేశం ప్రగతిపథంలో పయనించగలదని ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు శ్రీశ్రీ రవిశంకర్ తెలిపారు. ఆదివారం ఉదయం ప్రారంభ సమయంలో ఆయన తిరుమలేశుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ.. శనివారం రాత్రి తిరుపతిలో జరిగిన ప్రపంచ ఆధ్యాత్మిక ఉత్సవంలో ఎక్కువమంది విద్యార్థులే హాజరయ్యారని తెలిపారు. దేశం సౌభాగ్యంగా ఉండాలని స్వామివారిని ప్రార్థించానన్నారు. అదే సమయంలో పేద ప్రజలు సుభిక్షంగా జీవించేలా ఆశీర్వాదించాలని కోరుకున్నానన్నారు.

ఆస్తులు కాదు, అక్షరాలే శాశ్వతం

▸▸ పిల్లలు ప్రయోజకులైనప్పుడే

తల్లిదండ్రుల త్యాగాలకు ఫలితం: నన్నపనేని

గుంటూరు(విద్య); మార్చి 25: పిల్లలు సమాజంలో ప్రయోజకులుగా నిలిచినప్పుడే తల్లిదండ్రుల త్యాగాలకు నిజమైన ఫలితం లభిస్తుందని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి అన్నారు. ఆదివారం హైదరాబాదులో డాక్టర్ లక్ష్మయ్య ఐఎఎస్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. సివిల్స్, గ్రూప్స్‌పై యువతకు ఈ స్థాయిలో చైతన్యం తీసుకురావడం అభినందనీయమన్నారు. ఆస్తులు శాశ్వతం కాదని, అక్షరాలే శాశ్వతమని, సివిల్స్ వంటి పరీక్షల్లో విజయం సాధించి తెలుగు వారి సత్తాను ప్రపంచానికి తెలియజేయాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. డాక్టర్ పారా వెంకట లక్ష్మయ్య మాట్లాడుతూ పేద విద్యార్థులను సివిల్స్ ఉద్యోగులుగా తయారుచేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.



డాక్టర్ లక్ష్మయ్యను సత్కరిస్తున్న మోహన్‌కందా తదితరులు

పోలవరంలో 'నవయుగ' స్పీడు

▸▸ రోజుకు 3,600 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు

పోలవరం, మార్చి 25: పోలవరం ప్రాజెక్టు వద్ద కాంక్రీట్ పనులు నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం ముందుకు సాగుతున్నాయి. నవయుగ కంపెనీ కాంక్రీటు పనులు చేపట్టిన తర్వాత పనుల్లో వేగం పెరగడంతో పాటు రికార్డులను అధిగమిస్తోంది. పనులు ప్రారంభించిన 38 రోజుల్లోనే లక్ష క్యూబిక్ మీటర్ల కాంక్రీటు పనుల మైలురాయిని నవయుగ అధిగమించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయానికి అనుగుణంగా కాంక్రీట్ పనులు అదే వేగంతో సాగుతున్నాయి. ఇప్పటి వరకు 2 వేల క్యూబిక్ మీటర్లు జరిగే కాంక్రీట్ ప్రస్తుతం 3500 చేరింది. ఆదివారం ఒక్కరోజే 3600 క్యూబిక్ మీటర్ల కాంక్రీటును స్పిల్‌వేలో వేశారు. ఆదివారం నవయుగ కంపెనీ ప్రాజెక్టు మేనేజరు క్రాంతి మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో ఫ్లడ్ లైట్ల వెలుగులో సైతం కాంక్రీటు వేస్తున్నామన్నారు. ఏప్రిల్ 1 నుంచి మరింత వేగం పెంచుతామన్నారు. కాంక్రీట్ పనులు వేగవంతం కావడంతో ప్రతి రోజు వేల టన్నుల్లో సిమెంట్‌ను వినియోగిస్తున్నారు. ఇప్పటికే ప్రతి రోజు 900 నుంచి 1000 టన్నుల సిమెంట్‌ను స్పిల్‌వేలో వినియోగిస్తున్నారు. ఒక్కొక్క బల్కర్‌లో 30 టన్నుల చొప్పున ప్రతి రోజు 30 నుంచి 33 బల్కర్ల ద్వారా సిమెంట్‌ను పోలవరానికి నేరుగా సరఫరా చేస్తున్నారు.

స్థిరంగా విద్యుత్ చార్జీలు

▸▸ ఏపీ బ్రాండ్ ఇమేజ్ మరింత పెరగాలి: సీఎం

అమరావతి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థిరమైన విద్యుత్ చార్జీలను కొనసాగించడం ద్వారా పెట్టుబడులు ఆకర్షించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. ఇంధన శాఖ మంత్రి కళా వెంకట్రావు, పరిశ్రమలశాఖ మంత్రి అమర్నాథరెడ్డిలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ గత ఏడాది విజయదశమి సందర్భంగా ఇచ్చిన మాటకు కట్టుబడి భవిష్యత్తులో కరెంట్‌చార్జీలు పెంచబోమని స్పష్టం చేశారు. పరిశ్రమలను ప్రోత్సహించాలంటే కనీసం 5 నుంచి 10 ఏళ్ల పాటు విద్యుత్ టారిఫ్‌ను స్థిరంగా ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్థిరమైన విద్యుత్ చార్జీలు, స్థిరమైన విద్యుత్ సరఫరాకు సరికొత్త విధానాన్ని రూపొందిస్తోందన్నారు. దీనివల్ల సాధారణ వినియోగదారులతో పాటు పారిశ్రామిక రంగానికీ లబ్ధి చేకూరనుందన్నారు. ఈ నెల 27న ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్‌సీ) 2018-19కి సంబంధించి విద్యుత్ చార్జీలను ఖరారు చేయనుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో కూడా చార్జీలను పెంచకుండా చర్యలు తీసుకున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.4.39 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులకు సం బంధించి పలు పారిశ్రామిక దిగ్గజాలతో 734 పరస్పర అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుందని వెల్లడించారు. ఈ అంశాలన్నింటినీ దృష్టిలో పెట్టుకుని ఎలక్ట్రిక్ వాహనాలు, సోలార్ ఆధారిత విద్యుత్ ప్రాజెక్టులు వంటి వాటికి సంబంధించిన ఎంఓయూల ఆచరణకు పటిష్ట కార్యాచరణ సిద్ధం చేయాలని విద్యుత్ సంస్థలను సీఎం ఆదేశించారు.

20 రోజులు గ్యాంగ్ రేప్

▸▸ ఢిల్లీ యువతిని గదిలో బంధించి అత్యాచారం


బంజారాహిల్స్/హైదరాబాద్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం కాని రాష్ట్రం నుంచి వచ్చిన ఓ బొటిక్ డిజైనర్‌పై కొందరు కామాంధులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. బొటిక్ ఏర్పాటు చేసేందుకు సాయం చేస్తానని నమ్మించి ఒక గదిలో బంధించి 20 రోజుల పాటు యువతి(25)కి నరకం చూపించారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన గత ఏడాది డిసెంబరులో జూబ్లీహిల్స్‌లో చోటుచేసుకుంది. కశ్మీర్‌కు చెందిన బొటిక్ డిజైనర్ ఢిల్లీలో బొటిక్ ఏర్పాటు చేసుకొని అక్కడే స్థిరపడింది. హైదరాబాద్‌లోనూ బొటిక్ పెట్టేందుకు డిసెంబరులో నగరానికి వచ్చింది. ఫరీద్ అనే యువకుడు ఆమెకు పరిచయమయ్యాడు. బొటిక్ కోసం దుకాణాలు చూపిస్తున్నట్లు నమ్మించి ఆమెను జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు-36లోని ఓ గదిలో నిర్బంధించాడు. మరో ముగ్గురితో కలిసి ఆమెపై 20 రోజుల పాటు అత్యాచారానికి తెగబడ్డాడు. కేసు పెట్టొద్దని బెదిరించి తెల్లకాగితాలపై సంతకాలు చేయించుకున్నాడు. వారి నుంచి ఎలాగోలా తప్పించుకున్న యువతి ఢిల్లీకి చేరి జరిగిన విషయాన్ని తల్లికి చెప్పింది. ఆమె ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. నిందితులపై కేసు నమోదు చేయాలని ఫిబ్రవరిలో ఢిల్లీ గ్రేటర్‌కైలాశ్ పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఎఫ్ఐఆర్ నమోదు చేసిన అక్కడి పోలీసులు కేసును ఇక్కడికి బదిలీ చేశారు. బంజారాహిల్స్ పోలీసులు ఫరీద్, మరో ముగ్గురిపై లైంగిక దాడి, నిర్బంధం, బెదిరింపులు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.

విజిలెన్స్ విచారణకు మంగళం?

▸▸ అటకెక్కిన ఇందిరమ్మ ఇళ్ల అక్రమాల అంశం

▸▸ ఆచూకీ లేని 14లక్షల ఇళ్లు.. దారిమళ్లిన రూ.4వేల కోట్లు!

▸▸ నమూనా సర్వేతో సరి



ఇందిరమ్మ ఇళ్ల విచారణ వివరాలు

జిల్లా	మొత్తం ఇళ్లు	విచారణలో దొరికినవి	ఇంకా కనిపించనివి
శ్రీకాకుళం	265825	190086	75739
విజయనగరం	312406	202458	109948
విశాఖపట్నం	356760	188775	167985
తూర్పుగోదావరి	414458	254318	160140
పశ్చిమగోదావరి	265213	140336	124877
కృష్ణా	216167	160073	56094
గుంటూరు	275864	220647	55217
ప్రకాశం	242868	172857	70011
నెల్లూరు	229856	165369	64487
చిత్తూరు	387404	282245	105159
కడప	313170	203263	109907
అనంతపురం	446464	262897	183567
కర్నూలు	411151	254472	156679

అమరావతి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల అక్రమాలపై విజిలెన్స్ విచారణ అటకెక్కినట్లే కనిపిస్తోంది. మూడేళ్లుగా విచారణ జరుపుతున్నప్పటికీ ఎలాంటి ఫలితమివ్వడంలేదని తాజాగా ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన ప్రకటనతో ఇక ఈ విచారణకు మంగళం పలికినట్లేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

విచారణ ఎందుకంటే!

2004 నుంచి 2014 వరకు పదేళ్ల కాంగ్రెస్ పాలనలో ఇందిరమ్మ పథకం కింద 42లక్షల పక్కా ఇళ్లు నిర్మించారు. మొదట్లో ఇంటి రాయితీ రూ.25వేలు ఉండగా, 2013లో అది రూ.లక్షకు చేరింది. ఈ నిర్మాణాల్లో భారీగా నిధులు పక్కదారి పట్టాయి. ఒక్కరే రెండు ఇళ్లు నిర్మించుకోవడం, ఒకే ఇంటికి రెండేసి బిల్లులు తీసుకోవడం, పశువుల దొడ్లను సైతం ఇళ్లుగా చూపి బిల్లులు పొందడం వంటి అక్రమాలు లెక్కలేనన్ని జరిగాయి. ఈ క్రమంలో అధికారంలోకి వచ్చిన టీడీపీ ముందుగా వాటి లెక్కలు తేల్చాక కొత్త పథకం చేపట్టాలని భావించింది. తొలుత శాఖాపరమైన విచారణలో భాగంగా 42లక్షల ఇళ్లకు జియోట్యాగింగ్ చేయగా 28లక్షల ఇళ్లు మాత్రమే దొరికాయి. దీంతో జియోట్యాగింగ్‌లో కనిపించని మిగిలిన 14లక్షల ఇళ్లపై విచారణ ప్రారంభించింది. ఈ 14 లక్షల ఇళ్లకు చెల్లించిన రాయితీలు రూ.4149కోట్లు ఉంటాయని అంచనా వేసింది. వీటిపై మూడేళ్ల కిందట విచారణ ప్రారంభించినా ఇంతవరకూ నివేదిక సమర్పించలేదు. పైగా విజిలెన్స్ విభాగం కేవలం నమూనా పద్ధతిలో కొన్ని గ్రామాల్లో మాత్రమే విచారణ చేపట్టడంతో సమగ్ర నివేదిక ఇచ్చే అవకాశము లేకుండాపోయింది. విచారణ తామే పూర్తిచేస్తామని గృహనిర్మాణ శాఖ చెప్పినా ఈ బాధ్యతను విజిలెన్స్‌కు ఇవ్వడం జాప్యానికి దారితీసిందనే విమర్శ కూడా ఉంది.

రికవరీ కష్టమే!

పక్కా ఇళ్లకు సంబంధించి అక్రమంగా నగదు పొందిన వారి నుంచి నిధులు రికవరీ చేయాలని ప్రభుత్వం భావించింది. కానీ ఇందులో చాలా మంది లబ్ధిదారులే ఉండటంతో అది కూడా సాధ్యమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. అప్పట్లో జాయింట్ వాల్ విధానం అమల్లో ఉంది. అంటే ఒకే శ్లాబు కింద అన్నదమ్ములు ఇళ్లు కట్టుకుని, రెండు ఇళ్లకు బిల్లులు తీసుకున్నారు. టీడీపీ ప్రభుత్వం దీనిని తొలుత తప్పుబట్టింది. కానీ ఇటీవల ఎన్టీఆర్ ఇళ్లకూ ఇలాంటి అనుమతులు మంజూరుచేశారు. అలాగే కట్టని ఇళ్లకు బిల్లులు పొందినట్లు తేలినా చాలా మంది లబ్ధిదారుల ఆచూకీ లభించడం లేదు. కొన్ని కేసుల్లో అక్రమం అని తేలినా, వాటితో తమకేం సంబంధం లేదని పేదలు చెబుతున్నారు. వారి పేరుతో స్థానిక నాయకులు బిల్లులు తీసుకోవడంతో, లబ్ధిదారుని నుంచి నగదు రికవరీ సాధ్యమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. కాగా టీడీపీ ప్రభుత్వం కూడా ఇందిరమ్మ ఇళ్ల విచారణను మొదట్లో తీసుకున్నంత సీరియస్‌గా ఇప్పుడు పట్టించుకోవడం లేదు.

కులసత్రాలకు అనుమతులివ్వం!

▸▸ దేవస్థానాల పవిత్రత, ఆస్తుల రక్షణే లక్ష్యం

▸▸ దేవదాయశాఖ నిర్ణయం

అమరావతి మార్చి 25(ఆంధ్రజ్యోతి): దేవాలయాల్లో కులసత్రాలకు కొత్తగా అనుమతులివ్వకూడదని దేవదాయ శాఖ అధికారులు నిర్ణయించారు. దేవాలయాల పవిత్రతకు కులవ్యవస్థలు భంగం కలిగించకూడదన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని దేవాలయాల్లో అన్నదాన సత్రాలు ఏర్పాటు చేస్తామంటూ దేవదాయ శాఖకు వందల్లో దరఖాస్తులు వస్తున్నాయి. ప్రస్తుతం 120కి పైగా దరఖాస్తులున్నాయి. అన్నదాన సత్రాల లీజు పేరుతో కొందరు దేవదాయ శాఖ భూములు తీసుకుని వాటిని దుర్వినియోగం చేస్తున్నారు. స్థానిక రాజకీయ నాయకుల సిఫారసులతో ఆ భూములు దక్కించుకున్న చాలా మంది వాటిని సొంతం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు అనేక ఫిర్యాదులు వస్తున్నాయి. ఇందులో కొన్ని కోర్టు కేసులు కూడా ఉన్నాయి. ఇప్పుడు అన్నదాన సత్రాల ఏర్పాటు కోసం వచ్చిన దరఖాస్తుల్లో అనేకం స్థానిక రాజకీయనాయకుల సిఫారసులతో వచ్చినవేనని తెలిసింది. ఇలా ఇచ్చుకుంటూపోతే దేవాలయాల భూములన్నీ హరించుకుపోయే ప్రమాదముందని భావించి అన్నదాన సత్రాల ఏర్పాటుకు దేవాలయ భూములు ఇవ్వకూడదని ఆ శాఖ నిర్ణయించినట్లు తెలిసింది. ప్రధానంగా కులాల పేరుతో దేవాలయాల్లో ఏర్పాటవుతున్న కులసత్రాలకు స్వస్తి పలకాలనే ఉద్దేశంతో వాటిని పక్కన పెడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలోని దేవాలయాల్లో ఇప్పటికే అన్నదాన సేవలందిస్తున్న సంప్రదాయక, నమ్మకమైన సేవా సంస్థలు కొన్ని ఉన్నాయని, కొత్తగా ఏదైనా దేవాలయంలో అన్నదాన ఏర్పాట్లు చేయదలచుకుంటే వాటికే బాధ్యతలు అప్పగిస్తామని చెప్పారు. కుదరని పక్షంలో దేవదాయ శాఖ తరఫునే నిర్వహిస్తామని చెబుతున్నారు.

కేఈకి అదనంగా దేవదాయశాఖ



ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తికి ప్రభుత్వం దేవదాయ, ధర్మదాయ శాఖ బాధ్యతలను అప్పగిస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే ఆయన రెవెన్యూ, స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖల బాధ్యతలను నిర్వర్తిస్తుండగా, అదనంగా ఈ బాధ్యతలు కూడా అప్పగించింది. టీడీపీతో రాజకీయ పొత్తుల నేపథ్యంలో బీజేపీకి చెందిన పి.మాణిక్యాలరావు ఇంతవరకు దేవదాయశాఖ మంత్రిగా ఉన్నారు. అయితే అనూహ్యంగా మారిన రాజకీయ పరిస్థితుల కారణంగా ఆయన తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. కాగా మాణిక్యాలరావుతో పాటు రాజీనామా చేసిన మరో బీజేపీ మంత్రి కామినేని శ్రీనివాస్ చూసిన వైద్య ఆరోగ్య శాఖను ప్రభుత్వం ఇంకా ఎవరికీ అప్పగించలేదు.



యూటీఎఫ్ సమావేశంలో మాట్లాడుతున్న ఆంధ్రజ్యోతి సంపాదకులు కె.శ్రీనివాస్


మతతత్త్వ శక్తుల ప్రోత్సాహంతో

చరిత్ర వక్రీకరణకు ప్రయత్నం

అమలాపురం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మతతత్త్వ శక్తుల ప్రోత్సాహంతో చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయని ఆంధ్రజ్యోతి సంపాదకులు కె.శ్రీనివాస్ పేర్కొన్నారు. అటువంటి చరిత్రను పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు అందించే ప్రయత్నాలు చేపడుతున్నారని విమర్శించారు. విద్యావిధానంలో మతతత్త్వ ధోరణులు దేశానికే ప్రమాదకరమని హెచ్చరించారు. అమలాపురం జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఉపాధ్యాయ ఉద్యమ అమరజీవులు అప్పారి వెంకటస్వామి, వత్సవాయి సూర్యనారాయణరాజుల వర్ధంతులను పురస్కరించుకుని ఆదివారం యూటీఎఫ్ జిల్లాశాఖ బహిరంగ సభ ఏర్పాటుచేసింది. సంస్థ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు ఐ.వెంకటేశ్వరరావు(ఐవీ) అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథిగా కె.శ్రీనివాస్ 'మతతత్త్వం-విద్యావిధానం' అనే అంశంపై ప్రసంగించారు. స్వాతంత్రోద్యమంలో మతతత్త్వవాదులు పాల్గొన్న దాఖలాలు లేవన్నారు. క్విట్ ఇండియా ఉద్యమం నాటికి అక్కడక్కడా ఉన్న మతతత్త్వవాదులు బ్రిటిష్ పాలకులకు దాసోహం అయ్యారన్నారు. మిగిలినవారు మహాత్మా గాంధీ హత్య అనంతరం నిషేధానికి గురైనవారేనని వివరించారు. అప్పటికి మతతత్త్వవాదులకు రాజకీయ పార్టీగానీ, రాజకీయబలంగాని లేదని చెప్పారు. అయితే పాఠశాలలు ఏర్పాటుచేసి విద్వేషపూరితమైన బోధనా ప్రణాళికను అమలు చేస్తున్నారని వివరించారు. నేడు పూర్తిస్థాయిలో అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యావిధానాన్ని వాళ్ల లక్ష్యాలకు అనుగుణంగా మార్చుకునే ప్రయత్నాలను ముమ్మరం చేశారన్నారు. అజేయమైన జాతిగా తీర్చిదిద్దితే అందరూ స్వాగతించాల్సిందేనన్నారు. అయితే అందుకు అవసరమైన ఐకమత్యాన్ని ఎలా తీసుకురాగలరని ఆయన ప్రశ్నించారు. మేధావి వర్గమైన ఉపాధ్యాయులు ఇటువంటి మతశక్తులకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాబురెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సాబ్జీ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రాము సూర్యారావు తదితరులు ప్రసంగించారు.

సమాజాభివృద్ధికి మీ వంతుగా...

సమాజాభివృద్ధి కోసం కృషి చేయడమనేది పౌరుల కర్తవ్యం. దీనిమీద ఆసక్తి ఉంటే ముందు స్థానికంగా ఉన్న వెల్ఫేర్ అసోసియేషన్ల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాల్లో పాలుపంచుకోండి. యువజనాభివృద్ధి, మహిళాభివృద్ధి, వయోజనుల కోసం పనిచేసే సంస్థల్లో అవలంభిస్తున్న వివిధ కార్యక్రమాల గురించి తెలుసుకోండి. వాటిలో పాల్గొనే ప్రయత్నం చేయండి. తద్వారా నాయకత్వ సామర్థ్యాలు, సేవాభావం పెంపొందుతాయి. సమాజాభివృద్ధి కోసం పనిచేయాలనుకొనే ఔత్సాహికులకు గ్రామ, నగర స్థాయిల్లోని అనేక ప్రభుత్వ సంస్థలు ప్రోత్సాహకాలను కూడా అందిస్తుంటాయి.



సెలవుల్లో నేర్చుకుందాం

ఉల్లాసంగా ఉత్సాహంగా

విద్యా సంవత్సరం ముగింపు దశకు చేరుకుంది. ఇప్పటికే ఇంటర్మీడియెట్ పరీక్షలు పూర్తయ్యాయి. పదో తరగతి పరీక్షలు కూడా కొద్ది రోజుల్లో ముగియనున్నాయి. డిగ్రీ, ఇతర తరగతులకు కూడా త్వరలోనే వేసవి సెలవులు ప్రకటిస్తారు. వచ్చే జూన్‌లో మొదలయ్యే విద్యా సంవత్సరానికి ఇంకా రెండు నెలల సమయం ఉంటుంది. పుస్తకాలు, మార్కులు, హోమ్ వర్క్ వంటి కార్యకలాపాలకు దూరంగా ఒత్తిడి లేకుండా స్నేహితులు, బంధుమిత్రులతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడపడానికి కావల్సిన సమయం ఈ వేసవి సెలవుల ద్వారా లభిస్తుంది. ఆటపాటలతో సమానంగా ఏదైనా కొత్త విషయాన్ని నేర్చుకోవడానికి ఈ సెలవులను ఉపయోగించుకుంటే భవిష్యత్ దృష్ట్యా ప్రయోజనకరం. ఈ నేపథ్యంలో వేసవి సెలవులను ప్రభావవంతంగా ఎలా వినియోగించుకోవాలో చూద్దాం..

వేసవి సెలవులు వచ్చేశాయి. సరదాగా, ఆడుతూ పాడుతూ సెలవులు గడపడం అందరికీ ఇష్టమే. కొంచెం భిన్నంగా ఆలోచించి కెరీర్‌కు కూడా ఉపయోగపడేలా ఈ సమయాన్ని ప్లాన్ చేసుకుంటే ఇంకా మంచిది. ఏదైనా పార్ట్ టైమ్ జాబ్ చేసి ఆ మనీతో స్మార్ట్ ఫోన్ కొనుక్కుంటే వచ్చే కిక్కే వేరు. సమ్మర్‌లో ఇలాంటివి ఇంకా ఎన్నో చేయవచ్చు. భాషా సామర్థ్యాలు పెంపొందించుకోవడం, ఇష్టమైన కళలు, క్రీడలు నేర్చుకోవడం, మంచి పుస్తకాలు చదవడం లాంటి హాబీలను పెంపొందించుకోవడానికి సమ్మర్ హాలిడేస్‌కు మించిన సమయం మరొకటి ఉండదు. విద్యార్థులు ఈ సమయాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవడానికి అనేక మార్గాలున్నాయి. ...

సమ్మర్ జాబ్స్‌తో అనుభవం

యువత... ముఖ్యంగా విద్యార్థులు సమ్మర్ జాబ్స్ కోసం ప్రయత్నించడం ప్రయోజనకరం. ఫుడ్ కోర్టులు, రెస్టారెంట్లు, రిటైల్ స్టోర్లు, అమ్యూజ్‌మెంట్ పార్కులు, టెలికాం సంస్థలు, ఫైనాన్స్ అండ్ ఇన్స్యూరెన్స్ కంపెనీలు, తదితర వ్యాపార కేంద్రాల్లో విస్తృతమైన అవకాశాలు ఉన్నాయి. విద్యార్థులు తమ ఆసక్తికి తగ్గట్టు చిన్న ఉద్యోగంలో చేరితే అనుభవం వస్తుంది. సమ్మర్ జాబ్స్ కల్చర్ విదేశాల్లో బాగా ప్రాచుర్యం పొందింది. మనదేశంలో ఇప్పుడిప్పుడే దీని ప్రాధాన్యాన్ని గుర్తిస్తున్నారు. ఏ అవకాశం దొరకలేదంటూ చాలామంది వేసవి సెలవులను వృథా చేసుకుంటారు. కొంతమంది మాత్రం ఏదైనా సాధించాలనే జిజ్ఞాసతో అవకాశాలను శోధించి వాటిని అందిపుచ్చుకుంటారు. సమ్మర్ జాబ్స్‌లో వేతనానికి అంత ప్రాముఖ్యం లేకపోయినప్పటికీ తమ కష్టార్జితంతో ఇష్టమైనవి కొనుక్కోవచ్చు. అంటే మొబైల్ ఫోన్, ఐప్యాడ్, మ్యూజిక్ సిస్టం మొదలైనవి. అన్నింటికీ మించి మీరు పనిచేసిన రంగంలో ఆచరణాత్మక అనుభవం వస్తుంది. మీ రెజ్యూమెలో దీన్ని ప్రస్తావించవచ్చు.

ప్రొఫెషనల్ కోర్సులు

మంచి పుస్తకాలు చదవడం, బ్రిడ్జి కోర్సులకు వెళ్లడం ద్వారా ఆయా రంగాల్లో అవగాహన ఏర్పడుతుంది. వ్యాపార / సాంకేతిక పరమైన లోటుపాట్లను అంచనా వేయడానికి ప్రొఫెషనల్ సర్టిఫికెట్ కోర్సులు దోహదం చేస్తాయి. అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఆఫ్ ఇండియా (ఏఎంఎఫ్ఐ), నేషనల్ కమిషన్ ఫర్ ఫ్యూచర్ మార్కెట్స్, ఇన్స్యూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ వంటి ఆర్థిక సంస్థలు నిర్వహించే కోర్సులు ఈ కోవలోకి వస్తాయి. వీటితోపాటు పర్సనాలిటీ డెవలప్‌మెంట్, ఫిల్మ్ మేకింగ్, ఇంటర్నేషనల్ అఫైర్స్, జర్నలిజం, ఈవెంట్ మేనేజ్‌మెంట్, హెల్త్ అండ్ మెడిసిన్‌కు సంబంధించిన కోర్సులు చేయవచ్చు.

పాకెట్ మనీ.. పార్ట్ టైమ్

సమాచార పరిజ్ఞానాన్ని ఇచ్చి పుచ్చుకొనే నాలెడ్జ్ ప్రాసెస్ ఔట్ సోర్సింగ్ (కేపీఓ); మార్కెటింగ్, హ్యూమన్ రిసోర్సెస్, కస్టమర్ / టెక్నికల్ సపోర్ట్ అందించే బిజినెస్ ప్రాసెస్ ఔట్ సోర్సింగ్ (బీపీఓ) సంస్థల్లో ఇంటర్న్‌షిప్ చేయడం ద్వారా ఉన్నత స్థాయి ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు. బీమా, వ్యాపార, ఆర్థిక సేవా సంస్థలతోపాటు మార్కెట్ రీసెర్చ్ కంపెనీలు, బ్యాంకుల్లో పార్ట్‌టైమ్ జాబ్ చేస్తే అనుభవంతోపాటు పాకెట్ మనీ కూడా వస్తుంది.

బలహీనతలకు చెక్

చాలామందికి ఎన్నో రకాలైన బలహీనతలు ఉండొచ్చు. వాటి నుంచి బయటకు రావడానికి అనేక రకాలుగా ప్రయత్నించి విఫలమై ఉండవచ్చు. కెరీర్‌లో ఎదగాలన్న సంకల్పంతో, బలహీనతలను జయించడానికి వేసవి సెలవులకు మించిన సువర్ణావకాశం దొరకదు. యాంగర్ మేనేజ్‌మెంట్, పాజిటివ్ దృక్పథాన్ని అలవరచుకోవడం, స్ట్రెస్ మేనేజ్‌మెంట్, రీడింగ్ సామర్థ్యాని పెంపొందించుకోవడం, ఏకాగ్రత నిలుపుకోవడానికి సంబంధించిన వర్క్‌షాపులకు వెళ్లి బలహీనతలను అధిగమించవచ్చు.

నాయకత్వ లక్షణాలు

వ్యక్తిగతంగా మాత్రమే కాదు, వృత్తి పరంగా కూడా ఎదగడానికి నాయకత్వ లక్షణాలు దోహదం చేస్తాయి. ప్రస్తుతం విద్యార్థులకు పాఠశాల / కాలేజీ స్థాయిల్లో ఈ లక్షణాలు అలవడే అవకాశాలు ఉండడం లేదు. యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు పలువురు నిష్ణాతులు వర్క్‌షాపులను నిర్వహిస్తున్నారు. వీటిలో చేరితే తమ ప్రతిభకు మెరుగులు దిద్దుకొనే అవకాశం లభిస్తుంది.

స్కిల్ డెవలప్‌మెంట్

ప్రస్తుతం ప్లేస్‌మెంట్లలో ఆంగ్లభాషా పరిజ్ఞానానికి విశేష ప్రాధాన్యం ఇస్తున్నారు. సబ్జెక్టు పరంగా మంచి మార్కులు / ర్యాంకులు సాధించినప్పటికీ విద్యార్థుల్లో ఇంగ్లీషు లాంగ్వేజ్ స్కిల్స్ కొరవడడంతో ఆశించిన ఉద్యోగాలను సాధించలేకపోతున్నారు. ఇంటర్, డిగ్రీ విద్యార్థులు వేసవి సెలవుల్లో సంబంధిత శిక్షణా తరగతులకు వెళ్లడం మంచిది. అంతేకాదు విక్రయ నైపుణ్యం, మెప్పించే సామర్థ్యం వంటి స్కిల్స్‌లో ప్రావీణ్యం సాధిస్తే భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయి.

ఆరోగ్యం, వైద్యం

ఇటీవల ప్రతి ఒక్కరిలో మానసిక ఒత్తిడి అధికంగానే ఉంటోంది. దీని ప్రభావంతో దైనందిన జీవితం అనేక దుష్ప్రభావాలకు లోనవుతోంది. కాబట్టి హెల్త్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించిన ధ్యానం, యోగా, ప్రాణాయామం తదితర ప్రక్రియల్లో శిక్షణ తీసుకోవడం లాభదాయకంగా ఉంటుంది. బ్యూటీ మేనేజ్‌మెంట్, ఆరోగ్యానికి సంబంధించిన అవగాహన కార్యక్రమాలకు హాజరు కావచ్చు. నిపుణులు చెప్పే అంశాలను స్వయంగా పాటించి ప్రయోజనం పొందవచ్చు.

పుస్తకాలతో స్నేహం

వేసవిలో పుస్తకాలను కూడా మీ స్నేహితుల జాబితాలో చేర్చుకోండి. మంచి పుస్తకాలు ఎప్పటికీ గొప్ప మిత్రుల్లాగే స్నేహమందిస్తాయి. అతి తక్కువ కాలంలో గొప్ప అనుభవాల సారాన్ని అందించే పుస్తకాలు చాలా ఉన్నాయి. మీ ఆసక్తిని బట్టి ఫిక్షన్, నాన్ ఫిక్షన్ పుస్తకాలను ఎంచుకోవచ్చు. సండే బుక్ మార్కెట్లు, ఈ కామర్స్ వెబ్‌సైట్ల ద్వారా తక్కువ ధరకు పుస్తకాలను కొనుక్కోవచ్చు.

సమ్మర్ ట్రైనింగ్ ప్రోగ్రామ్స్

వివిధ కంపెనీలతోపాటు ప్రభుత్వేతర సంస్థలు, చిన్న, మధ్య తరహా సంస్థలు నిర్వహించే సమ్మర్ ట్రైనింగ్ ప్రోగ్రామ్స్ ఉద్యోగసాధనలో చాలా ఉపయోగపడతాయి. ఇలాంటి శిక్షణా కార్యక్రమాల్లో పాల్గొన్న అనుభవం భవిష్యత్తులో సాధించే విజయాలకు పునాది వేస్తుంది.

చిన్నారులకు...



కళలు, క్రీడల్లో విద్యార్థుల అభిరుచులకు తగిన ప్రోత్సాహం ప్రస్తుతం స్కూళ్లలో లభించడం లేదు. కాబట్టి విద్యార్థులు తమ ఆసక్తికి అనుగుణంగా ఇష్టమైన రంగంలో ప్రావీణ్యం సాధించేందుకు సమ్మర్ వెకేషన్ ఎంతగానో తోడ్పడుతుంది. సంగీతం, నృత్యం, పెయింటింగ్, డ్రాయింగ్, శిల్పం, ఫొటోగ్రఫీ తదితర రంగాల్లో తమదైన ముద్రను చాటుకోవడానికి వేసవి సెలవులు ఉపకరిస్తాయి. వేసవి సెలవులంటే కేవలం ఆటపాటలకే అనే భావనతో ఇంటికే పరిమితం కాకుండా సమయాన్ని సద్వినియోగం చేసుకునే దిశగా ఆలోచించాలి.

కళలు, క్రీడలు

మానసికోల్లాసానికి, ఉత్సాహానికి కళలు, క్రీడలు ఎంతగానో తోడ్పడతాయి. సంగీతం, నృత్యం వంటి కళలు ఒత్తిడిని దూరం చేయడంతోపాటు ప్రశాంతతను, అహ్లాదాన్ని కలిగిస్తాయి. చిత్ర కళ, శిల్ప కళ వంటివి సృజనాత్మకతకు అద్దం పడతాయి. క్రీడల మీద ఆసక్తి ఉంటే టెన్నిస్, బాడ్మింటన్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, క్రికెట్ వంటి అవుట్ డోర్ గేమ్స్‌తోపాటు క్యారమ్స్, చెస్ వంటి ఇండోర్ గేమ్స్‌లో శిక్షణ తీసుకోవచ్చు.

కౌన్సెలింగ్

యూరప్‌లో పీహెచ్‌డీ ఎలా..?

ప్ర: మైక్రో బయాలజీలో మాస్టర్స్ చేశాను. యూరప్‌లో పీహెచ్‌డీ చేయాలనుకుంటున్నాను. సంబంధించిన వివరాలు తెలపండి?

కె. అనురాధ, హైదరాబాద్



జ: యురోపియన్ దేశాలు నిర్వహిస్తున్న బయాలజీ కోర్సులకు మంచి ఆదరణ ఉంది. అక్కడి యూనివర్సిటీల్లో పీహెచ్‌డీలో ప్రవేశం పొందాలంటే మంచి అకడమిక్ రికార్డుతోపాటు టోఫెల్ లేదా ఐఈఎల్‌టీఎస్‌లో అర్హత, పరిశోధనల్లో అనుభవం ఉండాలి. చాలా యూనివర్సిటీల్లో బోధనాపరమైన ఫీజులు ఉండవు. ఫెలోషిప్ / స్కాలర్‌షిప్ పొందే వీలుంటుంది. కోర్సుతోపాటు అభ్యర్థులు పార్ట్ టైం ఉద్యోగాలు కూడా చేసుకోవచ్చు. డాక్టోరల్ స్టడీస్‌లో చాలా మంది ఇండివిడ్యువల్ స్టడీ మోడ్‌నే ఎంచుకుంటున్నారు. ఈ విధానంలో మంచి గైడెన్స్ ఇచ్చే ప్రొఫెసర్ అవసరం. పరిశోధనా ప్రాంగణానికి సంబంధించి కూడా మూడు ఆప్షన్లు ఉంటాయి. అవి.. యూనివర్సిటీ, ప్రముఖ పరిశోధనాత్మక సంస్థ, పారిశ్రామిక సంస్థ. వీటిల్లో ఎక్కడ రీసెర్చ్ చేయాలనేది అభ్యర్థుల ఇష్టం. లక్ష్య సాధనకు అనుకూలంగా ఉన్న రీసెర్చ్ ఆర్గనైజేషన్‌ను ఎంపిక చేసుకోవడం ఉపయుక్తంగా ఉంటుంది. ఇండివిడ్యువల్ పీహెచ్‌డీ పూర్తికావడానికి మూడు నుంచి ఐదేళ్లు పడుతుంది. డాక్టరేట్ ప్రోగ్రామ్స్‌లో ప్రాచుర్యం పొందిన మరో విధానం స్ట్రక్చర్డ్ పీహెచ్‌డీ. ఇది పూర్తిగా అమెరికా, ఇంగ్లండ్ ప్రోగ్రామ్స్‌ను పోలి ఉంటుంది. టీమ్ అడ్వైజర్ల ఆధ్వర్యంలో కొనసాగే ఈ రెగ్యులర్ కోర్సుకు నిర్దేశిత కరిక్యులమ్ ఉంటుంది. ఇందులో అకడమిక్, సైంటిఫిక్ పద్ధతుల ద్వారా ప్రెజెంటేషన్ స్కిల్స్ నేర్పిస్తారు. ఈ పద్ధతిలో డాక్టరేట్ పొందాలంటే మూడు నుంచి నాలుగేళ్లు పడుతుంది.

- డాక్టర్ యు.ఎస్.ఎన్. మూర్తి, సీనియర్ సైంటిస్ట్.

జాబ్ కార్నర్

రీసెర్చ్ అసోసియేట్లు

ఖాళీలు 30

ఆంధ్రప్రదేశ్, పశ్చిమ గోదావరి జిల్లా - వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం (డీఆర్‌వైఎస్ఆర్‌హెచ్‌యు)- ఒప్పంద ప్రాతిపదికన టీచింగ్ / రీసెర్చ్ అసోసియేట్ల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

- విభాగాల వారీగా ఖాళీలు: అగ్రికల్చరల్ ఎకనామిక్స్ 1, అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ 2, బయో కెమిస్ట్రీ 2, బయో టెక్నాలజీ 2, ఎంటమాలజీ 5, జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్ 1, హార్టీకల్చర్ 7, లైవ్ స్టాక్ ప్రొడక్షన్ 1, మైక్రో బయాలజీ 1, ప్లాంట్ పాథాలజీ 4, సాయిల్ సైన్స్ అండ్ అగ్రికల్చరల్ కెమిస్ట్రీ 2, స్టాటిస్టిక్స్ అండ్ మేథమెటిక్స్ 2
- అర్హత: సంబంధిత విభాగంలో కనీసం 50 శాతం మార్కులతో పీజీ, నెట్ అర్హతతో పాటు కనీసం రెండేళ్ల పరిశోధన అనుభవం ఉండాలి.
- ఒప్పంద వ్యవధి: 11 నెలలు
- నెలకు వేతనం: ఎమ్మెస్సీ (హార్టీ కల్చర్ / అగ్రికల్చర్) అభ్యర్థులకు రూ.30,000 పీహెచ్‌డీ అభ్యర్థులకు రూ.35,000.
- ఇంటర్వ్యూలు: మార్చి 26 నుంచి 28 వరకు.
- వేదిక: కాన్ఫరెన్స్ హాల్, ఇంటర్నేషనల్ హాస్టల్, వైఎస్సార్‌హెచ్‌యు క్యాంపస్, వీఆర్ గార్డెన్, వెంకట్రామన్నగూడెం, పశ్చిమగోదావరి జిల్లా
- వెబ్‌సైట్: www.drysrhu.edu.in

ఎగ్జిక్యూటివ్ ట్రైనీలు

ఖాళీలు 10

మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ - ఎగ్జిక్యూటివ్ ట్రైనీ (కెమిస్ట్)ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- అర్హత: కనీసం 60 శాతం మార్కులతో ఎమ్మెస్సీ (కెమిస్ట్రీ) ఉత్తీర్ణులై గేట్ 2017లో అర్హత పొంది ఉండాలి.
- వయసు: జనవరి 21 నాటికి 28 ఏళ్లు .
- ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం: ఏప్రిల్ 9
- దరఖాస్తుకు చివరి తేదీ: మే 8
- వెబ్‌సైట్: www.mecl.gov.in

క్లర్క్‌లు

ఖాళీలు 664

నార్తర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ (ఎన్‌సీఎల్)- పలు ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ఉద్యోగాలు-ఖాళీలు: అసిస్టెంట్ లోడింగ్ క్లర్క్ 26, క్లర్క్ 51, ట్రిప్‌మన్ 16, ట్రైనీ క్లర్క్ 7, అకౌంట్స్ క్లర్క్ 19, అసిస్టెంట్ కాషియర్ 5, స్టోర్ ఇష్యూ 7, ఫార్మాసిస్ట్ 3, డ్రెసర్ 8, సెక్యూరిటీ గార్డ్ 393, మైనింగ్ సిర్దార్ 36, జూనియర్ టెక్నికల్ ఇన్‌స్పెక్టర్ 21, జూనియర్ కెమిస్ట్ 9, ఆపరేటర్ 54, టెలికాం / రేడియో మెకానిక్ 7, జూనియర్ ట్రాన్స్‌లేటర్ 2
- అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి / డిప్లొమా (ఫార్మసీ) / ఇంటర్ / బీఎస్సీ / బీఏ ఉత్తీర్ణతతోపాటు నిర్దేశించిన మేర అనుభవం. సెక్యూరిటీ గార్డు పోస్టులకు ఎనిమిదో తరగతి పాసై ఉండాలి.
- వయసు: దరఖాస్తు నాటికి 30 ఏళ్లలోపు ఉండాలి
- ఎంపిక: సెలెక్షన్ టెస్ట్ / ఆప్టిట్యూడ్ టెస్ట్ / ట్రేడ్ టెస్ట్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 28
- వెబ్‌సైట్: www.nclcil.in

యూపీఎస్సీ

ఖాళీలు 5

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ)- పలు ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ఉద్యోగాలు: అసిస్టెంట్ కమిషనర్ 1, డిప్యూటీ డ్రగ్ కంట్రోలర్ 1, అసిస్టెంట్ డ్రగ్స్ కంట్రోలర్ 2, అసిస్టెంట్ ప్రొఫెసర్ 1
- విభాగాలు: కో ఆపరేషన్ / క్రెడిట్, మెడికల్ డివైజెస్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్
- అర్హత: డిగ్రీ/ పీజీ ఉత్తీర్ణతతోపాటు నిర్దేశించిన మేర అనుభవం ఉండాలి.
- వయసు: దరఖాస్తు నాటికి 50 ఏళ్లు మించకూడదు.
- దరఖాస్తు ఫీజు: రూ.25
- ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 12
- వెబ్‌సైట్: www.upsconline.nic.in



నర్సింగ్ ఆఫీసర్లు

ఖాళీలు 9

పోస్ట్‌గ్రాడ్యుయేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (పీజీఐఎంఈఆర్)- పలు ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ఉద్యోగాల వారీగా ఖాళీలు: నర్సింగ్ ఆఫీసర్లు 7, జూనియర్ టెక్నీషియన్లు 2,
- అర్హత: నర్సింగ్ ఆఫీసర్లకు పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీలో సర్టిఫికెట్ ఉండాలి. జూనియర్ టెక్నీషియన్ (ఎక్స్‌రే) అభ్యర్థులకు బీఎస్సీ (మెడికల్ టెక్నాలజీ - ఎక్స్‌రే / రేడియాలజీ / రేడియో డయాగ్నసిస్ / రేడియో డయాగ్నసిస్ అండ్ ఇమేజింగ్ టెక్నాలజీ) పూర్తి చేసి ఉండాలి.
- వయసు: దరఖాస్తు నాటికి 30 ఏళ్లు మించకూడదు.
- దరఖాస్తు ఫీజు: రూ.1000 (ఎస్సీ / ఎస్టీలకు రూ.500)
- దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 10
- వెబ్‌సైట్: www.pgimer.edu.in

సీనియర్ రెసిడెంట్లు

ఖాళీలు 9

మౌలానా ఆజాద్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ (ఎంఏఐడీఎస్)- సీనియర్ రెసిడెంట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- విభాగాల వారీగా ఖాళీలు: ప్రోస్థో డాంటిక్స్ 1, కన్జర్వేషన్ డెంటిస్ట్రీ 2, పిరియోడాంటిక్స్ 1, పబ్లిక్ హెల్త్ డెంటిస్ట్రీ 1, ఫోరెన్సిక్ ఓడంటాలజీ 1, పేడోడాంటిక్స్ 1, డెంటల్ అనాటమీ 1, ఓరల్ పాథాలజీ 1
- అర్హత: సంబంధిత విభాగంలో ఎండీఎస్ పూర్తిచేసి ఉండాలి. ఫోరెన్సిక్ ఓడంటాలజీ విభాగానికి మాత్రం డిప్లొమా / డిగ్రీ (ఫోరెన్సిక్ ఓడంటాలజీ / ఫోరెన్సిక్ సైన్సెస్) పూర్తిచేసి ఉండాలి.
- వయసు: దరఖాస్తు నాటికి 40 ఏళ్లు మించకూడదు
- దరఖాస్తు ఫీజు: రూ.1000
- దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 16
- వెబ్‌సైట్: http://maids.ac.in

ఇంజనీర్లు

ఖాళీలు 10

ఐటిఐ లిమిటెడ్ - ఒప్పంద ప్రాతిపదికన ఇంజనీర్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- అర్హత: కనీసం 60 శాతం మార్కులతో బిఈ / బీటెక్ (ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ / మెకానికల్ / ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ / ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్).
- వయసు: దరఖాస్తు నాటికి 28 ఏళ్లు మించకూడదు
- దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 7
- వెబ్‌సైట్: www.itiltd-india.com

సీతమ్మ మన అమ్మ!...

శ్రీరాముడు మనకు తండ్రి!!



చతుర్బాహుడై, అంకపీఠం మీద సీతమ్మతో, సోదరుడు లక్ష్మణ సమేతంగా కొలువైన శ్రీరామచంద్రమూర్తి కల్యాణానికి ఆయన పుట్టిన రోజైన శ్రీరామనవమి నాడు అంకురార్పణ జరిగిన పవిత్ర ప్రదేశం భద్రాచలం. దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచలం పుణ్యక్షేత్రంలో రాముడు జన్మించిన శ్రీరామనవమి నాడే కల్యాణం నిర్వహిస్తారు. పాంచరాత్ర ఆగమం ప్రకారం నాడు రామదాసు ఈ దివ్య సంప్రదాయంకు శ్రీకారం చుట్టగా నాటి నుంచి తెలుగువారు శ్రీరామనవమి నాడే సీతారాముల కల్యాణం జరపడం ఒక సంప్రదాయం. పాంచరాత్ర ఆగమ శాస్త్రానుసారం నిర్వహించే కల్యాణాన్ని కనులారా వీక్షిస్తే అశ్వమేధ యాగఫలం సిద్ధిస్తుందని బ్రహ్మపురాణం పేర్కొంటోంది.

రామదాసు చేయించిన ఆభరణాలే....

భక్తరామదాసు ఆనాడు సీత, రామలక్ష్మణుల కోసం చేయించిన పచ్చల పతకం, బిళ్లల మొలతాడు,

శ్రీరామ నవమి ప్రత్యేకం

చింతాకు పతకం, మూడు సూత్రాలుండే మంగళసూత్రాన్ని నేటికీ అర్చకస్వాములు కల్యాణోత్సవాల్లో వినియోగిస్తారు. ధ్వజారోహణం అనంతరం గరుత్మంతునికి నివేదన చేసిన గరుడ ప్రసాదాన్ని సంతాన ప్రాప్తి లేని మహిళలు దానిని స్వీకరిస్తే సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల ప్రగాఢ నమ్మకం.

అలనాటి తానీషా సంప్రదాయం ప్రకారం ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలను పాలకులు సమర్పిస్తారు. ఈ సంప్రదాయం అనేక శతాబ్దాలుగా కొనసాగుతోంది.

ఈసారి విళంబినామ సంవత్సరంలో స్వామి కల్యాణానికి ఎంతో విశిష్టత ఉంది. విళంబి నామ సంవత్సరంలోనే సీతారామచంద్రస్వామి జన్మించారన్నది పండితుల మాట! ఈ ఏడాది రామయ్య కల్యాణం తిలకించేవారికి మహా సామ్రాజ్య పట్టాభిషేకాన్ని తిలకిస్తే పొందే పుణ్యఫలం లభిస్తుందని ఆధ్యాత్మికవేత్తల ఉవాచ.

విశిష్ట దేవుడు...

విలక్షణ రాముడు

"పదికొంపలు లేని పల్లెనైనను రామభజన మందిరమొండు వరలుగాత!" అనేది కవి వాక్యం. మన దేశంలో గ్రామాలు ఎన్ని ఉన్నాయో దాదాపు అన్ని రామాలయాలున్నాయి. అయితే వీటిలో కొన్ని తమదైన విలక్షణతతో ప్రత్యేకతను చాటుకుంటున్నాయి. అలాంటి రామాలయాల్లో కొన్ని. తొమ్మిది రోజుల ఈ 'శ్రీరామనవమి' ఉత్సవాల ప్రత్యేకం...

మారుతి లేని రాముడు... మీసాల దేవుడు



"యత్ర యత్ర రఘునాథ కీర్తనం తత్ర తత్ర కృత మస్తకాంజలిం!"

ఎక్కడ శ్రీరామ భజన, కీర్తన జరుగుతాయో అక్కడ హనుమంతుడు తన్మయంగా చేతులు జోడించి నిలబడతాడట! రామాలయాల్లో రాముని పాదాల దగ్గర ముక్త హస్తాలతో మారుతి విగ్రహం కనిపించడం సర్వసాధారణం. కానీ ఈ ఆలయంలో ఆంజనేయుడు కనిపించడు! తెలంగాణలోని మెదక్ జిల్లా గుమ్మడిదలలో ఈ ఆలయం ఉంది. హైదరాబాద్ నగరానికి సుమారు 48 కిలోమీటర్ల దూరంలో ఈ గ్రామం ఉంది. కుత్బుల్లాపూర్ మున్సిపల్ కేంద్రానికి హైదరాబాద్‌లోని ప్రధాన ప్రాంతాలనుంచి బస్సులున్నాయి. అక్కడినుంచి దాదాపు సుమారు 25 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.

ప్రత్యేకత ఏంటంటే.... హనుమంతుడు లేని రామాలయం ఇది. ఇక్కడి రాముడిని 'కల్యాణ రాముడ'ని కూడా పిలుస్తారు. శ్రీరామ కల్యాణ సమయానికి ఆంజనేయునితో రాముడికి పరిచయం లేదు కనుక, హనుమ విగ్రహాన్ని ఏర్పాటుచేసి ఉండకపోవచ్చునీ ఆలయ వర్గాల మాట.

ఈ ఆలయం ప్రత్యేకత ఇదొక్కటే కాదు... సీతాసమేతుడైన శ్రీరామునితోపాటు లక్ష్మణుడు- ఊర్మిళ, భరతుడు- మాండవి, శత్రుఘ్నుడు- శ్రుతకీర్తి దంపతుల విగ్రహాలు కూడా గర్భగుడిలో దర్శనమిస్తాయి. ఇలాంటి అరుదైన దర్శనం మరెక్కడా దొరకదు. మరో విశేషం ఏమిటంటే.... ఇక్కడ శ్రీరాముడు మీసాలతో కనిపిస్తాడు. ఇది సుమారు 900 ఏళ్ళనాటి ఆలయం. శ్రీరామనవమి రోజున ఇక్కడ నిర్వహించే సీతారామ కల్యాణంలో పాల్గొనే అవివాహితులకు త్వరలోనే పెళ్ళి అవుతుందని భక్తుల విశ్వాసం.

ముగ్గురయ్యల ముచ్చటైన స్వరూపం!

ఆ ఆలయంలో శ్రీరాముడు విష్ణుమూర్తిలా కనిపిస్తాడు. అంతేకాదు, వేరే ఏ రామాలయంలోనూ కానరాని అనేక విశేషాల నెలవు ఈ శ్రీరాముడి కొలువు! కేరళలోని త్రిస్సూర్ (త్రిచ్చూర్) జిల్లా త్రిప్రాయర్‌లో ఉందీ గుడి. తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రధాన నగరాల నుంచీ త్రిస్సూర్‌కు నేరుగా రైళ్ళున్నాయి. అక్కడినుంచి 25 కిలోమీటర్ల దూరంలోని త్రిప్రాయర్‌కు రోడ్డు మార్గంలో చేరుకోవచ్చు.

ప్రత్యేకత ఏమిటంటే... 'త్రిప్రాయరప్పన్', 'త్రిప్రా దేవర్'గా ప్రసిద్ధుడైన త్రిప్రాయర్ శ్రీరాముడు చతుర్భుజుడు. ఒక చేతిలో పాంచజన్యం (శంఖం), మరో చేతిలో సుదర్శన చక్రం, ఇంకో చేతిలో కోదండం (విల్లు), నాలుగో చేతిలో జపమాల ఉంటాయి. వీటిలో జపమాల బ్రహ్మకు సంకేతం అంటారు. అలాగే శివుడికి సంబంధించిన లక్షణాలు కూడా కొన్ని కనిపిస్తాయి. సర్వసాధారణంగా ఏ వైష్ణవ ఆలయంలోనూ ఉండని విధంగా ఇక్కడ దక్షిణామూర్తి విగ్రహం ఉండడం విశేషం. హనుమంతుడు, గోశాల కృష్ణమూర్తితోపాటు ఉపదేవతలుగా గణపతి, అయ్యప్ప కూడా ఇక్కడ కొలువు తీరారు. అందుకే దీన్ని త్రిమూర్తి స్వరూపమైన ఆలయంగా భావిస్తారు. ఈ ఆలయంలోని శ్రీరామ విగ్రహాన్ని ద్వాపర యుగంలో శ్రీకృష్ణుడు పూజించాడనీ, ఆయన అవతార సమాప్తి తరువాత విగ్రహం ద్వారకతో పాటు సముద్రంలో మునిగిపోయిందనీ క్షేత్ర పురాణం చెబుతోంది. తరువాత బెస్త వారికి సముద్రంలో దొరికిన విగ్రహానికి ప్రతిష్ఠ జరిపారు. ఈ ఆలయం 'తీవ్ర' నది ఒడ్డున ఉంది.



యోగ రామప్రభో!



చిన్ముద్రతో, చిదానందంగా భక్తులను అలరిస్తూ, నమ్మినబంటు హనుమంతుడికి గురుస్థానంలో నిలిచిన ప్రత్యేకమైన రాముడిని ఆ గుడిలో చూడవచ్చు. అక్కడి శ్రీరామచంద్రుడు రణశూరుడైన విజయ రాఘవుడు. తమిళనాడులోని నెడుంగుణమ్ (లేదా నెడుంగుంద్రమ్)లో ఉందీ విశిష్ట ఆలయం. తమిళనాడులోని అరణికి 20 కిలోమీటర్లు, తిరువణ్ణామలై (అరుణాచలం)కి సుమారు 55 కిలోమీటర్ల దూరంలో, వందవాసి పట్టణానికి దాదాపు 26 కిలోమీటర్ల దూరంలో నెడుంగుణమ్ ఉంది. చెన్నై నుంచి నేరుగా బస్సులున్నాయి.

ప్రత్యేకతలేమిటంటే.... కడప దగ్గరి పద్మాసన రాముడి మాదిరిగా ఇక్కడ కూడా శ్రీరాముడు యోగముద్రలో కనిపిస్తాడు. తమిళనాడులోని అతి పెద్ద రామాలయాల్లో ఇదొకటి. రాముడు యోగముద్రతో దర్శనమిచ్చే ఆలయాల్లో ప్రఖ్యాతమైనది కూడా ఇదే. రాముడు చిన్ముద్రతో- గురుస్థానంలో బోధిస్తున్నట్టు, హనుమంతుడు శిష్యుడి స్థానంలో వేదాధ్యయనం చేస్తూ, స్వామి చెబుతున్నది ఆలకిస్తున్నట్టూ ఉంటారు. లక్ష్మణుడు ధనుర్ధారిగా కనిపిస్తాడు. సీతమ్మ కుడిచేత్తో తామరపువ్వు పట్టుకొని, ఎడమచేతిని రాముని పాదాలవైపు చూపిస్తూ ఆయన పక్కన ఆసీనురాలై ఉంటుంది. రావణ సంహారం తరువాత తిరిగి వస్తూ, శ్రీరాముడు ఇక్కడ విడిది చేశారనీ, శుక మహర్షిని దర్శించుకున్నారనీ స్థలపురాణాలు చెబుతున్నాయి. విజయం సాధించి తిరిగి వచ్చిన వాడు కాబట్టి ఇక్కడి రాముడిని 'విజయరాఘవన్' అని కూడా పిలుస్తారు.

కుడివైపు జానకమ్మ!

"వామాంక స్థిత జానకీ పరిలసత్ కోదండదండం కరే!" అని ప్రార్థనాశ్లోకంలో మాట.

ఏ రామాలయంలోనైనా రామునికి ఎడమవైపున సీతమ్మ కనిపిస్తుంది. భద్రాచలంలో రామాంకం మీద కొలువుతీరుతుంది. కానీ తిరుపతిలోని కోదండ రామాలయంలో మాత్రం ఆయనకు కుడివైపున సీతమ్మ ఉంటుంది.

ప్రత్యేకత ఏమిటంటే... తిరుపతి నగరం మధ్యలో ఉండే ఈ ఆలయానికి వేల సంవత్సరాల చరిత్ర ఉంది. రావణ సంహారం తరువాత అయోధ్యకు వెళ్తూ, ఈ ప్రాంతంలో శ్రీరాముడు విశ్రమించాడని ఐతిహ్యం. దానికి గుర్తుగా ఈ ఆలయం నిర్మితం అయిందని అంటారు. తరువాత కలియుగంలో జనమేజయ చక్రవర్తి దీన్ని అభివృద్ధి పరిచారనీ కథనాలు ఉన్నాయి. నిర్మాణ శైలిలో ఈ గుడి తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని పోలి ఉంటుంది. ఇక్కడ శ్రీరాముడి కుడివైపున సీతమ్మ, ఎడమవైపున లక్ష్మణుడు ఉండడం విశేషం. అయితే అసలు వైఖానస ఆగమ నియమాల ప్రకారం అమ్మవారు దక్షిణంగా అంటే కుడివైపునే ఉండాలట! ఆ ప్రకారమే ఈ విగ్రహాలు ఉన్నాయని పండితులు చెబుతున్నారు. ఇలా కుడి పక్కన ఉన్న అమ్మవారిని దర్శించుకోవడం మోక్షదాయకమని పెద్దల మాట, నమ్మకం.



పద్మాసనంలో పరంధాముడు



ధనుర్బాణాలు ధరించి, నిలబడి ఉన్న శ్రీరాముడు! భక్తుల స్మరణలో, మననంలో ముద్రపడిన రూపం ఇదే!! కానీ శ్రీరాముడు పద్మాసనంలో కూర్చొని ఉండడం ఎప్పుడైనా చూశారా? పద్మాసనాసీనుడైన రాముడిని కడప జిల్లా పెద్దపుత్త గ్రామంలోని ఈ ఆలయంలో దర్శించుకోవచ్చు. కడప నుంచి సుమారు 22 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెద్దపుత్తకు రోడ్డు మార్గంలో చేరుకోవచ్చు.

ప్రత్యేకతలేమిటంటే.... ఇక్కడ సీతారాములు పద్మాసనాల్లో కూర్చొని దర్శనమిస్తారు. స్వామికి కుడివైపు లక్ష్మణుడు నిలబడి ఉంటాడు. రాముడి కుడి చెయ్యి యోగముద్రతో, ఎడమ చెయ్యి స్పర్శముద్రతో-(నేలను చూపిస్తూ) ఉంటాయి. ఆయన చేతుల్లో ధనుర్బాణాలుండవు. లక్ష్మణుడు మాత్రం వాటిని ధరించి ఉంటాడు. వారికి ముందు హనుమంతుడు కూర్చొని, బ్రహ్మసూత్రాలు చదువుతున్నట్టు కనిపించడం మరో విశేషం.

పట్టాభి రాముడు

శ్రీరామ పట్టాభిషేకం చిత్రపటం చూసే ఉంటారుగా! అలాంటి భంగిమలో, విభీషణ వరదుడైన రాముడు కనిపించే ఇలాంటి అపూర్వ ఆలయం మరెక్కడా ఉండదేమో! తమినాడులోని అయోధ్యాపట్నంలో ఈ ఆలయం ఉంది. తమిళనాడులోని సేలం నగరానికి సుమారు 12 కిలోమీటర్ల దూరంలో అయోధ్యాపట్నం ఉంది. తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రధాన నగరాల నుంచీ సేలం వెళ్ళే రైళ్ళున్నాయి. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో అయోధ్యాపట్నం చేరుకోవచ్చు. ప్రత్యేకత ఏమిటంటే... ఇక్కడి ఆలయంలో రాముడు పట్టాభిషేక భంగిమలో కనిపిస్తాడు. ఎడమ కాలిని కుడి తొడ మీద వేసుకొని, వరద హస్తంతో దర్శనమిస్తాడు. ఆయన ఎడమవైపు సీతాదేవి కూర్చొని ఉంటుంది. దీని వెనక ఒక పురాణ గాథ ఉంది. రావణ సంహారం తరువాత తిరిగి వస్తూ, ఈ ప్రాంతంలో విశ్రమించిన రాముడిని- తదనంతరం జరగబోయే పట్టాభిషేకంలో కూర్చొనే భంగిమలో దర్శనం ఇవ్వాలని విభీషణుడు కోరాడు. ఆ కోరికను రాముడు నెరవేర్చాడు. దానికి తార్కాణం అన్నట్టు ఈ ఆలయంలో విభీషణుడి విగ్రహం సీతారాముల ముందు నిలబడి ఉంటుంది. విభీషణుడు ప్రార్థిస్తూ ఉంటే, వారిద్దరూ అతన్ని ఆశీర్వదిస్తున్నట్టు కనిపిస్తుంది.



బ్యూటీ కేర్

అందమనగానే మృదువైన చర్మం, నల్లటి శిరోజాలు, కాంతివంతమైన కళ్లు వెంటనే స్ఫురిస్తాయి. పండుగలు, పార్టీలప్పుడు నలుగురిలో అందంగా కనిపించేందుకు కొన్ని ప్రత్యేక టిప్స్ ఉన్నాయంటున్నారు ప్రముఖ సౌందర్య నిపుణురాలు సుపర్ణా త్రిఖ. అవేమిటంటే...

- డల్, ఆయిలీ, కాంబినేషన్ చర్మం ఉన్నవాళ్లు చల్లటి పెరుగులో కొద్దిగా చక్కెర వేసి పేస్టులా చేసి దానితో ముఖాన్ని మసాజ్ చేసుకోవాలి. తర్వాత కమలాపండు ముక్కలతో ముఖాన్ని మృదువుగా రుద్దుకోవాలి. అనంతరం చల్లటి నీళ్లతో ముఖం కడుక్కుంటే చర్మం కాంతివంతంగా కనిపిస్తుంది.
- వెంట్రుకలు సహజమైన నల్లని రంగులో కాకుండా కొద్దిగా బ్రౌన్ రంగులో ఉంటే దానికి కూడా ఒక చిట్కా ఉంది. రోజ్‌మేరీ రెబ్బల్ని రెండు కప్పుల నీళ్లల్లో వేయాలి. రెండు టీస్పూన్ల టీపొడి కూడా వేయాలి. ఆ మిశ్రమం సగానికి వచ్చే వరకూ స్టవ్ మీద మరిగించాలి. షాంపుతో తల రుద్దుకునేటప్పుడల్లా పావుకప్పు షాంపులో ఈ మిశ్రమాన్ని కొద్దిగా కలిపి, తలకు రాసుకుని పదిహేను నిమిషాలుండాలి. ఆతర్వాత తలస్నానం చేస్తే మార్పు కనిపిస్తుంది.
- కళ్ల కింద నల్ల వలయాలు పోవాలంటే కీరదోస తరుగుతో కళ్ల చుట్టూతా మసాజ్ చేసుకోవాలి. తర్వాత ఫ్రీజర్‌లో పెట్టిన వాడేసిన టీ బ్యాగ్స్‌ను కళ్ల మీద పదినిమిషాలపాటు పెట్టుకోవాలి. ఇలా చేయడం వల్ల కళ్ల చుట్టూ ఉన్న చర్మంలో మెరుపు చమక్‌మంటుంది.
- చర్మంలో సాగే గుణంతోపాటు మెరుపు కనిపించాలంటే చల్లటి నీళ్లతో లేదా ముఖంపై టీస్పూను తేనె వేసుకుని ఐస్‌ముక్కలతో చర్మంపై సున్నితంగా రుద్దాలి. గుడ్డులోని తెల్ల సొనను కూడా చర్మంపై రాసుకుని అది పొడారిపోయే వరకూ ఉంచుకోవాలి. తర్వాత చల్లటి నీటితో ముఖం కడుక్కోవాలి. ఇలా చేయడం వల్ల చర్మం మృదువుగా ఉండి, కాంతివంతంగా తయారవుతుంది.



సమ్మర్ జ్యూస్



సపోటా మిల్క్ షేక్

కావలసినవి:

సపోటాలు - నాలుగు, పాలు - అర లీటరు, పంచదార - తగినంత.

తయారీ:

- సపోటాల పైన ఉండే పొట్టు తీసేయాలి. అలాగే లోపలి గింజలను కూడా తీసేయాలి.
- సపోటా ముక్కలను మిక్సీ జార్‌లో వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి.
- ఈ గుజ్జులో కాగబెట్టిన పాలు పోసి, పంచదార వేసి కలపాలి.
- మళ్లీ ఒకసారి గ్రైండ్ చేయాలి. కొంచెంసేపు ఫ్రిజ్‌లో ఉంచి చల్లగా తాగేయాలి.

నోట్:

- పండును గ్రైండ్ చేసేటప్పుడు కొంచెం పాలు పోస్తే జారుగా ఉంటుంది.
- ఈ మిల్క్‌షేక్‌లో నచ్చిన ఐస్‌క్రీం ఫ్లేవర్ ఒక స్కూప్ వేసుకుని కూడా లాగించేయొచ్చు.

లక్ష్యసాధనే ఆనందం!

పేరెంటచ్



సరదా కోసమో, వినోదం కోసమో చదివే పుస్తకాలు వేరు, పాఠ్య పుస్తకాలు వేరు. పరీక్షల కోసం పాఠ్యపుస్తకాలు చదువుతున్నప్పుడు అందులోని విషయాలేవీ ఆనందాన్ని ఇవ్వవు. ఎందుకంటే, అవి ఒక లక్ష్యసాధన కోసం చదువుతున్నవి మాత్రమే. పరీక్షల సమయంలో చదివిందంతా జ్ఞాపకం పెట్టుకోవడం ఎలా? పరీక్షా వేళలో చదివిందేదీ గుర్తుకు రాకపోతే ఏమిటి చేయడం? అంటూ ఆందోళన పడే పిల్లల మనసుకు ఆనందపు అనుభూతి కలిగే అవకాశమే లేదు.

ఒక్కో పరీక్ష దాటే కొద్దీ పిల్లలు విషయాల్ని గుర్తుపెట్టుకునే యంత్రాలుగా మారిపోతారు. అలా అని పిల్లల్ని అలాగే వదిలేస్తే, క్రమక్రమంగా చదివిందేదీ జ్ఞాపకం ఉండని పరిస్థితి ఏర్పడుతుంది. సరిగ్గా ఇలాంటప్పుడే తలిదండ్రులు పిల్లలకు అండగా నిలబడాలి. ప్రత్యేకించి, పరీక్షలు రాయడం కోసం పడే శ్రమంతా, రేపు ఒక అద్భుతమైన లక్ష్యాన్ని సాధించడానికి నిస్సంకోచంగా తోడ్పడుతుందని వారికి చెప్పగలగాలి. ఇలా ఒక్కో మెట్టే ఎక్కుతూ వెళితే, ఒక దశలో ఒక పెద్ద హోదాగల ఉద్యోగాన్ని సొంతం చేసుకునే అవకాశం వస్తుంది. దానివల్ల నలుగురిలో గౌరవం పెరగడంతో పాటు, ఎంతో మందికి సాయపడే అవకాశం వస్తుందనే విషయాలు చెప్పాలి. ఈ శ్రమకు వెరచిన వారు, లేదా పూర్తి స్థాయిలో శ్రమించని వారికి ఆ అవకాశాలు రావు అనే నిజాన్ని చెప్పాలి.

ఏదైనా సాధించాలంటే లక్ష్యాన్ని నిర్దేశించుకోవడమే ముఖ్యమని చెప్పాలి. నిజానికి ప్రపంచంలో అన్నింటికన్నా అందమైనది లక్ష్యమే. ఆ లక్ష్యాన్ని సాధించడంలో గొప్ప ఆనందం ఉంది. అందుకే ఒక లక్ష్యాన్ని ఏర్పరుచుకుని, దాన్ని సాధించడం ద్వారా జీవితాన్ని ఆనందమయం చేసుకోవాలని పిల్లలకు చిన్న చిన్న మాటల్లో ఏదో ఒక సమయంలో చెబుతూ ఉండాలి. ఈ మాటలు పరీక్షల సమయంలో వారి మనసులోకి చొరబడిన జడత్వాన్ని, యాంత్రికతను పారదోలి, ఎప్పటికప్పుడు పునరుత్సాహంతో చదువు మీద మనసు లగ్నమయ్యేలా చేస్తాయి!!



ఆయన భారతదేశానికి ప్రభుత్వం నియమించిన సైబర్ సెక్యూరిటీ చీఫ్.. 'నేను అసలు ఇంటర్నెట్ బ్యాంకింగ్ వాడను, అత్యవసరమైతే 25 వేలు రూపాయలు వేరే బ్యాంక్ ఎకౌంట్ లో వేసుకొని డెబిట్ కార్డు మాత్రమే వాడతాను' అని ఇటీవల సెలవిచ్చారు. ఏకంగా సైబర్ సెక్యూరిటీ కీలకమైన అధికారిగా ఉన్న అలాంటి వ్యక్తే అంతగా భయపడుతున్నారంటే మరి సామాన్యుల పరిస్థితి ఏంటి? మన లాంటివాళ్ళు ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, యుపిఐ చెల్లింపులు ఎలాంటి భయాలు లేకుండా చేసుకోగలిగిన సురక్షితమైన వాతావరణం అసలు మన దేశంలో వుందా? ఇలాంటి సందేహాలు ప్రతీ ఒక్కరికి తలెత్తున్నాయి.

ఆన్‌లైన్‌లో డబ్బులు సేఫ్ కాదా?

ఆధికశాతం ఫైనాన్షియల్ ఫ్రాడ్‌లు ఫిషింగ్ అటాక్‌ల వల్ల తలెత్తుతున్నాయి. బ్యాంకులు పంపించినట్లు మీ మెయిల్ ద్వారానూ, ఎస్ఎంఎస్‌ల ద్వారానూ కొన్ని లింకులు వస్తాయి. మీ క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతున్నామనీ, లేదా మీ బ్యాంక్ ఎకౌంట్ సెక్యూరిటీ వెరిఫై చేస్తున్నామని ఈ లింక్ క్లిక్ చేసి వెంటనే మీ ఎకౌంట్ నిర్ధారించుకోమనీ ఇలా వచ్చే మెసేజ్లకు వెనకా ముందు ఆలోచించకుండా చాలామంది స్పందిస్తుంటారు. లింకు క్లిక్ చేసిన వెంటనే స్క్రీన్ మీద ప్రత్యక్షమయ్యే వెబ్‌సైట్ మీ బ్యాంక్‌కి సంబంధించిన వెబ్ సైటు మాదిరిగానే ఉంటుంది. మీ డెబిట్ కార్డ్, క్రెడిట్ కార్డ్ వివరాలు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ యూజర్ నేమ్, పాస్‌వర్డ్‌లు టైప్ చేయడం ఆలస్యం స్క్రీన్ మీద ఓ ఎర్రర్ మెసేజ్ చూపించబడి అంతటితో నిలిచిపోతుంది. పైకి మనకు కనిపించేది అదే, కానీ మనకు తెలియకుండానే మనం ఎంటర్ చేసిన వివరాలు మొత్తం హ్యాకర్‌కి చేర్చబడతాయి. దీంతో కొన్ని రోజుల తర్వాత మన అకౌంట్ లో బ్యాలెన్స్, క్రెడిట్ కార్డు లిమిట్ ఖాళీ అయిపోతుంది. అందుకే మెయిల్స్‌కు వచ్చే అన్ని లింకులను గుడ్డిగా క్లిక్ చేయకూడదు.

ఆఫర్ల పేరిట

ఈమధ్య పలురకాల ఆఫర్ల పేరిట వాట్సప్‌లోనూ, ఫేస్‌బుక్‌లోనూ అనేక లింకులు షేర్ అవుతున్నాయి. కేవలం 10 రూపాయలు చెల్లిస్తే ఫలానా డిటిహెచ్ సర్వీస్ జీవితాంతం అన్‌లిమిటెడ్ ఛానల్స్ చూడొచ్చు అని ఓ మెసేజ్ ఓ లింక్ చూపిస్తుంది. చాలామంది ఆశపడి వెంటనే ఓపెన్ చేసి పేమెంట్ చేద్దామని చూస్తే మన డెబిట్, క్రెడిట్ కార్డు ఎంటర్ చేయమని కన్పిస్తుంది. 10 రూపాయలు ఖర్చుపెడుతున్నామన్న ఆలోచనలో మాత్రమే చాలామంది ఉంటారు తప్పించి అది పేమెంట్ గేట్‌వే కాదనీ, తాము ఎంటర్ చేసే వివరాలు హ్యాకర్లకి చేర్చబడుతుంటాయని గ్రహించేవారు చాలా తక్కువమంది. ఇలాంటివే చాలా రకాల ప్రలోభాలు.. వెయ్యి రూపాయలకే ఐఫోన్ వస్తోందనీ.. తక్కువ ధరకే రేబాన్ గ్లాసులనీ ఇలా ఏది పడితే అది చెబుతూ ఉంటారు. మీ కార్డుల వివరాలు తస్కరించి, అకౌంట్లు ఖాళీ చేయడానికి వేసే ఎత్తుగడ ఇది. ఇలాంటి ఆఫర్లు నమ్మకండి, మీ మిత్రులకు షేర్ చేయకండి.

ఎన్‌క్రిప్టెడ్ పేజీనా కాదా?

ఒక బిల్లు చెల్లించడానికి కావచ్చు, మొబైల్ రీఛార్జి చేయటానికి కావొచ్చు, ఇంక వేరే ఏదైనా అవసరానికి డబ్బులు చెల్లించాల్సి వచ్చినప్పుడు మీరు పేమెంట్ చేసే పేజీ హెచ్‌టిటిపిఎస్ అని చివర్లో 'ఎస్' అనే అక్షరం ఉండేలా, అదికూడా రెడ్ కలర్‌లో కాకుండా మొత్తం గ్రీన్ కలర్‌లో ఉండేలా జాగ్రత్త వహించండి. మామూలు హెచ్‌టిటిపి పేజీల ద్వారా మీరు చేసే చెల్లింపులు, సర్వర్‌కి పంపించే డేటా 'మేన్ ఇన్ మిడిల్ ఆటాక్' అని పిలవబడే పాకెట్ స్నిఫ్ఫింగ్ వంటి పద్ధతుల ద్వారా హ్యాకర్ల చేత దొంగిలించబడతాయి. ఆర్థికపరమైన లావాదేవీలు చేసేటప్పుడు వెబ్‌సైట్ అడ్రస్‌బార్‌పై ఓ కన్నేసి ఉంచడం తప్పనిసరి.


> వీటితోపాటు కుకీలను దొంగిలించటం, సెషన్ హైజాకింగ్, కార్డ్ స్కిమ్మింగ్ వంటి ఎన్నో రకాల పద్ధతులు మన బ్యాంకు అకౌంట్లను ఖాళీ చేయడం కోసం వాడబడుతున్నాయి. కీలకమైన అర్థిక లావాదేవీలు చేసే తమ ఫోన్లలో ఇప్పటికీ చాలామంది పైరేటెడ్, అశ్లీల సమాచారం ఉన్న వెబ్‌సైట్లను ఓపెన్ చేస్తున్నారు. వాటిలో అంతర్గతంగా పొందుపరచబడే ప్రమాదకరమైన స్క్రిప్ట్‌లు మన కీలకమైన డేటాని సేకరించి వారికి వారు స్వయంగా వాడుకోవడం గానీ, లేదా డార్క్‌వెబ్ వంటి ప్రదేశాల్లో విచ్చలవిడిగా అమ్మేయడం గానీ చేస్తుంటారు. కాబట్టి ఆన్‌లైన్ లావాదేవీలు డివైజ్‌లను నిరంతరం సెక్యూర్డ్‌గా ఉంచుకోవటం మన బాధ్యత. తప్పనిసరిగా శక్తివంతమైన యాంటీ వైరస్ సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాల్ చేసుకోండి. అలాగని యాంటీవైరస్ ఒకటే మిమ్మల్ని పూర్తిగా రక్షించలేదు. పైన చెప్పుకున్న అన్ని రకాల జాగ్రత్తలు తీసుకున్న తర్వాత మాత్రమే మీరు సేఫ్ అని గుర్తుంచుకోండి.

అంతర్జాతీయ లావాదేవీలు

తమకు తెలియకుండానే అమెరికా నుండి, ఆస్ట్రేలియా నుండి భారీ మొత్తంలో క్రెడిట్ కార్డు లావాదేవీలు జరుగుతున్నాయని ఈ మధ్య కాలంలో చాలామంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి ప్రధానమైన కారణం, ఓటిపి అవసరం లేకపోవడం. అవును, మీరు బయట ఎక్కడైనా రెస్టారెంట్లకు, పెట్రోల్ బంకులకు వెళ్లినప్పుడు బిల్ తీసుకురమ్మని క్రెడిట్ కార్డును అక్కడ ఉండే సర్వర్‌కి ఇస్తుంటారు. కొన్ని కార్డ్ క్లోనింగ్ ముఠాలు దేశవ్యాప్తంగా రెస్టారెంట్లు, పెట్రోల్ బంకుల్లో పనిచేసే కొంతమంది ఉద్యోగులకు ఇన్ని కార్డుల డేటా సేకరిస్తే ఇంత మొత్తంలో డబ్బులు ఇస్తామని ఆశ చూపి మన క్రెడిట్ కార్డుల డేటా తస్కరించడానికి స్కెచ్ వేస్తున్నారు. ఇండియాలో జరిగే లావాదేవీలకైతే ఓటిపి అవసరమవుతుంది గానీ అంతర్జాతీయ లావాదేవీల విషయంలో అలాంటిది ఏదీ అవసరం లేదు. కేవలం మీ క్రెడిట్ కార్డు నెంబరు, దాని ఎక్స్‌పయిరీ డేట్, కార్డు మీద ఉన్న పేరు, సివివి నెంబర్ ఉంటే సరిపోతుంది. ఇక ఓటిపి పనిలేకుండా ప్రపంచంలో ఎక్కడ నుండైనా మీ క్రెడిట్ కార్డు మీద అంతర్జాతీయ లావాదేవీలు చేయటానికి అవకాశముంటుంది. కాబట్టి మీరు అర్జంటుగా చేయవలసిన పని మీ క్రెడిట్ కార్డు వెనుక భాగంలో చివర్లో రాయబడి ఉన్న సివివి నెంబర్‌ని కొట్టివేయడం. అలాగే బయట ఇతరులకు మీ కార్డు చేతికిచ్చి ఆ సివివి నెంబర్ చెప్పకుండా ఉండడం. మనం నేరుగా ఇలా ఫిజికల్‌గా మాత్రమే కాదు, ఆన్‌లైన్‌లో కూడా ఇలాంటి సమాచారాన్ని ఇచ్చేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి. ఈ సైట్లో పడితే ఆ సైట్లో ఈ అతి ముఖ్యమైన సమాచారం ఇచ్చామంటే గనుక మన డబ్బులు గోవిందా!

ప్లెయిన్ టెక్స్ట్‌లో..

ఇప్పటికీ చాలామంది తమ పాస్‌వర్డ్‌లు, డెబిట్, క్రెడిట్ కార్డ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వివరాలు తమకు తాము మెయిల్ పంపించుకోవడం ద్వారాగానీ, లేదా తమ ఫోన్లో ప్లెయిన్ టెక్స్ట్ గానీ సేవ్ చేసుకుంటూ ఉంటారు. అవసరమైనప్పుడు సులభంగా అందుబాటులో ఉంటాయి అన్నది వీరి భావన. అయితే ప్రతిరోజూ మనం కొత్తగా ఫోన్లో ఇన్‌స్టాల్ చేసే పలు రకాల అప్లికేషన్లు మన ఫోన్ స్టోరేజ్ పర్మిషన్ కోరుతూ ఉంటాయి. ఇలా ఏదైనా ప్రమాదకరమైన అప్లికేషన్‌కి మీరు పర్మిషన్ ఇచ్చారంటే, అది మీ ఫోన్లో భద్రపరచుకున్న యూజర్‌నేమ్ పాస్‌వర్డ్‌లు, క్రెడిట్ కార్డు నంబర్లు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వివరాలు అన్నింటినీ హ్యాకర్లకి చేరవేస్తూ ఉంటుంది. దాంతో అవి దుర్వినియోగం చేయబడే ప్రమాదం చాలా ఎక్కువగా ఉంటుంది. అందుకే సాధ్యమైనంత వరకూ ఫోన్లోనూ, మెయిల్ మెసేజ్‌లలోనూ ముఖ్యమైన సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ భద్రపరచుకోకండి. ఇలాంటి సున్నితమైన సమాచారాన్ని స్టోర్ చేసుకోవాలంటే లాస్ట్‌పాస్ వంటి ప్రత్యేకమైన పాస్‌వర్డ్ మేనేజర్ అప్లికేషన్లను ప్రయత్నించడం మంచిది. అవి ఎన్‌క్రిప్టెడ్ పద్ధతిలో మీ డేటాని సురక్షితంగా భద్రపరుస్తాయి. మన ముఖ్యమైన డేటాని జాగ్రత్తగా ఉంచుకోవాల్సిన బాధ్యత ఎప్పుడూ మనదే. మనం అశ్రద్ధ చేస్తే గనుక ఖచ్చితంగా దానికి తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది.



నల్లమోతు శ్రీధర్
fb.com/nallamothusridhar

టెక్ సందేహాలు

ఆ నెంబర్ రీస్టోర్ చేసుకోవచ్చా?

నేను వాడుతున్న వాట్సాప్ నంబర్ మిస్ అయింది. వాట్సప్ ఛాట్‌తో పాటు మళ్లీ వెరిఫికేషన్ అవసరం లేకుండా ఆ నెంబర్‌ను కూడా రీస్టోర్ చేసుకునే అవకాశం ఏదైనా ఉందా?

- వినీల్‌కుమార్, కావలి



డీఫాల్ట్‌గా వాట్సప్ ఛాట్ మనం లింకు చేసిన గూగుల్ డ్రైవ్ అకౌంట్లోకి బ్యాకప్ తీయబడుతుంది. అయితే ఈ బ్యాకప్‌లో కేవలం మన పంపించిన టెక్స్ట్ మెసేజ్ లు, ఫోటోలు వీడియోలు లాంటివి మాత్రమే భద్ర పరచబడుతుంటాయి. మీరెప్పుడైనా ఆ బ్యాకప్‌ని రీస్టోర్ చేయాలంటే కొత్తగా వాట్సప్ ఇన్‌స్టాల్ చేసి అకౌంట్ వెరిఫికేషన్ పూర్తయిన తర్వాత ఇప్పటికే తీయబడి ఉన్న బ్యాకప్ గుర్తించబడుతుంది. దాన్ని ఎంపిక చేసుకుంటే అది రీస్టోర్ చేయబడుతోంది. మామూలు పద్ధతిలో వెరిఫికేషన్‌కి ముందు బ్యాకప్‌ని రీస్టోర్ చేయడానికి సాధ్యపడదు. అయితే ఇక్కడ ఓ చిన్న టెక్నిక్ ఫాలో కావచ్చు. మీ ఫోన్‌ని రూట్ చేసుకుని టైటానియమ్ బ్యాకప్ అనే అప్లికేషన్ ఇన్‌స్టాల్ చేసుకుని ఇప్పటికే మీ ఫోన్లో వాడబడుతున్న వాట్సప్‌తో పాటు దాని డేటాను కూడా బ్యాకప్ తీసుకోవచ్చు. తిరిగి అదే అప్లికేషన్ ద్వారా రీస్టోర్ చేసేటప్పుడు మళ్లీ వెరిఫికేషన్ కోరకుండానే మీ వాట్సప్ అకౌంట్ పూర్తిగా వచ్చేస్తుంది. అయితే వాట్సాప్ తాజా వెర్షన్లలో ఇది సాధ్య పడదు. ఇంటర్నెట్లో కొద్దిగా పాత వాట్సప్ వెర్షన్ వెతికి పట్టుకొని దానిద్వారా ప్రయత్నించండి. పాత వెర్షన్ ద్వారా మాత్రమే మీ వాట్సప్ నెంబర్‌తో సహా, వాట్సాప్ ఛాట్ మొత్తాన్ని కూడా రీస్టోర్ చేసుకోవడానికి వీలవుతుంది.

పబ్లిక్ వై-ఫై ప్రమాదమా?

పబ్లిక్ వై-ఫై నెట్‌వర్క్‌లకు కనెక్ట్ కావద్దని ఈమధ్య చాలా మంది చెబుతున్నారు. అసలు పబ్లిక్ వై-ఫైకి కనెక్ట్ ఐతే ఇబ్బందేంటో తెలుపగలరు.

- రాజశేఖర్, వరంగల్



కొంతమంది హ్యాకర్లు కావాలని తమ వై-ఫై నెట్‌వర్క్‌కి పాస్‌వర్డ్‌పెట్టరు. దీంతో చాలామంది వై-ఫై ఫ్రీగా వస్తోందని వెనకా ముందు ఆలోచించకుండా దానికి కనెక్ట్ అవుతుంటారు. హ్యాకర్లకు కావాల్సింది కూడా అదే. ఇలాంటి ప్రమాదకరమైన వైఫై నెట్‌వర్క్‌కు మీరు కనెక్ట్ అయిన వెంటనే ఇక మీ ఫోన్ ద్వారానూ, ల్యాప్‌టాప్ ద్వారానూ ఇంటర్నెట్‌కి కనెక్ట్ అయి పంపించే డేటా పాకెట్లు అన్నీ ఆ నెట్‌వర్క్‌ని క్రియేట్ చేసిన హ్యాకర్‌కి వెళ్లిపోతుంటాయి. ఈ పాకెట్లలో మీరు ఎంటర్ చేసిన యూజర్‌నేమ్, పాస్‌వర్డ్‌లు కూడా నిక్షిప్తమై ఉంటాయి. పాకెట్ అనలైజర్లు అనే ప్రత్యేకమైన టూల్స్ నుపయోగించి మీ నుండి ఇంటర్నెట్‌కీ, ఇంటర్నెట్ నుండి మీకు ప్రసారం చేయబడే మొత్తం డేటాలోని కీలకమైన సమాచారాన్ని హ్యాకర్లు తస్కరిస్తుంటారు. కాబట్టి వీలైనంతవరకు అసలు సెక్యూరిటీ లేని పబ్లిక్ వై-ఫై నెట్‌వర్క్‌లకు అసలు కనెక్ట్ అవకపోవడమే సురక్షితం.

మీ టెక్ సందేహాలకు సమాధానాల కోసం navya@andhrajyothy.com

అలాంటి కీబోర్డ్‌లతో నష్టమా?

ఫోన్‌లో ఏవైనా కీబోర్డులు ఎనేబుల్ చేసేటప్పుడు మీ పర్సనల్ సమాచారం ఇవి సేకరిస్తాయి అని ఒక వార్నింగ్ మెసేజ్ చూపించబడుతుంది కదా. అంటే కీబోర్డ్‌ల వల్ల ఏదైనా నష్టం ఉంటుందా?

- శ్రీనివాసులు, వైజాగ్

సహజంగా స్విఫ్ట్‌కీ, జీబోర్డ్ వంటి వివిధ రకాల ఆండ్రాయిడ్ కీబోర్డ్ అప్లికేషన్ల ద్వారా మనమేమైనా కీలను ప్రెస్ చేసినప్పుడు ఆయా అప్లికేషన్ల ద్వారా మాత్రమే మనం ఎంటర్ చేసే కీలకమైన పాస్‌వర్డ్‌లు, ఇతర డేటా వెబ్‌సైట్లకు, ఇతర అప్లికేషన్లకు చేర్చబడుతుంది. ఈ నేపథ్యంలో మీ డేటా ఆ కీ బోర్డు సేకరిస్తుంది అని చూపించడం ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్ యొక్క కనీస బాధ్యత. అందుకే మనకు ఫోన్ స్క్రీన్ మీద ఇలాంటి మెసేజ్ కన్పిస్తుంది. అంతే తప్పించి పెద్దగా మన ఆందోళన చెందాల్సిన పనిలేదు. అయితే పెద్దగా మనకు పరిచయం లేని, కొత్తగా తయారు చేయబడిన, సరైన రేటింగ్‌లు లేని కీబోర్డ్ అప్లికేషన్ల విషయంలో జాగ్రత్తగా ఉండడమే మంచిది. మిగతా వాటి గురించి పెద్దగా భయపడాల్సిన పనిలేదు.



టెక్ న్యూస్

మీ ఫేస్‌బుక్ డేటా డౌన్‌లోడ్ చేసుకోండి!

'కేంబ్రిడ్జ్ అనలిటికా' (ఫేస్‌బుక్ అనుబంధ సంస్థ) స్కామ్ ఇచ్చిన షాక్ ప్రపంచాన్ని కుదిపేస్తోంది. ఫేస్‌బుక్‌పై మాయని మచ్చ వేసింది. సామాజిక మాధ్యమాల్లో మన సమాచారం ఎంత వరకూ సురక్షితం అన్న అనుమానాలను రేకెత్తించింది. అసలు డేటా చూస్తే చాలు... మన సమాచారం ఎందుకు అంతలా 'ఖరీదు' చేస్తున్నారో అర్థమైపోతోంది. మనం ఎక్కడికి వెళ్లామో... ఏం చేస్తున్నామో...? ఎక్కడికి వెళుతున్నామో? ఏ సినిమాకు వెళ్లామో! ఎవరి మీద కామెంట్ చేశామో! ఇలా మన ఇష్టాయిష్టాలు... వగైరా ఇవన్నీ మనల్ని అంచనా వేయడానికి ఉపయోగిస్తారు. చక్కగా ట్రాప్‌లో పడేస్తారు! మరి ఈ డేటాను అంతా మీరు ఒకే చోట చూసుకోవాలని ఉందా? మీరే డౌన్‌లోడ్ చేసుకోవచ్చు, అదెలాగంటే!

స్టెప్ 1: ఫేస్‌బుక్ సెట్టింగ్స్‌లోకి వెళ్లి 'డౌన్‌లోడ్ ఎ కాపీ ఆఫ్ ఫేస్‌బుక్ డేటా' అనే ఆప్షన్‌ను క్లిక్ చేయండి. మొత్తం మీ డేటాను జిప్ ఫైల్‌గా మార్చి, మీ ఈ-మెయిల్ అడ్రస్‌కు పంపిస్తుంది.



స్టెప్ 2: మీ మెయిల్‌కు రెండు ఈ-మెయిల్స్ వస్తాయి. ఒకటి 'కన్‌ఫర్మేషన్ మెయిల్', రెండు 'యాక్చువల్ లింక్'. ఈ 'యాక్చువల్ లింక్'ను క్లిక్ చేస్తే మళ్లీ ఫేస్‌బుక్‌లోకి ఎంటరవుతాం. అప్పుడు ఓ డైలాగ్ బాక్స్ ఓపెన్ అవుతుంది. అందులో 'డౌన్‌లోడ్ ఆర్కైవ్' అనే పచ్చరంగు బటన్‌ను క్లిక్ చేయండి. అంతే జిప్‌ఫైల్ ఫార్మేట్‌లో ఉన్న డేటా మీ సిస్టంలోకి డౌన్‌లోడ్ అయిపోతుంది.

టెక్ యాప్

ఎప్పుడైనా..ఎక్కడైనా వినేద్దాం!

ఎక్కడైనా, ఎప్పుడైనా మొబైల్‌లో ఉచితంగా, అన్‌లిమిటెడ్‌గా మ్యూజిక్ వినాలంటే గానా.కామ్‌ని ఎంచుకోవాల్సిందే. ఇందులో మీకు నచ్చే పాటలు లక్షల్లో అందుబాటులో ఉంటాయి. తెలుగు పాటలతోపాటు బాలీవుడ్, తమిళం, మరాఠి, కన్నడ, పంజాబీ భాషల పాటలు అందుబాటులో ఉన్నాయి. మీకు నచ్చిన పాటలు విరామం లేకుండా వినాలంటే గానా రేడియోను ఎంచుకుంటే చాలు. గాన్ యాప్‌ను ఎంచుకుంటే నిర్విరామ సంగీతం మీ వెంటే ఉంటుంది. ఇందులో 30 లక్షలకు పైగా పాటలు ఉన్నాయి. వెయ్యికిపైగా ప్లేలిస్టులున్నాయి. ఫేస్‌బుక్, ట్విట్టర్, ఈమెయిల్ ద్వారా స్నేహితులతో మ్యూజిక్‌ను షేర్ చేసుకోవచ్చు.



బీ కేర్‌ఫుల్

కెమెరా కళ్లే మోసం చేస్తాయి!

ల్యాప్‌టాప్ ముందు కూచుంటారు... కానీ మీకు తెలియకుండానే మీ డేటా ఎగిరిపోతుంది! చేతిలో స్మార్ట్‌ఫోన్ అలానే ఉంటుంది. కానీ స్మార్ట్‌ఫోన్ హ్యాక్ అయిపోతుంది. ఇంట్లోకి దొంగలు వస్తారని, ఆఫీసులో నిఘా వేద్దామని సీసీ కెమెరాలు వినియోగిస్తారు. అయితే అవి కూడా మీ గుట్టును రట్టు చేస్తాయి. దొంగ చేతికి తాళాలు ఇస్తాయి. ఆ మధ్య కాలంలో ఓ హాలీవుడ్ సినిమా వచ్చింది. అందులో 'గాడ్స్ ఐ' అనే చిన్న పరికరంతో ఫోన్ కెమెరాలు, సీసీ టీవీ కెమెరాలన్నిటినీ హ్యాక్ చేస్తారు విలన్లు. తెరపై చూడటానికి బాగానే ఉంటుంది. కానీ ఆ ఊహ నిజమైతే!! ఇప్పుడు ఆ ప్రమాదం పొంచి ఉందని క్యాస్పర్‌స్కై యాంటీవైరస్ లాబ్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. స్మార్ట్‌ఫోన్ కెమెరాలను, సీసీటీవీ కెమెరాలను హ్యాక్ చేసే అవకాశం ఉందని వారు అంటున్నారు. పైగా చాలా స్మార్ట్ కెమెరాలను ఈజీగా హ్యాక్ చేసేయచ్చన్నది నిపుణుల మాట.

సీరియల్ నెంబర్ తెలిస్తే చాలు!

ముఖ్యంగా కొరియా కంపెనీ హన్వా టెక్విన్ తయారుచేసే స్మార్ట్‌ఫోన్ల కెమెరాలకు ఈ బెడద ఉందని తేలింది. ఈ కెమెరాల్లోని వీడియో, ఆడియో ఫీడ్స్ సహాయంతో ఆ స్మార్ట్‌ఫోన్లను కొంతసేపు పనిచేయకుండా చేసి, డేటాను తస్కరిస్తారట. ఇక ప్రతి కెమెరాకు సీరియల్ నెంబర్ ఉంటుంది. ఆ సీరియల్ నెంబర్‌ను సదరు కెమెరాకు ఎలా ఇస్తారో తెలుసుకుంటే చాలు వెంటనే ఆ ఫోన్‌ను హ్యాక్ చేయడం అంతకష్టమేం కాదు!! క్లౌడ్ సర్వర్లతో కనెక్ట్ అయిన కెమెరాలను ఇంకా సులువుగా హ్యాక్ చేయవచ్చట!




మరి ఏం చేయాలి?

- ఎప్పటికప్పుడు మీ పాస్‌వర్డ్‌ని మార్చుకొంటూ ఉండాలి.
- ఆ పాస్‌వర్డ్ కూడా మీకు గుర్తుండేలా, ఎదుటివారు ఊహించని విధంగా ఉండాలి.
- సీసీటీవీ కెమెరాలను కొనుగోలు చేసేటప్పుడు వాటి పనితీరును పూర్తిగా పరిశీలించి కొనుగోలు చేయండి. అలాగే వాటి మీద ఏమైనా సందేహం వస్తే ఆన్‌లైన్‌లో వీటి గురించి చెక్ చేయండి


బతుకులో పోగొట్టుకున్న ఆనందాన్ని కవిత్వంలో వెతుక్కొన్నవాడు జాన్ కీట్స్. ఇతడి జీవితమంతా కష్టాలే....కన్నీళ్లే! కీట్స్ జీవించింది పాతికేళ్లే. అయితేనేం ప్రకృతిలోని ప్రతి అణువులోనూ అందాల్ని తడిమితడిమి చూసుకొన్నాడు. కీట్స్ పుట్టింది లండన్‌లో... 1795లో. తండ్రి థామస్ గుర్రాల కాపరి. తల్లి ఫ్రాన్సిస్‌జెన్నింగ్స్-ధనవంతుల అమ్మాయి. ఆమెకు అంతగా ఇష్టంలేని పెళ్లది. కీట్స్‌కి ఎనిమిదేళ్లప్పుడు గుర్రంపై నుంచి పడి నాన్న మరణించాడు. ఆపై రెండు నెలలకు తల్లి వేరే పెళ్లి చేసుకొని వెళ్లిపోయింది. అమ్మ కీట్స్ వెక్కి వెక్కి ఏడ్చేవాడు. నైరాశ్యంతో తనలో తానే ముడుచుకుపోయేవాడు.


కవితా ప్రణయవిహారి


లైఫ్‌లెసన్




అంతలో తల్లి తిరిగొచ్చింది- రెండో పెళ్లి విఫలమవడంతో! ఒంటరిగా దీనంగా పైగా క్షయవ్యాధితో వచ్చిన అమ్మను చూస్తే దుఃఖం పొంగుకొచ్చింది. అయినా బాధ్యత మోశాడు. తల్లిని కంటికి రెప్పలా చూసుకొన్నాడు. రాత్రిళ్లు కూడా మేల్కొని ఉండి సేవలు చేసేవాడు. నవలలు చదివి వినిపించేవాడు. చివరకు ఆమె కన్నుమూసింది. 14 ఏళ్ల కీట్స్ చుట్టూ విషాదం. నా అన్నవాళ్లు లేక దుర్భరజీవితం అనుభవించాడు. ఒంటరితనం, ఆవేదన, అసంతృప్తి, అసహనం! చనిపోవాలనిపించేంత బాధ. అలాంటి బాధలో కీట్స్‌కు పుస్తకాలు తోడయ్యాయి. సాహిత్యం చదివితే జీవితం రసరమ్యమవుతుందని కీట్స్‌కి అర్థమైంది. అప్పటికే ఆంగ్లంలో వచ్చిన పునరుజ్జీవన సాహిత్యం, భావకవిత్వం కీట్స్‌ను విశేషంగా ఆకర్షించాయి. అందులోని ప్రణయతత్వం కీట్స్‌ను ఉన్మత్తుణ్ణి చేసింది. వాస్తవ జీవిత సంక్షోభం నుంచి పారిపోయి ఊహాజగత్తులో విహరించేలా చేసింది.









19 ఏళ్ల కీట్స్- తన ఎదలోకి దూసుకొచ్చే భావాల్ని కవిత్వంగా మలచడం మొదలుపెట్టాడు. 1816లో 'ఎగ్జామినర్' అనే పత్రికలో కీట్స్ రాసిన 'ఓ సాలిట్యూడ్' ప్రచురితమైంది. తొలిసారి అచ్చులో తన కవిత చూసుకొని పరవశుడైపోయాడు. ఆ మరుసటి సంవత్సరం కీట్స్ తొలి పుస్తకం 'పోయమ్స్' ప్రచురణకి నోచుకుంది. కానీ దీన్ని విమర్శకులు దుమ్మెత్తి పోశారు. ఇది కీట్స్ సున్నితహృదయాన్ని గాయపరిచింది. అలాంటి నిరాశాస్థితిలో కీట్స్‌కి పరిచయమైంది ఇజాబెల్లా జోన్స్. ఆమె చాలా అందగత్తె. పైగా సాహిత్యం అంటే చాలా ఇష్టం. ఇద్దరికీ సాన్నిహిత్యమైంది. ఎన్నెన్నో ఊసులు. ఆమె సాంగత్యంలో ప్రణయోపాసకుడయ్యాడు కీట్స్. ఆమెనే అభివర్ణిస్తూ కవితలు రాశాడు.

అప్పుడే 'ఎండిమియాన్' అనే కావ్యరచనకు పూనుకొన్నాడు. నాలుగువేల పాదాల దీర్ఘకవిత అది. ఇది 1818లో ముద్రితమైంది. దీనిపై ఎన్నో ఆశలు పెట్టుకొన్నాడు. తీరా ఈ కావ్యాన్ని కూడా విమర్శకులు ఈసడించుకొన్నారు. 'ఇంతకన్న దిగువస్థాయి కవిత్వం రాయలేరు. రాస్తే మళ్లీ కీట్స్ రాయాలి' అని శాపనార్థాలు పెట్టారు.

భరించలేకపోయాడు కీట్స్. అందరికీ దూరంగా వెళ్లిపోయి, వెక్కివెక్కి ఏడవాలనుకున్నాడు. హేంప్‌స్టడ్ ప్రాంతానికి వలసవెళ్లాడు. లండన్‌కి నలభై మైళ్ల దూరంలోని లోయ ప్రదేశమది. అక్కడ కీట్స్ ఇంటి పక్కనే 16 ఏళ్ల ఫ్యానీబ్రాన్ అనే అమ్మాయి ఉండేది. తొలిచూపులోనే ప్రేమ పుట్టింది ఇద్దరి మధ్య. తీవ్ర డిప్రెషన్‌లో ఉన్న ఇతగాడికి ఆమె చనువు దుఃఖోపశమనమైంది. కలిసి పాడి, ఆడి చదువుకొనేవారు. ఒంటరిగా ఆమె గదికి వెళ్తుండేవాడు. అతని కోసం ఆమె ఎప్పుడూ ఉండేది ఒంటరిగా!

ఆమెను వివాహం చేసుకోవాలనుకున్నాడు. కానీ ఆమె తల్లి ఒప్పుకోలేదు. మళ్లీ ప్రణయభంగం. ఆమెతో గడిపిన క్షణాల్ని తలుచుకొంటూ శూన్యంలో ఉండిపోయాడు. ప్రణయమ్ము తపు ఆనందం, అంతలోనే విషమైన విధం, ఆ విషాదం ఏదో తెలీని సుఖాన్నిస్తున్న వింత అనుభూతి, సౌందర్య నైరాశ్యాలు పెనవేసుకుపోయిన వైనం- ఇవన్నీ కవితా కుసుమాలుగా విచ్చుకొన్నాయి కీట్స్ హృదయవనంలో! ఫ్యానీని ప్రేమించినప్పటి వివిధ దశల్ని, ప్రణయభంగంలోని అంతర్దశల్ని కవితీకరించాడు. ప్రణయతిరస్కారం ఎంతటి నరకమో వివరిస్తాడు- 'ఓడ్ టు ఫ్యానీ'లో! లామియా అనే కవితలో ఫ్యానీ తనను ఓ సర్పకన్యలా కాటేసి వెళ్లిపోయిందనీ, ఇప్పుడు దుఃఖం మాటేసి కూచుందని వాపోతాడు. "దుఃఖం నా ఆనందధామంలోకి ప్రవేశించింది" అని కీట్స్ 'ఓడ్ టు మెలాంఖలీ'లో అంటాడు. 'నా మరణశయ్య నేనే పరుచుకొంటున్నాను' అంటాడు 'ఓడ్ టు ఎ నైటింగేల్'లో. ప్రేమకు వివేకంతో పని లేదు అంటాడు 'ఓడ్ టు సైకీ'లో.

ఈ కవితలన్నీ సాహిత్యప్రపంచాన్ని కుదిపేశాయి. గతంలో విమర్శించిన వారే 'ఇకపై ఇంత గొప్ప కవిత్వం రాబోదు' అన్నారు కీట్స్ కవిత్వాన్ని నెత్తిపై పెట్టుకొన్నారు. ఆ అక్షరాలను గుండెలకు హత్తుకొన్నారు.

అంతలో మరో దుఃఖం. 1820లో కీట్స్ క్షయవ్యాధికి గురయ్యాడు. కన్నీటి పర్యంతమయ్యాడు. లండన్ వదిలి ఇటలీ వెళ్లిపోయాడు. రోమ్‌లో నరకం చూశాడు. వ్యాధి ముదిరిపోయింది. పట్టుమని పాతికేళ్లయినా లేవు. నడవలేని, రాయలేని, మాట్లాడలేని, చివరికి పుస్తకం తీసి చదవలేనంత నీరసం. హేంప్‌స్టడ్ నుంచి ఫ్యానీ రాసే ఉత్తరాలే కీట్స్‌కి ఆనందకారకాలు. చివరకు 1821లో కీట్స్ ప్రాణదీపం ఆరిపోయింది.

ఫ్యానీ రాసిన లేఖలు, ఆమె జుట్టు, ఒక పర్స్ తనతో పాటు సమాధి చేయమన్నాడు కీట్స్. సమాధిపై తన పేరు రాయొద్దన్నాడు. అయితేనేం- భావుకుల గుండెల్లో కీట్స్ ఎప్పటికీ నిలిచే ఉంటాడు!



- ఆకెళ్ల రాఘవేంద్ర

కౌన్సెలింగ్ కార్నర్

భర్తగా స్వీకరించలేకపోతున్నా!

పెళ్లయిన రెండేళ్లకే ఒక రోడ్డు ప్రమాదంలో నా భర్త చనిపోయాడు. అప్పటికి నాకింకా సంతానం కూడా కలగలేదు. మా ఇద్దరి మధ్య ఎంతో గాఢమైన ప్రేమ ఉండేది. ఆ జ్ఞాపకాలతోనే ఆ తర్వాత నాలుగేళ్లూ గడిచిపోయాయి. కానీ, అయిన వాళ్లందరి నుంచీ, మళ్లీ పెళ్లి చేసుకొమ్మనే ఒత్తిళ్లు రోజురోజుకూ పెరిగిపోయాయి. ఆ మాటలు విని విని, చివరికి సరేనన్నాను. ఓ విడాకులు తీసుకున్న వ్యక్తితో నాకు మళ్లీ పెళ్లి చేశారు. నేను అతనితో సహజీవనమైతే చేస్తున్నాను. కానీ, మానసికంగా అతణ్ని నా భర్తగా స్వీకరించలేకపోతున్నాను. ఈ స్థితిని అధిగమించే మార్గం ఏమైనా ఉంటే చెప్పండి!

- ఎన్. సారిక, విశాఖపట్నం

ఒక జీవితం ఒకరికే అంకితం అనే నైతిక విలువలున్న సమాజం మనది. ఆ విలువలు గొప్పవే. కానీ, ఆ బంధాలు శాశ్వతంగా ముగిసిపోయిన తర్వాత కూడా ఆ విలువలనే పట్టుకువేళ్లాడటంలో అర్థం ఏముంటుంది? ఆ బంధాల్ని ఎంతగా ప్రేమించినా, ఏ కారణంగానో అవి తెగిపోయాయి కదా! ఎల్లకాలం ఏడుస్తూ కూర్చుంటే జీవితం గడవదు కదా! ఎంత కాదన్నా, రెండవ పెళ్లికి సంబంధించి లోలోపల ఒక సంఘర్షణ ఉంటుంది. కాకపోతే ఈ సంఘర్షణ ఎప్పటికీ అంతే తీవ్రంగా ఉండదు. ఒక దశలో అదంతా అదృశ్యమై, కొత్త జీవితంలో పూర్తి స్థాయిలో ఒదిగిపోతారు. అయినా, మీ జీవితంలో వెలితి ఉంది, అతని జీవితంలోనూ వెలితి ఉంది. మీ బంధం పరస్పర అవసరమైనదే. ఇతరుల ఒత్తిడి వల్లే మీరు ఈ పెళ్లికి ఒప్పుకున్నారనడంలో పూర్తి నిజం లేదు. మీ అంతరాంతరాళాల్లో బీజరూపంలోనే కావచ్చు కొత్త జీవితం గురించిన ఏదో ఒక ఆలోచన ఎప్పుడో మొదలైంది. అదే మిమ్మల్ని ఆ దిశగా అడుగులు వేయించింది. ఆ అడుగులు అర్థంలేనివేమీ కావు. ఈ పెళ్లి ద్వారా మీ మొదటి భర్తకు మీరేమీ ద్రోహం చేసినట్లు కానేకాదు. పైగా అతడు మిమ్మల్ని ఎంతగానో ప్రేమించిన వ్యక్తిగా మీ సంతోషాన్నే కోరుకుంటాడు కదా! ఈ పెళ్లి ద్వారా మీ జీవితంలోకి సంతోషం ప్రవేశిస్తే, అది ఆయనకు మాత్రం ఆనందదాయకం కాదా! మీరు వేసిన అడుగు ఏ రకంగా చూసినా పాజిటివే. అందువల్ల



మీ జీవితం పాజిటివ్‌గానే వెళుతుందనే నిజాన్ని గ్రహించండి చాలు..! మీ మానసిక కల్లోలమంతా మెల్లమెల్లగా కరిగిపోయి ఒక దశలో కనుమరుగవుతుంది.

- డాక్టర్ ప్రవీణ్‌కుమార్ చింతపంటి,
కన్సల్టెంట్ సైకియాట్రిస్ట్, హైదరాబాద్.

మీకు మీరే డాక్టర్



రక్తహీనత నుంచి మునగతో ముక్తి

- మునగ చెట్టు ఆకులు, పువ్వులు కలిపి కూరగా వండుకుని తింటూ ఉంటే, రక్తహీనత తగ్గుతుంది.
- 10 గ్రాముల మునగ వేరు ముద్దను కొద్దిపాటి నీళ్లలో ఉడికించి, కొద్ది రోజుల పాటు తాగితే మూత్రపిండాల్లోని రాళ్లు కరిగిపోతాయి.
- 50 మి.లీ. మునగ పట్ట కషాయంలో 1 స్పూను తేనె, 1 స్పూను వాయు-విడంగాల చూర్ణం కలిపి రెండు పూటలా తాగుతూ ఉంటే, పేగుల్లోని క్రిములు నశిస్తాయి.
- రెండు మూడు చుక్కల మునగాకు రసాన్ని చెవిలో వేస్తే, చెవిపోటు తగ్గుతుంది.
- 50 మి. లీ మునగ పట్ట కషాయాన్ని ప్రతి రోజూ రెండు పూటలా సేవిస్తూ ఉంటే, గుండెకు బలం చేకూరుతుంది.
- 30 మి.లీ మునగాకు రసాన్ని ప్రతి రోజూ సేవిస్తూ, ఆహారంతో పాటు తాజా ఆకులను కూరల్లో వాడుతుంటే, రక్తపోటు అదుపులో ఉంటుంది.
- 30 మి. లీ వేరు కషాయాన్ని రోజూ రెండు పూటలా సేవిస్తూ, మునగ గింజల తైలాన్ని కీళ్ల నొప్పులు ఉన్న చోట మర్దన చేస్తూ ఉంటే, కీళ్లనొప్పులూ, కాళ్లూ, చేతుల నొప్పులూ తగ్గుతాయి.
- మునగ ఆకులతో తయారు చేసిన కట్టును ప్రతి రోజూ తాగుతూ ఉంటే, ఉబ్బస వ్యాధి ఉపశమిస్తుంది.

నవజీవనగీతం



ఎంత దాచినా... తెలిసేపోతుంది!!

ప్రేమోద్వేగంలో ఉన్నవాళ్లు మాత్రమే ప్రేయసీ ప్రియులను గొప్పగా చూస్తారు. ప్రేమలో భంగపడిన వాళ్లకూ, ప్రేమ ఒక చేదు అనుభవంగా మిగిలిన వాళ్లకూ, లేదా ఆ దశను దాటేసిన వాళ్లకూ ప్రేమ గొప్పగా ఏమీ అనిపించదు. అదొక అత్యంత అల్ప విషయంగా, నిరర్థకంగా అనిపిస్తుంది. ఇలాంటి వాళ్లల్లో చాలామంది ఎవరైనా ప్రేమలో పడటాన్ని సహించలేరు. పైగా ప్రేమను అడ్డుకోవాలని కూడా చూస్తారు. మొత్తంగా చూస్తే, ప్రేమను ఆశీర్వదించేవారి కన్నా, ప్రేమను ఆటంకపరిచేవారే లోకంలో ఎక్కువ. అందుకే ప్రేమికుల్లో చాలా మంది ఈ ఓర్వలేని లోకంతో ఎందుకులే అనుకుని, తమ ప్రేమయానాన్ని ఎవరికీ కనపించకుండా కొనసాగిస్తూ ఉంటారు. 1997లో విడుదలైన 'పర్‌దేస్' సినిమా కోసం ఆనంద్ బక్షీ రాసిన ఈ పాటలో ఈ కోణమే కనిపిస్తుంది. నదీమ్- శ్రావణ్ ఈ గీతానికి అల్లిన బాణీకి కుమార్ సాను అద్దిన స్వర మధురిమలు మనోహరం.

❖❖❖

దో దిల్ మిల్‌రహే హైఁ - మగర్ ఛుప్‌కే - ఛుప్‌కే
సబ్‌కో హోరహీ హై - ఖబర్ ఛుప్‌కే ఛుప్‌కే

(రెండు మనసులు కలుస్తున్నాయి. కానీ, చాటుమాటుగా
అయినా, అందరికీ వార్త అందుతూనే ఉంది చాటుమాటుగా)



కుమార్ సాను

నిజానికి, ప్రేమంటే గిట్టని వాళ్లు, ప్రేమను మనసులోనే ద్వేషించుకుంటూ అలా ఉండిపోరు. ఎవరెవరు ఎక్కడెక్కడ ప్రేమలో పడుతున్నారా అని నలువైపులా పరిశీలిస్తూనే ఉంటారు. ఎప్పుడో ఒకప్పుడు ఏదో ఒక వైపు నుంచి ఆ సమాచారం వాళ్ల చెవిన పడుతూనే ఉంటుంది. ప్రేమికుల హృదయాలు ఎంత గుట్టు చప్పుడు కాకుండా వ్యవహరిస్తున్నా, ఆ హృదయాల్ని మోసే శరీరాలు నడిచేది ఈ నేల మీదే కదా! అందువల్ల ఎప్పుడో ఒకప్పుడు, ఏదో ఒక సమయాన, ఎవరో ఒకరి కంట పడకుండా ఉంటారా? ప్రేమికుల భయమంతా ఇదే మరి!!

❖❖❖

సాంసో మే బడీ బేకరారీ - ఆంఖో మే రాత్ జగే
కభీ కహీఁ లగ్‌జాయే దిల్ తో- కహీఁ ఫిర్ దిల్ నా లగే
అప్నా దిల్ మై జరా థామ్ లూఁ - జాదూ కా మై ఇసే నామ్ దూఁ
జాదూ కర్ రహా హై - అసర్ ఛుప్‌కే - ఛుప్‌కే /దో దిల్ /

(శ్వాసలో ఏదో పెద్ద అలజడి - కళ్లల్లో రాత్రి జాగరణ
ఎక్కడైనా మనసులు ఒకసారి కలిస్తే, ఇక దేని మీదా మనసు నిలవదు
నా మనసున్నేను కాస్త సంబాళించుకుంటా! నేనైతే ఇదంతా ఒక మంత్రమే అంటా
ఆ మంత్రం ప్రభావితం చేస్తూనే ఉంది... కాకపోతే చాటుమాటుగా)

ఎంత తప్పించుకు తిరుగుతున్నామనుకున్నా, ఎక్కడ ఎవరి కంటబడతామోనన్న ఆందోళన ప్రేమికుల్ని అనుక్షణం వెంటాడుతూనే ఉంటుంది. ఆ స్థితిలో వాళ్లకు కంటి మీద కునుకు పడుతుందా? ఇలాంటివన్నీ కంటక ప్రాయంగా అనిపిస్తున్నా, ఒకసారి మనసు పారేసుకున్నాక అది మళ్లీ వెనక్కి తిరిగి వచ్చేస్తుందా? దాని దృష్టి ఇంకోవైపు పడుతుందా? అయినా, ఇంకోవైపు చూడటానికి వాళ్లకు ప్రేమలోకం తప్ప మరొకటి కనిపిస్తేగా! ప్రేమమంత్రం అంత శక్తిమంతమైంది మరి! కాకపోతే ఆ మంత్ర ప్రభావం కూడా చాటుమాటుగానే వచ్చిపడుతుంది సుమా!

❖❖❖

ఐసే భోలే బన్ కర్ హై జైసే - జైసే కోయీ బాత్ నహీఁ
సబ్ కుచ్ నజర్ ఆ రహా హై - దిన్ హై యే రాత్ నహీఁ
క్యా హై కుచ్ భీ నహీఁ హై అగర్ - హోటోఁ పే హై ఖామోషీ మగర్
బాతే కర్ రహీ హై - మగర్ ఛుప్‌కే ఛుప్‌కే / దో దిల్ /

(బేలవై ఎలా కూర్చున్నావూ అంటే, అసలు మాట్లాడే విషయమే లేనట్లు
అయినా అంతా తెలిసిపోతూనే ఉంది - ఇది పగలే... రాత్రేమీ కాదుగా
ఒకవేళ విషయమేదీ లేదన్నా, పెదాల పైన నిశ్శబ్దమే ఉన్నా
మాటలు నడుస్తూనే ఉన్నాయి - కాకపోతే చాటుమాటుగా)

విషయం ఒక స్థాయిలో ఉన్నప్పుడు మాత్రమే, ఎవరైనా ఏదైనా మాట్లాడతారు. అది ఇంకా ఎత్తుకు వెళ్లిపోయి మరింత విస్తృతమయ్యాక మాటలు అశక్తమై ఆగిపోతాయి. ఆ పైన మౌనమే రాజ్యమేలుతుంది. విచిత్రం ఏమిటంటే, పెదాలు మాట్లాడటం ఆపేసిన మరుక్షణమే కళ్లు మాట్లాడటం మొదలెడతాయి అది కూడా చడీచప్పుడు కాకుండానే! కాకపోతే ప్రేమికులు ఎంత జాగ్రత్తపడినా కళ్లలోని ఆ కలవరం మాత్రం బయటపడుతూనే ఉంటుంది.

❖❖❖

కహీఁ ఆగ్ లగ్నే సే పహెలే - ఉఠ్‌తా హై ఐసా ధువాఁ
జైసా హై ఇధర్ కా నజారా వైసా హీ ఉధర్ కా సమాఁ
దిల్ మే కైసీ కసక్ సీ జగీ, దోనో- జానిబ్ బరాబర్ లగీ
దేఖో తో ఇధర్ సే ఉధర్ ఛుప్‌కే ఛుప్‌కే /దో దిల్ /

(నిప్పు పుట్టడానికి ముందు - పొగ ఇలాగే ఎగిసిపడుతుంది.
ఇక్కడున్న ఈ దృశ్యం లాంటిదే - ఆ సుందర తీరం కూడా
మనసులో ఏదో కుదుపు మొదలయ్యింది - ఇరువైపులా ఒకేలా అనిపించింది
ఈ వైపు నుంచి ఆ వైపైతే చూడు, చాటుమాటుగా)

భావోద్వేగాల్ని ఎవరైనా ఏళ్ల పర్యంతం దాచుకుంటూ ఉండిపోతే, ఏదో ఒక రోజున అదొక పొగలా గుండె నిండా కమ్ముకుంటుంది. ఆ పొగలో ఏ వైపు చూసినా అంతా ఒకేలా అనిపిస్తుంది. కానీ, ఈ పొగ కమ్ముకోవడం అనేది, నిప్పు పుట్టడానికి ముందు కనిపించే ఒక సంకేతం మాత్రమే. ఒకసారి ఆ నిప్పు ఎగిసిపడిందీ అంటే అది ఎదురొచ్చిన సమస్తాన్నీ కాల్చి, కూల్చివేస్తుంది. మారుమాట్లాడకుండా విరోధుల్ని మాడ్చి మసిచేస్తుంది ఆ తర్వాత ఇన్నేళ్లూ చాటుమాటుగా ఉన్న ప్రేమ కాస్తా ఎదురులేని ధీరత్వంతో తాననుకున్న వైపు నడుస్తుంది. ఒక సుందర తీరంలో ఒక మహా ఆనంద సౌధాన్ని నిర్మిస్తుంది. ఒక శుభముహూర్తంలో జరిగే ఒక మహోత్సవానికి శ్రేయోభిలాషులందరికీ హృదయపూర్వక ఆహ్వానం పలుకుతుంది!!

- బమ్మెర

లైఫ్ స్టయిల్

జాక్వెలిన్ సౌందర్య రహస్యం



'ఏక్ దో తీన్...' అనే సూపర్‌హిట్ హిందీ పాట గుర్తుండే ఉంటుంది కదా! ఆ పాట రీమేక్‌లో మెరిసి ఒక్కసారిగా టాక్ ఆఫ్ ద ఇండస్ట్రీ అయ్యారు బాలీవుడ్ కథానాయిక జాక్వెలిన్ ఫెర్నాండెజ్. అప్పటి పాటలో మాధురిలా మ్యాజిక్ చేయకపోయినా ఐటమ్ గర్ల్‌గా తనదైన గ్లామర్‌తో గిలిగింతలు పెట్టారీ బ్యూటీ. అప్పట్లో 'కిక్ (హిందీ వెర్షన్)'తో సక్సెస్ ట్రాక్ ఎక్కిన జాక్వెలిన్ ఇప్పుడు వరుస హిట్లతో దూసుకెళుతున్నారు. సన్నగా, నాజూగ్గా, మల్లెతీగలా కుర్రకారు హృదయాలకు అల్లుకుపోయిన జాక్వెలిన్ ఫిట్‌నెస్ సీక్రెట్ ఏంటో... ఆమె మాటల్లోనే..!

❖ ఎవర్'గ్రీన్'

కావలసినన్ని నీళ్లు, గ్రీన్ టీ రోజంతా తాగుతూనే ఉంటా. ఏం తిన్నా సరే కచ్చితంగా అవి శరీరానికి కావలసిన పోషకాలనూ, ఆరోగ్యాన్నీ ఇచ్చేవిగా ఉండాలనుకుంటా. ఎందుకంటే అవి నా అందాన్ని మరింత పెంచేవై ఉండాలి.

❖ సీటీఎం....నా సీక్రెట్

ప్రతిరోజూ నిద్రపోవడానికి ముందు చర్మ శుభ్రత, మర్దన కోసం 'సీటీఎం (క్లీన్సింగ్, టోనింగ్, మాయిశ్చరైజింగ్)' చేసుకుంటాను.

❖ కురుల కోసం....

దాదాపు రోజూ నా జుత్తుకు నూనె రాస్తాను. కాకపోతే, పని ఒత్తిడి వల్ల కొన్నిసార్లు సమయం కేటాయించలేకపోతున్నాను. అందుకే జుత్తు అందంగా కనిపించడానికి ఉపయోగపడే ప్రత్యేక ఉత్పత్తులను ఎంచుకుంటాను.

❖ మేకప్ తప్పనిసరి!

లిప్‌స్టిక్ లేకుండా ఉండలేను. సో... నా మేకప్ బాక్స్‌లో లిప్‌స్టిక్ తప్పనిసరి.

❖ సల్లాడ్... సూప్స్!

ఆహారం విషయంలో కొన్ని నియమాలు విధిగా పాటిస్తాను. ప్రత్యేకించి సల్లాడ్‌లు, పండ్లరసాలు, సూపులు ప్రతిరోజూ నా ఆహారంలో తప్పనిసరిగా ఉంటాయి.

❖ మై ఫేవరేట్ ఫుడ్

లడ్డూలు

❖ నాకు ఫిట్‌నెస్ పిచ్చి!

యోగా, పోల్ అండ్ కార్డియో ఎక్సర్‌సైజులు, డ్యాన్స్ చేస్తాను.

❖ స్టైల్ విషయంలో....

సెక్సీగా ఉండాలనుకుంటా

❖ అభిమాన డిజైనర్లు

క్రిస్టియన్ డయార్, అనైతా ష్రాఫ్ అదజానియా, స్టీఫెన్ రోలాండ్. జీన్స్ అంటే నాకు చాలా ఇష్టం. అవి గొప్ప సౌకర్యవంతంగానే కాకుండా, నా శరీర ఆకృతి ఆకర్షణీయంగా కనిపించేలా చేస్తాయి.

❖ షూస్

ప్యూమా, సోఫియా వెబ్‌స్టర్ బ్రాండ్‌లు నేను అమితంగా ఇష్టపడే షూ కంపెనీలు

❖ స్టైల్ రోల్ మోడల్స్

బాలీవుడ్‌లో అయితే, సోనమ్ కపూర్, కంగనా రనౌత్, దీపికా పదుకొనే. హాలీవుడ్‌లో అయితే జీజీ హదీద్.

డైలీ సుడోకు - 141

6	3		1	7				
				8		6		
							1	9
5					6	3		
	7		8		5		2	
		4	7					5
1	8							
		5		6				
				1	2		3	4

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 140 సమాధానం

9	8	6	2	7	1	5	4	3
3	4	2	5	9	8	1	6	7
1	7	5	3	6	4	9	2	8
5	3	9	1	8	6	2	7	4
4	2	8	7	5	3	6	1	9
7	6	1	4	2	9	3	8	5
8	5	4	6	3	2	7	9	1
6	9	7	8	1	5	4	3	2
2	1	3	9	4	7	8	5	6



రాశీ ఖన్నా

రచ్చ రచ్చే

ఏ రోజైనా తాను జుట్టుకు రంగు వేసుకోవాలంటే రచ్చ రచ్చగా ఉంటుందన్నారు రాశీ ఖన్నా. ఏంటి... రాశీ జుట్టుకి రంగు వేసుకుంటున్నారా? అప్పుడే తెల్ల జుట్టు వచ్చేసిందా? ఏమంత వయసు అయ్యిందని అనుకోవద్దు! తెల్ల జుట్టు వస్తేనే రంగు వేసుకుంటారా ఏంటి? స్టైల్ కోసం, కథ డిమాండ్ చేస్తే పాత్ర కోసం నల్ల జుట్టుకి బోలెడు రంగులు వేసుకోవలసి వస్తుందిగా! అటువంటి సమయంలో చాలా ఇబ్బందిగా ఉంటుందని అంటున్నారు. "నా సహనానికి పరీక్ష పెట్టే రోజు ఏదైనా ఉందంటే... అది జుట్టుకి రంగు వేసుకునే రోజే" అని రాశీ ఖన్నా పేర్కొన్నారు.

క్రియేటివిటీని చంపకండి!




అమితాబ్ బచ్చన్

'ప్లీజ్... ప్లీజ్... ప్లీజ్... దయచేసి సినిమాను విడుదల చేయండి. చాలామంది కష్టానికి ప్రతిరూపమిది. క్రియేటివిటీని చంపకండి' అని ప్రముఖ హిందీ నటుడు అమితాబ్ బచ్చన్ ట్విట్టర్‌లో నిర్మాణ సంస్థలకు విన్నవించుకున్నారు. ఎందుకంటే... అంత పెద్ద స్టార్ నటించిన 'షూబైట్' సినిమా విడుదలకు నోచుకోవడం లేదు మరి! ఇప్పటి సినిమా కాదిది... ఐదేళ్ళ క్రితమే పట్టాలు ఎక్కింది. 'మద్రాస్ కేఫ్', 'విక్కీ డోనర్' సినిమాల ఫేమ్ సూజిత్ సర్కార్ దర్శకత్వం వహించారు. సమస్య ఏంటంటే... తొలుత 'జానీ వాకర్' పేరుతో సూజిత్ దర్శకత్వంలో పర్‌సెప్ట్ పిక్చర్స్ కంపెనీ ఈ సినిమాను నిర్మిస్తున్నట్టు ప్రకటించింది. ఎప్పటికీ షూటింగ్ ప్రారంభం కాలేదు. ఏమైందో ఏమో... తర్వాత యూటీవీ మోషన్ పిక్చర్స్ సంస్థ అదే కథతో సూజిత్ దర్శకత్వంలో 'షూబైట్'ను ప్రకటించింది. దాంతో పర్‌సెప్ట్ పిక్చర్స్ సినిమాను అడ్డుకోమని కోర్టు మెట్లు ఎక్కింది. అప్పట్నుంచి సినిమా విడుదలకు నోచుకోలేదు. గతంలోనూ 'షూబైట్' విడుదల విషయమై విన్నపాలు చేసిన అమితాబ్, మరోసారి డిస్నీ - యూటీవీ లేదా సంబంధిత నిర్మాణ సంస్థలకు నా విజ్ఞప్తి అంటూ సమస్యను వెలుగులోకి తీసుకొచ్చారు.

'ఎఫ్2'లో వి2... వెల్లడించారహో



వెంకటేశ్



వరుణ్‌తేజ్

'వి' ఫర్ వెంకటేశ్! 'వి' ఫర్ వరుణ్‌తేజ్! వీళ్ళిద్దరూ (వి2) కలిసి నటించనున్న సినిమా 'ఎఫ్2'. ఫన్ అండ్ ఫ్రస్ట్రేషన్... అనేది ఉపశీర్షిక. అనిల్ రావిపూడి దర్శకత్వంలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై ప్రముఖ నిర్మాత 'దిల్' రాజు నిర్మాణ సారథ్యంలో రూపొందనుంది. శ్రీరామ నవమి సందర్భంగా ఈ సినిమా వివరాలను వెల్లడించారు. సందేశంతో పాటు వాణిజ్య విలువలు గల కుటుంబకథా చిత్రంగా తెరకెక్కిస్తామని, జూలైలో చిత్రీకరణ ప్రారంభిస్తామని 'దిల్' రాజు తెలిపారు. త్వరలో ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు వెల్లడి కానున్నాయి.

సినిమాలు లేకపోతే సన్నగా అవుతా

- పవన్‌కల్యాణ్



నటరాజ సుబ్రమణ్యం, కృష్ణ చైతన్య, తమన్, పవన్‌కల్యాణ్, నితిన్, సుధాకర్‌రెడ్డి, మేఘా ఆకాష్ తదితరులు

"నితిన్ 16 సంవత్సరాల్లో 25 సినిమాలు పూర్తి చేశాడు. మా ఇద్దరి మధ్య వయసులో తేడా ఉంది. కానీ సినిమాల పరంగా మా ఇద్దరి అనుభవంలో ఐదారేళ్లే తేడా ఉంది" అని పవన్‌కల్యాణ్ అన్నారు. నితిన్, మేఘా ఆకాష్ జంటగా నటించిన చిత్రం 'ఛల్ మోహన్‌రంగ'. కృష్ణ చైతన్య దర్శకుడు. నిఖితారెడ్డి సమర్పణలో పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్, త్రివిక్రమ్ మరియు శ్రేష్ఠ్ మూవీస్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఎన్.సుధాకర్‌రెడ్డి నిర్మాత. తమన్ స్వరకర్త. ఆదివారం హైదరాబాద్‌లో ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుక జరిగింది. పవన్‌కల్యాణ్ ప్రీ రిలీజ్ లుక్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "ఎలాంటి సపోర్ట్ లేకుండా ఫిల్మ్ ఇండస్ట్రీకి వస్తే ఎలా ఉంటుందో నాకు తెలుసు. కొన్ని సందర్భాల్లో మనం ఎమోషనల్ సపోర్ట్ కోరుకుంటాం. నితిన్ 'ఇష్క్' ఆడియో వేడుకకి పిలిచినప్పుడు నేను పరాజయాల్లో ఉన్నాను. అయితే వాళ్లు మనస్ఫూర్తిగా పిలిచారు కాబట్టి వెళ్లి శుభాకాంక్షలు తెలిపాను. అందరి అభిమానంతో ఆ సినిమా విజయం సాధించింది. నా అభిమానులు ఒక్కొక్కరూ ఒక్కోలా అభిమానం చూపిస్తారు. నా సినిమాల స్ఫూర్తితో చాలామంది ఐఐటీకి వెళ్లినవారు ఉన్నారు. నితిన్ కూడా అలాంటి స్ఫూర్తితోనే ముందుకెళ్తున్నాడు. జయాలకు పొంగిపోకుండా, అపజయాలకు కుంగిపోకుండా 16 ఏళ్లలో 25 సినిమాల్లో నటించాడు. కృష్ణచైతన్య బలమైన కథ రాశాడు. సినిమా కూడా బాగా వచ్చింది. మ్యూజిక్ డైరెక్టర్ కాక ముందు నుంచీ తమన్ నాకు తెలుసు. 'ఖుషి' సినిమాలో 'ఏ మేరా జహా' పాట అంతగా ఆకట్టుకోవడానికి తమనే కారణం. ఈ సినిమాకు కూడా చక్కని పాటలిచ్చారు. తప్పకుండా ఈ చిత్రం ప్రేక్షకుల్ని అలరిస్తుందనే నమ్మకం ఉంది. తనకంటే నేనే స్లిమ్‌గా ఉన్నానని నితిన్ అంటున్నాడు. షూటింగ్ లేకపోతే నేను పెద్దగా తిండి తినను. అందుకే సన్నబడిపోతా" అని అన్నారు. నితిన్ మాట్లాడుతూ "16 ఏళ్ల 25 సినిమాలు చేశా. అందుకు పవన్‌కల్యాణ్‌గారికి, కరుణాకరన్‌కి థ్యాంక్స్. వారిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'తొలిప్రేమ' సినిమా చూసి నేను హీరో కావాలనుకున్నా. తేజగారు నటన నేర్పించారు. ఈ సినిమా నాకు చాలా ప్రత్యేకం. 25 సంఖ్య గురించి కాదు. నా జీవితంలో ఇష్టమైన మొదటి ముగ్గురు వ్యక్తులు మా నాన్న, పవన్‌కల్యాణ్‌గారు, త్రివిక్రమ్‌గారు. ఈ ముగ్గురు నిర్మించడం వల్ల స్పెషల్ సినిమా ఇది. పరిశ్రమలో నా స్ట్రెంగ్త్ కల్యాణ్‌గారు, త్రివిక్రమ్. వారిద్దరు నా సినిమాకు నిర్మాతలు కావడం అదృష్టంగా భావిస్తున్నా. కల్యాణ్‌గారు ఏ రంగంలో ఉన్నా సక్సెస్ కావాలని మా అభిమానులంతా కోరుకుంటాం. అలాగే ఆయన సినిమా కోసం మేమంతా ఎదురుచూస్తుంటాం. సినిమాలు చెయ్యనని మాత్రం ఆయన ఎప్పుడూ చెప్పకూడదు. ఆ మాట అనకుంటే సినిమా చేస్తారనే ఆశతో ఎదురుచూస్తుంటాం" అని అన్నారు. "పవన్‌కల్యాణ్‌గారిని త్రివిక్రమ్‌ను చూస్తే చాలనుకున్నా. నా దర్శకత్వంలో నితిన్ 25వ చిత్రాన్ని వారు నిర్మించడం ఆనందంగా ఉంది" అని దర్శకుడు తెలిపారు. "25 ఏళ్ల తర్వాత నేను నటిస్తున్న తెలుగు సినిమా ఇది. చాలా భాషల్లో 20 కథలు విన్నాక ఈ సినిమా ఎంపిక చేసుకున్నా. తెలుగు సినిమా అన్నా, ఇక్కడ వంటకాలన్నా, తెలుగువారు మహిళలపై చూపించే అభిమానం అన్నా నాకు చాలా ఇష్టం. ఈ టీమ్‌తో పని చేయడం కొత్త అనుభూతిని కలిగించింది" అని సీనియర్ నటి లిజి అన్నారు.

ఇది నా కథ అని ఫీలవుతున్నారు

- శ్రీవిష్ణు



'నీది నాది ఒకే కథ' థ్యాంక్స్‌మీట్‌లో ఓ దృశ్యం

"సినిమా ఫస్ట్ కాపీ చూసిన చాలామంది 'బాగుంది కానీ కమర్షియల్‌గా వర్కవుట్ అవుతుందా? లేదా?' అన్న అనుమానం వ్యక్తం చేశారు. నేను మాత్రం డబ్బు గురించి పట్టించుకోలేదు. మంచి సినిమాను ప్రేక్షకులకు అందించామనే తృప్తి జీవితాంతం ఉంటుందనే నమ్మకంతో విడుదల చేశా. ఇపుడు కమర్షియల్‌గా కూడా సినిమా సంతృప్తినిచ్చింది. థియేటర్లు కూడా పెరిగాయి" అని నారా రోహిత్ అన్నారు. శ్రీవిష్ణు, సత్నా టైటస్ జంటగా వేణు ఊడుగుల దర్శకత్వం వహించిన చిత్రం 'నీది నాది ఒకే కథ'. ప్రశాంతి, కృష్ణవిజయ్ నిర్మించిన ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఆదివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన థ్యాంక్స్ మీట్‌లో శ్రీవిష్ణు మాట్లాడుతూ "ప్రతి ఒక్కరూ ఇది నా కథ, మా ఇంట్లో జరిగిన కథ అని ఓన్ చేసుకుంటున్నారు. అలాంటి ఫోన్ కాల్స్ నాకు చాలా వచ్చాయి. రోహిత్ సహకారం మరువలేనిది. ఇలాంటి చిన్న సినిమాలు ఆడితే మరిన్ని మంచి సినిమాలొస్తాయి" అని అన్నారు. "నేనీ సినిమా చెయ్యకపోతే గొప్ప గౌరవాన్ని కోల్పోయేవాణ్ణి" అని సినిమాలో హీరోకి తండ్రిగా కీలక పాత్ర పోషించిన దేవి ప్రసాద్ తెలిపారు. "సినిమాకు ప్రశంసలతోపాటు. కొన్ని విమర్శలు కూడా వున్నాయి. వాటిని పాజిటివ్‌గా తీసుకుని తర్వాతి సినిమాకు రిపీట్ కాకుండా చూసుకుంటా" అని దర్శకుడు వేణు చెప్పారు. వి.ఎన్.ఆదిత్యా, పవన్ సాదినేని, విరించి వర్మ, సాగర్ చంద్ర, కిషోర్ తిరుమల, దేవిప్రసాద్, ప్రముఖ నిర్మాతలు రాజ్ కందుకూరి, బెక్కం వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



ఇంటి వద్ద ఉన్న రాధాబాయికి సాయంత్రం అల్పాహారం అందజేస్తున్న సంఘం సభ్యుడు భీమ్‌రావు

వృద్ధుల ఆకలి తీరుస్తూ... అ'విశ్రాంత' సేవ

- బాక్సుల్లో ఇంటింటికీ భోజనం, అల్పాహారం
- చెన్నూరులో విశ్రాంత ఉద్యోగుల సేవా నిరతి

వృద్ధులు తమ పని తాము చేసుకోవడమే ఎంతో కష్టం! ఇక వండి పెట్టేవారు లేకపోతే వారి బతుకెంతో భారం! చదువులు, ఉద్యోగాల కోసం పిల్లలు ఎక్కడెక్కడో స్థిరపడుతున్నారు. ఊళ్లలో తల్లిదండ్రుల బాగోగులు చూసుకుని, పట్టెడన్నం పెట్టేవాళ్లు ఉండటం లేదు. అలాంటి వృద్ధులకు మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలోని గాయత్రీ అన్నదాన సత్రం అండగా నిలుస్తోంది. వృద్ధ బ్రాహ్మణుల ఆకలి తీరుస్తోంది. కేవలం 15 మంది సభ్యులతో నడుస్తున్న ఈ సత్రంలో అందరూ విశ్రాంత ఉద్యోగులే! దాదాపు అందరూ ఉపాధ్యాయ వృత్తిలో రిటైర్ అయినవారే! దాతలు ఇచ్చిన విరాళాల నుంచి కావాల్సిన సరుకులు తెచ్చి, రోజుకు రెండు పూటలూ పట్టణంలోని వృద్ధ బ్రాహ్మణులకు ఇంటి దగ్గరకే టిఫిన్ బాక్సుల్లో భోజనాన్ని పంపే కార్యక్రమాన్ని 2006 నుంచి నిరంతరాయంగా కొనసాగిస్తున్నారు.

– మంచిర్యాల, ఆంధ్రజ్యోతి

అందరి కోసం అందరు



భోజనాలకు అయ్యే ఖర్చును మేమంతా భరిస్తాం. ఇంకా దాతలు కూడా సహకరిస్తారు. ఇది నిరంతర ప్రక్రియ. ఈ సంఘం 1983లో 8 మందితో ప్రారంభమైంది. రూ.5 లక్షల ఎమ్మెల్సీ నిధుల నుంచి అభివృద్ధి చేస్తున్నాం. ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతరావు తన నియోజకవర్గ నిధుల్లోంచి ఏటా రూ. 10 లక్షలు ఇస్తానని ఈ మధ్యే మాటిచ్చారు. కాలక్షేపానికి మాత్రమే.. విశ్రాంత ఉద్యోగులు అన్న మాటను మరిచి.. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– కేఎం శ్రీనివాస్, శ్రీ గాయత్రి అన్నదాన సత్రం అధ్యక్షుడు

ఇంటింటికీ అందిస్తాం



మధ్యాహ్నం భోజనంలో అన్నం, పప్పు, కూర, చారు, మజ్జిగ, సాంబారు ఉంటాయి. సాయంత్రం ఉప్మా, ఇడ్లీ, అటుకులపోపువంటి టిఫిన్లు, వివిధ రకాల కూరలు ఇస్తాం. ఇంటింటికి తిరిగి 20 మందికి టిఫిన్ డబ్బాలలో భోజనం అందిస్తున్నాం. ఎవరైనా భోజనం చేస్తామని ఉదయం 9 గంటలకల్లా చెబితే..భోజనాలు వండి సత్రంలోనే పెడతాం. లేదా ఇంటికి తీసుకుపోయి ఇస్తాం. ప్రతీ రోజు నేనే టిఫిన్ డబ్బాలు తీసుకెళ్తాను. సంఘంలో కొమ్మెర రాధాబాయి, కేఎం శ్రీనివాస్, పురాణం శంకర్, కేవీఎం ప్రకాష్, ఆర్ దామోదర్, భీమ్‌రావు, తదితరులు సభ్యులుగా ఉన్నారు.

– దామోదర్





కృష్ణలంకలో ఇల్లు.. పటమటలో ఆఫీసు..! భవానీపురంలో ఇల్లు..బెంజ్ సర్కిల్‌లో స్కూలు..! ఇలా ఇల్లొక చోట, పాఠశాలలు మరో చోట! నగరంలో నివాసం, శివార్లలో ఉద్యోగం! రాజధాని రాకతో అవకాశాలతో బాటు పొద్దున్నే ఉరుకులు పరుగులూ పెరిగాయి. చదువులు, ఉద్యోగాలు, వ్యాపారాలు..ఇలా అన్ని పనుల్లోనూ అన్ని వర్గాల వారిదీ బిజీ జీవితం! ఉదయం ఇంట్లో వండి బాక్సుల్లో పెట్టిన భోజన పదార్థాలు.. మధ్యాహ్నానికి చల్లబడిపోయి తినబుద్ధి కావు. కడుపు కాలుతున్నా..ముద్ద మాత్రం గొంతు దిగదు. సాయంత్రానికి ముఖాలు వేలాడేసుకుని తిరిగి వచ్చే పిల్లలను చూసి.. ఇంట్లో వాళ్ల మనస్సు విలవిల్లాడుతుంది. ఈ సమస్యను కొంతైనా తీర్చుతూ..బెజవాడలో డబ్బావాలాలు ముందుకొచ్చారు. ముంబై డబ్బావాలాల స్ఫూర్తితో.. రెండేళ్లుగా ఇంటి భోజనాన్ని లంచ్ సమయానికి వేడివేడిగా అందిస్తున్నారు.

ముంబైలో బైక్‌లపై రయ్.. రయ్..

ముంబై జన జీవితంలో డబ్బావాలాలు భాగం. సమయపాలన, నిజాయితీలతో అంతర్జాతీయంగా గుర్తింపు తెచ్చుకున్నారు. వందేళ్లకుపైగా చరిత్ర కల్గిన ముంబై డబ్బావాలాలు.. దశాబ్దాలుగా తోపుడు బండ్లు సైకిళ్లపైనే ప్రయాణం సాగించారు. కానీ యువ డబ్బావాలాలు సైకిళ్లు వదిలి సెకండ్ హ్యాండ్ బైక్‌లు కొనుక్కొంటున్నారు. సమయం ఆదా కావడం, శారీరక శ్రమ తగ్గడంతోబాటు ఎక్కువ లంచ్ బాక్స్‌లను బట్వాడా చేయగలుగుతున్నారు. తమ తాత ముత్తాతల కాలంనాటి సైకిళ్లు 60కి మించి టిఫిన్ బాక్స్‌లు మోయలేకపోయేవి. బైక్‌ల మీద రోజుకు 150 లంచ్ బాక్స్‌లను అందిస్తున్నారు.

బెజవాడలో డబ్బావాలాలు

లంచ్ సమయానికి వేడివేడిగా ఇంటి భోజనం.. కృష్ణా తీరంలో ముంబై తరహా సేవలు



విజయవాడలో ఉపాధి పొందుతున్న డబ్బావాలాలు

ఇద్దరితో మొదలై..

ముంబైలో రైళ్ల కంటే వేగంగా డబ్బావాలాలు పరుగులు పెడతారు. సైకిళ్లు, తోపుడుబండ్లు, లోకల్ ట్రైన్లు..ఇలా అంచెలంచెలుగా లంచ్ బాక్స్‌లను మోసుకుపోతారు. విజయవాడలో కూడా ఇలాంటి నెట్‌వర్క్ ఏర్పాటుచేస్తే ఎలా ఉంటుందనే ఆలోచన బేతాళం శ్రీనివాసరాజు అనే యువకుడికి వచ్చింది. గుంటూరుజిల్లా కాజీపాలెం నుంచి పదేళ్ల క్రితం ఆయన ఉపాధి కోసం విజయవాడకు వచ్చారు. చాలాకాలం మార్కెటింగ్ రంగంలో పనిచేసిన ఆయన సొంతంగా క్యాటరింగ్ వ్యాపారం చేద్దామనుకున్నారు. అయితే విజయవాడలో ఎటు చూసినా అవే! దీంతో క్యాటరింగ్‌కు భిన్నంగా ఏమైనా చేయాలని శ్రీనివాసరాజు భావించారు. అప్పుడే ముంబైలో డబ్బావాలా గురించి విన్నారు. కొత్త హంగులు అద్దుకుంటున్న బెజవాడకు డబ్బావాలా సర్వీసే సరైనదని నిర్ణయించుకున్నారు. కేవలం ఇద్దరు ఉద్యోగులతో 2016, ఫిబ్రవరి 10న విజయవాడలో డబ్బావాలా సేవలను ప్రారంభించారు. తొలుత మూడు ఇళ్లవారు ముందుకొచ్చారు. రెండేళ్లు తిరిగేసరికి 150 లంచ్‌బాక్స్‌లను బైకులపై బట్వాడా చేసే స్థాయికి సర్వీసులు పెరిగాయి. విద్యార్థుల తల్లిదండ్రులు, షాపుల్లో పనిచేసేవారు, ప్రైవేటు ఆస్పత్రుల్లో పనిచేసేవారు ఎక్కువగా డబ్బావాలాల సేవలు వినియోగించుకుంటున్నారు.

వేడి చల్లారక ముందే..

ఉదయం తొమ్మిది గంటలకల్లా డబ్బావాలాలు సిద్ధమైపోతారు. బైకులపై తమ ఖాతాదారుల ఇళ్లకు చేరుకుంటారు. పదకొండు గంటలకల్లా లంచ్ బ్యాగులతో రోడ్డెక్కుతారు. మధ్యాహ్నం పన్నెండు, ఒంటిగంటకల్లా వాటిని స్కూళ్లు, ఆఫీసులకు చేరుస్తారు. మధ్యాహ్నం 2 గంటలకల్లా డెలివరీ పూర్తి చేసేస్తారు. ఆ తర్వాత కొంతమంది వేరే పనుల్లోకి వెళితే, మరికొందరు కాలేజీల్లో క్లాసులకు హాజరవుతారు. సిద్ధార్థ కాలేజ్‌లో బీఎస్సీ కంప్యూటర్స్ మొదటి సంవత్సరం చదువుతున్న గారపాటి రాజేశ్..డబ్బావాలాగా పార్ట్‌టైమ్ పనిచేస్తున్నాడు. తండ్రి చనిపోయి, తల్లి కష్టం మీదే కుటుంబం నడవాల్సిన స్థితిలో..ఈ పని తమకు ఊరటనిస్తుందని తెలిపాడు.

–విజయవాడ సిటీలైఫ్, ఆంధ్రజ్యోతి



రాజధాని అవసరాల కోసమే..

రాజధాని రాకతో పెరిగిన నగర అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూ.2 లక్షల పెట్టుబడితో, ఇద్దరు ఉద్యోగులతో మా సేవలు మొదలయ్యాయి. విజయవాడ పరిధిలో లంచ్ బాక్స్‌లు డెలివరీ చేస్తున్నాం. రాబోయే రోజుల్లో డబ్బావాలా సర్వీసును విస్తరించాలనుకుంటున్నాం. ఇప్పుడిప్పుడే కొత్త ప్రాంతాల నుంచి ఆర్డర్లు వస్తున్నాయి. **–బేతాళం శ్రీనివాసరాజు, 'డబ్బావాలా' నిర్వాహకుడు, విజయవాడ**

దూరాన్ని బట్టి చార్జీలు..

లంచ్‌బాక్స్‌ను పికప్ చేసుకోవాల్సిన ఇంటి నుంచి డెలివరీ చేయాల్సిన ప్రాంతానికి మధ్య దూరాన్ని బట్టి డబ్బావాలాలు చార్జ్ చేస్తారు. మూడు కిలోమీటర్లలోపు రూ.400, ఐదు కిలోమీటర్లలోపు రూ.500 చొప్పున నెలకు తీసుకుంటారు. హోటళ్లు, మెస్‌ల నుంచి భోజనాలు, టిఫిన్లు, కూరలు తీసుకురావడం.. నిత్యావసరాలను అందించడం, పుట్టినరోజు కానుకలు.. బ్యాంకుల్లో చెక్కులు, డీడీ డిపాజిట్లు, సినిమా టికెట్లు, కవర్ల చేరవేత వంటి అన్ని సేవలనూ అందిస్తున్నారు. ఇందుకుగాను ఐదు కిలోమీటర్లకు రూ.50 వసూలు చేస్తున్నారు. ఆ తర్వాత ప్రతి కిలోమీటరుకూ రూ.7 తీసుకుంటారు. నిడమనూరు, తాడిగడప, గొల్లపూడి, కృష్ణలంక, పాయకాపురం తదితర ప్రాంతాలకు డబ్బావాలాల సేవలు విస్తరించాయి.

'ఏయ్ హాస్కీ.. నీళ్లు పట్టుకురా..!'

- గ్రామస్థులకు నీళ్లు మోసుకొస్తున్న రోబో
- మున్ముందు పల్లెల్లో మరిన్ని మర మనుషులు

ఊరంతా కోలాహలంగా ఉంది. వీధుల్లో 'హస్కీ' సందడి చేస్తోంది. 'ఏయ్ హస్కీ..మాకు ఒక క్యాన్' అంటూ అరిచింది అవ్వ! అంతే వడివడిగా కదులుతూ..వీధుల్లో మలుపులు తిరుగుతూ.. గుడిసె ముందు నీళ్ల క్యాన్‌తో ప్రత్యక్షమయింది హస్కీ! వెంటనే దాన్ని అందుకుని, నీళ్లను బిందెలోకి పోసుకుని, ఖాళీ క్యాన్ హస్కీకి ఇచ్చేసింది. 'ఓకే, నే వెళ్తున్నా..అన్నం తినేటప్పుడు చేతులు శుభ్రం చేసుకోవడం మరచిపోకు' అంటూ అవ్వకి చెప్పి..మరో ఇంటికి వెళ్లిపోయింది హస్కీ! ఇంతకీ హస్కీ ఎవరో తెలుసా? గ్రామంలోని బావి నుంచి ఇంటింటికీ నీళ్లు మోసుకొచ్చే రోబో! కేరళలోని అయ్యంపతి అనే కుగ్రామంలో రిమోట్‌తో పనిచేసే 'హస్కీ' రోబో సంచలనం సృష్టి



స్తోంది. ఊరి చివర ఉన్న బావి నుంచో..కాలువ నుంచో బిందెలతో నీళ్లు తెచ్చుకోవడం మహిళలకు ఎంతో కష్టం! కానీ రోబోలతో ఆ పని చేయించవచ్చంటున్నారు అమోల్ దేశ్‌ముఖ్ అనే పరిశోధకుడు. గ్లాస్గో యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ కంప్యూటింగ్ సైన్స్‌లో రీసెర్చ్ అసోసియేట్‌గా ఉన్న ఆయన.. కేరళలోని అమృత యూనివర్సిటీతో కలిసి ఈ ప్రాజెక్టు కోసం పనిచేశారు. 'ఇంతవరకూ రోబోలపై నగరాల్లోనూ, ప్రయోగశాలల్లోనే ఎక్కువ పరిశోధనలు జరిగాయి. మేం మనుషులకు రోబోలను దగ్గర చేసే ప్రయత్నం చేశాం. టీవీల్లో, సినిమాల్లో మాత్రమే రోబోలను చూసిన పల్లెవాసులకు వాటిని నేరుగా పరిచయం చేస్తున్నాం. నిత్య జీవితంలో ప్రజలకు రోబోలు ఎలా ఉపయోగపడతాయి? ఎలా పనిచేస్తాయి? తెలుసునే ప్రయత్నం చేస్తున్నాం' అని దేశ్‌ముఖ్ పేర్కొన్నారు. ఈ 'హస్కీ' రోబోను తయారు చేయడానికి దాదాపు రూ.23 లక్షలు ఖర్చయింది. ఇప్పుడు హస్కీ అయ్యంపతి గ్రామంలోని ప్రతి ఇంటిలో సభ్యురాలైపోయింది. 'గ్రామస్థులు హస్కీతో కలిసి పనిచేస్తున్నందుకు సంతోషంగా ఉన్నారు. హస్కీ తమకు చేదోడు వాదోడుగా ఉందని చెబుతున్నారు. రోబో రిమోట్‌తో పనిచేస్తుందని తెలిసినా..అది నిజంగా తమతోబాటు జీవించి ఉన్నట్లు భావిస్తున్నారు' అని దేశ్‌ముఖ్ తెలిపారు. బహుశా 'హస్కీ' ప్రపంచంలో తొలి ట్రాన్స్‌జెండర్ రోబో అయి ఉండొచ్చు అంటున్నారాయన! ఎందుకంటారా? గ్రామస్తులతో సింథటిక్ 'మేల్' వాయిస్‌తో మాట్లాడుతున్నప్పటికీ.. హస్కీని ఊర్లో అందరూ ఆడపిల్లలా చూడటమే అందుకు కారణం!

కొండను తవ్వి కోటను పట్టారు!

అది మహారాష్ట్రలోని వార్ధా జిల్లా కెల్‌ఝర్ పట్టణం. ఈ పట్టణాన్ని పలువురు రాజవంశీయులు పాలించినట్లు చరిత్రలో కొన్ని పేజీలున్నాయి. వార్ధా జిల్లా కలెక్టర్ 1974 గెజిట్ ప్రకారం.. 13-14వ శతాబ్దంలో దేవగిరి యాదవుల రాజ్యంలో ఈ ప్రాంతం ఉండేది. తర్వాత బహమనీ సుల్తానుల ఆధీనంలోకి వెళ్లిపోయింది. 'బకాసురుడు కెల్‌ఝర్‌లోనే నివసించేవాడని, భీముడు అతణ్ని ఇక్కడే చంపేసినట్లు' పౌరాణిక కథ ప్రాచుర్యంలో ఉంది. మరి ఇంత చరిత్ర ఉన్న ఈ పట్టణంలో కోట ఉండేదా? అంటే ఎవ్వరికీ తెలీదు. కానీ, చరిత్రలోకి తొంగి చూసేందుకు ప్రయత్నించిన నాగ్‌పూర్ యూనివర్సిటీ విద్యార్థులు, పురావస్తు శాస్త్రవేత్తలకు ఆశ్చర్యపోయేలా కొంగొత్త విషయాలు, శతాబ్దాలనాటి విశేషాలు తెలిశాయి. అందుకు ఓ కొండ వేదికగా నిలిచింది. ఆ కొండను తవ్వితే వందల ఏళ్ల పాటు కొండ కింద దాక్కున్న 2.6 ఎకరాల విస్తీర్ణంలో అత్యద్భుతమైన కోట బయటపడింది. అలనాటి సామ్రాజ్యపు అనుభూతులను కళ్లముందుకు తెచ్చి చరిత్రకారులను, పురావస్తు శాస్త్రవేత్తలను సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తోంది.



తవ్వకాల్లో బయటపడ్డ విగ్రహం





అంబానీ కారు కూడా దీని ముందు చీపే!


- ఎస్‌యూవీలలో రారాజు 'కార్ల్‌మన్ కింగ్' .. రూ.13 కోట్ల కిర్రాక్ మోడల్

ఆ దర్జా..ఆ గాంభీర్యం..ఆ వేగం.. ఎస్‌యూవీ కార్లలో ఉండే కిక్కే వేరప్పా! కానీ ఆధునిక ఎస్‌యూవీలలో ఈమధ్య సున్నితత్వం పెరుగుతోంది. అయితే చైనాలో తయారైన 'కార్ల్‌మన్ కింగ్' ఎస్‌యూవీ ప్రపంచ వ్యాప్తంగా కిర్రాక్ పుట్టిస్తోంది. దీని ఖరీదు ముందు అంబానీలు వాడే.. బెంట్లే కారు కూడా చవకే! చైనాకు చెందిన ఐఏటీ కంపెనీ కేవలం 9 ఎస్‌యూవీలను మాత్రమే తయారు చేసింది. ఈ లిమిటెడ్ ఎడిషన్ కస్టమైజ్డ్ ఎస్‌యూవీ ఖరీదు 2 మిలియన్ డాలర్లు. అంటే అక్షరాలా మన కరెన్సీలో 13 కోట్ల రూపాయలు! బుల్లెట్ ప్రూఫ్ కావాలంటే అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. కారు బాడీలో కర్వ్‌లు ఉండవు. తిన్నని, కోణీయ ఆకృతిలో కారును డిజైన్ చేశారు. ల్యాంప్‌లు కూడా కోణీయ ఆకారంలోనే తీర్చిదిద్దారు. హెడ్‌ల్యాంప్‌లు, ఫాగ్ ల్యాంపులు కూడా త్రికోణాకృతిలో ఉంటాయి. కారులో ఇంటీరియర్ అంతా లాంజ్‌ను తలపిస్తుంది. రోల్స్ రాయిస్ వాహనాల మాదిరిగానే ఎల్‌ఈడీ మూడ్ ల్యాంప్‌లు, టీవీ, రిఫ్రిజిరేటర్, ఎస్ప్రెసో మెషిన్లు ఉంటాయి. ఏ వాతావరణ పరిస్థితుల్లో అయినా ఈ ఎస్‌యూవీని నడపవచ్చు. మైనస్ 40 డిగ్రీల నుంచి 200 డిగ్రీల ఉష్ణోగ్రతల్లో కూడా ఈ బడా కారు జోరుగా దూసుకెళ్తుంది. దీని వెడల్పు ఏకంగా 8.2 అడుగులు. అంటే రద్దీగా ఉండే రోడ్లపై ఈ ఎస్‌యూవీ మీద వెళ్లలేరు. నలుగురు కూర్చొనే విధంగా కారును తయారు చేసినప్పటికీ.. సిక్స్-సీట్, సిక్స్- డోర్ వెర్షన్ వాహనాలను కూడా రూపొందిస్తున్నారు. ఫోర్డ్‌కి చెందిన 6..8 లీటర్ వీ10 ఇంజన్ కల్గిన కార్ల్‌మన్ కింగ్ కారు వేగం..మిగతా ఎస్‌యూవీలతో పోలిస్తే తక్కువే! ఆరు టన్నుల బరువు కారణంగా గంటకు 140 కిలో మీటర్ల వేగంతో ఇది ప్రయాణిస్తుంది.



పెరిగే శివలింగం.. కుడివైపున గంగ

- లింగం పై భాగంలో రంధ్రం.. సర్వకాలసర్వావస్థల్లోనూ నీళ్లు
- మేళ్లచెర్వు స్వయంభూలింగేశ్వరస్వామి ఆలయ విశిష్టతలెన్నో



ని-దర్శనం

Nidarshanam

మేళ్లచెర్వు: పుష్కర కాలానికి (12 ఏళ్లకు) అంగుళం చొప్పున పరిమాణం పెరిగే శివలింగాన్ని ఎప్పుడైనా చూశారా? చూడకపోతే.. సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలకేంద్రంలోని శ్రీ స్వయంభు శంభులింగేశ్వర స్వామి ఆలయానికి వెళ్లాల్సిందే. అదొక్కటే కాదు.. ఆ శివలింగానికి మరెన్నో ప్రత్యేకతలున్నాయి. ఏటా మహాశివ రాత్రి పర్వదినానికి వారం రోజులు ముందు లేదా వారం రోజుల తర్వాత ఆ లింగాన్ని సూర్యకిరణాలు తాకుతాయి. అలాగే, పంచభూత తత్వాల్లో ఈ లింగానికి జలతత్వం ఉన్నదని పెద్దలు చెబుతారు. అందుకు నిదర్శనంగా.. శివలింగం పైభాగంలో మూడు వేళ్లు పట్టేంత రంధ్రం ఉంటుంది. అందులో ఎల్లప్పుడూ నీరు ఉంటుంది. ఆ నీరు తీసేస్తే మళ్లీ అంతే నీరు వచ్చి చేరుతుంది. పొర్లదు. గుడి చుట్టుపక్కల ఎక్కడైనా 300 అడుగుల లోతు వరకూ బోరు వేస్తేగానీ నీరు లభ్యం కాదు. అలాంటి చోట ఈ నీరు ఎక్కడి నుంచి వస్తోంది? వచ్చినా సరిగ్గా ఆ రంధ్రం నిండేంత మాత్రమే ఎలా ఊరుతోంది? అనేవి ఎవరికీ అర్థం కాని విషయాలు. ఇక, సాధారణంగా శివుడి శిరస్సున గంగ ఎడమవైపున ఉంటుంది. కానీ ఈ ఆలయంలో మాత్రం గంగమ్మ కుడివైపున ఉండటం విశేషం.

ఆంధ్రజ్యోతి

బిజినెస్

విజయవాడ • సోమవారం 26 మార్చి 2018

andhrajyothibusiness@gmail.com

పిఎస్‌యు చీఫ్‌లతో మోదీ మేధోమథనం

ఏప్రిల్ 9న 'న్యూ ఇండియా-2022' వేదికపై భేటీ



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల (పిఎస్‌యు) సారథులతో ప్రధాని మోదీ మేధోమథనం జరపనున్నారు. వచ్చే నెల 9న నిర్వహించనున్న 'న్యూ ఇండియా- విజన్ 2022' సదస్సు ఇందుకు వేదిక కానుంది. 2022 నాటికి సరికొత్త భారత్ ను ఆవిష్కరించేందుకు పిఎస్‌యులు పోషించాల్సిన పాత్రపై ఈ సందర్భంగా చర్చించనున్నారు. జాతి నిర్మాణంలో పిఎస్‌యులు మరింత చురుకైన పాత్ర పోషించేందుకు వీలుగా వాటి సామర్థ్యాన్ని మెరుగుపర్చేందుకు మానవ వనరులు, సృజనాత్మకత, ఫైనాన్స్ తదితర అంశాలపై చర్చించనున్నారు.

రూ.4,300 కోట్లతో
బిఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ విస్తరణ



న్యూఢిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సరం (2018-19)లో నెట్‌వర్క్ విస్తరణ కోసం రూ.4,300 కోట్ల మేర పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ బిఎస్ఎన్ఎల్ తెలిపింది. అలాగే, భారత్ నెట్, నెట్‌వర్క్ ఫర్ స్పెక్ట్రమ్ వంటి ప్రభుత్వ టెలికాం ప్రాజెక్టుల కోసం మరో రూ.5,000-6,000 కోట్ల నిధులు వెచ్చించనున్నట్లు బిఎస్ఎన్ఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అనుపమ్ శ్రీవాస్తవ తెలిపారు. "ప్రైవేట్ ఆపరేటర్లు సేవలందించని ప్రాంతాల్లో టెలికాం, బ్రాడ్‌బ్యాండ్ నెట్‌వర్క్ ఏర్పాటు కోసం ప్రభుత్వం పెట్టుబడులు పెడుతోంది. బిఎస్ఎన్ఎల్ ద్వారా ఈ ప్రాజెక్టుల అమలు చేస్తోంది. ప్రభుత్వం తరఫున మా సంస్థ ప్రాజెక్టు పనులను చేపడుతోంది" అని ఆయన వెల్లడించారు. సంస్థ 3జి సేవల కోసం 12వేలు, 4జి సేవల కోసం 10వేల టవర్లను ఏర్పాటు చేయాలనుకుంటున్నట్లు శ్రీవాస్తవ చెప్పారు. దేశీయ మొబైల్ సేవల మార్కెట్‌లో బిఎస్ఎన్ఎల్ 9.40 శాతం మార్కెట్ వాటా కలిగి ఉంది.

డిసెంబరులో ఆకాష్, శ్లోకా వివాహం



న్యూఢిల్లీ : ప్రముఖ పారిశ్రామికవేత్త ముకేష్ అంబానీ పెద్ద కుమారుడు ఆకాష్ అంబానీ, వజ్రాల వ్యాపారి రసెల్ మెహతా కూతురు శ్లోకా మెహతా వివాహం వచ్చే డిసెంబరులో జరగనుంది. శనివారం గోవాలోని ఫైవ్‌స్టార్ రిసార్టులో వీరి నిశ్చితార్థం జరిగినట్టు తెలిసింది. ఈ కార్యక్రమంలో రెండు కుటుంబాల సభ్యులతోపాటు వారి సన్నిహితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాబోయే కోడలు శ్లోకాకు ముకేష్ అంబానీ స్వీట్ తినిపిస్తున్న ఫొటోతో పాటు శ్లోకా, ఆకాష్‌ల ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. డిసెంబరులో పెళ్లి ఉంటుందని, పెళ్లి సంబరాలు 4-5 రోజులు ఉంటాయని ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న విశ్వసనీయవర్గాలు తెలిపాయి.

ముంబైలోని ఒబెరాయ్ హోటల్‌లో డిసెంబరు 8-12 వరకు పెళ్లి వేడుకలు జరుగుతాయని పేర్కొన్నారు. పెళ్లి దేశంలోనే జరుగుతుందని కూడా అంటున్నారు. అయితే ఈ విషయమై రెండు కుటుంబాల నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. ఆకాష్, శ్లోకాలకు చిన్నప్పటి నుంచే పరిచయం ఉంది. వీరిద్దరూ ధీరూభాయ్ అంబానీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో చదువుకున్నారు. ఆకాష్ రిలయన్స్ జియో బోర్డు సభ్యుడిగా ఉన్నారు. శ్లోకా 2009లో తన పాఠశాల విద్యను పూర్తి చేశారు. ప్రిన్స్‌టన్ యూనివర్సిటీలో ఆంత్రోపాలజీ, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్‌లో న్యాయ విద్యను పూర్తి చేశారు. 2014 జూలై నుంచి రోసీ బ్లూ ఫౌండేషన్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

నీరవ్ మోదీ బకాయిలు..
ఫైర్‌స్టార్ నుంచి వసూలు!

సంస్థ దివాలా పరిష్కార చర్యల్లో పాల్గొనే యోచనలో పిఎన్‌బి

న్యూఢిల్లీ: నీరవ్ మోదీకి చెందిన ఫైర్‌స్టార్ డైమండ్ దివాలా పరిష్కార వ్యవహారంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) సైతం పాల్గొనాలనుకుంటోంది. పిఎన్‌బికి దాదాపు రూ.13,000 కోట్లు కుచ్చుటోపీ పెట్టిన నీరవ్ మోదీ.. మోసం వెలుగు చూడక ముందే దేశం విడిచి పారిపోయిన విషయం తెలిసిందే. మోదీ నుంచి బకాయిలు రాబట్టేందుకు అన్ని అవకాశాలను అన్వేషిస్తున్న పిఎన్‌బి.. ఫైర్‌స్టార్ దివాలా పరిష్కార వ్యవహారంలో పాల్గొనడం ద్వారా వీలైనంత రికవరీ చేసుకోవాలని భావిస్తోంది. ఈ విషయంలో మరింత ముందుకెళ్లేందుకు న్యాయ నిపుణులను కూడా నియమించుకోనున్నట్లు సమాచారం. అయితే, ఈ విషయంపై స్పందించేందుకు బ్యాంక్ యాజమాన్యం నిరాకరించింది.

పిఎన్‌బి నుంచి లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్స్ (ఎల్ఒయు) పొందడం ద్వారా రూ.12,968 కోట్ల మేర రుణాలు తీసుకొని మోసగించిన కేసులో నీరవ్ మోదీతోపాటు ఆయన మేనమామ, గీతాంజలి జెమ్స్ ఓనర్ మెహుల్ చోక్సీపై సిబిఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి), సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ (ఎస్ఎఫ్ఐఒ) దర్యాప్తు చేస్తున్నాయి.

గత నెలలో ఫైర్‌స్టార్ దివాలా

నీరవ్ గ్రూప్ కంపెనీల్లో ఒకటైన అమెరికన్ సంస్థ ఫైర్‌స్టార్ డైమండ్ గతనెల దివాలా పిటిషన్ దాఖలు చేసింది.



దివాలా కేసులను విచారించే న్యూయార్క్ సదరన్ బ్యాంక్రప్టసీ కోర్టులో చాప్టర్ 11 వాలంటరీ పిటిషన్‌ను ఫైల్ చేసింది. దాంతో ఫైర్‌స్టార్ నుంచి బకాయిలు వసూలు చేయకుండా అమెరికన్ కోర్టు స్టే విధించింది. అంటే, రుణదాతలు తమ బకాయిలను వసూలు చేసుకునేందుకు రుణ గ్రహీతతోపాటు అతని కంపెనీలపై ఎలాంటి చర్యలు తీసుకోవడానికి వీలుండదు. ఇ-మెయిల్, ఫోన్ లేదా మరే ఇతర మాధ్యమం ద్వారానూ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేయడానికీ వీల్లేదు. ఫైర్‌స్టార్, దాని అనుబంధ కంపెనీల్లో నీరవ్ మోదీ మెజారిటీ వాటా కలిగి ఉన్నారు.

టెలికాం రంగంలో ఐదేళ్లలో కోటి ఉద్యోగాలు

న్యూఢిల్లీ : దేశీయ టెలికాం రంగంలో కన్సాలిడేషన్ (విలీనాలు) మూలంగా పెద్ద ఎత్తున ఉద్యోగాలు గల్లంతు అవుతున్నాయి. అయితే వచ్చే ఐదేళ్ల కాలంలో పరిస్థితి మారిపోతుందని, ఈ రంగం కోటికి పైగా ఉద్యోగాలను సృష్టించే అవకాశం ఉందని టెలికాం రంగ స్కిల్ కౌన్సిల్ (టిఎస్ఎస్‌సి) సిఇఒ ఎస్‌పి కొచ్చార్ తెలిపారు. ప్రస్తుతం టెలికాం రంగం 40 లక్షల మందికి ఉపాధి కల్పిస్తోందని, ఐదేళ్లలో వీరి సంఖ్య 1.43 కోట్లకు పెరుగుతుందని ఆయన అంచనా వేశారు. సిఐఇఎల్ హెచ్‌ఆర్ నివేదిక ప్రకారం.. గత ఏడాది నుంచి టెలికాం రంగంలో 40,000 మంది ఉద్యోగాలు కోల్పోయారు. వచ్చే తొమ్మిది నెలల పాటు కూడా ఇదే ట్రెండ్ కొనసాగే అవకాశం ఉందని అంటున్నారు. ఫలితంగా 80,000-90,000 మంది ఉద్యోగాలను కోల్పోవచ్చని అంచనా. కాగా మెషిన్ టు మెషిన్ కమ్యూనికేషన్స్, టెలికాం మాన్యుఫ్యాక్చరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ సర్వీసెస్ కంపెనీల నుంచి రానున్న కాలంలో డిమాండ్ ఎక్కువగా ఏర్పడే అవకాశం ఉందని, ఫలితంగా కొత్త ఉపాధి అవకాశాలు లభిస్తాయని కొచ్చార్ చెప్పారు. మాన్యుఫ్యాక్చరింగ్ భారత్‌కు వస్తోందని, ఫలితంగా టెలికాం రంగంలో నైపుణ్యాలు ఉన్నవారికి అవకాశాలు లభిస్తాయని ఆయన తెలిపారు. టెలికాం మాన్యుఫ్యాక్చరింగ్ రంగంలో 14.2 లక్షల మందికి ఉపాధి లభించే అవకాశం ఉందన్న అంచనాలున్నాయని చెప్పారు. నైపుణ్యాలను పెంచేందుకు టిఎస్ఎస్‌సి కూడా తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. నైపుణ్యాలు పెరిగిన నేపథ్యంలో వలసలు ఉంటాయని పరిశ్రమ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయని, అయితే తాము ఇలాంటి భయాలను తొలగించేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నామని ఆయన చెప్పారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసేందుకు అవసరమైన పెట్టుబడి పెట్టేందుకు కూడా టిఎస్ఎస్‌సి సిద్ధంగా ఉందని, దీని ద్వారా టెలికాం రంగంలోని వివిధ ఉత్పత్తులకు సంబంధించి శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఇలాంటి వెంచర్‌కు టవర్ కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయన్నారు. శిక్షణా కేంద్రం ఏర్పాటు కోసం తాము పెట్టుబడి పెడతామని, సిఎస్ఆర్ కింద వాళ్లు ఎక్విప్‌మెంట్‌ను అందజేస్తారని, శిక్షణ పొందిన వారిని ఆ కంపెనీలు నియమించుకునే అవకాశం కల్పిస్తామని కొచ్చార్ వివరించారు.

3 బ్యాంకుల్లో 379 కోట్లకు టోపీ

నకిలీ దస్తావేజులతో భారీ మోసం.. 'నాదెళ్ల' జువెలరీపై సీబీఐ కేసు

చెన్నైలో షోరూమ్‌కు తాళం

చెన్నై(ఆంధ్రజ్యోతి): నకిలీ దస్తావేజులతో మూడు బ్యాంకులను నిండా ముంచిన మరో కేసు బయటకు వచ్చింది. ఆయా బ్యాంకుల నుంచి రూ.379 కోట్ల మేరకు రుణాలు పొంది మోసం చేసిన చెన్నైలోని నాదెళ్ల సంపత్ జువెలరీ సంస్థ యజమానులపై సిబిఐ కేసులు నమోదు చేసింది. చెన్నైలోని ప్యారిస్ కార్నర్, మైలాపూర్, టి.నగర్ ప్రాంతాల్లో నాదెళ్ల నగల దుకాణాలు ఉన్నాయి. నగల కొనుగోలుకు వాయిదాల పద్ధతితో డబ్బులు చెల్లించినవారికి గడువు ముగిసినా నగలు ఇవ్వకుండా మోసగించిన విషయం గత అక్టోబరులో వెలుగుచూసింది. కొద్ది రోజుల తర్వాత దుకాణాలు మూతపడ్డాయి. ఈ నేపథ్యంలో నాదెళ్ల సంపత్ జ్యువెలరీ సంస్థ నకిలీ దస్తావేజులు సమర్పించి మూడు బ్యాంకుల్లో రుణాలు పొంది మోసగించినట్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) చెన్నై రీజినల్ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్ సిబిఐ అధికారులకు ఫిర్యాదు చేశారు. జువెలరీ సంస్థ తమ దుకాణాల్లో బంగారు, వజ్రాల నగల నిల్వలు అత్యధికంగా ఉన్నట్లు



తప్పుడు రికార్డులు సమర్పించి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకుల్లో కోట్లాది రూపాయల మేరకు రుణాలు పొంది తిరిగి చెల్లించలేదని, మూడు బ్యాంకులకు ఆ సంస్థ వడ్డీతో సహా రూ.379 కోట్ల మేరకు చెల్లించాల్సి ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదును స్వీకరించిన సిబిఐ అధికారులు నాదెళ్ల జువెలరీ సంస్థ ఎండి రంగనాథగుప్తా, డైరెక్టర్లు ప్రసన్నకుమార్, ప్రసన్నకుమార్ తదితరులపై ఐపిసి409, 420, 467, 468, 471, 13(2) 13(1)(డి) వంటి ఏడు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. త్వరలో ఆ ముగ్గురినీ అరెస్టు చేయనున్నారు.

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 3.60 — నెక్ (100 గుడ్లు)



హైదరాబాద్	300.00	చిత్తూరు	348.00
వరంగల్	302.00	చెన్నై	355.00
విజయవాడ	305.00	నమక్కల్	345.00
గోదావరి	305.00	బెంగళూరు	335.00
విశాఖపట్నం	305.00	ముంబై	340.00

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	62.00	విజయవాడ	63.00
కరీంనగర్	63.00	గుంటూరు	63.00
వరంగల్	62.00	ఒంగోలు	65.00
మహబూబ్‌నగర్	62.00	చిత్తూరు	59.00
కర్నూలు	62.00	నెల్లూరు	59.00
విశాఖపట్నం	67.00	అనంతపురం	60.00
గోదావరి	63.00		

ఈ వారంలో కూడా దిగువకే...

ఆస్ట్రో గైడ్

(మార్చి 26-28 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

గత వారం నిఫ్టీ : 9998 (-197)

నిఫ్టీ గత వారం 10227-9952 పాయింట్ల పరిధిలో కదలాడి 197 పాయింట్ల నష్టంతో కనిష్ఠ స్థాయికి చేరువలో 9998 వద్ద క్లోజయింది. వరుసగా నాలుగో వారంలో కూడా నెగెటివ్‌గానే క్లోజవడం, ఈ వారంలో మూడే ట్రేడింగ్ దినాలుండడం వల్ల ఐదో వారంలో సైతం నష్టాలతో దిగువ స్థాయిలోనే ముగిసే ఆస్కారం ఉంది.

- చంద్రుడు కుంభ, మీనరాశుల సంచార సమయంలో నిఫ్టీ 10420-10180 మధ్యన 240 పాయింట్ల పరిధి ఏర్పడింది. గత సోమవారంనాటి కదలికల్లో ఈ రెండు స్థాయిలను బ్రేక్ చేసి చివరికి 9952 కన్నా దిగజారింది.
- స్వల్పకాలిక ట్రెండ్ చాలా బేరిష్‌గా మారింది. మధ్యకాలిక ధోరణిలో తటస్థంగాను, దీర్ఘకాలిక ధోరణిలో బుల్లిష్‌గాను ఉంది. 10300 కన్నా పైన ముగిస్తే స్వల్ప కాలంలో కూడా బుల్లిష్ అవుతుంది.
- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 10315, 10554, 10465, 10172 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 200 డిఎంఎ కన్నా దిగువకు వచ్చినప్పటికీ 50 డిఎంఎ ఇప్పటికీ 200 డిఎంఎ కన్నా పైనే ఉండడం దీర్ఘకాలిక ట్రెండ్ చెక్కు చెదర లేదనేందుకు సంకేతం.
- ప్రస్తుతం నిఫ్టీ అన్ని డిఎంఎల కన్నా దిగువకు వచ్చింది. నిఫ్టీ 200 డిఎంఎ కన్నా పైన ఉండడం 50 డిఎంఎ 200 డిఎంఎ కన్నా పైకి రావడం (గోల్డెన్ క్రాస్) దీర్ఘకాలిక ట్రెండ్ బుల్లిష్‌గా ఉందనేందుకు సంకేతం.

గ్రహగతులివే..

- కర్కాటకంలోని పునర్వసు పాదం 4 నుంచి సింహంలోని మఖ పాదం 1 మధ్యలో చంద్ర సంచారం
- మీనంలోని ఉత్తరాభాద్ర పాదం 3-4 మధ్యలో రవి సంచారం
- మీనంలోని రేవతి పాదం 2లో వక్రగతిలో బుధ సంచారం
- మీనంలోని రేవతి పాదం 4 నుంచి మేషంలోని మఖ పాదం 1లో శుక్ర సంచారం
- ధనస్సులోని మూల పాదం 3-4 మధ్యలో కుజ సంచారం
- ధనుస్సులోని పూర్వాషాఢ పాదం 1లో సింహ నవాంశలో శని సంచారం
- తులలోని విశాఖ పాదం 3లో మిథున నవాంశలో వక్రగతిలో బృహస్పతి సంచారం
- కర్కాటకంలో ఆశ్లేష పాదం 1లో రాహువు, మకరంలో శ్రవణం పాదం 3లో కేతువు ధనుస్సు, మిథున నవాంశల్లో సంచారం.

బ్రేకౌట్ స్థాయి : 10300

బ్రేక్‌డౌన్ స్థాయి : 9850

నిరోధ స్థాయిలు : 10150, 10225, 10300 (10075 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు : 9850, 9775, 9700 (9925 దిగువన బేరిష్)

ఇన్వెస్టర్లకు సూచన

వారం ప్రారంభ స్థాయి అత్యంత కీలకం. ఇండెక్స్ గత వారం ప్రారంభ స్థాయి కన్నా పైన ట్రేడవుతూ ఉంటే లాంగ్ పొజిషన్లను పరిశీలించవచ్చు.

ముగింపు సెషన్ మెరుగు (సోమవారానికి)

తిథి: చైత్ర శుద్ధ దశమి నక్షత్రం : పునర్వసు, పుష్యమి

అశ్విని, మఖ, మూల నక్షత్ర జాతకులు, సింహ, ధనుస్సు రాశులవారు అప్రమత్తంగా ఉండాలి.

ట్రెండ్ మార్పు వేళలు : 12.54

ధోరణి: గ్రహగతులను బట్టి మెరుగ్గా ప్రారంభమై 10.20 నుంచి 12.30 వరకు నిస్తేజంగా ట్రేడయి 1.30 నుంచి చివరి వరకు మెరుగ్గా ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

ట్రేడింగ్ వ్యూహం...

నిఫ్టీ ఫ్యూచర్స్ 10.30 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా దిగువన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో షార్ట్ పొజిషన్లు తీసుకుని 12.30 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 1.30 తర్వాత ఎటిపి కన్నా పైకి వస్తే లాంగ్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయానికి క్లోజ్ చేసుకోవాలి.

నిరోధం : 10040, 10075 **మద్దతు స్థాయిలు:** 9960, 9925

గమనిక: ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

మూడో వంతు సంస్థల షట్ డౌన్!

- అందులో సగం గత ఏడాదిలోనే మూసివేత
- డొల్ల కంపెనీలపై కేంద్ర ప్రభుత్వం చర్యలు..
- నిబంధనల అమలులో వైఫల్యమే కారణం



న్యూఢిల్లీ: రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ (ఆర్ఒసి) వద్ద నమోదైన కంపెనీల్లో మూడింట ఒక వంతు ఇప్పటికే మూతబడ్డాయని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. అందులో సగం సంస్థలు గత సంవత్సరంలోనే దుకాణం కట్టేశాయట. కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ డేటా ప్రకారం.. ఈ జనవరి 31 నాటికి ఆర్ఒసి వద్ద 17 లక్షల కంపెనీలు రిజిస్ట్రేషన్ చేసుకున్నాయి. అందులో 5,38,000 సంస్థలు (దాదాపు 32 శాతం) ఇప్పటివరకు మూతబడగా.. వాటిలో 2,38,000 (మొత్తం కంపెనీల్లో 15 శాతం) గత సంవత్సరంలోనే షట్ డౌన్ అయ్యాయి. అంటే, 2017లో ప్రతి ఏడు కంపెనీల్లో ఒకటి మూతబడిందన్నమాట.

మనీ లాండరింగ్‌కు వేదికగా మారిన షెల్ కంపెనీలపై కొరడా ఝుళిపించిన కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ.. గత ఏడాది లక్షలాది సంస్థల రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసింది. నిబంధనలను పాటించడంలో వైఫల్యం సంస్థలు మూతబడటానికి మరో ప్రధాన కారణం. కంపెనీ ఏర్పాటైన ఏడాదిలో వ్యాపారం ప్రారంభించలేకపోయినా, తగినంత మూలధనం లేకపోయినా, వరుసగా రెండేళ్లపాటు ఏ వ్యాపారం చేయకపోయినప్పటికీ అచేతన కంపెనీగా ఉండేందుకు దరఖాస్తు చేసుకోకపోయినా కంపెనీల చట్టం 2013లోని సెక్షన్ 248 ప్రకారంగా ఆ సంస్థల పేర్లను కొట్టివేసే అధికారం ఆర్ఒసికి ఉంటుంది. ఇప్పటివరకు మూతబడిన 5.38 లక్షల కంపెనీల్లో 4.95 లక్షలు ఈ కారణాల వల్లే మూతబడ్డాయి.

పిఎస్‌బిలను ప్రైవేటీకరించాల్సిందే

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ బ్యాంకు (పిఎస్‌బి)లను ప్రైవేటీకరించడమే మంచిదని నీతి ఆయోగ్ మాజీ చీఫ్ అరవింద్ పనగడియా మరోసారి స్పష్టం చేశారు. అయితే దేశంలోనే అతి పెద్ద బ్యాంక్ అయిన ఎస్‌బిఐని మాత్రం ప్రభుత్వ రంగంలోనే కొనసాగించడం మంచిదన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల తర్వాత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలనుకునే పార్టీలు తమ ఎన్నికల ప్రణాళికల్లోనూ ఈ విషయాన్ని చేర్చాలని సూచించారు. పిఎస్‌బిల ప్రైవేటీకరణ వాదనకు కుంభకోణాలు, మొండి బకాయిలు కూడా కారణమన్నారు. ఉత్పాదకత, నిర్వహణ సామర్థ్యం పరంగా చూసినా, ప్రభుత్వం పిఎస్‌బిలపై పెత్తనం వదులుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. పెద్ద మొత్తంలో డిపాజిట్లు కలిగి ఉన్నా, పిఎస్‌బిల మార్కెట్ విలువ పడిపోతున్న విషయాన్ని పనగడియా గుర్తు చేశారు. పిఎస్‌బిల ద్వారానే సమాజంలోని అన్ని వర్గాలకు రుణ వితరణ సాధ్యమన్న వాదనని కొట్టివేశారు.

పెరగనున్న 'ఇబి-5' వీసాల పెట్టుబడి పరిమితి

గణనీయంగా తగ్గనున్న భారతీయుల అప్లికేషన్లు

ముంబై : సంపన్నులైన విదేశీయులు కూడా ఇక అమెరికాలో సెటిల్ కావడం అంత తేలిక కాదు. పెట్టుబడులతో ముడిపెట్టి 'ఇబి-5' పేరుతో వీరికి ఇచ్చే వీసాల పెట్టుబడి పరిమితిని ప్రస్తుత ఐదు లక్షల డాలర్ల (సమారు రూ.32.5 లక్షలు) నుంచి 13 లక్షల డాలర్లకు (సుమారు రూ.84.5 లక్షలు) పెంచాలని ట్రంప్ సర్కార్ భావిస్తోంది. ప్రస్తుతం ప్రతిపాదన దశలోనే ఉన్న ఈ ప్రతిపాదన ఈ సంవత్సరం చివరిలోగా అమలులోకి వస్తుందని అంచనా. ఇదే జరిగితే ఈ వీసాల కోసం భారత్ నుంచి వచ్చే దరఖాస్తులు 50 నుంచి 80 శాతం వరకు తగ్గుతాయని ఈ వీసాలకు సంబంధించిన సేవలు అందించే కేన్‌ఆమ్ ఇన్వెస్టర్ సర్వీసెస్ అనే సంస్థ అంచనా. ప్రస్తుతం ఇబి-5 వీసాల కోసం ఎక్కువగా దరఖాస్తు చేసే వారిలో భారతీయులు రెండో స్థానంలో ఉన్నారు. 2014తో పోలిస్తే ఈ కేటగిరిలో మన దేశానికి మంజూరయ్యే వీసాల సంఖ్య ఇప్పటికే రెట్టింపైంది. 2016లో మన దేశం నుంచి 354 మంది ఇబి-5 వీసాల కోసం దరఖాస్తు చేశారు. 2017 నాటికి ఇది 500కు చేరింది. ఏటా ఈ సంఖ్య 30-40 శాతం చొప్పున పెరుగుతోంది.

ఈ సంవత్సరం కూడా ఇదే స్థాయిలో ఉంటుందని అంచనా. పెట్టుబడుల పరిమితి పెంచడం ద్వారా అమెరికాలో శాశ్వతంగా స్థిరపడేందుకు వచ్చే విదేశీయుల సంఖ్యను నియంత్రించాలని ట్రంప్ సర్కార్ భావిస్తోంది.

ఇబి-5 వీసా అంటే?

విదేశీయులు అమెరికాలో పెట్టుబడులు పెట్టడాన్ని ప్రోత్సహించేందుకు 'ఇబి-5 పేరుతో ఎంప్లాయ్‌మెంట్ బేస్‌డ్ ఫిఫ్త్ ప్రిఫరెన్స్ క్యాటగిరి వీసాలు జారీ చేస్తారు. ప్రస్తుతం ఈ వీసాల కోసం దరఖాస్తు చేసే వ్యక్తులు కనీసం ఐదు లక్షల డాలర్లు ఇన్వెస్ట్ చేయగలిగి, పది మందికి తగ్గకుండా స్థానిక అమెరికన్లకు ఉద్యోగాలు కల్పించగలగాలి. ఇపుడు ఈ పెట్టుబడి పరిమితిని ఏకంగా 13 లక్షల డాలర్లకు పెంచేయాలని ట్రంప్ సర్కార్ భావిస్తోంది.



ట్రెండ్ బలహీనం, మద్దతు 9900

టెక్ వ్యూ





వి సుందర్ రాజా

నిఫ్టీ గత వారంలో కూడా అంతకు ముందు వారాల బలహీనతను కొనసాగిస్తూ ప్రధాన మద్దతు స్థాయి 9950 కన్నా దిగువకు వెళ్లింది. శుక్రవారంనాడు మైనర్ రికవరీ సాధించినా మానసిక అవధి 10000 కన్నా దిగువనే బలహీనంగా ముగిసింది. రానున్న కాలంలో మరింత బలహీనత ఉంటుందనేందుకు ఇది సంకేతం. వీక్లీ చార్టుల్లో కూడా బ్రేక్‌డౌన్ సాధించి కీలక మానసిక అవధి కన్నా దిగజారడం తక్షణ ర్యాలీ అవకాశాలు కోల్పోయిందనేందుకు సంకేతం. స్వల్పకాలిక అప్‌ట్రెండ్ ఆశలు కొనసాగించాలంటే 10000 వద్ద బౌన్స్‌బ్యాక్ తప్పనిసరి. టెక్నికల్‌గా ప్రస్తుతం స్వల్పకాలిక కరెక్షన్‌లో ఉంది.

బుల్లిష్ స్థాయిలు...

ప్రధాన నిరోధం 10000. కొద్ది రోజుల క్రితం వరకు నిరోధంగా ఉన్న ఈ స్థాయి మద్దతుగా మారింది. ట్రెండ్‌లో సానుకూలత కోసం ఈ స్థాయి కన్నా పైన బలంగా క్లోజ్ కావాలి. ఈ స్థాయి కన్నా పైన కనీసం రెండు రోజుల పాటు బలంగా కన్సాలిడేట్ అయినప్పుడే స్వల్పకాలిక అప్‌ట్రెండ్ ఏర్పడుతుంది.

బేరిష్ స్థాయిలు...

శుక్రవారం నాటి అమెరికన్ స్టాక్ మార్కెట్ బలహీనత కారణంగా డౌన్‌ట్రెండ్‌లో ప్రవేశిస్తే 9900 వద్ద గట్టి మద్దతు ఉంది. ఈ స్థాయి కన్నా దిగజారితే మరింత కరెక్షన్‌లో పడుతుంది. మరో ప్రధాన మద్దతు స్థాయి 9700. గతంలో సెప్టెంబరు 29వ తేదీన వీక్లీ చార్టుల్లో నమోదైన కనిష్ఠ స్థాయి ఇదే.

సోమవారం స్థాయిలివే...

నిరోధం: 10020, 10100
మద్దతు : 9900, 9840

బ్యాంక్ నిఫ్టీ: గత వారంలో బ్యాంక్ నిఫ్టీ 24000 పాయింట్ల వద్ద నిలదొక్కుకోలేక ప్రధాన మద్దతు స్థాయి 23600కి చేరువయింది. గత ఏడాది సెప్టెంబరు 29న నమోదైన ప్రధాన కనిష్ఠ స్థాయి ఇదే. ఇక్కడ రికవరీ తప్పనిసరి.

స్వల్పకాలిక వ్యూహం : 10000 వద్ద బలమైన కన్సాలిడేషన్ ఏర్పడినప్పుడే గట్టి స్టాప్‌లాస్‌తో స్వల్పకాలిక బై పొజిషన్లు తీసుకోవలసి ఉంటుంది.

పాటర్న్ : గత వారంలో 10000 వద్ద "అడ్డంగా కనిపిస్తున్న రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" కన్నా దిగజారింది. స్వల్పకాలిక అప్‌ట్రెండ్ కోసం ఈ రేఖ కన్నా పైన బలమైన కన్సాలిడేషన్ అవసరం. 9700, 9500 వద్ద "అడ్డంగా కనిపిస్తున్న ట్రెండ్‌లైన్" వద్ద బలమైన మద్దతు ఉంది. గత వారంలో ప్రధాన 200 డిఎంఎ కన్నా దిగజారడం బలహీనత సంకేతం. అయితే స్వల్పకాలిక ఓవర్‌సోల్ట్ స్థితిలోకి వెళుతున్నందు వల్ల కనిష్ఠ స్థాయిల్లో రికవరీ ఉండవచ్చు.

టైమ్ : ఈ సూచిక ప్రకారం బుధవారం మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

మణప్పురం ఫైనాన్స్ (రూ.106)- కొనుగోలు స్థాయిలకు చేరువలో..

రూ.102 ఎగువన అప్‌ట్రెండ్	మొదటి నిరోధం రూ.112	రెండో నిరోధం రూ.125
రూ.97 దిగువన డౌన్‌ట్రెండ్	మొదటి మద్దతు రూ.91	రెండో మద్దతు రూ.84

హెచ్‌సిఎల్ టెక్నాలజీ (రూ.957)- కొనుగోలు స్థాయిలకు చేరువలో..

రూ.950 ఎగువన అప్‌ట్రెండ్	మొదటి నిరోధం రూ.980	రెండో నిరోధం రూ.1030
రూ.930 దిగువన డౌన్‌ట్రెండ్	మొదటి మద్దతు రూ.900	రెండో మద్దతు రూ.870

వాసిరాజు సుందర్ రాజా
www.sundartrends.in

ఆంధ్రజ్యోతి

andhrajyothibusiness@gmail.com

బిజినెస్ ప్లస్

విజయవాడ • సోమవారం 26 మార్చి 2018

ఎగుమతుల రిఫండ్స్ త్వరగా రావాలంటే ?

రిఫండ్స్ ప్రక్రియ అనేది ఏ పన్ను వ్యవస్థలోనైనా ముఖ్య పాత్ర పోషిస్తుంది. జిఎస్‌టికి సంబంధించి వివిధ రకాల రిఫండ్స్ అమల్లో ఉన్నప్పటికీ, ఎగుమతులు చేసిన వస్తువులపై చెల్లించిన ఐజిఎస్‌టి రిఫండ్ పొందే విషయంలో ఎగుమతిదారులు కొంత ఇబ్బందుల ఎదుర్కొంటున్నారు. రిఫండ్ పొందటానికి సమయం కూడా పడుతోంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తోంది. అధికారులు, ఎగుమతిదారులతో ముఖాముఖి సమావేశాలు జరిపి పరిస్థితిని చక్కదిద్దుతున్నారు.



రాంబాబు గొండాల

జాప్యం ఎందుకు..

అసలు ఎగుమతులకు సంబంధించిన రిఫండ్స్ ఎందుకు జాప్యం అవుతున్నాయి. త్వరగా రావాలంటే ఎగుమతిదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటో చూద్దాం. మిగతా రిఫండ్స్‌కు దీనికి తేడా ఏమిటంటే, ఇతర తరహా రిఫండ్స్ జిఎస్‌టి విభాగం చూస్తుండగా, ఈ విభాగానికి చెందిన రిఫండ్స్ కస్టమ్స్ పర్యవేక్షణలో సాగుతుంటాయి. దీని కోసం ఆయా ఎగుమతులకు సంబంధించి సమాచారం జిఎస్‌టి నెట్‌వర్క్, కస్టమ్స్ విభాగానికి చేరవేయాల్సి ఉంటుంది. ఉదాహరణకు ఎగుమతిదారులు తమ వస్తువులను ఎగుమతి చేసే సమయంలో షిప్పింగ్ బిల్ అనేది తయారు చేయాల్సి ఉంటుంది. ఇది నింపే సమయంలో ఆయా వస్తువులకు సంబంధించిన జిఎస్‌టి ఇన్వాయిస్ వివరాలను ఇవ్వాల్సి ఉంటుంది. అలాగే, ఆ నెలకు సంబంధించి ఆయా ఎగుమతిదారులు పొందుపరిచే జిఎస్‌టిఆర్ 1లో సంబంధిత కాలమ్‌లో షిప్పింగ్ బిల్ వివరాలను పొందుపరచాల్సి ఉంటుంది. అంటే షిప్పింగ్ బిల్‌లో ఇన్వాయిస్ వివరాలు సరిగ్గాలేకున్నా, నెలవారీ రిటర్న్‌లో షిప్పింగ్ బిల్ వివరాలు సరిగ్గా లేకున్నా సిస్టమ్ ఆ రిఫండ్స్‌ను ప్రాసెస్ చేయటం కష్టం. అలాగే షిప్పింగ్ బిల్‌లో ఇచ్చిన విలువకు ఇన్వాయిస్‌లో ఉన్న విలువకు అంతరం ఉన్నా సమస్య ఉత్పన్నం అవుతుంది.



ఎగుమతిదారులు ఏం చేయాలి..

ఎగుమతిదారులు షిప్పింగ్ బిల్లులో కమర్షియల్ ఇన్వాయిస్ వివరాల బదులు జిఎస్‌టి ఇన్వాయిస్ వివరాలు నమోదు చేయాలి. షిప్పింగ్ బిల్‌కు సంబంధించిన వివరాలు, ఇన్వాయిస్ వివరాలు, ఎగుమతుల విలువ, కట్టాల్సిన ఐజిఎస్‌టి మొత్తం, జిఎస్‌టిఆర్ 1లోని కాలమ్ 6ఎలో జాగ్రత్తగా నింపాలి. ఈ వివరాలన్నీ సంబంధిత షిప్పింగ్ బిల్‌లో ఇచ్చిన వివరాలతో సరిపోయేట్టు జాగ్రత్త తీసుకోవాలి. అలాగే జిఎస్‌టి ఆర్ 3బి లో సంబంధిత 3.1 కాలమ్‌లో ఇచ్చే వివరాలతో సరిపోయేట్లు జాగ్రత్తలు తీసుకుంటే రిఫండ్ త్వరగా మంజూరు కావటానికి అవకాశం ఉంటుంది. ఒకవేళ ఇప్పటికే ఏదైనా తప్పు జరిగి ఉంటే తదుపరి ఫైల్ చేసి జిఎస్‌టిఆర్ 1 రిటర్న్‌లోని కాలమ్ 9లో సరైన వివరాలు నింపటం ద్వారా పొరపాట్లను సరిచేసుకోవచ్చు. ఈ విధంగా కనీస జాగ్రత్తలు తీసుకోవటం ద్వారా ఎగుమతిదారులు సకాలంలో రిఫండ్స్‌ను పొందవచ్చు.



జిఎస్‌టికి సంబంధించిన వీడియోలను https://goo.gl/bzX8s1 ద్వారా వీక్షించవచ్చు.

గమనిక : ఈ వ్యాసాల ద్వారా ఇస్తున్న సమాచారం కేవలం అవగాహన కోసం మాత్రమే. పాఠకులు ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు సంబంధిత చట్టాలు/నిబంధనలను కూలంకషంగా పరిశీలించాలి.



10 పన్ను రిటర్న్‌లు ముఖ్య విషయాలు

ఆదాయ పన్ను పరిధిలోకి వచ్చేవారందరికీ పన్నుల గురించిన పరిజ్ఞానం ఉండాలన్న రూలు లేదు. చాలామంది ఈ వ్యవహారం ఆడిటర్‌కు సంబంధించిందని వదిలేస్తారు. ఆఫీస్‌లో టిడిఎస్ ఎంత కట్ అవుతోంది, పన్ను రాయితీల కోసం ఎప్పటిలోగా ఇన్వెస్ట్ చేయాలి? రిటర్న్స్ ఎప్పటి వరకు దాఖలు చేయవచ్చు? అసెస్‌మెంట్ ఇయర్ అంటే ఏమిటీ, ఫైనాన్షియల్ ఇయర్ అంటే ఏమిటీ.. ఇలాంటి విషయాల్లో కొంత ప్రాథమిక సమాచారం తెలిసి ఉండటం అవసరం. మీ కోసం ఐటికి సంబంధించిన పది ముఖ్య అంశాలు.

ఆర్థిక సంవత్సరం (ఎఫ్‌వై)- మదింపు సంవత్సరం (ఎవై)

మన దేశంలో ఏటా ఏప్రిల్ 1న ప్రారంభమై తదుపరి సంవత్సరం మార్చి 31న ఆర్థిక సంవత్సరం (ఎఫ్‌వై) ముగుస్తుంది. ఈ కాలంలో సంపాదించే ఆదాయాన్నే పన్ను మదింపు కోసం పరిగణనలోకి తీసుకుంటారు. ఒక ఆర్థిక సంవత్సరం ముగిసిన తర్వాత ప్రారంభమయ్యే మరో ఆర్థిక సంవత్సరాన్ని అసెస్‌మెంట్ (మదింపు) సంవత్సరం (ఎవై) అంటారు. ఆర్థిక సంవత్సరంలో సంపాదనపై మదింపు సంవత్సరంలో టాక్స్ రిటర్న్స్ దాఖలు చేయాల్సి ఉంటుంది. ఉదాహరణకు 2017 ఏప్రిల్ 1 నుంచి 2018 మార్చి 31 వరకు ఉండే కాలాన్ని ఆర్థిక సంవత్సరం అని, ఏప్రిల్ 1 నుంచి 2019 మార్చి 31 వరకు ఉండే కాలాన్ని అసెస్‌మెంట్ ఇయర్ లేదా మదింపు సంవత్సరం అని అంటారు.

26ఎఎస్‌లో టిడిఎస్ క్లెయిమ్ చెక్ చేసుకోవడం

ఏటా ఆర్థిక సంవత్సరం ముగిశాక ప్రతి ఉద్యోగి తాను పని చేసిన కంపెనీ నుంచి ఫారమ్-16 పొందవచ్చు. ఈ ఫారమ్‌లో తన జీతం నుంచి టాక్స్ కింద ఎంత డిడక్ట్ అయిందో తెలుసుకోవచ్చు. ఉద్యోగులు కాకుండా ఇతర ఆదాయాలున్న వారు, ఎంత టాక్స్ డిడక్ట్ అయిందో తెలుసుకోవాలంటే మాత్రం ఆన్‌లైన్‌లో ఫారమ్ 26ఎఎస్‌ను చెక్ చేసుకోవాలి. ఈ ఫారమ్‌లో మూలంలో పన్ను కోత(టిడిఎస్)తో పాటు ముందస్తు పన్ను చెల్లింపుల వివరాలూ ఉంటాయి. ఈ ఫారమ్‌లో పేర్కొన్న ఇతర ఆదాయాలు, టిడిఎస్‌లో ఏమైనా తేడాలు కనిపిస్తే రిటర్న్ ఫైల్ చేసే ముందే వాటిని మినహాయించిన వారికి తెలియజేసి సరిదిద్దుకోవచ్చు.

ఐటిఆర్ ఇ-వెరిఫికేషన్

ఏటా ఇన్‌కమ్ టాక్స్ రిటర్న్ (ఐటిఆర్)ఫైల్ చేసిన తర్వాత ఆన్‌లైన్‌లో మన ఐటిఆర్‌ను సరిచూసుకోవాలి. ఇలా సరిచూసుకోకపోవడం ఐటిఆర్ ఫైల్ చేయకపోవడంతో సమానం. బెంగళూరులోకి సిపిసికి పంపించిన ఐటిఆర్-ఫైవ్ రిటర్న్‌ను మాన్యువల్‌గా చెక్ చేసుకోవచ్చు. ఒకవేళ ఎలక్ట్రానిక్ ఫార్మాట్‌లో ఫైల్ చేస్తే నెట్ బ్యాంకింగ్, ఆధార్ ఒటిపి ద్వారా సరిచూసుకోవచ్చు.



అన్ని ఆస్తుల వెల్లడి

ఏటా 50 లక్షల రూపాయల కంటే మించిన రాబడులున్న వారు రిటర్న్ ఫైల్ చేసేనాటికి తమ పేరు మీద ఉన్న స్థిర, చరాస్తుల వివరాలన్నింటినీ విధిగా రిటర్న్‌లో వెల్లడించాలి. లేకపోతే భవిష్యత్‌లో సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుంది.

విదేశీ ఆస్తులు - ఆదాయం

పన్ను చెల్లింపుదారులకు విదేశీ ఆస్తులు లేదా ఆదాయం ఉంటే ఆ వివరాలనూ రిటర్న్‌లో పేర్కొనాలి. అలాగే విదేశాల్లోని బ్యాంకుల్లో ఏమైనా ఖాతాలు ఉంటే ఆ వివరాలూ వెల్లడించాలి. ఆ ఖాతా ఎప్పుడు ఓపెన్ చేశారు? ఆర్థిక సంవత్సరంలో ఆ ఖాతా ద్వారా సమకూరిన వడ్డీ వివరాలూ కూడా ఇవ్వాలి.

గత ఉద్యోగ రాబడులు

చాలా మంది ఉద్యోగులు ఉద్యోగం మారిన తర్వాత కొత్త కంపెనీకి పాత కంపెనీకి సంబంధించిన వివరాలు ఇవ్వరు. దాంతో కొత్త కంపెనీ పాత కంపెనీలో ఉద్యోగి పొందిన జీతాన్ని పరిగణిలోకి తీసుకోకుండానే ఫారమ్ 16 సిద్ధం చేస్తుంది. రిటర్న్ ఫైల్ చేశాక ఐటి శాఖ రెండు కంపెనీల్లో ఉద్యోగి పొందిన ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకొని ఆ ప్రకారమే పన్ను తగ్గింపులు, మినహాయింపులు లెక్కించి మరింత పన్ను కట్టాలని నోటీసులు జారీ చేస్తుంది. తరచూ ఉద్యోగాలు మారే పన్ను చెల్లింపుదారులు ఈ విషయంలో జాగ్రత్తగా ఉండడం మంచిది.

అడ్వాన్స్ టాక్స్ చెల్లింపు

టిడిఎస్ తర్వాత కూడా రూ.10,000 అంత కంటే ఎక్కువ పన్ను చెల్లించాల్సిన వ్యక్తులు, సంస్థలు అడ్వాన్స్ (ముందస్తు) టాక్స్ చెల్లింపు పరిధిలోకి వస్తారు. అయితే వ్యాపారం, వృత్తి ద్వారా ఎలాంటి ఆదాయం లేని సీనియర్ సిటిజన్లు మాత్రం ఎలాంటి ముందస్తు పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు.

వడ్డీ ఆదాయం

ఆదాయ పన్ను చెల్లించేవారిలో దాదాపు సగం మంది ఫిక్స్‌డ్ డిపాజిట్లు, పన్ను ఆదా ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వచ్చే వడ్డీ ఆదాయాన్ని తమ ఐటి రిటర్న్‌లో పేర్కొనడం మర్చిపోతారు. 'కొంత మంది పన్ను చెల్లింపుదారులు ఈ వడ్డీ ఆదాయ పన్ను పరిధిలోకి రాదనుకుంటారు. ఇది కేవలం అపోహ మాత్రమే. సెక్షన్ 80సి కింద ఈ డిపాజిట్లకు పన్ను ఆదా లభించినా, వీటిపై వచ్చే వడ్డీ ఆదాయం మాత్రం పూర్తిగా పన్ను చెల్లింపు పరిధిలోకి వస్తుంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఆదాయ పన్ను చెల్లింపుదారుడు తమ ఐటి రిటర్న్‌లో ఈ విషయం పేర్కొనాలి' అని చార్టర్డ్ అకౌంటెంట్లు చెబుతారు.

ఒరిజినల్స్ అవసరం లేదు

ఐటి రిటర్న్‌లు ఫైల్ చేసేటప్పుడు ఐటి శాఖకు ఎలాంటి అసలు (ఒరిజినల్) పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదు. ఒకవేళ ఎవరైనా సిఎల సాయంతో ఐటి రిటర్న్‌లు సమర్పిస్తుంటే, వారికి కూడా ఈ అసలు పత్రాలు ఇవ్వాల్సిన అవసరం లేదు. కాకపోతే ఏమైనా అనుమానం వస్తే భవిష్యత్‌లో ఎప్పుడైనా ఐటి శాఖ ఈ అసలు పత్రాలు చూపించమని అడగొచ్చు. అందుకోసం వీటి కాపీలు అట్టిపెట్టుకోవడం మంచిది.

టాక్స్ శ్లాబులు

పన్ను చెల్లింపుదారుల వార్షిక రాబడిని బట్టి వేర్వేరు ఆదాయ శ్లాబులు ఉంటాయి. పన్ను చెల్లించే ముందే మీరు ఏ శ్లాబులోకి వస్తారు? ఎంత పన్ను చెల్లించాలి? అనే విషయాలు తెలుసుకోవడం అత్యంత ముఖ్యం. ఈ శ్లాబుల్లో పన్ను రేట్లు అందరికీ ఒకే విధంగా ఉండవు. సీనియర్ సిటిజన్స్‌కు వర్తించే రేట్లు వేరుగా ఉంటాయి. మహిళలకు రేట్లు విడిగా ఉంటాయి. వ్యక్తిగత ఆదాయ పన్ను చెల్లింపుదారులకు సంబంధించి ప్రస్తుతం దేశంలో ఉన్న పన్ను శ్లాబులివే.

60 సంవత్సరాల లోపు రెసిడెంట్, నాన్ రెసిడెంట్ పన్ను చెల్లింపుదారులు

పన్ను పరిధి	పన్ను రేటు (2017-18)
రూ.2.5 లక్షల వరకు	పన్ను లేదు
రూ.2.5-5 లక్షల వరకు	5 శాతం
రూ.5-10 లక్షల వరకు	20 శాతం
రూ.10 లక్షలు మించితే	30 శాతం

60-80 సంవత్సరాల మధ్య ఉన్న సీనియర్ రెసిడెంట్ పౌరులు

పన్ను పరిధి	పన్ను రేటు (2017-18)
రూ.3 లక్షల వరకు	పన్ను లేదు
రూ.3-5 లక్షల వరకు	5 శాతం
రూ.5-10 లక్షల వరకు	20 శాతం
రూ.10 లక్షలు మించితే	30 శాతం

80 ఏళ్లు పైబడిన వయో వృద్ధులు


పన్ను పరిధి	పన్ను రేటు (2017-18)
రూ.5 లక్షల వరకు	పన్ను లేదు
రూ.5-10 లక్షల వరకు	20 శాతం
రూ.10 లక్షలు మించితే	30 శాతం

ప్లస్ సర్‌చార్జ్: వార్షిక ఆదాయం రూ.50 లక్షలు మించితే మొత్తం పన్నులో 10 శాతం, రూ.కోటి మించితే మొత్తం పన్నులో 15 శాతం.

ఇసి, ఎస్‌హెచ్ఇసి : టాక్స్‌లో 3 శాతం, సర్‌చార్జ్

నోట్: వ్యక్తిగత వార్షిక స్థూల ఆదాయం రూ.3.5 లక్షలలోపు ఉంటే సెక్షన్ 87ఎ కింద 100 శాతం ఆదాయ పన్ను లేదా రూ.2,500 (ఏది తక్కువగా ఉంటే అది) రిబేట్‌గా పొందవచ్చు.


2018-19 ఆర్థిక సంవత్సరం నుంచి ఎడ్యుకేషన్ సెస్, సర్‌చార్జ్ ఎడ్యుకేషన్ సెస్ (ఇసి అండ్ ఎస్‌హెచ్ఇసి)ను రద్దు చేసి, ఆ స్థానంలో ఆదాయ పన్నుపై హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సెస్ నాలుగు శాతం సెస్ విధిస్తున్నారు.



నెస్లే ఇండియా

స్విట్జర్లాండ్‌కు చెందిన నెస్లే ఎస్ఎ సబ్సిడరీ కంపెనీ ఇది. దేశవ్యాప్తంగా 8 భారీ ఫ్యాక్టరీలను కలిగి ఉంది. ఇన్‌స్టంట్ నూడుల్స్, బేబీ ఫుడ్ ఉత్పత్తుల్లో దేశంలో నంబర్‌వన్ స్థానాన్ని కలిగి ఉంది. ఇన్‌స్టంట్ కాఫీ, చాక్లెట్స్ విభాగంలో రెండో స్థానంలో ఉంది. గడచిన రెండేళ్లలో 40కి పైగా కొత్త ఉత్పత్తులను మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. ఇందులో కొన్ని పూర్తిగా కొత్త ఉత్పత్తులు కాగా, మరికొన్ని పాత ఉత్పత్తులకు వేరియెంట్స్‌గా మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. కొన్ని గ్లోబల్ బ్రాండ్లను కూడా దేశీ మార్కెట్లోకి వచ్చే ఏడాది కాలంలో ప్రవేశపెట్టడం ద్వారా వాల్యూమ్స్‌లో పెరుగుదలతో పాటు మార్కెట్ వాటాను పెంచుకోవాలని భావిస్తోంది. ప్రధాన బ్రాండ్ మ్యాగీని మళ్లీ మార్కెట్లోకి తీసుకురావటంతో పాటు కొత్త రకాల నూడుల్స్‌ను మార్కెట్లోకి ప్రవేశపెట్టడంలో కంపెనీ ప్రయత్నాలు సఫలం అయ్యాయి. మ్యాగీ నూడుల్స్‌ను నిషేధించటానికి ముందు మార్కెట్ వాటా 75 శాతంగా ఉంది. అనంతరం మళ్లీ మార్కెట్లోకి రావటంతోనే కోల్పోయిన వాటాలో 60 శాతాన్ని తిరిగి చేజిక్కించుకోగలిగింది. మొత్తం రాబడిలో 24.2 శాతం ఈ విభాగం ద్వారానే వస్తోంది.

మ్యాగీ నిషేధానికి ముందు నూడుల్స్ విభాగం 900 కోట్ల రూపాయల టర్నోవర్‌ను కలిగి ఉండగా గత త్రైమాసికంలో 990 కోట్ల టర్నోవర్‌ను సాధించింది. జిఎస్‌టి అమలు తర్వాత చాలా ఆహార ఉత్పత్తులపై పన్ను రేట్లు తగ్గిన కారణంగా కంపెనీ ప్రయోజనం పొందనుంది. కంపెనీ ఉత్పత్తులపై పరోక్ష పన్నులు గణనీయంగా తగ్గాయి. చాక్లెట్స్, మాల్టెడ్ ఫుడ్ డ్రింక్స్‌పై జిఎస్‌టిని 28 నుంచి 18 శాతానికి, పాస్తా, కండెన్స్ మిల్క్‌పై 18 శాతం నుంచి 12 శాతానికి తగ్గించారు. ఈ తగ్గింపు వల్ల వచ్చే ప్రయోజనాన్ని వినియోగదారులకు అందించటం ద్వారా వాల్యూమ్ వృద్ధిని అంచనా వేస్తున్నారు. గత ఏడాది కాలంలో ప్రవేశపెట్టిన కొత్త ఉత్పత్తుల కారణంగా ఇప్పటికే అమ్మకాల్లో వృద్ధి రేటు స్పష్టంగా కనిపిస్తోంది. దీంతో ఆహార ఉత్పత్తుల వృద్ధి రేటు 2018 నుంచి 2019 సంవత్సరాల్లో సగటున 16.6 శాతం పెరిగే అవకాశాలున్నాయి.



ఫండమెంటల్స్

డిసెంబరుతో ముగిసిన నాలుగో త్రైమాసికంలో అమ్మకాలు 15.6 శాతం వృద్ధితో 2,601.46 కోట్ల రూపాయలకు చేరుకున్నాయి. నిర్వహణా లాభం 430 కోట్ల రూపాయల నుంచి 584.56 కోట్ల రూపాయలకు పెరిగింది. నికర లాభం రూ.195.41 కోట్ల రూపాయల నుంచి 311.83 కోట్ల రూపాయలకు చేరుకుంది. కాగా 2017 పూర్తి సంవత్సరానికి అమ్మకాలు 9,409.60 కోట్ల రూపాయల నుంచి 10,135.10 కోట్ల రూపాయలకు చేరుకున్నాయి. 2018 సంవత్సరానికి 11,808.80 కోట్ల రూపాయల అమ్మకాలను సాధించగలదని అంచనా. స్థూల లాభం 491.30 కోట్ల రూపాయల నుంచి 622.30 కోట్ల రూపాయలకు చేరుకోగా స్థూల లాభ మార్జిన్లు 21.9 శాతం నుంచి 23.9 శాతానికి పెరిగాయి. రిటర్న్ ఆన్ ఈక్విటీ 43.4 శాతంతో గరిష్ఠంగా ఉంది. గత నాలుగు త్రైమాసికాలుగా ఇపిఎస్ వృద్ధి రేటు పెరుగుతూ వస్తోంది. డిసెంబరు త్రైమాసికంలో ఇపిఎస్ 86 శాతం వృద్ధి రేటుతో 32.34 రూపాయలుగా నమోదైంది. 2017 సంవత్సరానికి ఇపిఎస్ 58.42 రూపాయల నుంచి 96.10 రూపాయలకు పెరిగింది. కాగా గత జూన్ నెలలో సంస్థాగత ఇన్వెస్టర్ల వాటా 19.77 శాతం ఉండగా డిసెంబరు నాటికి 20.04 శాతానికి పెరిగింది. డిసెంబరు త్రైమాసికంలో మదుపు చేసిన ఎఫ్ఐఐల సంఖ్య 21 నుంచి ఏకంగా 659కి పెరిగింది. అలాగే మ్యూచువల్ ఫండ్స్ సంఖ్య కూడా 5 నుంచి 78 శాతానికి పెరిగింది. గత నాలుగు వారాలుగా 50 వారాల సగటు వాల్యూమ్స్ కన్నా ఎక్కువగా నమోదు కావటంతో అక్యుములేషన్ భారీగా జరుగుతున్నట్లుగా స్పష్టమవుతోంది.

టెక్నికల్స్

ఈ షేరు ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయికి అతి దగ్గరగా ట్రేడవుతోంది. ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయిని చేరుకున్న తర్వాత 11 వారాల కప్ ప్యాట్రన్ నుంచి నాలుగు వారాల క్రితం బ్రేకౌట్ జరిగింది. అప్పటి నుంచి పైవోట్‌కు 1 శాతం పైగా గత నాలుగు వారాలుగా ట్రేడవుతూ ఉంది. 40,10 వారాల మూవింగ్ యావరేజీలకు చాలా ఎగువన ట్రేడవుతోంది. ఓనీల్ రిలేటివ్ ప్రైస్ స్ట్రెంత్ మెరుగుపడుతూ 69కి చేరుకుంది. అలాగే మూమెంటమ్ ఇండికేటర్లన్నీ బుల్లిష్ ధోరణిని కనబరుస్తున్నాయి. ఎడిఎక్స్ 24తో అప్‌ట్రెండ్ బలంగా ఉన్నట్లు తెలుపుతోంది. ఆర్ఎస్ఐ 57 పైగా పటిష్ఠంగా బుల్లిష్ జోన్‌లో ఉంది. ఈ షేరును 7,720 రూపాయల నుంచి 8,040 రూపాయల మధ్య అక్యుములేట్ చేయవచ్చు. స్వల్పకాలిక లక్ష్యం 9,510 రూపాయలు. కాగా వచ్చే 18 నుంచి 24 నెలల కాలంలో లక్ష్యం 11,900 రూపాయలు. పోర్టుఫోలియో క్యాపిటల్ 5 శాతం వెయిటేజీతో ఈ షేరును కొనుగోలు చేయవచ్చు.

- టి బ్రహ్మాచారి
హెడ్, అసోసియేషన్ ఆఫ్ టెక్నికల్ మార్కెట్ ఎనలిస్ట్, హైదరాబాద్ చాప్టర్
tbchary@gmail.com

గమనిక : ఈ శీర్షికలో అందించే రికమండేషన్ల ఆధారంగా జరిపే లావాదేవీలకు ఇన్వెస్టర్లదే పూర్తి బాధ్యత. వారి లాభనష్టాలకు ఆంధ్రజ్యోతి పత్రిక, కాలమిస్ట్ ఎలాంటి బాధ్యత వహించరు. లావాదేవీలు చేపట్టే ముందు మీ వ్యక్తిగత ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ సలహా తీసుకోండి.

క్యాపిటల్ గెయిన్స్‌ను బాండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తున్నారా?

అయితే ఇప్పుడే ఇన్వెస్ట్ చేయడం బెస్ట్.. ఏప్రిల్ నుంచి ఐదేళ్ల లాక్ ఇన్ పీరియడ్

ఇళ్లు, భూములు, భవనాలు వంటి స్థిరాస్తుల్లో పెట్టుబడులపై భారీగా దీర్ఘ కాలిక మూలధన లాభాలు(ఎల్‌టిసిజి) సంపాదించారా? మరైతే ఆ లాభాలను ఏం చేయబోతున్నారు? కొత్తగా ఇళ్లు, భూములు కొనేందుకు ఉపయోగిస్తారా? లేక ఏవైనా బాండ్స్‌లో ఇన్వెస్ట్ చేయాలనుకుంటున్నారా? బాండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తే ఏ రకం బాండ్స్‌లో ఎప్పటిలోగా ఇన్వెస్ట్ చేయాలి? ఈ విషయాలు తెలుసుకోవాలంటే ఈ స్టోరీ చదవాల్సిందే.

ఎల్‌టిసిజి పన్ను పోటు

స్థిరాస్తులైతే కొనుగోలు చేసిన రెండేళ్ల తర్వాత, చరాస్తులైతే కొన్న మూడేళ్ల తర్వాత అమ్మితే వచ్చే లాభాలను దీర్ఘకాలిక మూలధన లాభాలు(ఎల్‌టిసిజి) అంటారు. ఇండెక్సేషన్ బెనిఫిట్‌తో కలిపి ఈ లాభాలపై 20 శాతం పన్ను చెల్లించాలి.

పన్ను పోటు తప్పించుకునే మార్గాలు

ఏదైనా ఇంటిని కొన్న రెండేళ్ల తర్వాత అమ్మగా వచ్చే దీర్ఘకాలిక మూలధన లాభాలను, మరో ఇంటిని కొనడం, నిర్మించడం లేదా సెక్షన్ 54ఇసి పేర్కొన్న మూడేళ్ల కాల పరిమితి ఉండే కొన్ని కంపెనీల రుణ పత్రాల్లో(బాండ్స్) ఇన్వెస్ట్ చేయడం ద్వారా పన్ను పోటు తప్పించుకోవచ్చు. మరో ఇంటిని కొనేపనైతే రెండేళ్లలోగా, కొత్త ఇంటిని నిర్మిస్తే మూడేళ్లలోగా ఆ పని పూర్తి చేయాలి. ఇవేవీ వద్దనుకుంటే పాత ఆస్తులను అమ్మిన ఆరు నెలల్లోగా భారత జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఎఐ), గ్రామీణ విద్యుదీకరణ సంస్థ (ఆర్ఇసి) లేదా పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పిఎఫ్‌సి) జారీ చేసే ప్రత్యేక రుణ పత్రా(బాండ్స్)లో ఇన్వెస్ట్ చేయాలి. ఇంటి యాజమాన్యం బదిలీ అయిన తేదీ నుంచి ఈ కాలాన్ని లెక్కిస్తారు.

బాండ్స్ కాల పరిమితి

ప్రస్తుతం ఈ బాండ్స్ కాల పరిమితి మూడేళ్లు. అదీ ఈ నెలాఖరు వరకు ఇన్వెస్ట్ చేసిన వారికి మాత్రమే. ఏప్రిల్ 1 నుంచి ఈ బాండ్స్ కాలపరిమితిని ఐదేళ్లకు పెంచారు. అంటే 2018 ఏప్రిల్ నుంచి తమ దీర్ఘకాలిక మూలధన లాభాలను సెక్షన్ 54ఇసి కింద ఈ బాండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తే, ఐదేళ్ల వరకు పెట్టుబడులు కదిలించేందుకు అవకాశం ఉండదు. ఒకవేళ కదిలిస్తే 20 శాతం పన్ను మినహాయింపు ప్రయోజనం లభించదు. కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి జైట్లీ ఇందుకు సంబంధించి మార్పులు ప్రకటించారు.



వడ్డీ

54ఇసి బాండ్స్‌పై ప్రస్తుతం ఏటా ఒకసారి 5.25 శాతం చొప్పున వడ్డీ చెల్లిస్తున్నారు. వడ్డీ చెల్లింపు తేదీ, కనీస పెట్టుబడి ఈ బాండ్స్ జారీ చేసే సంస్థలను బట్టి మారుతుంటుంది. ఈ వడ్డీ ఆదాయాన్ని ఆయా వ్యక్తుల మొత్తం ఆదాయంలో కలిపి, ఆయా శ్లాబుల ప్రకారం పన్ను విధిస్తారు.

ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని తమ దీర్ఘకాలిక మూలధన లాభాలను సెక్షన్ 54ఇసి కింద బాండ్స్‌లో ఇన్వెస్ట్ చేయాలనుకునే ఇన్వెస్టర్లు ఈ నెలాఖరులోగా ఆ పని పూర్తి చేయడం మంచిది. ఆలస్యం చేస్తే పెట్టుబడులను మూడేళ్లకు బదులు, ఐదేళ్ల వరకు కదిలించేందుకు అవకాశం ఉండదు.



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న బాలకృష్ణ

బీజేపీతో యుద్ధం చేస్తున్నాం: బాలకృష్ణ

హిందూపురం, మార్చి 25: వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం ఇవ్వాల్సిన నిధులను ఇవ్వకుండా కేంద్రం మొండిచేయి చూపుతున్న బీజేపీతో యుద్ధం చేస్తున్నామని హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ అన్నారు. అనంతపురం జిల్లా లేపాక్షి ఉత్సవాల్లో భాగంగా ఆదివారంకొడికొండ చెక్‌పోస్టు నుంచి లేపాక్షి నంది విగ్రహం వరకు నిర్వహించిన సైకిల్ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. 2014-15 ఆర్థిక సంఘం కింద ఏపీలోని వెనుకబడిన రాయలసీమ నాలుగు జిల్లాలు, ఉత్తరాంధ్ర మూడు జిల్లాలకు ప్రత్యేక నిధుల కింద కేంద్రం రూ. 1050 కోట్లు కేటాయించిందన్నారు. ఈ నిధుల్లో ఇప్పటికే రూ.954 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఇప్పుడు వెనుకబడిన జిల్లాలకు ఇవ్వాల్సిన నిధులను ఇవ్వకుండా పీఎంవో నిరాకరిస్తుందన్నారు.

ప్రత్యేక హోదాపై తొందరెందుకు?: సుమన్

నెల్లూరు(సాంస్కృతిక ప్రతినిధి), మార్చి 25: కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇచ్చేందుకు ఇంకా వ్యవధి ఉందని, ఈలోగా తొందరపడడం ఎందుకని? సినీ నటుడు సుమన్ ప్రశ్నించారు. నెల్లూరులోని పురమందిరంలో ఆదివారం సింహపురి సంస్కృతి సమాఖ్య ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాన్ని ఆయన అందుకున్నారు. అనంతరం మాట్లాడుతూ హోదా కోసం ఇంకా ఏడాది వ్యవధి ఉందని, ఈ లోపే నలుగురూ నాలుగు వైపులా మాట్లాడటం సమంజసం కాదని పేర్కొన్నారు.

హోదా ఉద్యమానికి 'మా' మద్దతు

అమరావతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీల మేరకు ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని అంశాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సాధన సమితి చేస్తున్న ఉద్యమానికి మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్(మా) సంపూర్ణ మద్దతు తెలిపిందని సాధన సమితి కార్యదర్శి, సీపీఐ నేత కె.రామకృష్ణ తెలిపారు. ఆదివారం సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాసరావుతో కలిసి మా అధ్యక్షులు శివాజీరాజా, ఏడిది శ్రీరాం, బెనర్జి, నాగినీడు, రఘును హైదరాబాద్‌లోని మా కార్యాలయంలో కలిశామని చెప్పారు. ఆర్థాంతరంగా విభజించబడిన ఏపీ పరిస్థితి గురించి వారికి వివరించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ వైఖరితో విసుగుచెందిన ప్రజలు పోరాటాలకు సన్నద్ధమయ్యారని వివరించామన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా అవసరమని గుర్తించిన మా అసోసియేషన్ కూడా ఉద్యమానికి సంపూర్ణ మద్దతు, సంఘీభావం తెలియజేస్తున్నట్లు ప్రకటించిందని రామకృష్ణ తెలిపారు.

ఆ సత్తా చంద్రబాబుకే ఉంది: కేఈ



కర్నూలు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కేంద్రంపై అవిశ్వాసం అనగానే ముఖ్యమంత్రి చంద్రబాబుకు అనేక పార్టీలు మద్దతుగా నిలిచాయని, దేశంలో చక్రం తిప్పగల సత్తా ఆయనకు ఉందని ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి అన్నారు. కర్నూలు నగరంలోని ప్రభుత్వ అతిథి గృహంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రానికి న్యాయం జరిగేదాక పోరాటం ఆగదని అన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం తమ పార్టీ ఎంపీలు పార్లమెంట్ లోపల, బయట ఆందోళన చేస్తుంటే చర్చలకు ఎందుకు పిలవడం లేదని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. చంద్రబాబు అనుకుంటే ఏదైనా సాధించగలనని, ఎన్టీఆర్ స్ఫూర్తితో యునైటెడ్ ఫ్రంట్‌కు జీవం పోయగల సత్తా ఉందని అన్నారు. తెలంగాణ సీఎం కేసీఆర్ ఆహ్వానిస్తే ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు అంశం అప్పుడు పరిశీలిస్తామని, ఇప్పటికి ఎలాంటి ఆలోచన లేదన్నారు.

ప్రజలా.. పార్టీనా?

దిక్కుతోచని బీజేపీ నేతలు.. టీడీపీ 'అటాక్'తో విలవిల

- పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డామా?
- వలస నేతల ఉక్కిరిబిక్కిరి

అమరావతి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మారిన రాజకీయ పరిస్థితులు బీజేపీ నేతలను సంకట స్థితిలో పడేశాయి. వారి పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యిలా తయారైంది. వాస్తవానికి 'దేశం ముందు.. ఆ తర్వాతే పార్టీ.. ఆపై స్వలాభం' అని బీజేపీ నేతలు నిత్యం కార్యకర్తలకు నూరిపోస్తుంటారు. ఇదే ఇప్పుడు రాష్ట్రంలోని బీజేపీ నేతలను కలవరపెడుతోంది. పార్టీ సిద్ధాంతానికి భిన్నమైన పరిస్థితులు ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాల్లోనూ కనిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రయోజనాల కోసం గొంతెత్తితే పార్టీ నుంచి వేటు తప్పదు. ఒకవేళ పార్టీ ప్రయోజనాల కోసం పని చేస్తే రాజకీయంగా సమాధే. ఈ రెండు దారుల్లో దేనిని ఎంచుకోవాలో తెలియని స్థితిలో నేతలు, కార్యకర్తలు ఉన్నారు. కాంగ్రెస్ పార్టీకి పట్టిన గతే పడుతుందని కొందరు నాయకులు అరో ర్ధనం చెందుతుండగా.. ఇంకొందరు పార్టీయే ముఖ్యమని దూకుడు ప్రదర్శిస్తున్నారు. 2014లో మోదీ ప్రభంజనాన్ని చూసి రాజకీయంగా ఏదో మంచి జరుగుతుందనే ఆశతో బీజేపీలో చేరిన వారు 'పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డామా?' అ. తీవ్ర ఆందోళనలో ఉన్నారు. టీడీపీని దూరం చేస్తే పార్టీని బలపరిచి వైసీపీతో బేరం ఆడొచ్చని.. ఆ విధంగా తమకు మళ్లీ మంచిరోజులు వస్తాయని ఇన్నాళ్లూ ఆశించారు. సీఎం చేస్తున్న దాడితో ఇటు వైసీపీతో పొత్తుపెట్టుకోలేని వాతావరణం నెలకొందని వాపోతున్నారు. మోదీ, బీజేపీ ద్రోహం చేశారనే భావన తెలుగు ప్రజల్లో బలంగా నాటుకుపోయిందని, పైగా బీజేపీ కన్నా కాంగ్రెస్సే నయమనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయని చెబుతున్నారు. దాంతో సొంతగూటికి వెళ్లలేక, బీజేపీలో ఉండలేక తలలు పట్టుకుంటున్నారు. ఇటీవల విశాఖలో అటూరి కిశోర్ కుమార్‌కు ఎదురైన పరిస్థితిని ఉదహరిస్తున్నారు. విశాఖ లోక్‌సభ స్థానం నుంచి కంభంపాటి హరిబాబు రైల్వే జోన్ ప్రధాన అజెండాగా ఎన్నికల బరిలో దిగి వైఎస్ జగన్ తల్లి విజయలక్ష్మిని లక్ష ఓట్ల మెజారిటీతో ఓడించారు. ఇప్పుడా విషయం అడిగినందుకే కిశోర్‌పై వేటేశారు. ఉత్తరాంధ్ర ప్రజలకు రైల్వేజోన్ సెంటిమెంట్. అయితే ఇలాంటి సెంటిమెంట్లను గౌరవించబోం అని కేంద్రం స్పష్టంగా చెబుతోంది. అంటే రైల్వే జోన్ కూడా ప్రత్యేక హోదా తరహాలో రానట్లే అని ప్రజలు ఒక నిర్ణయానికి వచ్చారు. ఈ పరిస్థితిలో అక్కడి బీజేపీ నేతలకు ఏమి మాట్లాడాలో కూడా తెలియని పరిస్థితి. బీజేపీకి ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఉన్న విశాఖపట్నంలోనే ఇలా ఉంటే.. మిగతాచోట్ల అసలు నోరు విప్పలేని దుస్థితిలో బీజేపీ నేతలున్నారు.

ప్రజలకు ఏం చెబుతాం?

హిందుత్వానికి ప్రాధాన్యం ఇచ్చే మోదీ తిరుపతిలో ఇచ్చినమాట తప్పారని టీడీపీ చేస్తోన్న దాడి బీజేపీ నేతలను గుక్క తిప్పుకోనీయడంలేదు. 'నాలుగేళ్లుగా ఇదిగో అదిగో అన్నాం.. ఇతర రాష్ట్రాలకు ఇచ్చినట్లే ఏపీకి నిధులు ఇచ్చినట్లుగా లెక్కలు కనిపిస్తున్నాయి. అంతా ఇచ్చేశాం అంటే ప్రజలు అమాయకులా? ఇక ఏమీ ఇవ్వరా?' అని అడుగుతున్నట్లు కొందరు బీజేపీ నేతలు చెబుతున్నారు. 'పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి ఒకప్పుడు విలువ ఉండేది.. పార్టీలో అవకాశాలుండేవి.. ఇప్పుడు ఎవరు ఎక్కడి నుంచి వస్తారో తెలియదు' అని ఓ నేత పేర్కొన్నారు. 'నరసరావుపేటకు చెందిన నరసింహరావును రాజ్యసభకు పంపే ముందు రాష్ట్ర నాయకత్వానికి ఒక్కమాటైనా చెప్పలేదు.. రాష్ట్రం విడిచి ఎప్పుడో వెళ్లిపోయిన రాంమాధవ్ ఇప్పుడు అన్నీ తానే అంటున్నారు.. రేపు ఇంకో ఐపీఎస్ ఎవరో రావచ్చు. అంటే పార్టీ కోసం పనిచేసిన వారికి ఇక్కడ ఏ స్థాయిలో విలువ ఉంటుందో ఇవే ఉదాహరణలు' అని అంటున్నారు. 'నాలుగేళ్ల క్రితం బీజేపీ దేశవ్యాప్తంగా ఎన్నికలకు వెళ్లినప్పుడు వీరంతా ఏపీలో కనిపించారా.? ఇప్పుడు ఎక్కడి నుంచి వస్తున్నారు? ఏపీలో పుట్టి.. రాష్ట్రాన్ని పూర్తిగా వదిలేసి.. ఎక్కడో ఉంటున్న వ్యక్తులు ఇప్పుడు రాష్ట్రానికి వచ్చి వ్యూహాలతో గెలిపిస్తారట. ఆంధ్రులు అంత అమాయకులా.?' అని కాషాయ జెండా మోసిన వారు ఆవేదనతో ప్రశ్నిస్తున్నారు.

పార్టీవైపే సంఘ్ వాదులు!

నాలుగేళ్ల క్రితం రాష్ట్రంలో మోదీకి ఉన్న క్రేజ్ ఏంటి.? ఈ రోజు ప్రధానిపై ప్రజలకున్న అభిమానం ఏంటి.? అనే దానిపై ప్రజా సర్వే చేయిస్తే తెలిసిపోతుందని పార్టీ నేతలు సూచిస్తున్నారు. సరిహద్దుల్లో ఉద్రిక్తతలున్నప్పుడు సైన్యం చేసే పోరాటాలను మనం ఖాతాలో వేసుకున్నట్లే.. టీడీపీ సైతం తెలుగు జాతి, ఆత్మగౌరవం అంటూ బాణాలు సంధిస్తోంది. ఇది రాజకీయ ఎత్తుగడ అని తెలిసినా.. ఏమీ మాట్లాడలేని స్థితిలో ఎందుకున్నామో ఆలోచించుకోవాలని హితవు పలుకుతున్నారు. ఆర్‌ఎస్‌ఎస్ వాదులు మాత్రం పార్టీకి ఒక వ్యూహం ఉందని, పార్టీ ఏది చెబితే అదే చేస్తామని చెబుతున్నారు.





నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న బీఎంఎస్ కార్మికులు

హోదా ఇవ్వని.. బీజేపీ నాశనమైపోతుంది

- బీఎంఎస్‌కు కార్మికుల రాజీనామా

తిరుపతి(పద్మావతినగర్), మార్చి 25: రాష్ట్రంలో బీజేపీ నామరూపాలు లేకుండా నాశనమై పోతుందని బీజేపీ అనుబంధ కార్మికసంస్థ భారతీయ మజ్దూర్ సంఘ్(బీఎంఎస్) చిత్తూరు జిల్లా అధ్యక్షుడు లేబూరు రత్నకుమార్ అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వనందుకు నిరసనగా తిరుపతి గాంధీభవన్‌లోని మహాత్ముని విగ్రహం వద్ద బీఎంఎస్ నాయకులు, కార్మికులు ప్లకార్డులు ప్రదర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రత్నకుమార్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ తిరుపతిలో ప్రత్యేక హోదా ఇస్తామని, ఢిల్లీని మించిన రాజధానిని నిర్మించి ఇస్తామని చెప్పినప్పుడు తాము ఎంతగానో సంతోషించామన్నారు. మోదీపై నమ్మకంతోనే 25 ఏళ్ల ఐఎన్‌టీయూసీలో పనిచేసిన 2 వేలమంది కార్మికులతో కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ సమక్షంలో ఏడాది క్రితం బీఎంఎస్‌లో చేరామని చెప్పారు. అయితే, కార్మికుల సంక్షేమానికి వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకున్నారని చెప్పారు. కనీసం రాష్ట్రానికైనా ఆపన్నహస్తం అందిస్తారని భావించామని, అందుకే ఇంతకాలం వేచిచూశామన్నారు. కానీ, బీజేపీ, మోదీ రాష్ట్రాన్ని మరింతగా దగా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే, బీజేపీ అనుబంధ కార్మిక సంస్థ బీఎంఎస్‌కు మూకుమ్మడిగా రాజీనామా చేస్తున్నామన్నారు.

నేడు వైసీపీ ఎంపీల భేటీ

- సత్తెనపల్లి నియోజకవర్గంలో జగన్ యాత్ర

గుంటూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ప్రజా సంకల్ప యాత్రలో ఉన్న వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సోమవారం వైసీపీ ఎంపీల సమావేశాన్ని గుంటూరు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గం పరిధిలోని ముప్పాళ్ళలో నిర్వహించేందుకు నిర్ణయించారు. జగన్ పాదయాత్ర ఆదివారం నరసరావుపేట మండలం నుంచి ప్రారంభమై సత్తెనపల్లి నియోజకవర్గంలోని ముప్పాళ్ళ మండలం గోళ్ళపాడు మీదుగా ముప్పాళ్ళకు చేరుకుంది. ప్రత్యేక హోదా అంశంతో పాటు పార్లమెంటులో ఎంపీలు అనుసరించాల్సిన వ్యూహాలపై విపక్ష నేత జగన్ చర్చించనున్నారు. ఇప్పటికే ప్రకటించినట్లుగా ఏప్రిల్ ఆరో తేదీన వైసీపీ ఎంపీలతో రాజీనామా చేసే అంశంపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. వైసీపీకి చెందిన ఏడుగురు ఎంపీలు సమావేశానికి హాజరుకానున్నట్లు నేతలు తెలిపారు.



రాజీనామా చేద్దాం రా

- ప్రజాక్షేత్రంలో తేల్చుకుందాం.. వీర్రాజుకు గోరంట్ల సవాల్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 25: "నీకు దమ్ముంటే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చెయ్యి... నేను కూడా రాజీనామా చేస్తా... ఎన్నికలకు వెళ్లి ప్రజాక్షేత్రంలో తేల్చుకుందాం' అంటూ బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజుకు రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి సవాల్ విసిరారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని తన నివాసంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కనీసం వార్డులో కూడా గెలవలేని సోము వీర్రాజు వల్ల ఆ పార్టీ దెబ్బతింటుందని, వీర్రాజు ఇచ్చిన రాంగ్ ఫీడింగే రాష్ట్రంలో రెండు పార్టీల మధ్య స్నేహాన్ని పాడు చేసిందని బుచ్చయ్య మండిపడ్డారు. టీడీపీ వల్ల వచ్చిన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి సత్తా ఉంటే పోటీకి సిద్ధపడాలన్నారు. అమిత్‌షా అబద్ధాలకోరని, రాజకీయ అవసరాల కోసమే కేంద్ర ప్రభుత్వం ఈశాన్య రాష్ట్రాల్లో నిధులు కుమ్మరిస్తోందని ఆయన విమర్శించారు. లక్షల కోట్లు అవినీతి అంటున్న ఈ బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి ఇచ్చింది కేవలం రూ.12,500 కోట్లేనని అన్నారు. మోదీ సారథ్యంలో మరో ముగ్గురు మోదీలు బ్యాంకులను లూటీ చేసి విదేశాలకు పారిపోతే చోద్యం చూశారని, అటువంటి ప్రధాని రాష్ట్రంలో రుణమాఫీ దండగ అనడం ఎంతవరకు సమంజసమని ధ్వజమెత్తారు.

బీజేపీకి వైసీపీ మద్దతు ఎందుకు?

- దళితుల్ని కాషాయ పార్టీ చేతిలో పెడతారా?
- బీజేపీ పట్ల వైఖరేంటో జగన్, పవన్ చెప్పాలి
- అమిత్ షా చెబుతున్నవన్నీ వక్రీకరణలే: శీలం



అమరావతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): బీజేపీపై వైసీపీ, జనసేన తమ వైఖరిని స్పష్టం చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. దళితులను తీసుకెళ్లి బీజేపీ చేతిలో పెడతావా అంటూ జగన్‌ను కాంగ్రెస్ ప్రశ్నించింది. కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం విజయవాడలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రమంతా బీజేపీ మోసాన్ని గర్హిస్తోంటే వైసీపీ మాత్రం ఆ పార్టీకి ఎందుకు మద్దతిస్తుందని శీలం నిలదీశారు. ప్రత్యేక హోదా విషయంలో దాగుడుమూతలు ఆడితే ప్రజలు క్షమించబోరని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ విషయంలో బీజేపీ అధ్యక్షుడి అమిత్‌షా మాటలన్నీ వక్రీకరణలేనని మండిపడ్డారు. అన్ని రాష్ట్రాల్లోని జాతీయ రహదారులకు ఇచ్చినట్లు ఏపీలో రోడ్లకు ఇచ్చిన నిధులు, కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండే విశాఖ ఉక్కు పరిశ్రమకు ఇచ్చిన నిధులు రాష్ట్రానికి ఇచ్చినట్లు ఎలా లెక్కిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉత్తరాఖండ్‌కు చట్టంలో లేకున్నా ప్రత్యేక హోదా ఇచ్చారని, ఏపీ విషయంలో ఎందుకు వివక్ష చూపుతున్నారని ప్రశ్నించారు. విభజన చట్టాన్ని మూడుసార్లు సవరణ చేసిన మోదీ ప్రభుత్వం ఏపీకి హోదా విషయంలో ఎందుకు చేయలేదని అడిగారు. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వస్తే ఏపీకి ప్రత్యేక హోదాపైనే తొలి సంతకం చేస్తామని చెప్పారు. 2019 తర్వాత కాంగ్రెస్ లేకుండా ప్రభుత్వం ఏర్పాటు సాధ్యం కాదని జోస్యం చెప్పారు. రాష్ట్రంలో అవినీతి వల్ల చంద్రబాబు ప్రభుత్వంపై పట్టు కోల్పోయారని జేడీ శీలం వ్యాఖ్యానించారు. అన్ని రాజకీయపార్టీలు సంఘటితమై మోదీ ప్రభుత్వాన్ని గద్దెదించాలని జేడీ శీలం బాపట్లలో అన్నారు. మోదీకి వ్యతిరేకంగా పని చేసే ఏ పార్టీతోనైనా కలిసి నడిచేందుకు కాంగ్రెస్‌పార్టీ సిద్ధంగా ఉందని చెప్పారు.

ప్రాంతీయ పార్టీలతో హోదా రాదు: రఘువీరా

మడకశిర: ప్రాంతీయ పార్టీలతో ప్రత్యేక హోదా సాధించడం సాధ్యం కాదని ఏపీసీసీ చీఫ్ ఎన్.రఘువీరారెడ్డి పేర్కొన్నారు. బ్రిటిష్ వారికి, బీజేపీకి ఏ మాత్రం తేడా లేదన్నారు. బ్రిటిష్ వారు వెళ్తూ వారి వారసులుగా వీరిని వదిలి వెళ్లారన్నారు. 2019 నాటికి బీజేపీకి మిత్ర పక్షాలుండవని ఆయన జోస్యం చెప్పారు. ప్రత్యేక హోదాను అమలుపరిచే అవకాశం ఒక కాంగ్రెస్ పార్టీకే ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు కాంగ్రెస్ పార్టీ వడ్డించిన విస్తరి ఇస్తే బీజేపీ, టీడీపీలు కుక్కలు చించిన విస్తరిగా తయారు చేశారన్నారు. లోక్‌సభలో గత వారం పది రోజులుగా టీడీపీ, వైసీపీలు అవిశ్వాస తీర్మానాన్ని ఇస్తే దానికి మనస్ఫూర్తిగా కాంగ్రెస్ మద్దతిచ్చిందన్నారు. సాక్షాత్తు సోనియాగాంధీ లోక్‌సభలో నిలబడి వారం రోజులుగా అవిశ్వాస తీర్మానాన్ని చర్చకు తీసుకోండని కోరితే.. బీజేపీ దాన్ని అనుమతించకపోవడం దారుణమని రఘువీరా అన్నారు.

న్యాయం అడిగితే అవహేళనా?

- ఏ హోదాతో లేఖ రాశారు.. ఆంధ్రులను అవమానించేలా ఉంది
- అమిత్‌షా లేఖపై మంత్రుల ఫైర్





ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్: బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా రాసిన లేఖపై రాష్ట్ర మంత్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి కొల్లు రవీంద్ర ఆదివారం సీఎం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ జగన్ పత్రికలో వచ్చిన విమర్శలనే లేఖలో చూపించారని, 2500 కోట్లు రాజధాని కోసమే ఇచ్చారని చెప్పడంతోనే వారి చిత్తశుద్ధి తేటతెల్లమైందని అన్నారు. అమిత్‌షా లేఖను బట్టి ఏపీకి హోదా ఇవ్వరనే విషయం అర్థమైందని, ఇకనైనా అసత్య ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. 'అమిత్ షా ఓ పార్టీకి అధ్యక్షుడు మాత్రమే. కేంద్ర ప్రభుత్వ లెక్కలు ఆయనెలా చెప్తారు, ఆయన ఏ హోదాలో ముఖ్యమంత్రికి లేఖ రాశారు. ఆయన రాసిన లేఖ ఏపీని అవమానించే విధంగా ఉంది' అంటూ మంత్రి నక్కా ఆనందబాబు మండిపడ్డారు. గుంటూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ... 2014 ఎన్నికల్లో బీజేపీ పొత్తు వల్ల తాము 15 సీట్లు కోల్పోయామని పేర్కొన్నారు. అభివృద్ధిని అడ్డుకునే క్రిమినల్స్‌ను ప్రధాని ప్రోత్సహిస్తారా అని ప్రశ్నించారు. విభజన కారణంగా నష్టాల్లో ఉన్న రాష్ట్రానికి ప్రత్యేక హోదాతో పాటు విశాఖ రైల్వేజోన్ ప్రకటిస్తామని హామీ ఇచ్చిన ప్రధానమంత్రి మోదీ.. ఇప్పుడు వాటిని విస్మరిస్తున్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, విద్యుత్‌శాఖ మంత్రి కిమిడి కళావెంకటరావు శ్రీకాకుళం జిల్లా రాజాంలో అన్నారు. ప్రత్యేకహోదా ఇవ్వకపోతే కేంద్రంపై తీవ్ర ఒత్తిడి తీసుకువస్తామన్నారు. రాష్ట్రానికి న్యాయం చేయకపోగా అమిత్‌షా లేఖ ద్వారా కేంద్రం ఆంధ్రులను అవహేళన చేస్తోందని ఎక్సైజ్‌శాఖ మంత్రి కేఎస్ జవహర్ ఓ ప్రకటనలో మండిపడ్డారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని 19 అంశాలు, అప్పటి యూపీఏ ఇచ్చిన 6 హామీల అంశాన్ని లేఖలో ఎందుకు ప్రస్తావించలేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే స్వప్రయోజనాల కోసం పెద్దపీట వేస్తున్న ప్రతిపక్షం ఏపీలో ఉండడం ఆంధ్రుల దురదృష్టకరమని చెప్పారు. బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తున్న వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి రాజ్యసభ సభ్యత్వాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు.

జగన్, పవన్ మోదీకి తొత్తులు

- ఆర్థిక నేరస్థుడికి పీఎంవోలో ఏంపని?.. టీడీపీ ధ్వజం

రాజంపేట/ఒంటిమిట్ట, మార్చి 25: ప్రధానమంత్రి మోదీకి వైసీపీ నేత జగన్‌మోహన్‌రెడ్డి, జనసేన నేత పవన్‌కల్యాణ్ తొత్తులుగా మారి రాష్ట్రాభివృద్ధికి తీవ్ర ఆటంకం కలిగిస్తున్నారని మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, రాజ్యసభ సభ్యుడు సి.ఎం.రమేష్, కడప జిల్లా టీడీపీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి(వాసు) ధ్వజమెత్తారు. కడప జిల్లా ఒంటిమిట్టలో ఆదివారం వారు కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి బీజేపీ చెంతచేరి టీడీపీని విడదీశారని, విడిపోవడమూ మంచిదే అయిందని అన్నారు. రానున్నరోజుల్లో అన్ని జిల్లాల్లో టీడీపీ క్లీన్‌స్వీప్ చేస్తుందని, భవిష్యత్తులో బీజేపీకి ఏ గతి పడుతుందో త్వరలో తెలుస్తుందని పేర్కొన్నారు. ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ వైసీపీ బీజేపీపై అవిశ్వాసం ప్రకటిస్తూనే లోలోపల విశ్వాసం చూపిస్తోందని విమర్శించారు. రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్ మాట్లాడుతూ విజయ్ మాల్యా సంస్థలు నష్టాల పాలై బ్యాంకులకు వేలకోట్ల రూపాయలు ఎగనామం పెడితే ఆయన రాజ్యసభతోపాటు పాస్‌పోర్టును కూడా రద్దు చేశారని తెలిపారు. అదే విజయసాయిరెడ్డి వందల కోట్ల రూపాయల కుంభకోణంలో ఏ-2 ముద్దాయిగా ఉంటే అతనిని ప్రధానమంత్రి కార్యాలయంలో చోటు కల్పిస్తున్నారని, అంటే ఆయనకో రూలు.. ఈయనకో రూలా అని కేంద్రాన్ని ప్రశ్నించారు. ఆర్థిక నేరస్థుడిని పీఎంవోలోకి ఎలా అనుమతిస్తారన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా సీఎంకు రాసిన లేఖలో అన్ని అవాస్తవాలేనని చెప్పారు. కేంద్రం ఇచ్చిన నిధులకు ఎప్పటికప్పుడు యూసీలు పంపిస్తున్నా, లేదని చెప్పడం దారుణమన్నారు.

ఆ రోడ్లకు నిధులేవీ?

- పీఆర్ రహదారులతో ఆర్అండ్‌బీ పాట్లు
- రుణం కోసం బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు
- దాటవేస్తున్న బ్యాంకర్లు..
- రూ.5989 కోట్లు ఉంటేనే దశ దిశ

అమరావతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తమ పరిధిలోని రోడ్ల ప్యాచ్ వర్క్‌లకే సొమ్ములు లేక అష్టకష్టాలు పడుతున్న ఆర్‌అండ్‌బీ శాఖకు ఇతర శాఖల నుంచి బదిలీ అయిన రోడ్ల అభివృద్ధి తలకుమించిన భారంగా మారింది. ఒకవైపు సర్కారు నిధులివ్వక, మరోవైపు బ్యాంకులు ముఖం చాటేస్తుండటంతో ఏం చేయాలో ఆ శాఖకు దిక్కుతోచడంలేదు. ఇప్పటికే పలు బ్యాంకులు నో చెప్పినా... ఆశచావక అప్పులు తెచ్చి రోడ్లను బాగుచేసేందుకు మార్గాలను వెదుకుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులను ఎక్కువగా పంచాయతీరాజ్ శాఖ నిర్మిస్తుంది. అంటే ఆయా గ్రామాలకు కనీస రవాణా సదుపాయాలు కల్పించేందుకు వాటిని ఏర్పాటుచేస్తారు. కొన్నిచోట్ల మంచి టెక్నాలజీ ఉపయోగించి బీటీ రోడ్లను కూడా నిర్మించారు. అయితే, రెండేళ్ల క్రితం 5,975 కిలోమీటర్ల పరిధిలోని పంచాయతీ రోడ్లను ఆర్‌అండ్‌బీకి బదిలీ చేశారు. ఈ రోడ్లపై పక్కాగా అన్ని రకాల వాహనాలు ప్రయాణించేలా, కనీసం పదేళ్లపాటు మన్నిక ఉండేలా అభివృద్ధిచేయాలి. ఆర్ అండ్‌బీ వద్ద ఉన్న వనరులు, ఇతర ప్రాజెక్టుల కింద వచ్చిన సొమ్ముతో కలిపి 1789కి.మీ. మేర మాత్రమే రహదారులను అభివృద్ధి చేశారు. ఇంకా 4,186 కి.మీ. రహదారులను అభివృద్ధి చేయాలి. ఇందుకు కనీసం రూ.2700 కోట్లు అవసరం. ఈ నిధులను బడ్జెట్‌లోనే కేటాయించాలని, లేదా పంచాయతీరాజ్ శాఖ నుంచి ఇప్పించాలని ఆర్‌అండ్‌బీశాఖ కోరుతోంది. ఈ అంశాన్ని ఆర్‌అండ్‌బీ మంత్రి అయ్యన్నపాత్రుడు, ఆశాఖ అధికారులు పలుమార్లు ఆర్థికశాఖ దృష్టికి తీసుకెళ్లారు. భరోసా ఇచ్చినా, బడ్జెట్‌లో పూర్తి నిరాశే మిగిలింది. దీంతో మంత్రి అయ్యన్న అసెంబ్లీ సాక్షిగానే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మరోవైపు బ్యాంకుల నుంచి అప్పులు తెచ్చేందుకు ఆ శాఖ అధికారులు కొంతకాలంగా ప్రయత్నిస్తున్నారు. నాబార్డు, ఏడీబీ, ఏఐఐబీపీ వంటి సంస్థలను ఆశ్రయించారు. వివరాలన్నీ విన్నాక తర్వాత చుద్దామంటూ అవి చేతులెత్తేస్తున్నాయి. ఇక అప్పుకోసం ఆశ్రయించాల్సినవాటిలో మిగిలింది ప్రపంచబ్యాంకే. వచ్చేది ఎన్నికల సంవత్సరం కావడంతో గ్రామీణ రహదారులను అభివృద్ధి చేయాల్సిందేనంటూ ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు పట్టుబడుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రణాళికలోని పనులకు రూ.965.03 కోట్లు, ప్రణాళికేతర పనులకు రూ.1021.68 కోట్లు, ఇతర పథకాల (కేంద్రం, ప్రపంచబ్యాంకు రుణంతో చేపట్టేవి, ఏడీబీ రుణంతో ఇప్పటికే చేపట్టిన) ప్రాజెక్టులకు రూ.1643.60 కోట్లు ప్రతిపాదించారు. అయితే, అంతకుముందు ఆర్థికసంవత్సరంలోని పెండింగ్ పనులు, రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రాజెక్టులు, ముఖ్యమంత్రి హామీల అమలుకు అదనంగా రూ.9,620.08 కోట్లు అవసరమని అంచనా వేశారు. అయితే, ఇటు రాష్ట్రం నుంచి, అటు కేంద్రం నుంచి ప్రతిపాదించిన నిధులు కూడా విడుదల కాలేదు. దీంతో మూడు కేటగిరీల పనులను పూర్తిచేయడానికి ఇప్పుడు నికరంగా రూ.5989 కోట్లు తక్షణావసరమని తేల్చారు. ఈ నిధులు లేక 172 ప్రాజెక్టులు, దానికి అనుబంధంగా ఉండే 390 పనులు దాదాపుగా నిలిచిపోయినట్టు ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. 'రెగ్యులర్ ప్రాజెక్టులకే నిధులు లేవు. కాంట్రాక్టర్లు బిల్లుల కోసం ఆఫీసులకొచ్చి కూర్చుంటున్నారు. అందుకే రూ. 1000 కోట్ల బ్యాంకు రుణానికి వెళ్తున్నాం. ఇంకా 4999 కోట్ల లోటు అలాగే ఉంటుంది. వాటికి ఉద్దేశించిన ప్రాజెక్టులు ఎలా ముందుకు తీసుకెళ్లాలి. ఈ పరిస్థితుల్లో పీఆర్ నుంచి బదిలీ అయిన రోడ్ల అభివృద్ధి ఎలాగో సర్కారే నిర్ణయించాలి. రూపాయి లేకుండా రోడ్లను బాగుచేయలేం. మరమ్మతులు చేయాలన్నా పైసా ఉండాల్సిందే' అని ఆ అధికారి చెప్పారు.

అవిశ్వాసమంటే.. మోదీకి భయం!

- చర్చకు సిద్ధమంటూనే తప్పించుకుంటున్నారు: రాహుల్

మైసూరు/బెంగళూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): తన ప్రభుత్వంపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కొనేందుకు ప్రధాని నరేంద్ర మోదీ భయపడుతున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. అవిశ్వాస తీర్మానంపై చర్చ విషయంలో దాదాపు రెండు వారాలుగా ప్రభుత్వం దోబూచులాడుతోందని విమర్శించారు. "మోదీ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టారు. దాదాపు పదిరోజులైనా దీనిపై చర్చకు ప్రభుత్వం ముందుకు రావడం లేదు. అవిశ్వాసాన్ని ఎదుర్కొనేందుకు మోదీ భయపడుతున్నారు" అని రాహుల్ దుయ్యబట్టారు. కాంగ్రెస్, ఏఐఏడీఎంకే, టీడీపీ, వైసీపీల ఆందోళనలను సాకుగా చూపి రెండో దశ బడ్జెట్ సమావేశాలను దాదాపు తుడిచిపెట్టేశారని విమర్శించారు. కేంద్రంపై ఇప్పటి వరకు టీడీపీ, వైసీపీలు అవిశ్వాసం నోటీసులు ఇవ్వగా దీనికి కాంగ్రెస్ కూడా జతకలిసింది. అయితే, సభ సజావుగా లేదనే ఏకైక కారణంతో వాయిదాల పర్వానికి తెరతీశారని రాహుల్ విమర్శించారు. అవిశ్వాసంపై చర్చకు సిద్ధమంటూనే సభను వాయిదా వేయడం ఏమిటని ప్రశ్నించారు. త్వరలో జరగబోయే కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాగా, కర్ణాటక రైతులు రాహుల్‌ను తలపాగాతో సత్కరించేందుకు ప్రయత్నించగా ఆయన ససేమిరా అనడం విమర్శలకు దారి తీసింది. అయితే, శ్రీరంగపట్టణంలో టిప్పు టోపీ ధరించారు. మరోపక్క, మైసూరులోని అజీజ్‌నగర్ వాసులు 35 వేల బీడీలతో ప్రత్యేక హారాన్ని తయారు చేసి రాహుల్‌కు సమర్పించేందుకు రాగా ఎస్పీజీ బలగాలు అభ్యంతరం తెలిపాయి.

దానంగా భావిస్తున్నారాయన!

- అమిత్‌షాకు చురకలంటించిన సిద్దరామయ్య
- చంద్రబాబు ట్వీట్‌ను కోట్ చేస్తూ బీజేపీపై విమర్శ

అమరావతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాకు రాజ్యాంగం, కేంద్ర-రాష్ట్రాల మధ్య నిధుల పంపిణీపై అవగాహన లేదని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య విమర్శించారు. రాష్ట్రాలకు హక్కుగా నిధులొస్తాయని, కానీ వాటిని దానంగా ఇస్తున్నట్టు అమిత్‌షా భావిస్తున్నారని చురకలంటించారు. కర్ణాటకకు రూ. 2లక్షల కోట్లు ఇచ్చామని అమిత్‌షా చెప్తున్నారని... కానీ ఇచ్చింది రూ. 90 వేల కోట్లేనని పేర్కొన్నారు. అమిత్‌షా తనకు రాసిన లేఖపై ఏపీ సీఎం చంద్రబాబు శనివారం ట్విట్టర్‌లో స్పందించారు. రాష్ట్ర ప్రజలను అవమానపరిచేలా, ఇచ్చిన హామీల అమలును నిరుత్సాహపరిచేలా ఆ లేఖ ఉందని, ఆ లేఖలోని లెక్కలు తప్పులని ట్విట్టర్‌లో పేర్కొన్నారు. కాగా.. సిద్దరామయ్య ఆదివారం చంద్రబాబు ట్వీట్‌ను కోట్ చేస్తూ ట్విట్టర్‌లో అమిత్‌షాను విమర్శించారు.

విభిన్నంగా ఉపాధ్యాయుల హోదా పోరు: గాదె

విజయవాడ, మార్చి 25 (ఆంధ్ర జ్యోతి): విభజిత ఏపీ రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించడం కోసం అన్ని ఉపాధ్యాయ సంఘాలతో కలిసి విభిన్న తరహా ఉద్యమాన్ని త్వరలో ప్రకటిస్తామని ఎమ్మెల్సీ, పీఆర్‌టీయూనేత గాదె శ్రీనివాసులు నాయుడు చెప్పారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజనల హామీల సాధన కోసం పీఆర్‌టీయు ఉపాధ్యాయులు విజయవాడ ధర్నాచౌక్‌లో ఒక రోజు సత్యాగ్రహ దీక్ష చేశారు. దీక్షను ప్రారంభించిన తర్వాత ఆయన మాట్లాడారు. ఐదు కోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని కించపరిచే విధంగా బీజేపీ వ్యవహరిస్తున్న తీరు చాలా బాధాకరంగా ఉందన్నారు. సమైక్యాంధ్ర ఉద్యమంలో ఉపాధ్యాయులు 50 రోజులు సత్యాగ్రహ దీక్షలు చేపట్టి రాష్ట్రాన్ని విడగొట్టవద్దని డిమాండ్ చేయడం జరిగిందన్నారు. రాష్ట్రానికి రావాల్సిన వాటా ప్రకారం నిధులను ఇవ్వడం లేదని చెప్పారు. కేంద్రంపై అవిశ్వాసం పెట్టిన టీడీపీ, వైసీపీలకు అభినందనలు చెప్పారు.



ధర్నా చౌక్‌లో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాసులు నాయుడు

స్మిత్‌ను తొలగించాలి: ఆసీస్ ప్రధాని



కాన్‌బెర్రా: కెప్టెన్సీ నుంచి స్మిత్‌ను తొలగించాలని ఆస్ట్రేలియా ప్రభుత్వం ఆదేశించింది. జట్టు బాల్ ట్యాంపరింగ్‌కు పాల్పడడం తనను షాక్‌కు గురి చేసిందని దేశ ప్రధాని మాల్కమ్ టర్న్‌బుల్ వ్యాఖ్యానించారు. 'సౌతాఫ్రికా నుంచి వచ్చిన వార్తలు తీవ్ర నిరాశకు గురి చేశాయి. ఆస్ట్రేలియా జట్టు మోసానికి పాల్పడిందంటే నమ్మలేకపోతున్నా' అని ఆయన పేర్కొన్నారు. 'క్రికెట్ ఆస్ట్రేలియా చైర్మన్ డేవిడ్ పీవెర్‌తో మాట్లాడా. సౌతాఫ్రికాలో చోటుచేసుకున్న సంఘటనలపై నా అసంతృప్తిని ఆయనకు తెలియజేశా. ఆ ఘటనపై క్రికెట్ ఆస్ట్రేలియా కఠిన నిర్ణయం తీసుకుంటుందని భావిస్తున్నా' అని చెప్పారు.

ఛీ..ఛీ ఆసీస్



- ట్యాంపరింగ్‌పై క్రికెట్ ప్రపంచం ఉలికిపాటు
- స్మిత్‌పై ఒక టెస్టు నిషేధం
- బాన్‌క్రాఫ్ట్‌పై జరిమానాతో ఐసీసీ సరి
- కఠిన శిక్ష వేయాలని డిమాండ్లు

ఆస్ట్రేలియా క్రికెటర్ల బాగోతం క్రికెట్ ప్రపంచాన్ని కుదిపేసింది. విలువలకు తిలోదకాలిచ్చి ఆసీస్ చేసిన బాల్ ట్యాంపరింగ్ వ్యవహారం చూసి ఉలిక్కిపడింది. గెలుపు కోసం తెగించి ఆడే కంగారూలు.. క్రీడా స్ఫూర్తిని మంటగలుపుతూ.. బరితెగించిన వైనంపై ఆ దేశ ప్రధాని, మాజీ క్రికెటర్లతో పాటు అందరూ మండిపడుతున్నారు. ఈ నీతిమాలిన చర్యకు ప్రధాన సూత్రధారి స్మిత్‌పై ఒక టెస్టు నిషేధం, మ్యాచ్ ఫీజులో వంద శాతం కోత.. పాత్రధారి బాన్‌క్రాఫ్ట్‌పై 75 శాతం జరిమానా, మూడు డీమెరిట్ పాయింట్లతో సరిపెట్టడంపై ఐసీసీపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ఈ శిక్ష సరిపోదని..ఆసీస్ జట్టుపై కఠిన చర్యలు తీసుకోవాలన్న డిమాండ్లు వస్తున్నాయి. ఇక, మూడో టెస్టు కెప్టెన్సీ, వైస్ కెప్టెన్సీ నుంచి స్మిత్, వార్నర్ తప్పుకున్నారు. మరోవైపు ఘటనపై క్రికెట్ ఆస్ట్రేలియా దర్యాప్తు మొదలు పెట్టింది..! అయితే, స్మిత్‌ను కెప్టెన్‌గా ఇప్పుడే తప్పించడం లేదని పూర్తి విచారణ జరిగిన తర్వాత చర్యలు తీసుకుంటామని చెప్పింది..!

దోషులుగా నిలబెట్టాల్సిందే..

బాల్ ట్యాంపరింగ్‌కు పాల్పడిన ఆస్ట్రేలియాను క్రికెట్ మాజీలు తూర్పారబట్టారు. పక్కా ప్రణాళికతో మోసానికి పాల్పడడం సిగ్గు చేటన్నారు. కొందరు ట్వీట్లతో దండెత్తితే.. మరికొందరు మీడియా సాక్షిగా కంగారూలను నిలదీశారు.

నిద్దుర లేచే సరికి ఈ దుర్వార్త తెలిసింది. ఇదో పీడకల అని చెప్పండి. **-మైకేల్ క్లార్క్**

మోసం చేయాలని ముందస్తుగానే వేసుకున్న ప్రణాళిక ఇది. **- నాసిర్ హుస్సేన్**

బాన్‌క్రాఫ్ట్‌పై జాలేస్తోంది. ఇది అతనొక్కడే తీసుకున్న నిర్ణయం కాదు. ఏదో చేయాలని అతడి జేబులో ఏదో పెట్టారు. **- షేన్ వార్న్**

స్మిత్‌తోపాటు ఆసీస్ టీమ్, మేనేజ్‌మెంట్ మొత్తం మోసకారులుగా గుర్తుండిపోతారు. ఇలా వాళ్ల కెరీర్‌లో ఎన్ని రకాలుగా మోసాలకు పాల్పడ్డారో బయటపెట్టాలి. **- మైకేల్ వాన్**

కోచ్‌గా లీమన్ కెరీర్‌లో ఎంతో గొప్ప టెస్టు. ఇది బాన్‌క్రాఫ్ట్ ఒక్కడి ఐడియానే అని నమ్మడానికి నా మనసైతే అంగీకరించడం లేదు. **- కెవిన్ పీటర్సన్**

పక్కా ప్లాన్ ప్రకారం చేసిందే. రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయారు. తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సిందే.. వారిని దోషులుగా నిలబెట్టాల్సిందే..! **- షాన్ పొలాక్**

తప్పిదం జరిగిందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇందుకు ఆటగాళ్లే కారణం. కెప్టెన్ తన తప్పును అంగీకరించాడు. ఒకరిద్దరు ప్లేయర్ల కారణంగా జరిగినదైతే కాదు. **- బిషన్‌సింగ్ బేడీ**

అవసరమైతే మళ్లీ వస్తా ..



స్మిత్‌ను కెప్టెన్సీ నుంచి తొలగించాలన్న డిమాండ్లు వస్తున్న నేపథ్యంలో.. ఆసీస్ జట్టు సారథ్యాన్ని మళ్లీ చేపట్టేందుకు 36ఏళ్ల మైకేల్ క్లార్క్ సుముఖత వ్యక్తంజేశాడు. 2015లో రిటైరైన క్లార్క్ స్థానంలో స్మిత్ జట్టు పగ్గాలు చేపట్టిన సంగతి తెలిసిందే. స్టీవ్‌ను తప్పిస్తే తిరిగి నాయకత్వం చేపడతావా అన్న ప్రశ్నకు.. 'సరైన వ్యక్తులు అడిగితే అప్పుడు ఆలోచిస్తా' అని మీడియాతో క్లార్క్ అన్నాడు. బాల్ ట్యాంపరింగ్ ఉదంతం తనను ఉద్వేగానికి లోనుచేసిందన్న క్లార్క్... ఆ సంఘటనను పచ్చిమోసంగా అభివర్ణించాడు.

ఐపీఎల్‌లో అనుమతిస్తారా..?

న్యూఢిల్లీ: బాల్ ట్యాంపరింగ్‌తో అడ్డంగా దొరికి విమర్శలు ఎదుర్కొంటున్న ఆస్ట్రేలియా కెప్టెన్ స్మిత్, ఉప సారథి వార్నర్ ఇప్పుడు ఐపీఎల్‌లో ఆడేది సందేహంగా మారింది. ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ జట్టుకు స్మిత్, సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు వార్నర్ కెప్టెన్లుగా వ్యవహరిస్తున్నారు. తాజా వివాదం నేపథ్యంలో ఐపీఎల్‌లో ఈ ఇద్దరి కెప్టెన్సీలు ఉంటాయా ఊడతాయా అన్నదానిపై చర్చ మొదలైంది. ఇదే విషయమై ఐపీఎల్ చైర్మన్ రాజీవ్ శుక్లాను మీడియా ప్రతినిధులు అడిగితే.. ఇప్పటికిప్పుడే తాము ఏ నిర్ణయమూ తీసుకోలేమన్నారు. 'ఈ అంశంలో బీసీసీఐతో పాటు రాజస్థాన్, సన్‌రైజర్స్ ఫ్రాంచైజీలు వేచిచూడాలనుకుంటున్నాయి. స్మిత్, వార్నర్‌లు సదరు జట్లకు కీలక ఆటగాళ్లు. అందులోనూ కెప్టెన్లు. దీంతో వెంటనే నిర్ణయం తీసుకోలేం. రెండుమూడ్రోజులు ఆగి తుది నిర్ణయాన్ని ప్రకటిస్తాం' అని శుక్లా చెప్పుకొచ్చాడు.



ప్రేక్షకుల ఎగతాళి..

కేప్‌టౌన్: బాల్ టాంపరింగ్ ఘటన నేపథ్యంలో ఆస్ట్రేలియా టీమ్‌ను ప్రేక్షకులు హేళన చేశారు. నాలుగో రోజు ఆటలో భాగంగా మైదానంలోకి వచ్చిన ఆసీస్ జట్టును దక్షిణాఫ్రికా ప్రేక్షకులు గేలి చేస్తూ స్వాగతం పలికారు. కంగారూ ఆటగాళ్లు తమ స్థానాల్లో నిలబడే వరకు స్టాండ్లలో ఎగతాళి కేకలు గట్టిగానే వినిపించాయి. రెండో టెస్టు సందర్భంగా స్టేడియంలో ప్రేక్షకుల ప్రవర్తన చికాకు కలిగించే విధంగా ఉందని ఆసీస్ కెప్టెన్ స్మిత్ కామెంట్ చేశాడు.

బ్రాడ్‌మన్ కావాల్సినోడు బ్యాడ్‌మ్యాన్‌గా..

స్టీవ్ స్మిత్.. ఆస్ట్రేలియా క్రికెట్‌లో ఒక సంచలనం. లెగ్ స్పిన్ ఆల్‌రౌండర్‌గా అరంగేట్రం చేసి.. ఎక్కడో 8వ స్థానంలో టెయిలెండర్‌గా బ్యాటింగ్ చేయడం మొదలెట్టి.. అసాధారణ ప్రతిభతో.. పోరాట నైపుణ్యంతో ప్రపంచ మేటి బ్యాట్స్‌మన్‌గా ఎదగడం అతనికే సాధ్యమైంది.! అంతెందుకు ఆస్ట్రేలియన్లు దిగ్గజ ఆటగాడు డాన్ బ్రాడ్‌మన్‌తో మరో ఆటగాడికి కనీసం పోల్చేందుకు కూడా ఇష్టపడరు. అలాంటిది స్టీవ్ స్మిత్‌ను నయా బ్రాడ్‌మన్ అంటూ పొగిడారంటే అతనెంత ప్రతిభావంతుడో అర్థం చేసుకోవచ్చు..! ఇంతింతై.. అన్నట్టుగా అటు బ్యాట్స్‌మన్‌గా ఇటు నాయకుడిగా అనతి కాలంలోనే స్మిత్ అత్యున్నత శిఖరాలను అందుకున్నాడు..! కానీ, ఇదంతా నాణేనికి ఒకవైపే..! నరనరాన విజయకాంక్ష.. దానికోసం ఎంతకైనా తెగించే తత్వం... అతణ్ణి దొడ్డిదారుల్లోకి వెళ్లేలా చేసింది..! ఎంతో ప్రతిభ ఉన్నా.. వక్రబుద్ధి అతడి కెరీర్‌ను ప్రశ్నార్థకం చేసింది..! మరో బ్రాడ్‌మన్ కావాల్సినోడు.. ఇప్పుడు బ్యాడ్‌మ్యాన్‌గా మారిపోయాడు..! క్రికెట్ ప్రపంచం ముందు దోషిగా నిలుచున్నాడు..!

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

తన అసమాన బ్యాటింగ్ నైపుణ్యంతో స్టీవ్ స్మిత్ అత్యుత్తమ టెస్టు బ్యాట్స్‌మన్‌గా ఎదిగాడు. ప్రస్తుత తరంలో ఒకరిద్దరు అత్యుత్తమ ఆటగాళ్లలో ముందు వరుసలో ఉంటాడు. కానీ, మైదానంలో అతని ప్రవర్తన... నాయకుడిగా జట్టును నడిపిస్తున్న తీరు.. విజయాల కోసం అతను ఎంచుకున్న మార్గాలు ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు. గతేడాది ఇదే సమయంలో డ్రెస్సింగ్ రూమ్‌వైపు దొంగచూపులు చూస్తూ తనకు మతి తప్పిందని(బ్రెయిన్ ఫేడ్) అనడం మొదలు.. సౌతాఫ్రికా పర్యటనలో నాయకత్వ తీరు.. ముఖ్యం గా బాల్ టాంపరింగ్‌కు పథకం రచించడం... ఆటగాడిగా కెప్టెన్‌గా అతను సాధించిన అందుకున్న ఘనకీర్తిని ఒక్కసారిగా నేలకు దించింది. మొన్నటి వరకు డాన్ బ్రాడ్‌మన్‌తో పోల్చిన ఆస్ట్రేలియన్లే ఇప్పుడతను జట్టులో కొనసాగడానికి ఎంత మాత్రం వీల్లేదని అంటున్నారు. ఇలాంటి చీటర్ తమకు వద్దంటున్నారు. బంతి రూపు మార్చేందుకు ప్రయత్నించింది బాన్‌క్రాఫ్టే అయినా.. దానికి కథ... స్క్రీన్‌ప్లే, దర్శకత్వం మొత్తం స్మిత్‌దేనని కంగారూలతో పాటు క్రికెట్ ప్రపంచం నమ్ముతున్నది. తప్పు జరిగింది.. క్షమించండి అని స్మిత్ చెబుతున్నా.. అతడిపై కఠిన చర్యతీసుకోవాలన్న డిమాండ్లు వస్తున్నాయి. ఐసీసీ విధించిన ఒక టెస్టు నిషేధం సరిపోదన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఆస్ట్రేలియా ప్రధాని కూడా ఈ చర్యలను తీవ్రంగా ఆక్షేపించడం.. కఠిన చర్యలు తీసుకోవాలని క్రికెట్ ఆస్ట్రేలియాకు స్పష్టం చేసిన నేపథ్యంలో స్టీవ్ స్మిత్ కెరీర్ ప్రమాదంలో పడినట్టే. స్మిత్ కెరీర్‌ను పరిశీలిస్తే ఆటగాడికి ఎంతో ప్రతిభావంతుడైనా.. అతి దూకుడు.. గెలుపు కోసం అడ్డదారులు తొక్కాలన్న ఆలోచనా విధానం అతనికి ఈ గతి పట్టించింది. స్మిత్ ఆసీస్ జట్టులోకి ఓ మోస్తరు బ్యాటింగ్ చేయగల లెగ్ స్పిన్నర్‌గా అరంగేట్రం చేశాడు. బొద్దుగా ఉన్న ఆకారం.. విలక్షణమైన బ్యాటింగ్ శైలి.. కుదురుగా ఒక్క చోట ఉండలేని స్వభావంతో అతణ్ణి లాఫింగ్ స్టార్.. జోకర్ అంటూ సహచరులు ఆటపట్టించారు. కానీ, ఆకారాన్ని మార్చుకోవడంతో పాటు ఆటతీరులోనూ గణనీయమైన మార్పులతో అతను మేటి బ్యాట్స్‌మన్‌గా ఎదిగాడు. అయితే సారథిగా దుందుడుకు స్వభావం.. అతను తీసుకునే నిర్ణయాలు విమర్శలకు తావిస్తున్నాయి. మైదానంలో సహచరులను క్రమశిక్షణతో నడిపించాల్సిన బాధ్యత ఉన్న తానే ముందుగా గీత దాటడం స్మిత్‌కు అలవాటే. 2016 క్రైస్ట్‌చర్చ్ టెస్టు సందర్భంగా అంపైర్ల నిర్ణయంపై అభ్యంతరం వ్యక్తం చేయడం, ఆ తర్వాత మరో సందర్భంలో కాగిసో రబాడతో గొడవ పెట్టుకోవడం ఆ కోవలోకి వచ్చేవే. ఇక తాజా ఉదంతంపై ఐసీసీ ఒక్క టెస్టు నిషేధంతో సరిపెట్టింది కానీ.. స్వదేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న డిమాండ్ల నేపథ్యంలో స్మిత్‌తో పాటు ఉపసారథి వార్నర్‌పై క్రికెట్ ఆస్ట్రేలియా వేటు వేయకుండా ఉండలేని పరిస్థితి నెలకొన్నది. అలాగే, స్మిత్, వార్నర్ ఐపీఎల్‌లో సారథ్యం వహించడం అనుమానమే. జట్టులోకి వచ్చిన కొత్తలో జోకర్‌గా సహచరులను నవ్వించిన అతనిప్పుడు క్రికెట్ ప్రపంచం ముందు నవ్వులపాలయ్యాడు. గెలుపు కోసం అడ్డదారులు తొక్కితే ఎప్పటికైనా మూల్యం చెల్లించుకోవాల్సివస్తుందన్న విషయం ఆటగాళ్లంతా కూడా గుర్తుంచుకోవాలి. అడ్డదారులు తొక్కాలనుకునే వారికి స్మిత్ ఘటన ఓ హెచ్చరిక కావాలి.

జీవితకాల నిషేధం ?

ఐసీసీ మామూలు శిక్షతో సరిపుచ్చినా.. కెప్టెన్ స్మిత్, వైస్‌కెప్టెన్ వార్నర్‌లపై వారి క్రికెట్ బోర్డు తీవ్రమైన చర్యలే తీసుకోనున్నట్టు సమాచారం. క్రికెట్ ఆస్ట్రేలియా ప్రవర్తనా నియమావళి ప్రకారం వారిద్దరిపై ఏకంగా జీవితకాల వేటు వేసే విషయాన్ని తీవ్రంగా పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. తమ క్రికెటర్ల ప్రవర్తన యావత్ ఆస్ట్రేలియాకే చెడ్డపేరు తెచ్చిందని ఆగ్రహిస్తున్న ఆ దేశ ప్రధాని టర్న్‌బుల్..స్మిత్‌పై కఠిన చర్య తీసుకోవాలని ఇప్పటికే క్రికెట్ ఆస్ట్రేలియాకు సూచించారు. ఈ నేపథ్యంలో స్మిత్, వార్నర్‌లకు కఠిన శిక్ష తప్పదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఐసీసీ.. ఇదేం నీతి!

ఆస్ట్రేలియా క్రికెటర్లకు ఐసీసీ నామమాత్రపు శిక్ష విధించడాన్ని అంతా తప్పుబడుతున్నారు. మిగతా దేశాలపై కఠినంగా వ్యవహరించే ఐసీసీ ఆసీస్ అనగానే చూసీ చూడనట్టుగా ఉంటున్నదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ముఖ్య పాత్రధారి స్మిత్‌పై కేవలం ఒక మ్యాచ్ నిషేధమే విధించడాన్ని భారత్ వెటరన్ ఆఫ్‌స్పిన్నర్ హర్భజన్‌సింగ్ తీవ్రంగా ఆక్షేపించాడు. అంతేకాదు టాంపరింగ్ చేసిన బాన్‌క్రాఫ్ట్‌ను సస్పెండ్ చేయకుండా మ్యాచ్ ఫీజులో కోతతో సరిపెట్టడాన్నీ తప్పుబట్టాడు. జట్టంతా కలిసి.. పక్కా ప్రణాళికతో మోసం చేస్తే వైస్ కెప్టెన్ వార్నర్ సహా మిగతా ఆటగాళ్లపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని భజ్జీతో పాటు పలువురు ప్రశ్నిస్తున్నారు. 'వావ్..చక్కగా ఆడినందుకు సముచిత సత్కారం చేశారు. సాక్ష్యాలున్నా బాన్‌క్రాఫ్ట్‌పై చర్య ఏదీ? 2001లో దక్షిణాఫ్రికాపై అతిగా అప్పీలు చేశామని ఆధారాలు లేకున్నా మాలో ఆరుగురు క్రికెటర్లను బహిష్కరించారు. 2008లో సిడ్నీ ఉదంతాన్ని గుర్తుకు తెచ్చుకోండి. తప్పు చేయకపోయినా మాపై మూడు మ్యాచ్‌ల నిషేధం విధించారు. వ్యక్తులను బట్టి నిబంధనలా?' అని ఐసీసీని భజ్జీ నిలదీశాడు.

కేప్‌టౌన్/మెల్‌బోర్న్: దక్షిణాఫ్రికాతో మూడో టెస్టులో ఆస్ట్రేలియా క్రికెటర్ల బాల్ ట్యాంపరింగ్ వ్యవహారం క్రికెట్‌లో అతి పెద్ద వివాదంగా మారింది. ఆసీస్ క్రికెటర్లను యావత్ క్రికెట్ ప్రపంచం 'ఛీటర్స్' అంటూ దుమ్మెత్తిపోస్తోంది. ఈ ఉదంతంలో ఆస్ట్రేలియా కెప్టెన్ స్టీవ్ స్మిత్, ఓపెనర్ కామెరూన్ బాన్‌క్రాఫ్ట్‌పై ఐసీసీ చర్యలు తీసుకుంది. దీనికి నేతృత్వం వహించిన స్మిత్‌పై ఒక టెస్టు నిషేధంతో పాటు అతని



మ్యాచ్ ఫీజులో వందశాతం జరిమానా విధిస్తున్నట్టు ప్రకటించింది. అదే సమయంలో టేపుతో బంతి ఆకారాన్ని మార్చే ప్రయత్నం చేసిన బాన్‌క్రాఫ్ట్‌కు మ్యాచ్‌ఫీజులో 75శాతం కోత విధించింది. అలాగే, అతనికి 3డీమెరిట్ పాయింట్లు ఇచ్చింది. ఈ ఘటనను తీవ్రమైన నేరంగా పరిగణించి స్మిత్‌కు శిక్ష విధించినట్టు ఐసీసీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డేవిడ్ రిచర్డ్‌సన్ తెలిపాడు. తప్పు ఒప్పుకొన్న స్మిత్‌పై రెండు సస్పెన్షన్ పాయింట్లు విధించారు. ఇది ఒక టెస్టు మ్యాచ్ నిషేధానికి సమానం కావడంతో తర్వాతి టెస్టుకు అతను దూరం కానున్నాడు. అలాగే, అతని డీమెరిట్ పాయింట్లు నాలుగుకు చేరాయి. 'మ్యాచ్‌లో ఆస్ట్రేలియా నాయకత్వ బృందం చేసిన పని క్రికెట్ స్ఫూర్తికి పూర్తి విరుద్ధం. కెప్టెన్ స్మిత్ దీనికి పూర్తి బాధ్యత తనదే అని చెప్పడంతో అతనిపై సస్పెన్షన్ వేటు వేశామ'ని రిచర్డ్‌సన్ పేర్కొన్నాడు. బాన్‌క్రాఫ్ట్ కూడా తప్పు అంగీకరించడంతో విచారణ అవసరం లేకుండా చర్యలు తీసుకున్నామన్నాడు.



బాన్‌క్రాఫ్ట్

కెప్టెన్‌గా స్మిత్ కొనసాగింపు: సీఏ

బ్యాల్ ట్యాంపరింగ్‌కు నేతృత్వం వహించిన స్మిత్ జట్టు సారథిగా కొనసాగుతాడని క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) తెలిపింది. ఈ ఘటనపై దర్యాప్తు చేపడుతున్నట్టు చెప్పింది. జరిగిన దానికి బాధ్యత వహిస్తూ తాను కెప్టెన్సీ వదులుకుంటానని స్మిత్ చెప్పగా.. దర్యాప్తు పూర్తయ్యేదాకా అతనే సారథిగా ఉంటాడని సీఏ స్పష్టం చేసింది. ఈ ఘటన తెలిసి షాక్‌కు గురయ్యానని, ఆటగాళ్ల పని చూసి చాలా నిరుత్సాహపడ్డానని సీఏ చీఫ్ ఎగ్జిక్యూటివ్ జేమ్స్ సదర్లాండ్ పేర్కొన్నాడు. 'ప్రస్తుతానికి ఆసీస్ సారథిగా స్మిత్ ఉంటాడు. అయితే, ఈ ఉదంతానికి కారకులైన వారిపై కఠినచర్యలు తీసుకుంటాం. సమగ్ర దర్యాప్తు కోసం ఇప్పటికే అత్యున్నత స్థాయి అధికారుల బృందాన్ని దక్షిణాఫ్రికా పంపించాం. పూర్తి వివరాలు అందిన తర్వాతే తదుపరి నిర్ణయం తీసుకుంటామ'ని సదర్లాండ్ వివరించాడు. కాగా, మూడో టెస్టు నాలుగో రోజు టిమ్‌పైన్ తాత్కాలిక కెప్టెన్‌గా వ్యవహరించాడు. తదుపరి ఆటకు సారథులుగా కొనసాగేందుకు స్మిత్, వార్నర్ ఇష్టపడలేదని క్రికెట్ ఆస్ట్రేలియా తెలిపింది.

ఆసీస్ అవమానకర ఓటమి



కేప్‌టౌన్: అడ్డదారిలో గెలవాలనుకుంది. కానీ అడ్డంగా దొరికిపోయి అభాసుపాలవడమేకాదు..సౌతాఫ్రికాతో మూడో టెస్ట్‌లో 322 పరుగుల భారీ తేడాతో ఆసీస్ అవమానకర పరాజయం పాలైంది. 430 పరుగుల లక్ష్యంతో ఆదివారం, నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ చేపట్టిన ఆస్ట్రేలియా మోర్కెల్ (5/23) దెబ్బకు 39.4 ఓవర్లలో కేవలం 107 పరుగులకే చాపచుట్టేసింది.

సంక్షిప్తస్కోరు- సౌతాఫ్రికా: 311, 374;ఆస్ట్రేలియా: 255, 107.

పట్టుబిగించిన కివీస్

ఉదయం 6.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్ సెలెక్ట్ 1లో...

ఆక్లాండ్: దాదాపు రెండు రోజుల ఆట వర్షం బారిన పడిన ఇంగ్లండ్‌తో తొలి టెస్ట్‌లో కివీస్ పట్టు బిగించింది. 369 పరుగుల భారీ మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించిన ఆతిథ్య జట్టు.. ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో మూడు వికెట్లు పడగొట్టింది. ఫలితంగా ఆదివారం, నాలుగో రోజు ఆట ఆఖరికి ఇంగ్లండ్ 132/3 స్కోరుతో నిలిచింది. ఇంకా 237 పరుగుల లోటుతో ఉన్న పర్యాటక జట్టుకు ఏడు వికెట్లు చేతిలో ఉన్నాయి. మ్యాచ్‌ను డ్రా చేసేందుకు సోమవారం అంతా ఆ జట్టు బ్యాటింగ్ చేయాల్సి ఉంటుంది. నాలుగో రోజు చివరి బంతికి కెప్టెన్ రూట్ (51) అవుట్‌కాగా డేవిడ్ మలాన్ (19 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. కుక్ (2) వికెట్‌ను ఆదిలోనే కోల్పోగా..మరో ఓపెనర్ స్టోన్‌మన్ (55), రూట్ రెండో వికెట్‌కు 88 పరుగులు జోడించారు. అంతకుముందు ఓవర్‌నైట్ 233/4తో మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన కివీస్ 427/8 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. నికోల్స్ అజేయ సెంచరీ (145) చేశాడు. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 58కే ఆలౌటైన సంగతి తెలిసిందే.

రోడ్డు ప్రమాదంలో షమికి గాయాలు



డెహ్రాడూన్: వివాదాలలో చిక్కుకున్న భారత పేస్‌బౌలర్ మహమ్మద్ షమి ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. డెహ్రాడూన్ నుంచి ఢిల్లీకి వెళుతుండగా అతడి కారు ఒక ట్రక్‌ను ఢీకొనడంతో షమి తలకు స్వల్ప గాయాలయ్యాయి. భార్య ఆరోపణలతో వేదనకు గురైన షమి డెహ్రాడూన్‌లోని అభిమన్యు క్రికెట్ అకాడమీలో శారీరక, మానసిక స్థైర్యానికి చికిత్స పొందుతున్నాడు. షమికి ఎలాంటి ప్రమాదం జరగలేదని, గాయాలకు చికిత్స చేశారని, అతడు ఆదివారం ఢిల్లీకి వెళతాడని అభిమన్యు అకాడమీ నిర్వాహకులు తెలిపారు. కాగా భార్య హసీన్ జహా గృహహింస కేసు పెట్టడంతో తాను మానసికంగా కుంగిపోయానని షమి తెలిపాడు.

భారత మహిళల మరో ఓటమి

నేటి మ్యాచ్ భారత్ x ఆస్ట్రేలియా ఉదయం 10 నుంచి స్టార్‌స్పోర్ట్స్-1లో...

ముంబై: భారీ స్కోరు చేసినా దానిని కాపాడుకోవడంలో విఫలమైన భారత మహిళల జట్టు టీ20 ముక్కోణపు సిరీస్‌లో వరుసగా రెండో ఓటమిని చవి చూసింది. రికార్డుస్కోరు ఛేదనలో డేనియల్ వ్యాట్ (64 బంతుల్లో 124) సుడిగాలి శతకంతో చెలరేగడంతో ఇంగ్లండ్ 7 వికెట్ల తేడాతో భారత్‌పై గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. ఓపెనర్లు స్మృతి మంధాన (40 బంతుల్లో 76), మిథాలీ రాజ్ (43 బంతుల్లో 53) అర్ధ శతకాలు నమోదు చేయడంతో 20 ఓవర్లలో 4 వికెట్లకు 198 పరుగుల భారీ స్కోరు చేసింది. కాగా, టీ-20 క్రికెట్‌లో వేగవంతమైన అర్ధ శతకం నమోదు చేసిన తొలి భారత బ్యాట్స్‌వుమన్‌గా స్మృతి రికార్డులకెక్కింది. స్మృతి 25 బంతుల్లోనే అర్ధ శతకం నమోదు చేసింది. ఆ తర్వాత భారీ లక్ష్యాన్ని ఇంగ్లండ్ 18.4 ఓవర్లలోనే ఛేదించి రికార్డు సృష్టించింది. తొలి వికెట్‌కు మరో ఓపెనర్ బ్రోనీ స్మిత్ (15)తో కలసి 61 పరుగులు జత చేసిన డానియేల్.. టామీ బ్యూమంట్ (35)తో కలసి రెండో వికెట్‌కు 96 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పడంతో ఇంగ్లీష్ టీమ్ గెలుపు దిశగా దూసుకెళ్లింది.



స్మృతి (76)



తుపాకీ సంస్కృతికి వ్యతిరేకంగా అమెరికన్లు గళమెత్తారు. 'మార్చ్ ఫర్ అవర్ లైవ్స్' ర్యాలీలో భాగంగా వాషింగ్టన్ డీసీలో వేల మంది వీధుల్లోకొచ్చారు. తుపాకులను నియంత్రించాలంటూ పలు నగరాల్లో భారీ ప్రదర్శనలు నిర్వహించారు.



సిరియాలో నరమేధం

ఉల్కాపాతం కాదు.. ఇదో పెనువిషాదం! సిరియా తూర్పు ఘౌటాలో రెబల్స్ అణచివేతకు రష్యా దళాలు తాజాగా కురిపించిన బాంబుల వర్షం. నిషిద్ధ వైట్ ఫాస్పరస్, నాపాం బాంబులతో దౌమాపై విరుచుకుపడుతుండగా తీసిన ఫొటో ఇది. ఆ బాంబులు ఓ బంకర్‌ను ధ్వంసం చేయడంతో 37 మంది పౌరులు సజీవంగా దహనమయ్యారు. ఆ సమయంలో బంకర్‌లో 125 మంది వరకు ఉన్నారు. చెల్లాచెదురైన మృతదేహాలు, పూర్తిగా తగలబడిన శరీరాలతో నిండిన ఆ ప్రాంతం ఫొటోలను 'సిరియా పౌరరక్షణ దళం' మీడియాకు విడుదల చేసింది. సిరియా దళాలు, ఉగ్రవాదుల మధ్య పోరు కారణంగా తూర్పు ఘౌటా నుంచి ఇప్పటికే 4 లక్షల మంది తరలిపోయారు.

మాకు స్వతంత్రత లేదా?

ఒక వ్యక్తి ఎలా నిర్ణయం తీసుకుంటారు?.. కేంద్ర సమాచార కమిషన్‌లో రగడ

- సీఐసీ తీరును ఎండగడుతూ కమిషనర్ మాడభూషి శ్రీధర్ ఘాటు లేఖలు

న్యూఢిల్లీ, మార్చి 25: సుప్రీంకోర్టులో సీనియర్ జడ్జిలకు ప్రాధాన్యం ఉన్న కేసులు అప్పగించడం లేదన్న వివాదాన్ని ప్రజలు మర్చిపోకముందే.. రాజ్యాంగబద్ధమైన మరో సంస్థలోనూ ఇలాంటి అంశమే దుమారం రేపుతోంది. కేంద్ర సమాచార కమిషన్‌లో ఏదో జరుగుతోందనే అనుమానాలకు బలం చేకూర్చే రెండు లేఖలు బయటకొచ్చాయి. ఈ లేఖలను కేంద్ర సమచార కమిషనర్ మాడభూషి శ్రీధర్.. ముఖ్య సమాచార కమిషనర్ (సీఐసీ) ఆర్కే మాథుర్‌కు రాశారు. 'నిబంధనల మేరకు విధులు నిర్వహించలేకపోతే సమాచార కమిషన్ ఉండి ఉపయోగం ఏమిటి?' అని శ్రీధర్ ప్రశ్నించిన తీరు సీఐసీలో జరుగుతున్న పరిణామాలపై అనుమానాలు రేకెత్తుతున్నాయి.

ఇదీ వివాదానికి కారణం?

దేశంలోని ఆరు ప్రధాన పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ, ఎన్సీపీ, సీపీఐ, సీపీఎంలను 2013లో సమాచారం చట్టం పరిధిలోకి తీసుకొచ్చారు. సమాచార హక్కు కింద దాఖలైన పిటిషన్లకు ఆయా పార్టీలు సరిగా స్పందించడం లేదని అందిన ఫిర్యాదులపై ఫుల్ బెంచ్ విచారణ చేపట్టింది. ఈ బెంచ్‌లో మాఢభూషి శ్రీధర్, సుధీర్ భార్గవ, బిమల్ జుల్కా సభ్యులుగా ఉన్నారు. 2016లో ఆరు నెలలపాటు వాదనలు విన్నారు. పని ఒత్తిడి ఉందంటూ గత ఏడాది డిసెంబరులో బెంచ్ నుంచి జుల్కా తప్పుకొన్నారు. దాంతో 2017 ఆగస్టులో సీఐసీ మాథుర్ కొత్త బెంచ్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో పాత బెంచ్‌లోని కమిషనర్లు ఎవరూ లేరు. నిర్ణీత వ్యవధిలోగా అప్పీళ్లు పరిష్కరించాలని ఢిల్లీ హైకోర్టు ఆదేశించినా.. కొత్త బెంచ్ ఒక్కసారి కూడా విచారణ చేపట్టలేదు. ఆ బెంచ్‌లోని మరో కమిషనర్ ఈ ఏడాది జనవరిలో రిటైర్ కావడంతో మరోసారి మార్పులు చేశారు. ఇది ఒక గొడవ కాగా.. మాడభూషి శ్రీధర్ చూస్తున్న మానవ వనరుల అభివృద్ధి శాఖకు చెందిన వివాదాలను ఆయన పరిధి నుంచి 2017 జనవరిలో ఉపసంహరించారు. ఢిల్లీ వర్సిటీలో ప్రధాని నరేంద్ర మోదీకి చెందిన విద్యార్హత పత్రాలను బయటపెట్టాలని శ్రీధరే ఆదేశాలు ఇచ్చారు.



ఆర్కే మాథుర్



మాడభూషి శ్రీధర్

ఒక వ్యక్తి చేతిలో అధికారమా?

ఫుల్ బెంచ్ నుంచి తప్పించడం.. హెచ్ఆర్డీ విభాగాన్ని తన పరిధి నుంచి తొలగించడంతో మాడభూషి శ్రీధర్ తీవ్ర మనస్తాపం చెందినట్లు తెలుస్తోంది. సీఐసీ తీరును, చర్యలను ప్రశ్నిస్తూ ఫిబ్రవరి 7, 22 తేదీల్లో లేఖాస్త్రాలు సంధించారు. సీఐసీ కమిషనర్లందరికీ ఈ లేఖలను పంపించారు. 'ఒక ఫుల్ బెంచ్ ఉండగా.. దాని ప్రస్తావన లేకుండా మరో విస్తృత ధర్మాసనం ఎలా ఏర్పాటు చేస్తారు? సమాచార కమిషనర్లకు స్వతంత్రత లేదా? ఎలాంటి కారణాలు లేకుండా ఎవరు ఎంత కాలం బెంచ్‌లో ఉంటారో.. ఉండరో నిర్ధారించేది ఎవరు?' అని ఆ లేఖలో మాథుర్‌ను ప్రశ్నించారు. కమిషనర్లను ఒక బెంచ్ నుంచి తొలగించడం.. కొత్త వారిని నియమించడం వంటి విషయాల్లో బయటి శక్తుల ఒత్తిడి లేకుండా సీఐసీ నిబంధనలు ఉండాలంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. కీలకమైన రాజకీయ పార్టీల అంశంలో మనం నిర్ణయం తీసుకోకపోతే వ్యవస్థ నిబద్ధతపై అది తీవ్ర ప్రభావం చూపెడుతుందని హెచ్చరించారు. 'ఇలా మనం చేయలేకపోతే.. స్వతంత్రంగా వ్యవహరించలేకపోతే.. కమిషనర్ల స్వతంత్రతను కాపాడలేకపోతే.. ఈ సంస్థ పారదర్శకంగా ఉందని ఎలా చెప్పగలం?' అని మాథుర్‌ను నిలదీశారు. 'అలాంటి విధ్వంసకర పరిస్థితుల్లో.. ప్రజల బాధలను విస్మరించి.. ఈ సంస్థను కొనసాగించడం అవసరామా' అని శ్రీధర్ ప్రశ్నించారు. 'ఇది ఏదో ఒక కమిషనర్‌ను తీసేసినందుకు చెబుతున్న మాటలు కాదు.. అసలు ఎందుకు తీసేశారు? కారణాలేమిటో మొత్తం సీఐసీకి తెలియాలి' అని గట్టిగానే లేఖలో పేర్కొన్నారు. ఈ లేఖలను కమిషన్‌లోని ఇతర సభ్యులకు పంపాలని, సమాచార కమిషన్ వెబ్‌సైట్‌లోనూ ఉంచాలని శ్రీధర్ కోరారు. 'ఇది చాలా ప్రజోపయోగ అంశం. రాజకీయ పార్టీల గురించి తెలుసుకోవడం ప్రజల హక్కు. అందుకే ఈ లేఖలను పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలి' అని ఒక వివరణను కూడా మాడభూషి శ్రీధర్ ప్రస్తావించారు.

సేద్యానికి పెద్దపీట



రైతుకు గిట్టుబాటు ధర అందేలా చూస్తాం.. మన్‌కీ బాత్‌లో మోదీ

న్యూఢిల్లీ, మార్చి 25: 'ప్రియమైన దేశ ప్రజలకు నమస్కారం. అందరికీ శ్రీరామ నవమి శుభాకాంక్షలు' అంటూ ప్రధాని మోదీ ఆదివారం ఆలిండియా రేడియోలో 'మన్‌కీ బాత్'ను ప్రారంభించారు. దేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం, రైతులది కీలకపాత్ర అని మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి, రామ్‌మనోహర్ లోహియా, చరణ్ సింగ్, దేవీలాల్ వంటి గొప్ప వ్యక్తులు ఎప్పుడో చెప్పారని మోదీ అన్నారు. తాజా బడ్జెట్‌లో సేద్యానికి పెద్దపీట వేసినట్లు వెల్లడించారు. రైతు పెట్టుబడి వ్యయానికి ఒకటిన్నర రెట్లు రాబడి వచ్చేలా కనీస మద్దతు ధరను నిర్ణయిస్తామని స్పష్టం చేశారు. గ్రామీణ మార్కెట్లను టోకు మార్కెట్లతో అనుసంధానం చేస్తామని.. వాటిని అంతర్జాతీయ మార్కెట్లతోనూ అనుసంధానించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు.

ఆరోగ్య రంగంలో..

దేశంలోని పేదలకు మెరుగైన వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు తీసుకొస్తోందని మోదీ తెలిపారు. ఆయుష్మాన్ భారత్ పథకం కింద దేశవ్యాప్తంగా 10 కోట్ల కుటుంబాలకు ఏడాదికి రూ.5 లక్షల చొప్పున బీమా అందించనున్నట్లు తెలిపారు. 3000 జన ఔషధి కేంద్రాల ద్వారా 800 రకాలకు పైగా మందులను సరసమైన ధరలకే ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. గుండె జబ్బుల వారికి వేసే స్టెంట్ల ధరలను 85 శాతం తగ్గించామని, మోకాలి శస్త్రచికిత్స ధరలను కూడా 50 నుంచి 70 శాతం తగ్గేలా చేశామని వెల్లడించారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఏప్రిల్ 14 నుంచి మే 5 వరకు గ్రామ స్వరాజ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గ్రామాల అభివృద్ధి, పేదరిక నిర్మూలన, సామాజిక న్యాయానికి సంబంధించి దేశవ్యాప్తంగా పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇటీవల గణతంత్ర వేడుకలకు వచ్చిన ఆసియాన్ దేశాల కళాకారులు రామాయణాన్ని ప్రదర్శించడానికి ఆసక్తి చూపారని గుర్తుచేశారు. ఎగ్జామ్ వారియర్ పుస్తకానికి విద్యార్థుల నుంచి వచ్చిన స్పందన తనకెంతో సంతృప్తినిచ్చిందన్నారు. అసోంలోని రిక్షావాలా కరీంగంజ్ పేద విద్యార్థుల కష్టాన్ని గుర్తించి తొమ్మిది పాఠశాలలను కట్టించారని.. భారతీయుడి శక్తి ఏమిటో నిరూపించారని కొనియాడారు. యువత అంతా కలిసి ఫిట్ ఇండియా ఉద్యమాన్ని ప్రారంభించాలన్నారు.

త్రీడీ మోదీ.. త్రికోణాసనం

నల్లటి ప్యాంటు.. నీలం రంగు టీషర్టులో ఉన్న మోదీ అచ్చం యోగా టీచర్‌లా త్రికోణాసనం వేసిన త్రీడీ వీడియో ప్రధాని ధ్రువీకృత యూట్యూబ్ చానల్‌లో విడుదలైంది. 'మన్ కీ బాత్'లో భాగంగా ఆయన 'ఫిట్ ఇండియా' గురించి మాట్లాడారు. యోగా ఆరోగ్యానికి ఎంత మంచిదో చెప్పారు. "నేను యోగా టీచర్‌ను కాను. కానీ, కొందరు తమ సృజనాత్మకతతో నన్ను యోగా టీచర్‌ను చేసి ఒక త్రీడీ వీడియో రూపొందించారు. ఆ వీడియోను నేను మీతో పంచుకుంటాను" అని పేర్కొన్నారు. చెప్పినట్టుగానే 'మన్ కీ బాత్' పూర్తయిన కొద్దిసేపటికి ఆ వీడియోను షేర్ చేశారు.

బావిలోకి దూసుకెళ్లిన ఆటో

11 మంది మృతి

- నిజామాబాద్ జిల్లాలో ఘోర ప్రమాదం

మెండోర, మార్చి 25: ఆ ఆటోడ్రైవర్‌కు పెద్దగా డ్రైవింగ్ అనుభవం లేదు.. ఇటీవలే ఆటో కొన్నాడు.. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్నాడు.. మితిమీరిన వేగంతో వెళుతుండగా.. రోడ్డుపైనున్న గుంతను తప్పించేందుకు ప్రయత్నించాడు.. అంతే ఆటో అదుపుతప్పి పక్కనే ఉన్న బావిలోకి దూసుకెళ్లింది. ఐదుగురు చిన్నారులు సహా పది మంది మృత్యువాత పడ్డారు. నిజామాబాద్ జిల్లా మెండోర మండల కేంద్రం శివారులో ఆదివారం జరిగిందీ ఘోర ప్రమాదం. వివరాలిలా ఉన్నాయి.. ముప్కాల్ మండల కేంద్రం నుంచి ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో బయలుదేరిన ఆటో మెండోర మండలం మీదుగా సావెల్ గ్రామానికి వెళ్తోంది. పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న ఆటో అదుపుతప్పి ప్రధాన రోడ్డుకు పక్కనే ఉన్న బావిలో పడింది. మృతుల్లో ఆరుగురు పెద్దలు, ఐదుగురు పిల్లలు ఉన్నారు. కొందరు బావిలోని మోటారు పైపులను పట్టుకోవడంతో ప్రాణాలతో బయటపడ్డారు. ప్రమాదం జరిగినపుడు ఆటోలో డ్రైవర్‌తో కలిపి 20 మంది ఉన్నట్లు తెలిసింది. 11 మంది మరణించగా.. డ్రైవర్‌తో సహా తొమ్మిది మంది సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. మోటారు పైపు పట్టుకొని ఉన్నవారిని సురక్షితంగా పైకి తీసుకొచ్చారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చిన తర్వాత బావిలోని నీటిని తోడి.. ఆటోతో పాటు పది మృతదేహాలను వెలికితీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ఆస్పత్రికి తరలించారు. మృతుల్లో వేంపల్లికి చెందిన నాగంపేట సాయమ్మ(50), ధర్మోరకు చెందిన లక్ష్మి(45), కేశవపురానికి చెందిన కాషారపు గంగవ్వ(41), గుండం గంగామణి(45), మోస్రాకు చెందిన పెద్దోళ్ల సంపత్(14), కొడిచెర్లకు చెందిన మెట్టు వినయశ్రీ(6), ఆలూరుకి చెందిన మనస్విని(3), చిట్టాపూర్‌కి చెందిన రోజా(27), ఆమె ఇద్దరు పిల్లలు చక్కని(6), చిన్నా(2) ఉన్నారు. విషయం తెలిసిన వెంటనే రోజా భర్త మహేందర్ వచ్చి గుండెలవిసేలా రోదించాడు. తాను బండి మీద దించితే భార్యాపిల్లల ప్రాణాలు దక్కేవని విలపించాడు. సాయంత్రం వరకు బావిలో గాలించగా నిమ్మ సత్తెమ్మ(55) మృతదేహం దొరికింది. ఆటో డ్రైవర్ గోపి శ్రీనివాస్‌కు అనుభవం లేకపోవడం వల్లనే ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు భావిస్తున్నారు. రెండు రోజుల క్రితమే అతను ఆటోను కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ముప్కాల్‌కి చెందిన గోపి మెండోర మీదుగా సావెల్‌కు వెళ్లేందుకు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్నాడు. రోడ్డుపై గుంతను తప్పించేందుకు ప్రయత్నించడం, అదే సమయంలో వాటర్ బాటిల్ కాలు కిందకు రావడంతో బ్రేకు వేసే అవకాశం లేక ఆటో అదుపు తప్పి బావిలోకి దూసుకెళ్లినట్లు సమాచారం. ఆటో డ్రైవర్ శ్రీనివాస్‌ను పోలీసులు అరెస్టు చేశారు.



బావిలో నుంచి ఆటోను బయటకు తీస్తున్న దృశ్యం



ఆసియాలోనే అతి పెద్దదైన తులిప్ గార్డెన్ పర్యాటకుల సందర్శనార్థం ఆదివారం ప్రారంభమైంది. జమ్మూకశ్మీర్‌లోని దాల్ సరస్సు ఒడ్డున ఉన్న ఈ గార్డెన్‌ను 25 ఎకరాల్లో 40 వేల రకాల వెరైటీ, రంగు రంగుల పూల మొక్కలతో అధికారులు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఈ సీజన్‌లో తొలిసారిగా జమ్మూకశ్మీర్ మంత్రులు తసదుఖ్ ముఫ్తీ, జావెద్ ముస్తఫా మీర్ ఈ గార్డెన్ అందాలను తిలకించారు.

అమెరికా మిత్రులకు

డేటా ఇచ్చేస్తా!

ప్రధానిపై రాహుల్ వ్యంగ్యాస్త్రాలు

బెంగళూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): నమో యాప్ వినియోగిస్తున్న వారి డేటా లీక్ అయినట్లు వార్తలు రావడంతో.... ప్రధాని మోదీపైనా రాహుల్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "హాయ్! నా పేరు నరేంద్ర మోదీ. నేను భారత ప్రధానిని. నా అధికారిక యాప్‌లో మీరు చేరితే... మీ వివరాలన్నీ అమెరికా కంపెనీల్లోని నా మిత్రులకు ఇచ్చేస్తా!" అని ట్విటర్‌లో పేర్కొన్నారు. డేటా చోరీకి సంబంధించిన వార్తా కథనాన్ని కూడా ఆయన పోస్టు చేశారు. ఈ విషయాన్ని సమాధి చేయడానికి ప్రయత్నిస్తోందంటూ మీడియానూ తప్పుబట్టారు. కాగా రాహుల్ వ్యాఖ్యలను బీజేపీ తిప్పికొట్టింది. ఆయన నుంచి ఇంతకంటే మెరుగైన స్పందన ఆశించలేమని ఎద్దేవా చేసింది. ఈ డేటాను కేవలం అనలిటిక్స్ కోసమే ఉపయోగిస్తారని వివరించింది. బీజేపీకి జనతాదళ్ సెక్యులర్ (జేడీఎస్) పార్టీ బీ-టీమ్ అవునో కాదో స్పష్టం చేయాలని దేవెగౌడను రాహుల్ మరోసారి డిమాండ్ చేశారు. జేడీఎస్ పార్టీ కాస్తా... జనతాదళ్ సంఘ్ పరివార్‌గా మారిందన్నారు. రాహుల్ విమర్శలపై జేడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి విరుచుకుపడ్డారు. రాహుల్ వ్యాఖ్యలు ఆయన దివాళాకోరుతనాన్ని తెలియజేస్తున్నాయన్నారు. ఇప్పుడిప్పుడే ఆలయాలు, మఠాల చుట్టూ తిరిగే రాహుల్ కపట నడవడికపై ప్రజలు బుద్ధి చెబుతారన్నారు.

నవమి రోజున.. రామసేతు మీదుగా..

32 కిలోమీటర్లు 8:25 గంటల్లో ఈదేశాడు

- పాక్ జలసంధి ఈదిన ఆంధ్ర పోలీసు రికార్డు

చెన్నై, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు చెందిన హెడ్‌కానిస్టేబుల్ మోదుకూరి తులసి చైతన్య స్విమ్మింగ్‌లో సంచలనం సృష్టించాడు. భారత్, శ్రీలంకలను వేరు చేసే పాక్ జలసంధిని 8 గంటల 25 నిమిషాల్లోనే ఈది అత్యంత వేగంగా ఈ ఘనత సాధించిన వ్యక్తిగా రికార్డు నెలకొల్పాడు. శనివారం రాత్రి 1 గంటకు శ్రీలంకలోని తలైమన్నార్ హార్బర్ వద్ద మొదలుపెట్టిన 32 కిలోమీటర్ల దూరంలోని తమిళనాడులో ధనుష్కోటి వద్దకు ఆదివారం ఉదయం 9:25 గంటలకు చేరుకున్నాడు. గత శనివారం చెన్నై ముడిచ్చూరు ప్రాంతానికి కాలేజీ విద్యార్థి రాజేశ్వరప్రభు 11.58 గంటల్లో ఈది నెలకొల్పిన రికార్డును బ్రేక్ చేశాడు. 1994లో 12 ఏళ్ల కుత్రాలీశ్వరన్ అనే బాలుడు 16 గంటల్లో ఈది రికార్డు సృష్టించాడు. చైతన్యను జాలర్ల సంఘం నాయకుడు ఎన్‌జే బోస్, మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ జయకుమార్, మదురై జిల్లా స్విమ్మింగ్ సంఘం నిర్వాహకులు అభినందించారు.



తులసి చైతన్యను అభినందిస్తున్న జాలర్లు

బెజవాడ కుర్రాడు.. ఈతలో మొనగాడు

తులసి చైతన్య (29) జన్మస్థలం విజయవాడ. కంకిపాడులో స్పెషల్ బ్రాంచ్ హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. రామకృష్ణారావు-శశిబాలకుమారి తల్లిదండ్రులు. స్విమ్మింగ్‌పై ఆసక్తితో తొమ్మిదో ఏట నుంచే ఈతపై దృష్టిపెట్టాడు. యూనివర్సిటీ స్థాయిలోనే పతకాలు కొల్లగొట్టాడు. స్పోర్ట్స్ కోటాలో పోలీసు ఉద్యోగం సంపాదించాడు. ఆరు నెలల నుంచి ఏలూరుకి చెందిన గణేష్ దగ్గర కఠిన శిక్షణ తీసుకుంటున్నాడు. తులసి చైతన్య 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ 'రికార్డు కోసం చేయలేదు. ఇదొక సాహసంగానే చేశాను. 8:25 గంటల్లో 32 కి.మీ. ఈదడం అసాధ్యమే. కానీ, రామసేతు సాక్షిగా సాధించాను. ఆరు నెలల నుంచి ఈ సాహసం కోసం సాధన చేశా' అని చెప్పాడు.

ఐఐటీల్లో మిగిలిపోతున్న సీట్లు

హైదరాబాద్, కాన్పూర్ మినహా.. అంతటా ఇదే పరిస్థితి

- సమస్య పరిష్కారానికి కమిటీ నియామకం..
- ఒకట్రెండు కోర్సుల్ని తొలగించాలని సిఫారసు
- వాటి స్థానంలో కొత్త వాటి పరిచయానికి ప్రతిపాదనలు

న్యూఢిల్లీ, మార్చి 25: దేశవ్యాప్తంగా ఉన్న ఐఐటీల్లో ఖాళీగా మిగిలిపోతున్న సీట్ల సంఖ్య ఏఏటికాయేడు పెరుగుతోంది. గతంలో అన్ని ఐఐటీల్లో వంద శాతం సీట్లు భర్తీ కాగా.. గడిచిన ఐదేళ్లుగా కొన్ని విద్యాసంస్థల్లో సీట్ల భర్తీ పూర్తి స్థాయిలో జరగడం లేదు. హైదరాబాద్, కాన్పూర్ ఐఐటీలు మినహా.. మిగతా వాటన్నింటిలో ఈ పరిస్థితి నెలకొందని మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. అన్ని ఐఐటీల్లో 11 వేల సీట్లు ఉండగా.. గడిచిన ఐదేళ్లలో 276 సీట్లు ఖాళీగా మిగిలిపోయాయి. 2013-17 మధ్య కాలంలో ఈ పరిస్థితి నెలకొందని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఐఐటీ-భువనేశ్వర్‌లో 2013 నుంచి గత ఏడాది వరకు అత్యధికంగా 105 సీట్లు భర్తీ కాకుండా మిగిలిపోయాయి. ఈ పరిస్థితిని అధిగమించేందుకు ప్రభుత్వం గత ఏడాది ఒక కమిటీని నియమించింది. కొన్ని కోర్సులకు డిమాండ్ తగ్గుతోందని, ఉపాధి అవకాశాలు అధికంగా ఉన్న కోర్సులకే డిమాండ్ ఉందని ఈ కమిటీ గుర్తించింది. డిమాండ్ తక్కువగా ఉన్న ఒకట్రెండు కోర్సులను పూర్తిగా తొలగించి, వాటి స్థానంలో కొత్తవాటిని పరిచయం చేయాలని తన నివేదికలో ప్రతిపాదించింది.

సీట్ల మిగులు ఇలా..

ఐఐటీ	2013	2014	2015	2016	2017
భువనేశ్వర్	4	3	28	38	32
హైదరాబాద్	-	-	-	-	-
కాన్పూర్	-	-	-	-	-
ఢిల్లీ	-	-	-	2	2
బాంబే	-	-	-	2	1
మిగిలిన ఐఐటీలు	15	5	39	96	121

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107
Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.